www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 21-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 157 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, బాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: చవితి సా. 6.14 తదుపరి పంచమి; నక్షత్రం: భరణి రా. 12.36 తదుపరి కృత్తిక; వర్జ్యం: ఉ. 11.28-12.55; దుర్ముహూర్తం: ఉ. 6.07-7.43; అమృతఘడియలు: రా. 8.13-9.40; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.07; సూర్యాస్తమయం: 6.08 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

హైరిస్క్ జోన్‌లో తెలుగు రాష్ట్రాలు

అసోం తర్వాతి స్థానంలో ఏపీ, తెలంగాణ

ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలపై ఎక్కువ ప్రభావం

వాతావరణంలో మార్పులతోనే వరదలు, కరువు వంటి విపత్తులు

జిల్లాలవారీగా విపత్తులను ఎదుర్కొనేందుకు ప్రణాళికలు అవసరం

భారత వాతావరణ శాఖ విశ్రాంత డీజీ కేజే రమేష్

విశాఖపట్నం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): 'వాతావరణంలో మార్పుల ప్రభావం వల్లనే రెండు తెలుగు రాష్ట్రాలు వరదలు, కరువు వంటి విపత్తులు ఎదుర్కొంటున్నాయి. అసాధారణ వాతావరణ పరిస్థితులతో దేశంలో అనేక రాష్ట్రాలు ఇదే తరహా ప్రమాదంలో

మిగతా 2వ పేజీలో...

ఇంత అపచారమా?



దేశమంతటా 'లడ్డూ'పై గగ్గోలు

కొవ్వు కలిసిన నెయ్యితో ప్రసాదాలా?.. జగన్ నిర్వాకంపై సర్వత్రా భగ్గు

సీబీఐ విచారణకు పెరుగుతున్న డిమాండ్

శ్రీవారి లడ్డూను అపవిత్రం చేసిన వైనం దేశాన్ని కదిలించింది. స్వామిభక్తుల నుంచి ప్రముఖుల దాకా.. అందరూ చలించిపోతున్నారు. నాటి జగన్ ప్రభుత్వ నిర్వాకంపై భగ్గుమంటున్నారు. సీబీఐ విచారణ కోరుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పలువురు లేఖలు రాస్తున్నారు. దిద్దుబాటు ప్రారంభించిన సర్కారు..తిరుమల సంప్రోక్షణకు ఆదేశించింది

లడ్డూ కల్తీపై కేంద్రం సీరియస్

రంగంలోకి దిగిన నడ్డా..బాబుకు ఫోన్

కేంద్రస్థాయిలో విచారిస్తామని వెల్లడి

ఇది కుట్ర.. ద్రోహం.. ఘోరమైన నేరం..

జగన్, ధర్మారెడ్డిలను శిక్షించాల్సిందే

అమిత్‌షా, సుప్రీం సీజేలకు పలువురి లేఖ

సుప్రీంకోర్టు జోక్యం కోరుతూ పిటిషన్

సీబీఐ విచారణకు కేంద్రాన్ని కోరాం: షర్మిల


శ్రీవారి లడ్డూను జంతువుల కొవ్వుతో అపవిత్రం చేసిన వ్యవహారం జాతీయస్థాయిలో గగ్గోలు రేపుతోంది. లడ్డూ తయారీకి గత ప్రభుత్వం వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసినట్టు తేలడంతో వైసీపీ నిర్వాకంపై సర్వత్రా ఆగ్రహ జ్వాలలు ఎగసిపడుతున్నాయి. ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన లడ్డూను కలుషితం చేయడాన్ని కేంద్రప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. దీనిపై కేంద్ర స్థాయిలో విచారణ జరిపించేందుకు సిద్ధమైంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా శుక్రవారం రంగంలోకి దిగారు. సీఎం చంద్రబాబుకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న వివరాలు పంపిస్తే విచారణకు ఉపయోగకరంగా ఉంటుందని చంద్రబాబుకు తెలిపారు. హిందూ విశ్వాసాల పట్ల ఇది కుట్ర, ద్రోహం, క్షమించరాని నేరమంటూ కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, గిరిరాజ్ సింగ్, బండి

మిగతా 2వ పేజీలో...

సంప్రోక్షణ చేయండి

కల్తీ నెయ్యితో ఘోర అపచారం

శ్రీవారి ఆలయ శుద్ధికి సీఎం ఆదేశం



మంత్రులు, సీఎస్‌తో అత్యవసర భేటీ

ఈవోతో రెండుసార్లు టెలికాన్ఫరెన్స్

గత ప్రభుత్వ తప్పిదాలపై నివేదిక కోరిన బాబు

భక్తుల విశ్వాసాన్ని కాపాడతామని హామీ

బాధ్యులపై చర్యలు తప్పవ్



ప్రసాదంలో కొవ్వు కలవడం ఏమిటి?

గత టీటీడీ బోర్డు సమాధానం చెప్పాలి

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ డిమాండ్

తేడా తెలియనంతగా కల్తీ చేశారు

సేంద్రియ ఉత్పత్తులపైనా అనుమానాలు

అందుకే ఆ ప్రసాదాలు నిలిపివేత: ఈవో

చంద్రబాబును అందరూ తిట్టాలి!

తిరుమల లడ్డూపై దుష్ప్రచారానికి

మోదీ, సీజేఐ అక్షింతలు వేయాలి: జగన్

11

భక్తులతో ఆటలు

కొంపముంచిన రివర్స్ టెండరింగ్

ఖర్చు తగ్గించామని వైసీపీ ప్రభుత్వంలో గొప్పలు.. లడ్డూల నాణ్యత గాలికి

2

ఇప్పుడంతా సేఫ్

భక్తులకు నాణ్యమైన నెయ్యితో లడ్డూలు



యజ్ఞం చేస్తున్నాం!

రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు సహకరించండి

ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు

వంద రోజుల్లో ఏమీ చేయలేదనే వారు..

తొలి 6 నెలల్లో ఒక్కటైనా మంచిపని చేశారా?

ఐదేళ్లలో భ్రష్టుపట్టించారు.. లూటీ చేశారు

ప్రతికూల ఆర్థిక పరిస్థితులను అధిగమించాం

కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చాం

నా అనుభవంతో హామీల అమలుకు చర్యలు

పథకాల అమలుకు శ్రీకారం.. వచ్చే నెలలో

గ్రామ సభలు పెట్టి అర్హులందరికీ పెన్షన్లు

నంబర్ వన్ రాష్ట్రంగా నిలపడమే లక్ష్యం

జనాభా నిర్వహణపై అందరూ దృష్టిపెట్టాలి

'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో సీఎం



ప్రకాశం జిల్లా మద్దిరాలపాడు సభలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

ఒంగోలు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): 'ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం భ్రష్టుపట్టింది. ఇష్టారీతిన లూటీ చేశారు. ఏ శాఖపై సమీక్ష చేసినా అవినీతి, అక్రమాలు కోకొల్లలుగా బయటపడుతున్నాయి. అప్పులకు ప్పగా చేసి దివాలా తీయించారు. అలాంటి పరిస్థితి నుంచి తిరిగి రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు యజ్ఞం చేస్తున్నాం. దానికి ప్రజలందరూ సహకరించాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అభ్యర్థించారు. టీడీపీ

మిగతా 12వ పేజీలో...

చెత్త పన్ను రద్దు

సీఎం నిర్ణయం

మరో ఎన్నికల హామీ నెరవేర్చిన టీడీపీ

12

ఈ వంద రోజుల్లో ప్రధానంగా పింఛన్లు పెంచడంతోపాటు ఒకటో తేదీనే అందజేయడం, జగన్ మూసివేసిన అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, ఉచిత ఇసుక సరఫరా, మద్యం ధరల తగ్గింపు, మెగా డీఎస్సీ ప్రకటన వంటి అనేక ప్రజోపకరమైన పనులు చేపట్టాం. - సీఎం చంద్రబాబు

విశాఖ స్టీల్‌కు మరో రూ.2,500 కోట్లు

కేంద్ర ఉక్కు శాఖ ప్రకటన

2 బ్లాస్ట్‌ఫర్నేస్‌లను నడపండి

నవంబరు నుంచి పూర్తిస్థాయి ఉత్పత్తికి ఆదేశాలు



విశాఖపట్నం, సెప్టెంబరు 20 (ఆంధ్ర జ్యోతి): ముడి పదార్థాల కొరత కారణంగా ఉత్పత్తి తగ్గించుకున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంటుకు మరో రూ.2,500 కోట్లు ఇస్తామని కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ శుక్రవారం ప్రకటించింది. ఇప్పటికే గురువారం రూ.500 కోట్లు మంజూరు చేసిన సంగతి

మిగతా 2వ పేజీలో...

ఎన్నికలు, పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీ అమలుచేస్తాం



బంగారుపాళ్యంలో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి లోకేశ్

మంత్రి లోకేశ్ స్పష్టీకరణ

బంగారుపాళ్యంలో డయాలసిస్ కేంద్రం ప్రారంభం

పాదయాత్ర తొలి హామీ అమలు

12

విద్యాసాగర్ అరెస్టు




జెత్వానీ కేసులో డెహ్రాడూన్‌లో వైసీపీ నేత అదుపులోకి

నేడు ట్రాన్సిట్ వారెంట్‌పై బెజవాడకు.. ముంబై నటి కేసులో ఏ1గా నమోదు

ఆమె వాంగ్మూలం ఇచ్చాక పరార్.. కొన్నాళ్లు ముంబై, ఢిల్లీలో ఉన్నట్టు గుర్తింపు

12



కాపాడాల్సిన పోలీసులే చట్టాన్ని బ్రేక్ చేశారు

రఘురామను కస్టడీలో హింసించిందెవరో తేలాలి.. అప్పుడు విజయ్‌పాల్ కస్టడీలోనే రఘురామ

ఆయనను ప్రశ్నిస్తేనే వాస్తవాలు తెలుస్తాయి.. ముందస్తు బెయిల్‌కు అనర్హుడు.. లూథ్రా వాదనలు

కస్టడీలోని నిందితుడి బాధ్యత దర్యాప్తు అధికారిదే

హాని జరిగితే వివరణ ఇవ్వాల్సింది ఆయనే: హైకోర్టు



తీర్పు రిజర్వ్...

24న నిర్ణయం

12



హైరిస్క్ జోన్‌లో తెలుగు రాష్ట్రాలు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయి' అని భారత వాతావరణ శాఖ విశ్రాంత డైరెక్టర్ జనరల్ డాక్టర్ కేజే రమేష్ పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వాతావరణ, సముద్ర అధ్యయన విభాగం 75వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మూడో రోజు శుక్రవారం ఆయన దేశంలో వాతావరణ పరిస్థితులపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. 'విపత్తుల విలయాలకు సంబంధించి హై రిస్క్ జోన్‌లో ఉన్న రాష్ట్రాల్లో అసోం మొదటి స్థానంలో ఉంది. రెండు తెలుగు రాష్ట్రాలు రెండో స్థానంలో ఉన్నాయి. మూడో స్థానంలో మహారాష్ట్ర, నాలుగో స్థానంలో కర్ణాటక, ఐదో స్థానంలో బిహార్ ఉన్నాయి. రెండు తెలుగు రాష్ట్రాలను పరిశీలిస్తే... భారీ వర్షాలు కురిసే రోజుల సంఖ్య ఏపీలో ఉమ్మడి అనంతపురం, చిత్తూరు, గుంటూరు, కృష్ణా, ఉభయ గోదావరి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పెరుగుతుంది. ఉమ్మడి విశాఖపట్నం, కర్నూలు, కడప, నెల్లూరు జిల్లాల్లో తగ్గుతుంది. వరదలు/కరువు/తుఫాన్లతో ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలు ఎక్కువ ప్రభావితమవుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో వర్షాల కురిసే రోజుల సంఖ్య 38 నుంచి 43 వరకు ఉండగా... రాయలసీమలో 21నుంచి 25 రోజులు వరకు నమోదవుతోంది. వాతావరణ మార్పులతో 2000 నుంచి ఈ విపత్తుల తీవ్రత పెరుగుతూ వస్తోంది. తెలంగాణలో ఉత్తర, తూర్పు ప్రాంతంలో వర్షపాతం పెరుగుతుంది. తూర్పు తెలంగాణలోని వరంగల్, ఖమ్మం జిల్లాల్లో వర్షపాతం పెరగడంతో దిగువన ఉన్న విజయవాడ, కృష్ణా, ఏలూరు ప్రాంతాలకు వరద పోటు ప్రమాదం ఉంది. భవిష్యత్తులో విపత్తుల తీవ్రత మరింత ఎక్కువ అవుతుంది. ఏపీలో 1,900, తెలంగాణలో 950 రెయిన్‌గేజ్ స్టేషన్లు ఉన్నాయి. 2016నుంచి వర్షపాతం వివరాలు ప్రభుత్వం, వాతావరణ శాఖ వద్ద ఉన్నాయి. ఆ సమాచారాన్ని విశ్లేషించుకుని రెండు తెలుగు రాష్ట్రాలు అప్రమత్తమై విపత్తులు ఎదుర్కొనేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలి. విపత్తుల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. వాతావరణశాఖ, ఏయూ వాతావరణ విభాగం ప్రతినిధులు జిల్లాల వారీగా పర్యటించి అధికారులతో సమావేశమై విపత్తులను ఎదుర్కొనేందుకు సన్నద్ధం చేయాలి. ప్రజలకు సమాచారం అందేలా ప్రచారం చేయాలి. నగరాలు, పట్టణాల్లో విపత్తుల సన్నద్ధతకు ప్రణాళికలు అమలు చేయాలి' అని రమేష్ వివరించారు.

28 నుంచి కైలాస- మానస సరోవర యాత్ర

- కరోనా తర్వాత ఇదే మొదటిసారి

పిథోరగఢ్, సెప్టెంబరు 20: కైలాస- మానస సరోవర యాత్రికులకు తీపికబురు. ఈ యాత్ర సెప్టెంబరు 28 నుంచి ప్రారంభం కానుంది. కుమావోన్ మండల్ వికాస్ నిగమ్(కేఎంబీఎన్) అనే సంస్థ నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. ఇది కేంద్ర ప్రభుత్వం, ఉత్తరాఖండ్ పర్యాటక అభివృద్ధి బోర్డు ఆధ్వర్యంలో ప్రారంభమైన పైలట్ ప్రాజెక్టు. ఈ యాత్రలో పాల్గొనే భక్తులు ఉత్తరాఖండ్‌లోని పిథోరగఢ్ నుంచి చైనా సరిహద్దుల్లోని లిపు లేఖ్ పాస్ వరకు రోడ్డు మార్గం ద్వారా చేరుకోవచ్చు. అక్కడి నుంచి కైలాస పర్వతం 97 కి.మీ. పరమ శివుడు నివాసముంటాడని విశ్వసించే చోటు కైలాస పర్వతం. ఈ యాత్ర లిపు సరస్సు గుండా 1981లో మొదలైంది. కరోనా కారణంగా 2020లో నిలిపివేశారు. అయితే ఈ సంవత్సరం కేవలం 60 మందిని మాత్రమే యాత్రకు అనుమతిస్తారు. వీరిని నాలుగు బృందాలుగా విభజిస్తారు. 55 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలి.



ఐటీ రూల్స్ రాజ్యాంగ విరుద్ధం!

- నిబంధనలను కొట్టేసిన బాంబే హైకోర్టు

ముంబై, సెప్టెంబరు 20: కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చిలో అమల్లోకి తెచ్చిన ఐటీ రూల్స్‌ను బాంబే హైకోర్టు కొట్టేసింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు సమాచారాన్ని గుర్తించేందుకు ఉద్దేశించిన ఐటీ రూల్స్ రాజ్యాంగ వ్యతిరేకమని పేర్కొంది. ఇద్దరు సభ్యుల డివిజన్ బెంచ్ గత జనవరిలో ఈ అంశంపై భిన్న తీర్పులు ఇవ్వడంతో జస్టిస్ ఎ.ఎస్.చంద్రశేఖర్‌కు తీర్పు బాధ్యతను అప్పగించారు. శుక్రవారం ఆయన తీర్పును వెలువరించారు. ఐటీ రూల్స్ రాజ్యాంగంలోని సమానత్వం హక్కు(ఆర్టికల్ 14), భావ వ్యక్తీకరణ హక్కు(ఆర్టికల్ 19), నచ్చిన వృత్తిని చేసుకొనే హక్కు(ఆర్టికల్ 19(1)(జి))లను ఉల్లంఘించే విధంగా ఉన్నాయని జస్టిస్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. వ్యక్తులు నచ్చిన పని చేసుకోవడంపై ఎలాంటి నియంత్రణ విధించవచ్చో ఆర్టికల్ 19(6)లో ఉందని, అలాంటి పరిస్థితి ఇక్కడ లేదని చెప్పారు. ఐటీ రూల్స్‌లో పేర్కొన్న "తప్పుడు, అబద్ధపు, తప్పుదోవ పట్టించే" అనే పదాలు వ్యక్తపరిచే భావం అస్పష్టంగా ఉందని, స్పష్టమైన నిర్వచనం లేదని తెలిపారు. ఐటీ రూల్స్‌ను సవాలు చేస్తూ స్టాండప్ కమెడియన్ కునాల్ కర్మ, ఎడిటర్స్ గిల్డ్, మరి కొందరు ఈ పిటిషన్ వేశారు. గత జనవరిలో ఈ అంశం విచారణకు వచ్చినపుడు జస్టిస్ గౌతమ్ పటేల్ ఐటీ రూల్స్‌ను కొట్టేయగా, జస్టిస్ నీల గోఖలే ఐటీ రూల్స్‌ను సమర్థించారు. తాజాగా జస్టిస్ చంద్రశేఖర్ కూడా ఐటీ రూల్స్‌ను కొట్టేశారు. డిజిటల్ మీడియా నైతిక ప్రవర్తనా నియమావళిగా భావించే 2021 నాటి ఐటీ రూల్స్‌ను సవరిస్తూ 2023 ఏప్రిల్ 6న కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వు ఇచ్చింది. ఆ ఉత్తర్వు ప్రకారం పీఐబీ ఆధ్వర్యంలో ఫ్యాక్ట్ చెకింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తారు. ఆ యూనిట్ ప్రభుత్వ కార్యకలాపాలకు వ్యతిరేకంగా తప్పుడు, తప్పుదోవ పట్టించే సమాచారం ట్విటర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం లాంటి సోషల్ మీడియా వేదికల మీద వస్తే గుర్తించి సదరు సోషల్ మీడియా సంస్థకు సమాచారం అందజేస్తుంది. ఫ్యాక్ట్ చెకింగ్ యూనిట్ నుంచి సమాచారం అందిన వెంటనే సదరు సోషల్ మీడియా సంస్థ ఆ పోస్టును తీసేయడమో లేక ఈ సమాచారం విశ్వసనీయతపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయని చెప్పడమో చేయాలి. మౌనంగా ఉండటం కుదరదు. రెండో ఆప్షన్ తీసుకుంటే ఆ పోస్టుపై ప్రభుత్వం తీసుకొనే చట్టపరమైన చర్యల విషయంలో సోషల్ మీడియా సంస్థకు ఎలాంటి రక్షణ ఉండదు. ఈ ఏడాది మార్చి 20న ఐటీ రూల్స్ అమల్లోకి వచ్చాయి. మార్చి 11న విచారణ జరిగినపుడు వాటిపై స్టే ఇచ్చేందుకు జస్టిస్ చంద్రశేఖర్ నిరాకరించారు. ఒక సమాచారం తప్పా ఒప్పా అని నిర్ధారించే అధికారం కోర్టుకు ఉండాలే తప్ప ప్రభుత్వానికి కాదని పిటిషనర్లు వాదించారు. సోషల్ మీడియా సంస్థలు అనవసరపు న్యాయవివాదాలను, తద్వారా తలెత్తే ఖర్చులను తప్పించుకొనే ప్రయత్నంలో ప్రభుత్వం సూచించిన అన్ని పోస్టులను తొలగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కునాల్ కర్మ తాను రాజకీయ విమర్శకుడనని, తన కంటెంట్‌ను సోషల్ మీడియాలో షేర్ చేయాల్సి ఉంటుందని, ప్రభుత్వం ఐటీ రూల్స్‌ను అడ్డం పెట్టుకొని తన కంటెంట్‌ను ఏకపక్షంగా తొలగించే అవకాశం ఉందని, తన ఖాతాలను బ్లాక్ చేసే ప్రమాదం ఉందని వాదించారు. బాంబే హైకోర్టు తీర్పును ఎడిటర్స్ గిల్డ్ స్వాగతించింది.

కాంగ్రెస్‌ను నడిపించేది.. అర్బన్ నక్సల్స్

- 'విద్వేష దెయ్యం' ఆ పార్టీలో ప్రవేశించింది
- అబద్ధం, ద్రోహం.. కాంగ్రెస్ లక్షణాలు
- తెలంగాణ సమాజానికీ ఆ పార్టీ ద్రోహం
- నిప్పులు చెరిగిన ప్రధాని నరేంద్ర మోదీ

వార్ధా, సెప్టెంబరు 20: కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోదీ నిప్పులు చెరిగారు. ఆ పార్టీని తుక్డే తుక్డే గ్యాంగ్, అర్బన్ నక్సలైట్లే నడిపిస్తున్నారని, వీరంతా అత్యంత అవినీతిపరులని, విభజనవాదులని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 138 ఏళ్ల వయసున్న కాంగ్రెస్ పార్టీ చివరకు గణపతిని పూజించినా ద్వేషిస్తోందని అన్నారు. "ఈ రోజు మీరు చూస్తున్న కాంగ్రెస్ పార్టీ.. నాడు మహాత్మాగాంధీ వంటి గొప్ప నాయకులు కలిసి నడిచిన పార్టీ కాదు" అని వ్యాఖ్యానించారు. 'పీఎం విశ్వకర్మ' పథకాన్ని ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా మహారాష్ట్రలోని వార్ధాలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "కాంగ్రెస్‌లోకి విద్వేషమనే దెయ్యం ప్రవేశించింది. ఆ పార్టీలో దేశ భక్తి అనే ఆత్మ నశించిపోయింది. విదేశాల్లో మాట్లాడుతున్న ఆ పార్టీ నాయకులు(రాహుల్ గాంధీ పేరు ప్రస్తావించకుండా) భారత వ్యతిరేక ఎజెండాను ఎంచుకున్నారు. అవినీతిమయమైన పార్టీ ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్సే. అత్యంత అవినీతిమయమైన కుంటుంబం ఏదైనా ఉంటే అది రాచరిక కుటుంబమే(గాంధీల కుటుంబం). గణపతిని పూజించడాన్నీ వారు జీర్ణించుకోలేకపోతున్నారు. నేను గణపతిని పూజించేందుకు వెళ్తే.. తమ బుజ్జగింపు రాజకీయాల కోసం దానిపై కూడా కాంగ్రెస్ విమర్శలు చేసింది. కర్ణాటక(కాంగ్రెస్ ప్రభుత్వం)లో గణపతిని జైల్లో పెట్టారు. మరో గణపతి విగ్రహాన్ని పోలీసు జీపు ఎక్కించారు. గణపతిని ఇంతలా అవమానించినా మహారాష్ట్రలోని కాంగ్రెస్ మిత్రులు శివసేన(యూబీటీ), ఎన్సీపీ(ఎస్పీ)లు నోటికి తాళాలు వేసుకున్నాయి. వారి ద్వంద్వ రాజకీయాల పట్ల మనంగా అప్రమత్తంగా ఉండాలి. అబద్ధం, ద్రోహం అనేవి కాంగ్రెస్ హాల్‌మార్క్. ఈ పార్టీ విషయంలో మహారాష్ట్ర ప్రజలు జాగ్రత్తగా ఉండాలి" అని ప్రధాని వ్యాఖ్యానించారు.


వార్ధాలో విశ్వకర్మ-2024 ఎగ్జిబిషన్‌లో ప్రధాని మోదీ

తెలంగాణలో ఇచ్చిన హామీలేమయ్యాయి?

అన్నదాతల ఆశలను, ఆకాంక్షలను ధ్వంసం చేసిన కాంగ్రెస్ పార్టీకి మరో అవకాశం ఇవ్వద్దని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. రాజకీయాలు, అవినీతి కోసమే రైతులను వాడుకుందని దుయ్యబట్టారు. "గత ఏడాది తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ లెక్కకు విక్కిలిగా హామీలు గుప్పించింది. కానీ, అధికారంలోకి వచ్చాక వాటన్నింటినీ అటకెక్కించి.. తెలంగాణ సమాజానికి ద్రోహం చేసింది" అని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ ఏనాడూ ప్రయత్నించలేదని విమర్శించారు. "కళాకారులు కేవలం కళాకారులుగా ఉండిపోకూడదు. వారంతా వ్యాపార వేత్తలుగా ఎదగాలన్నది మా ఆలోచన" అని ప్రధాని తెలిపారు.

మోదీ ఎక్కడున్నారు?

మోదీ మహారాష్ట్ర పర్యటనపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. "మహాత్మాగాంధీ-నాథూరాం గాడ్సేల మధ్య ప్రధాని ఎక్కడున్నారు" అని నిలదీసింది. కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్.. ప్రధానికి 3 ప్రశ్నలు సంధించారు. 'రైతుల ఆత్మహత్యలు నిలువరించేందుకు బీజేపీ ఏం చేసింది? అటవీ హక్కుల చట్టం అమలులో ఆదివాసీల హక్కులను ఎందుకు పక్కన పెట్టింది? గాంధీ-గాడ్సేల మధ్య ప్రధాని ఎక్కడ ఉన్నారు?" అని ఎక్స్‌లో పోస్టు చేశారు. మహారాష్ట్రలోనే రోజుకు సగటున ఏడుగురు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, దీనిని మోదీ ఎందుకు ప్రస్తావించలేదని జైరాం నిలదీశారు.

విశ్వకర్మలకు విపణి చేరువ

ప్రపంచ మార్కెట్‌లో చేనేత రంగానికి గొప్ప గౌరవం దక్కేలా తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ప్రధాని తెలిపారు. విశ్వకర్మ కమ్యూనిటీలకు గత ప్రభుత్వాలు చేసింది ఏమీలేదన్నారు. కేవలం ఏడాది కాలంలో 18 రకాల వృత్తులకు చెందిన 20 లక్షల మంది పీఎం విశ్వకర్మ పథకంలో చేరారని, 8 లక్షల మంది నైపుణ్య శిక్షణ పూర్తి చేసుకున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా 2.5 లక్షల గ్రామపంచాయతీల్లో, 5 వేల పట్టణ స్థానిక సంస్థల్లో విశ్వకర్మ పథకం అమలవుతోందన్నారు. హస్త కళాకారులు తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకునేందుకు ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్(ఓఎన్‌డీసీ) అందుబాటులో ఉందని తెలిపారు. కాగా, విశ్వకర్మ పథకానికి ఏడాది పూర్తైన సందర్భంగా స్మారక తపాలా బిళ్లను ప్రధాని ఆవిష్కరించారు. అమరావతిలో 1000 ఎకరాల్లో నిర్మించనున్న పీఎం మెగా ఇంటెగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్స్, అపరెల్‌పార్క్(పీఎం-మిత్ర)కు ప్రధాని శంకుస్థాపన చేశారు.

ఆయుధాలు వీడకుంటే ఆలౌట్ ఆపరేషన్!

- నక్సలైట్లు హింసను వీడి లొంగిపోవాలి
- కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పిలుపు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20: నక్సల్స్ హింసను విడనాడాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పిలుపునిచ్చారు. ఆయుధాలు వీడి లొంగిపోవాలని, లేకుంటే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 55 మంది నక్సల్స్ హింస బాధితులను శుక్రవారం ఆయన ఢిల్లీలోని తన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా హోంమంత్రి అమిత్‌షా మాట్లాడుతూ 2026, మార్చి 31 వరకు మాత్రమే మావోయిస్టులు తమ చివరి శ్వాస తీసుకోగలుగుతారని, అప్పటికి దేశంలో నక్సలిజం లేకుండా చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. మాట వినకుంటే నక్సల్స్ ముప్పునకు ముగింపు పలికేందుకు 'ఆలౌట్ ఆపరేషన్' చేపడతామని అమిత్‌షా హెచ్చరించారు. నక్సలిజం అటు దేశ ప్రజలకు, ఇటు దేశ అంతర్గత భద్రతకు ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. మావోయిస్టులకు వ్యతిరేకంగా చేపట్టిన ఆపరేషన్లలో భద్రతా బలగాలు గణనీయ విజయం సాధించాయని, మోదీ సర్కార్ విధానాలతో వామపక్ష తీవ్రవాద సమస్య ఇప్పుడు ఛత్తీస్‌గఢ్‌లోని కొన్ని జిల్లాలకు మాత్రమే పరిమితమైందని అమిత్‌షా పేర్కొన్నారు. మావోయిస్టులు గతంలో నేపాల్‌లోని పశుపతినాథ్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి వరకు కారిడార్ ఏర్పాటు చేయాలని ప్లాన్ వేశారని, అయితే మోదీ ప్రభుత్వం దాన్ని ధ్వంసం చేసిందన్నారు. నక్సలైట్ల మానవ హక్కుల గురించి చెప్పేవాళ్లు.. నక్సలిజం బాధితుల హక్కుల గురించి కూడా ఆలోచన చేయాలని అమిత్‌షా హితవు పలికారు. ఛత్తీస్‌గఢ్‌లోని నక్సల్స్ హింస ప్రభావిత ప్రజల కోసం కేంద్ర హోంశాఖ మూడు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వ సమన్వయంతో ఒక సమగ్ర సంక్షేమ పథకాన్ని రూపొందించనున్నదని తెలిపారు.

ఇంత అపచారమా?

(మొదటి పేజీ తరువాయి)

సంజయ్, పలువురు ఎన్డీయే, బీజేపీ జాతీయ నేతలు తీవ్రంగా స్పందించారు. మరోవైపు, 'కలియుగ దైవానికి ఇంత అపచారమా?' అంటూ కోట్లాదిమంది భక్తులు, ప్రభుత్వ నేతలు, వివిధ రంగాల ప్రముఖులు చలించిపోతున్నారు. దీనిపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని ఒకవైపు, కేంద్ర దర్యాప్తు సంస్థను రంగంలోకి దింపాలని మరోవైపు ఒత్తిడి పెరిగిపోతోంది. శ్రీవారినీ, భక్తులనూ కొల్లగొట్టిన జగన్‌ను, అప్పటి అదనపు ఈవో ధర్మారెడ్డిని శిక్షించాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, డీజీపీకి లేఖలు అందుతున్నాయి. తిరుమల పవిత్రతను కాపాడాలంటూ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌కు లేఖ రూపంలో వేసిన పిటిషన్ దాఖలైంది. జగన్‌పైనా, కల్తీ నెయ్యిని సరఫరా చేసిన కాంట్రాక్ట్ సంస్థలపైనా జాతీయ భద్రతా చట్టం కింద చర్య తీసుకోవాలని మరో న్యాయవాది.. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు, డీజీపీ ద్వారకా తిరుమలరావుకు లేఖ రాశారు. ఆ లేఖను యూపీ డీజీపీకి కూడా పంపించారు. దీనిని సనాతన ధర్మంపై కుట్ర, దాడిగా పరిగణించాలని అయోధ్య ప్రధాన పూజారి సత్యేంద్ర దాస్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మొత్తం వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలంటూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల లేఖ రాశారు.

విశాఖ స్టీల్‌కు మరో రూ.2,500 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

తెలిసిందే. మొదట విడుదల చేసిన నిధులను కేవలం చట్టబద్ధమైన చెల్లింపులకే వినియోగించాలని షరతు పెట్టింది. ఆ నిధుల వినియోగం బాధ్యత స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)కు అప్పగించింది. తాజాగా ప్రకటించిన రూ.2,500 కోట్ల వినియోగంలోనూ ఎస్‌బీఐ కీలకంగా వ్యవహరించాలని సూచించింది. ఈ నిధులు ఈ నెల 23వ తేదీ నాటికి అందుబాటులో ఉంటాయని భరోసా ఇచ్చింది. స్టీల్‌ప్లాంటులో మూడు బ్లాస్ట్ ఫర్నేసులు ఉండగా ముడి పదార్థాల కొరత కారణంగా రెండింటిని మూసేసి, ప్రస్తుతం ఒక్క దాంట్లోనే ఉత్పత్తి చేస్తున్నారు. ఇప్పుడు నిధులు అందుబాటులోకి వస్తున్నందున రెండు బ్లాస్ట్ ఫర్నేసులను పూర్తిస్థాయిలో నడపాలని ఉక్కు మంత్రిత్వ శాఖ ఆదేశించింది. అందుకు అవసరమైన ముడి పదార్థాలు సరఫరా చేస్తామని హామీ ఇచ్చింది. అన్ని విభాగాల్లోనూ నిర్వహణ (మెయింటెనెన్స్) పనులు చేపట్టి అక్టోబరు చివరి నాటికి పూర్తిచేసి, నవంబరు నుంచి పూర్తిస్థాయి ఉత్పత్తి చేయాలని కోరింది.

మానవ వనరుల వ్యయం తగ్గించే యత్నం

స్టీల్ ప్లాంటులో మూడు బ్లాస్ట్ ఫర్నేసులకు రెండింటినే నడపాలని నిర్ణయించినందున అధికంగా ఉన్న ఉద్యోగులను ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థలకు డిప్యుటేషన్‌పై పంపాలని నిర్ణయించింది. ఆ మేరకు జీతాల భారం తగ్గించుకోవాలని ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ఎన్‌ఎండీసీకి చెందిన నగర్‌నార్ ప్లాంటుకు డిప్యుటేషన్‌పై వెళ్లడానికి ఆసక్తి ఉన్నవారు ముందుకు రావాలని ఎగ్జిక్యూటివ్ స్థాయి అధికారులను మరోసారి పిలుపునిచ్చింది. దీనిపై తర్జన భర్జనలు జరుగుతున్నాయి. ఇక్కడి జీతాలు ఇస్తారా?, అక్కడి జీతాలు ఇస్తారా?, కుటుంబం సంగతి ఏమిటి?, ఆ తరువాత పరిస్థితి ఏమిటి? అని ఉద్యోగ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

భక్తులతో ఆటలు

- కొంపముంచిన రివర్స్ టెండరింగ్
- కూటమి ప్రభుత్వం వచ్చాక ఆగస్టులో నందినితో ఒప్పందం

(తిరుపతి/తిరుమల-ఆంధ్రజ్యోతి)

టీటీడీ అధికార యంత్రాంగం గత ఐదేళ్లలో అనుసరించిన రివర్స్ టెండరింగ్ విధానమే శ్రీవారి లడ్డూ ప్రసాదాల నాణ్యత విషయంలో కొంపముంచింది. నాణ్యతా పరీక్షలకు టీటీడీ యంత్రాంగం తిలోదకాలిచ్చింది. ముడి సరుకులు, ఆహార పదార్థాల నాణ్యతను పరీక్షించే ల్యాబ్ సామర్థ్యాన్ని పెంచే విషయంపైనా దృష్టి సారించలేదు. రివర్స్ టెండరింగ్ ద్వారా గత ప్రభుత్వం కంటే జగన్ ప్రభుత్వంలో టీటీడీ నిధుల వ్యయం తగ్గించామని గొప్పలు చెప్పుకోవడం కోసం చేసిన ప్రయోగం వికటించింది. కాంట్రాక్టర్లు తక్కువ ధర కోట్ చేసి నాసిరకం ముడిసరుకులు సరఫరా చేశారు. దానివల్లే శ్రీవారి ప్రసాదాల రుచి, సువాసన, నాణ్యత ఘోరంగా దెబ్బతిన్నాయన్న ఆరోపణలున్నాయి.

నాడు నామమాత్రంగా పరీక్షలు

తిరుమలలో రోజువారీ సగటున 3 లక్షల లడ్డూలు తయారు చేస్తారు. వాటి తయారీకి రోజుకు సగటున 11 వేల కిలోల నెయ్యి వినియోగించాల్సి ఉంటుంది. దీనికోసం టీటీడీ భారీ పరిమాణంలో టెండర్ల ద్వారా నెయ్యిని సేకరిస్తుంది. తిరుపతిలో మార్కెటింగ్ విభాగం గోదాముల్లో నెయ్యి నిల్వ చేస్తారు. తిరుమలలో 77 వేల కిలోల నెయ్యి మాత్రమే నిల్వ చేసే సదుపాయం ఉంది. ఐదు ట్యాంకర్లలో ఈ నెయ్యిని స్టోర్ చేస్తారు. ఈ నెయ్యి వారం రోజుల పాటు మాత్రమే సరిపోతుంది. ఆ తర్వాత తిరుపతి నుంచి ఎప్పటికప్పుడు తెప్పించుకుంటారు. నెయ్యి సరఫరాకు టెండరు ఖరారు కాగానే గతంలో టీటీడీ నిపుణులైన అధికారుల బృందాన్ని తొలుత సరఫరాదారుకు చెందిన డెయిరీ ఉత్పత్తుల తయారీ పరిశ్రమకు పంపేవారు. వారికి అంత పరిమాణంలో నెయ్యి తయారు చేసి, సరఫరా చేసే సామర్థ్యం ఉందా లేదా పరిశీలించేవారు. సరఫరాదారు నాణ్యత విషయంలో అఫిడవిట్ తరహాలో సర్టిఫికెట్ ఇవ్వడంతో పాటు గుజరాత్‌లోని ఎన్‌డీబీఎల్ నుంచీ సర్టిఫికెట్ తెచ్చి టీటీడీకి సమర్పించేవారు. తర్వాత నెయ్యి తిరుపతి చేరగానే మార్కెటింగ్ విభాగం గోదాముల వద్ద ఉన్న ల్యాబ్‌లో శాంపిల్స్ టెస్టు చేసేవారు. అక్కడ స్టోర్ చేసిన నెయ్యిని కొండపైకి పంపాక పైన కూడా ల్యాబ్‌లో శాంపిల్స్ టెస్టు చేసేవారు. ప్రాథమికంగా సంతృప్తి చెందాక లడ్డూల తయారీకి వినియోగించేవారు. అయితే గత ఐదేళ్లలో ఇవేవీ సక్రమంగా నడవలేదన్న ఆరోపణలున్నాయి. నెయ్యి సరఫరా చేసే సంస్థ వద్దకు నిపుణుల బృందం వెళ్లి పరిశీలించడం వంటివన్నీ నిలిపివేసినట్టు సమాచారం. తిరుపతి, తిరుమలలోని ల్యాబ్‌లలో హెల్త్ ఇన్‌స్పెక్టరు స్థాయి అధికారుల పర్యవేక్షణలో ఐదుగురు చొప్పున సిబ్బంది కనీస స్థాయి పరీక్షలు మాత్రమే నిర్వహిస్తున్నారు. వాస్తవానికి ఈ పరీక్షలతో నెయ్యి నాణ్యత నిర్ధారించే అవకాశం లేదంటున్నారు. పూర్తిస్థాయిలో నెయ్యి నాణ్యతను నిర్ధారించడానికి గ్యాస్ క్రొమెటోగ్రఫీ, హై పెర్ఫార్మెన్స్ లిక్విడ్ క్రొమెటోగ్రఫీ యంత్రాలు అవసరమవుతాయి.

గతంలో ఉత్తుత్తి హడావుడి

గత వైసీపీ ప్రభుత్వంలో వైవీ సుబ్బారెడ్డి టీటీడీ బోర్డు ఛైర్మన్‌గా ఉన్నపుడు ప్రసాదాల నాణ్యతపై విమర్శలు రావడంతో ల్యాబ్‌కు ఆధునిక యంత్రాలు కొనుగోలు చేయాలని హడావిడిగా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నెయ్యి నాణ్యత పరీక్షించేందుకు రూ.2 కోట్లతో.. ఆహార పదార్థాల తనిఖీకి రూ.కోటితో పరికరాల కొనుగోలుకు ప్రతిపాదించగా బోర్డు ఆమోదించిందని సమాచారం. ఆ తర్వాత పరికరాల కొనుగోలు మాత్రం జరగలేదు. విమర్శలు, ఆరోపణలు కొనసాగుతున్న నేపథ్యంలో టీటీడీ అప్పటి ఈవో ధర్మారెడ్డి ఈ ఏడాది జనవరిలో మైసూరులోని సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన రిటైర్డు సైంటిస్టును కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించారు.

విజిలెన్స్ నివేదికలో ప్రస్తావన

టీటీడీలో గత ఐదేళ్లలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపిన విజిలెన్స్ అధికారులు ముడి సరుకుల నాణ్యత విషయాన్ని కూడా నివేదికలో ప్రస్తావించినట్టు సమాచారం. తిరుపతి, తిరుమలలో ముడి సరుకుల నాణ్యతను పరీక్షించేందుకు ఏర్పాటు చేసిన ల్యాబ్‌లకు బోర్డులు మినహా లోపల అవసరమైన నిపుణులు లేరని, అలాగే పరీక్షలకు అవసరమైన పరికరాలు కూడా లేవని పేర్కొన్నట్టు తెలిసింది. పరీక్షలు లేనందునే ముడి సరుకుల నాణ్యతను పట్టించుకోవడం లేదని, నాసిరకం వస్తువుల వినియోగంతో శ్రీవారి ప్రసాదాల రుచి తగ్గిందన్న అభిప్రాయం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

తిరుమలలోనే ల్యాబ్

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక టీటీడీ ఈవోగా నియమితులైన శ్యామలరావు ముడిసరుకులు, ఆహార పదార్థాల నాణ్యతపై దృష్టి సారించారు. దీనికోసం తాత్కాలికంగా తిరుపతి జిల్లా ఫుడ్ సేఫ్టీ విభాగానికి చెందిన ఐదుగురు అధికారులను నియమించారు. తిరుమలలోనే నెయ్యి నాణ్యతను సూక్ష్మస్థాయిలో పరీక్షించేందుకు ప్రత్యేక అత్యాధునిక ల్యాబ్‌ను ఎఫ్‌ఎస్‌ఎస్ఏఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసేందుకు టీటీడీ చర్యలు తీసుకుంటోంది. ఇందుకు అవసరమయ్యే రూ.75 లక్షల విలువైన యంత్రాలను విరాళంగా ఇచ్చేందుకు ఎన్‌డీడీబీ ల్యాబ్ ముందుకువచ్చింది. డిసెంబరు నెలాఖరుకు ఈ ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి వంద శాతం నాణ్యతను పరీక్షించేలా ప్రణాళికలు రూపొందించుకున్నారు. పలు ప్రసాదాల్లో వినియోగిస్తున్న ముడిసరుకుల నాణ్యతను పరీక్షించేందుకు ల్యాబ్‌ను సిద్ధం చేయనున్నారు.



జూలై 22నుంచి బ్లాక్ లిస్టులో

ఈ ఏడాది మార్చి 13వ తేదీన నెయ్యి కొనుగోలుకు టెండర్లు పిలిచారు. మే 8వ తేదీన టెండర్లు ఖరారు చేశారు. నెయ్యి కేజీకి రూ.320 ఖరారు చేశారు. అదే నెల 15వ తేదీన ఏఆర్ డైరీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు సరఫరాకు ఆర్డర్ ఇచ్చారు. అప్పటి నుంచి ఏఆర్ డైరీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నెయ్యిని సరఫరా చేస్తూ వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీటీడీ ఈవోగా బాధ్యతలు తీసుకున్న శ్యామలరావుకు పలు సందర్భాల్లో భక్తులు లడ్డూ, అన్నప్రసాదాల మీద అసంతృప్తిని తెలిపారు. దీంతో పదార్థాల నాణ్యతపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. ఈ సమయంలో ఏఆర్ డైరీ ఫుడ్స్ నుంచి వచ్చిన నాలుగు ట్యాంకర్లలోని నెయ్యిపై అనుమానం వ్యక్తమైంది. జూలై 6న రెండు ట్యాంకర్లు, 12వ తేదీన మరో రెండు ట్యాంకర్లలోని శాంపిల్స్‌ను ఎన్ఏబీఎల్ గుర్తింపు ఉన్న ఎన్‌డీడీబీ ల్యాబ్‌కు పంపారు. ప్రపంచస్థాయిలో గుర్తింపు ఉన్న ల్యాబ్ ఇది. జూలై 16వ తేదీన నెయ్యిలో కల్తీ జరిగినట్టు ల్యాబ్ రిపోర్టులువచ్చాయి. దీంతో నివ్వెరపోయిన టీటీడీ ఆ వెంటనే ఆ నాలుగు ట్యాంకర్ల నెయ్యిని వాడకుండా వెనక్కి పంపింది. జూలై 22వ తేదీన ఏఆర్ డైరీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను బ్లాక్ లిస్ట్‌లో పెట్టింది.

ప్రస్తుతం నాణ్యమైన నెయ్యితోనే..

ప్రస్తుతం వైష్ణవి డైరీ, పరాగ్ మిల్క్ ఫుడ్స్, కృపా రామ్ డైరీ, ప్రీమియర్ అగ్రి ఫుడ్స్ అనే సంస్థలు టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తున్నాయి. మరోవైపు నాణ్యత కలిగిన నందిని నెయ్యిని తిరిగి కొనుగోలు చేయాలని టీటీడీ నిర్ణయించింది. 2024-25 ఏడాదికి గాను 350 మెట్రిక్ టన్నుల నెయ్యిని సరఫరా చేసేందుకు ఆగస్టు నెలాఖరులో టెండరు ఖరారు చేసింది. కేజీ రూ.478 చొప్పున కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గత నెల రోజులుగా అత్యంత నాణ్యమైన నెయ్యితోనే లడ్డూలు తయారు చేస్తుండంతో భక్తుల నుంచి ఫిర్యాదులు తగ్గాయి. నాణ్యత విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేవని టీటీడీ నిర్ధారించుకుని లడ్డూ తయారీలోనూ, అన్నప్రసాదాల తయారీలోనూ వినియోగిస్తోంది.


సింహాచలం దేవస్థానంలో లడ్డూ ప్రసాదం తయారీ దృశ్యం

అప్పన్న ఆలయంలోనూ అదే తంతు!

- ప్రసాదాల తయారీలో నాణ్యతకు తిలోదకాలు
- తక్కువకు కోట్ చేసినవారికే నెయ్యి కాంట్రాక్టు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి నాణ్యత లేని నెయ్యిని వినియోగించినట్లు తేలడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రముఖ దేవస్థానాల్లో అలజడి మొదలైంది. విశాఖలోని సింహాచలం దేవస్థానంలోనూ అతి తక్కువ ధరకు వచ్చిన నెయ్యినే వాడుతున్నారని 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో తేలింది. ఇక్కడ ఆరు నెలలకు ఒకసారి టెండర్లు పిలిచి, ఎవరు తక్కువ ధరకు సరఫరా చేస్తామంటే వారికి కాంట్రాక్టు ఇచ్చేస్తున్నారు. ఈ క్రమంలో నాణ్యత గురించి పట్టించుకోవడం లేదు. సింహాచలం దేవస్థానానికి శ్రీ విజయ విశాఖ మిల్క్ ప్రొడ్యూసర్స్ ప్రైవేటు లిమిటెడ్ (విశాఖ డెయిరీ) చాలాకాలంగా నెయ్యి సరఫరా చేస్తోంది. 2020-21 లో కిలో ధర రూ.591 లెక్కన 54వేల కిలోలు, 2021-22లో 59,250 కిలోలు అందించింది. 2022-23లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రీమియర్ అగ్రోటెక్ ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ కిలో రూ.393.30కే ఇస్తామని టెండర్ వేయడంతో వారికి కాంట్రాక్టు ఇచ్చి 54వేల కిలోల నెయ్యి కొనుగోలు చేశారు. దాని డైరెక్టర్లంతా హిందూయేతరులేనని ఆ సంస్థ వెబ్‌సైట్‌లో చూపిస్తోంది. ఇక 2023-24లో విశాఖలోనే సూర్యకుమారి ఏజెన్సీస్ కిలోకు రూ.529 కోట్ చేయగా వారికి కాంట్రాక్టు ఇచ్చారు. ఆ సంస్థ 26,430 కిలోలు సరఫరా చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) కాంట్రాక్టును గోదావరి జిల్లాలకు చెందిన రైతు డెయిరీ సంస్థ దక్కించుకుంది. ఈ సంస్థ కిలో రూ.344కే కోట్ చేసింది. వారినుంచి 47,175 కిలోల నెయ్యికి ఆర్డర్ ఇచ్చారు. వాస్తవానికి విశాఖ డెయిరీ నెయ్యి కిలో రూ.660 చొప్పున మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. టోకున తీసుకుంటున్నారనే ఉద్దేశంతో కిలో రూ.591కే దేవస్థానానికి గతంలో సరఫరా చేశారు. కాగా, సింహాచలం దేవస్థానం ప్రసాదాల్లో నాణ్యత లేదని చాలాకాలంగా భక్తులు ఆరోపిస్తున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు తక్కువ ఖరీదు నెయ్యి వినియోగిస్తున్నారని తెలియడంతో సమర్థించుకునే ప్రయత్నాలు మొదలుపెట్టారు. సరఫరాదారు నుంచి నాణ్యత సర్టిఫికెట్ తీసుకుంటామని, చినవాల్తేరులోని లేబొరేటరీకి పంపించి, నాణ్యతను పరీక్షించాకే తీసుకుంటామని చెబుతున్నారు. అయితే ఇక్కడి ప్రభుత్వ లేబొరేటరీలో నామమాత్రంగా పరీక్షలు చేసి నివేదిక పంపుతున్నారనే విమర్శలున్నాయి. ఆ లేబొరేటరీ నివేదికను ప్రామాణికంగా తీసుకొని సింహాచలం దేవస్థానం నెయ్యిని కొనుగోలు చేయడమేంటనే ప్రశ్న వినిపిస్తోంది.

అన్నవరంలో 'వైసీపీ' నెయ్యి!

- రెండేళ్లుగా ఒకే కంపెనీకి కాంట్రాక్టు

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానానికి సరఫరా అవుతున్న నెయ్యిని రెండేళ్లుగా ఒకే కంపెనీ సమకూరుస్తోంది. ఆలయ అధికారులు ఆరు నెలలకోసారి టెండర్లు పిలుస్తున్నా ప్రతిసారీ ఆ కంపెనీ మాత్రమే ఆర్డరు దక్కించుకుంటోంది. పైగా ఈ కంపెనీ అన్నవరం ఆలయానికి ఒక ధరకు, విశాఖ జిల్లాలోని సింహాచలం దేవస్థానానికి మరో ధరకు నెయ్యి సరఫరా చేయడం దుమారం రేపుతోంది. ఈ రెండు ఆలయాలకు నెయ్యి సరఫరా కాంట్రాక్టును గత వైసీపీ ప్రభుత్వంలో రైతు డెయిరీ అనే కంపెనీ దక్కించుకుంది. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఈ కంపెనీ సింహాచలం దేవస్థానానికి కిలో నెయ్యి రూ.344 చొప్పున, అన్నవరం దేవస్థానానికి రూ.538 చొప్పున వసూలు చేయడంపై విమర్శలు వస్తున్నాయి. గతంలో అన్నవరం దేవస్థానానికి విజయ, సంగం డెయిరీల నుంచి ఏటా 1.80 లక్షల కిలోల వరకు నెయ్యి సరఫరా అయ్యేది. కానీ గత వైసీపీ సర్కారు 2022 నుంచీ వీటిని పక్కకు తప్పించి అనామక కంపెనీతో నెయ్యి సరఫరా చేయిస్తోంది. రెండేళ్ల నుంచి రైతు డెయిరీ కంపెనీకే టెండరు దక్కడంలో వైసీపీ పెద్దల కమీషన్ల బాగోతం ఉందని చెబుతున్నారు.

ఇంటర్‌లో ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్

వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు.. కీలక నిర్ణయం తీసుకున్న ఇంటర్ బోర్డు

- పరీక్షలు యథాతథం.. గణితంలో 2 పేపర్లు
- జాతీయ స్థాయిలో పోటీపడేలా బోధన
- ప్రైవేటు కళాశాలలతోనూ కీలక చర్చలు
- అన్ని కాలేజీల్లో రెమిడియల్ తరగతులు
- జిల్లాల్లో అకడమిక్ పర్యవేక్షణ కేంద్రాలు
- సంస్కరణల దిశగా ఇంటర్మీడియెట్ బోర్డు

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కాలేజీలను పటిష్ఠం చేసి, వాటిలో చదివే విద్యార్థులు జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో రాణించేలా తీర్చిదిద్దే దిశగా ఇంటర్ విద్యాశాఖ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. 2025-26 విద్యా సంవత్సరం నుంచి మొత్తం పాఠ్యాంశాలను(సిలబస్) మార్చేయాలని నిర్ణయించింది. ఇప్పటివరకు స్టేట్ సిలబస్ పుస్తకాలు అమ ల్లో ఉండగా వాటి స్థానంలో ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌ను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. సిలబస్‌ను ఎన్‌సీఈఆర్‌టీలోకి మార్చినా పరీక్షల విధానం యథాతథంగానే కొనసాగించనుంది. ఎన్‌సీఈఆర్‌టీలో గణితం ఒక్కటే సబ్జెక్టుగా ఉంటుంది. కానీ రాష్ట్రంలో ఇంటర్‌లో గణితం 2సబ్జెక్టులుగా ఉంటుంది. దీనికోసం ఎన్‌సీఈఆర్‌టీ గణిత సిలబస్‌ను రెండుగా విభజించి 1ఏ, 1బీ, 2ఏ, 2బీలుగా అమలు చేయనుంది. జేఈఈ, సీయూఈటీ, క్లాట్ లాంటి పరీక్షల్లో వచ్చే ప్రశ్నలు ఎక్కువగా ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ ఆధారంగానే వస్తున్నాయని గుర్తించిన ప్రభుత్వం ఈ మేరకు మార్పులు చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని ప్రైవేటు ఇంటర్ కాలేజీలు చాలా వరకు ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌నే అనుసరిస్తున్నా యి. ఆ కారణంగానే ప్రైవేటు కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులు ఐఐటీల్లో సీట్లు ఎక్కువగా సాధిస్తున్నారు. ఆ దిశగా ప్రభుత్వ కాలేజీల్లోని విద్యార్థులను కూడా మెరుగుపరచాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనిలో భాగంగా ఇటీవల ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ కృతికా శుక్లా.. నారాయణ, శ్రీచైతన్యలాంటి ప్రముఖ విద్యా సంస్థల అకడమిక్ ప్రతినిధులతో చర్చ లు జరిపారు. వారు అనుసరిస్తున్న బోధనా విధానాలను అడిగి తెలుసుకున్నారు. కొన్నింటిని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రవేశపెట్టాలని నిర్ణయించారు.

విద్యార్థి ట్రాకింగ్

ప్రైవేటు కాలేజీల్లో విద్యార్థులపై ట్రాకింగ్ విధానం అమల్లో ఉంది. విద్యార్థులకు తరచూ పరీక్షలు నిర్వహించడం, వారు ఏ స్థాయిల్లో ఉన్నారో గుర్తించి దానికి అనుగుణంగా రెమిడియల్ తరగతులు నిర్వహించడం లాంటి బోధనా విధానం ఉంది. అలాంటి విధానాన్నే ప్రభుత్వ కాలేజీల్లోనూ ప్రవేశపెట్టనున్నారు. ప్రతి విద్యార్థి సామర్థ్యాలను అంచనా వేయడం దీని ప్రధాన ఉద్దేశం. ప్రస్తుత విధానంలో విద్యార్థులు కొన్ని సబ్జెక్టుల్లో వెనకబడినా వారిని మెరుగుపరిచే విధానం లేదు. ఇకపై విద్యార్థులను ట్రాకింగ్ చేస్తూ నిత్యం వారి అభ్యసన సామర్థ్యాలు పెంచాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా అంతర్గత పరీక్షల విధానాన్ని సెంట్రలైజ్ చేశారు. గతంలో యూనిట్ పరీక్షలు, క్వార్టర్లీ, హాఫ్ ఇయర్లీ పరీక్షలకు కాలేజీల్లోనే ప్రశ్నపత్రాలు తయారు చేసేవారు. వారికి వీలున్నప్పుడు పరీక్షలు నిర్వహించేవారు. ఈ క్రమంలో కొందరు విద్యార్థులు అంతర్గత పరీక్షలు రాయట్లేదని తేలింది. దీంతో అన్ని పరీక్షలను నిర్దేశిత తేదీల్లోనే నిర్వహించాలని, వాటికి ప్రశ్న పత్రాలు ఇంటర్ బోర్డు నుంచి పంపాలని నిర్ణయించారు. అలాగే విద్యార్థుల మార్కులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి తరచూ సమీక్షించనున్నారు. ప్రైవేటు కాలేజీల తరహాలో రెమిడియల్ తరగతుల విధానాన్ని ప్రభుత్వ కాలేజీల్లో ఇటీవల ప్రారంభించారు. గతంలో జనవరి నుంచి ఈ విధానం అమలు చేసేవారు. ఇకపై దీనిని నిరంతరం అమలుచేయాలని భావిస్తున్నారు. సాయంత్రం కాలేజీ ముగిసిన తర్వాత గంటసేపు ఈ తరగతులు నిర్వహిస్తున్నారు.

మార్గదర్శనం, పర్యవేక్షణ సెల్స్

విద్యార్థుల అభ్యసన స్థితిని పర్యవేక్షిస్తూ కాలేజీలకు మార్గదర్శనం చేసేందుకు అకడమిక్ గైడెన్స్, మానిటరింగ్ సెల్(కేంద్రం)ను జిల్లా స్థాయిలో ఏర్పాటు చేశారు. ఆర్జేడీ స్థాయిలోనూ ఈ సెల్స్ ఏర్పాటు చేస్తున్నారు. లైబ్రరీల్లోని జూనియర్ లెక్చరర్లు, వ్యాయామ విద్య బోధించే జూనియర్ లెక్చరర్లు ఈ సెల్స్‌లో పనిచేయనున్నారు. ఎప్పటికప్పుడు కాలేజీల డేటాను పర్యవేక్షిస్తూ, వారికి అవసరమైన గైడెన్స్ ఇస్తారు. అలాగే వచ్చే ఏడాది నుంచి మారనున్న సిలబస్‌కు అనుగుణంగా జూనియర్ లెక్చరర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. మారిన సిలబస్, కొత్త బోధనా విధానంపై వీరికి శిక్షణ ఇస్తారు.

తెలంగాణ వరద బాధితులకు 'భాష్యం' విరాళం

- రూ.1.25 కోట్ల చెక్ సీఎం రేవంత్‌రెడ్డికి అందజేత



తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి చెక్ అందజేస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు(విద్య), సెప్టెంబరు 20: ఇటీవల తెలంగాణలో సంభవించిన వరదల కారణంగా నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు భాష్యం విద్యాసంస్థలు తమ వంతు విరాళం ప్రకటించాయి. ఆపన్నులను ఆదుకోవాలనే లక్ష్యంతో రూ.1.25 కోట్ల చెక్‌ను సీఎం రేవంత్‌రెడ్డికి భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ శుక్రవారం హైదరాబాదులో అందజేశారు. వరదల కారణంగా నష్టపోయిన వారిని ఆదుకునేందుకు భాష్యం విద్యాసంస్థలు ముందుకు రావడం అభినందనీయమని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణను ఆయన అభినందించారు. తమ సంస్థల పిలుపు మేరకు విద్యార్థులు వారి తల్లిదండ్రులు, సిబ్బంది అందించిన సహకారం హర్షణీయమని భాష్యం రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల తెలంగాణ సీఈవో చైతన్య, జెట్టి కుసుమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే అడుసుమిల్లి జయప్రకాష్ కన్నుమూత

- కాంగ్రెస్‌లో విద్యార్థి సంఘ నాయకుడిగా అడుగు
- కాకాని వెంకటరత్నం శిష్యుడిగా గుర్తింపు
- ఎన్టీఆర్ పిలుపుతో టీడీపీలో చేరిక
- విజయవాడ తూర్పు శాసనసభ్యునిగా ఎన్నిక
- అన్ని పార్టీల ప్రముఖులతో సత్సంబంధాలు
- 2014 తర్వాత రాజకీయాలకు దూరం



విజయవాడ (వన్‌టౌన్), సెప్టెంబరు 20: తెలుగుదేశం పార్టీ తొలితరం శాసనసభ్యునిగా 1983-85 మధ్య విజయవాడ తూర్పు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన మాజీ ఎమ్మెల్యే అడుసుమిల్లి జయప్రకాష్ అనారోగ్యంతో శుక్రవారం కన్నుమూశారు. కొన్నిరోజులుగా ఆయన హైదరాబాద్‌లోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీలో ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌కు సంబంధించిన చికిత్స పొందుతున్నారు. కాగా, జయప్రకాష్ మృతదేహం శుక్రవారం రాత్రి విజయవాడ చేరుకుంది. శనివారం అంత్యక్రియలు నిర్వహిస్తామని ఆయన కుమారుడు శ్రీతిరుమలేష్ తెలిపారు. జయప్రకాష్ విద్యార్థి దశలోనే రాజకీయాలపై ఆసక్తి పెంచుకున్నారు. విద్యార్థి సంఘ నాయకుడిగా కాంగ్రెస్‌లో పనిచేశారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టాక ఆయన పిలుపుతో టీడీపీలో చేరి విజయవాడ తూర్పు శాసనసభ్యునిగా గెలుపొందారు. దివంగత కాకాని వెంకటరత్నం శిష్యుడిగా గుర్తింపు పొందారు. సమైక్య ఉద్యమంలో ఆయన కీలకపాత్ర పోషించారు. అడుసుమిల్లి జయప్రకాష్‌కు అన్ని రాజకీయ పార్టీల ప్రముఖులతో పరిచయాలున్నాయి. ఆయన వాదనలు, విశ్లేషణలు మంచి ఆధారాలతో పటిష్ఠంగా ఉండేవి. ఎవరినీ నొప్పించకుండా ఉన్నది ఉన్నట్టుగా చెప్పేవారు. 2014లో రాష్ట్ర విభజన తరువాత ఆయన ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధాలు కొనసాగించలేదు. వివిధ దినపత్రికలకు సమకాలీన రాజకీయాలపై వ్యాసాలు రాయటమే కాకుండా టీవీల్లో చర్చల్లో, ఇంటర్వ్యూల్లో వర్తమాన రాజకీయాలను విశ్లేషించేవారు. జయప్రకాష్ మృతిపట్ల పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు.. జయప్రకాష్ తనయుడు తిరుమలేష్‌తో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. వర్తమాన రాజకీయ విశ్లేషకుడిగా జయప్రకాష్ తనదైన పాత్ర పోషించారని కొనియాడారు.

తిరుపతి ఆర్డీఓ సస్పెన్షన్

- 'ఎన్‌ఓసీ జారీకి లంచం' కేసు విచారణ ఏసీబీకి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పుత్తూరులో పెట్రోల్ బంకు ఏర్పాటుకు నిరభ్యంతర పత్రం(ఎన్‌ఓసీ) జారీ చేసే విషయంలో రెవెన్యూ అధికారులు డబ్బులు డిమాండ్ చేశారన్న ఫిర్యాదుపై అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)తో విచారణ చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా శుక్రవారం ఉత్తర్వులు(జీఓ-650)జారీ చేశారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న తిరుపతి ఆర్డీఓ ఎనిశాంత్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ టెక్నికల్ కన్సల్టెంట్ కె.కె. కిశోర్ కుమార్ ఫిర్యాదుపై స్పందించిన ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంది. ఎం.శ్రీను అనే వ్యక్తికి పుత్తూరులో హెచ్‌పీ పెట్రోల్ బంకు మంజూరైంది. బంకు ఏర్పాటుకు పోలీసు, ఫైర్ సేఫ్టీ అధికారులు అనుమతి ఇచ్చారు. భూమి వినియోగంపై రెవెన్యూ అధికారులు ఎన్‌ఓసీ ఇవ్వాల్సి ఉంది. ఇందుకోసం తిరుపతి ఆర్డీఓ దగ్గర పనిచేస్తోన్న నరేంద్ర, తిరుపతి కలెక్టరేట్‌లోని సూపరింటెండెంట్ సురేష్ కుమార్ దరఖాస్తుదారుడు శ్రీను దగ్గర డబ్బులు డిమాండ్ చేశారని కిశోర్‌కుమార్ (శ్రీను మామ) సీసీఎల్ఏకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులోని అంశాలను పరిశీలించిన ప్రభుత్వం ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని గుర్తించింది. ఏసీబీ విచారణకు ఆదేశించింది. ఇదే కేసులో డబ్బులు డిమాండ్ చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న అప్పటి పుత్తూరు తహశీల్దార్ పరమేశ్వరస్వామి, కలెక్టరేట్‌లోని సూపరింటెండెంట్ సురేష్‌కుమార్, ఆర్డీఓ క్లర్క్‌గా ఉన్న నాగేంద్రను సస్పెండ్ చేస్తూ తక్షణమే ఆదేశాలు జారీ చేయాలని సిసోడియా ఆదేశించారు. ఇదిలా ఉంటే, ఎన్‌ఓసీకి డబ్బులు డిమాండ్ చేయడంపై ఆంధ్రజ్యోతి పలు వార్తలను ప్రచురించింది. విచారణ పేరిట నాటి తిరుపతి జాయింట్ కలెక్టర్ బాధితుడినే బెదిరించిన ఉదంతాన్ని కూడా వెలుగులోకి తీసుకొచ్చింది.

సింహపురిలో పరువు హత్య!

- కన్నకూతురినే కడతేర్చిన తల్లిదండ్రులు



శ్రావణి

కొడవలూరు, సెప్టెంబరు 20: అల్లారు ముద్దుగా పెంచిన ఆడబిడ్డ పెళ్లైన ఏడాదికే భర్తతో విభేదాల కారణంగా ఇంటికి తిరిగొచ్చేసింది. ఆ తర్వాత ఆమె వేరే మతానికి చెందిన వ్యక్తిని ప్రేమించి పెళ్లిచేసుకోవడాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేక గొంతు నులిమి హత్య చేశారు. నెల్లూరు జిల్లా కొడవలూరు మండలంలో 25 రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. కొడవలూరు మండలం నత్రం గ్రామానికి చెందిన తిరుమూరు వెంకటరమణయ్య, దేవసేనమ్మ దంపతులకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు. అనారోగ్యం కారణంగా పదిహేనేళ్ల క్రితం పెద్దకుమారుడు మృతి చెందాడు. వీరిలో మూడో సంతానం తిరుమూరు శ్రావణిని (24) ఐదేళ్ల క్రితం సంగం మండలం సద్దీపురానికి చెందిన రాజేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. పెళ్లయిన ఏడాదికే కుటుంబ కలహాల కారణంగా భర్త నుంచి విడాకులు తీసుకుని తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. ఈ క్రమంలో రెండు నెలల క్రితం అల్లూరు మండలం ఆములూరులో మరో మతానికి చెందిన ఓ వ్యక్తిని ప్రేమించి, పెళ్లి చేసుకుంది. ఈ నేపథ్యంలో నెల రోజుల క్రితం కుమార్తెను అపహరించాడంటూ ఆమె భర్తపై అల్లూరు పోలీసులకు వెంకటరమణయ్య ఫిర్యాదు చేశాడు. ఆ తర్వాత కుమార్తెకు నచ్చజెప్పి ఇంటికి తీసుకొచ్చారు. తాను భర్తతోనే కలిసి ఉంటానని, తనను పంపేయాలంటూ కుటుంబ సభ్యులతో శ్రావణి గొడవ పడేది. ఈ క్రమంలో 25 రోజుల క్రితం జరిగిన ఘర్షణలో కోపోద్రిక్తులైన తల్లిదండ్రులు కుమార్తె గొంతు నులిమి హత్య చేసినట్టు సమాచారం. ఈ విషయం బయటకు పొక్కడంతో గ్రామస్థులు గురువారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. అదే రోజు వెంకటరమణయ్య ఇంటికి వెళ్లిన పోలీసులు శ్రావణి గురించి ఆరా తీయడంతో పాటు, వారిని అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం ఉదయం నెల్లూరు డీఎస్పీ శ్రీనివాసులు ఇంటి వెనుక పూడ్చిన శ్రావణి మృతదేహాన్ని వెలికితీయించారు.

ఇంటర్ విద్యార్థినులకు అస్వస్థత

- రేకుల షెడ్డులో హాస్టల్ నిర్వహణ
- తీవ్రవేడి కారణంగా అనారోగ్యం, ఓ విద్యార్థిని పరిస్థితి విషమం

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 20: ఆదోని ప్రభుత్వ బీసీ కళాశాల హాస్టల్‌లో పలువురు విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గురువారం కళాశాలకు వెళ్లిన ఇద్దరు విద్యార్థినులు ప్రార్థన సమయంలో స్పృహ తప్పి పడిపోగా, శుక్రవారం మరో ఆరుగురు కళాశాలలోనే తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ప్రిన్సిపాల్ సంజన ఆదోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చేర్పించారు. ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఇందు హైబీపీ వల్ల పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు కర్నూలుకు తరలించాలని సూచించారు. మరో ఆరుగురు విద్యార్థినులు ఆదోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యులు పరీక్షించి అధిక వేడితో పాటు వైరల్ జ్వరం, ఆరోగ్య సమస్యల వల్ల అస్వస్థతకు గురైనట్టు తెలిపారు. తహసీల్దార్ శివరాముడు అక్కడికి చేరుకుని విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా హాస్టల్ రేకుల షెడ్డులో ఉండటం.. అందులో ఫ్యాన్లు కూడా లేక విద్యార్థినులు ఉక్కబోతతో ఇబ్బందులు పడుతున్నట్టు అధికారులు గుర్తించారు. ఈ హాస్టల్‌లో దాదాపు 130 మంది విద్యార్థినులు వసతి పొందుతున్నారు.

కార్డుల సంఖ్య సమానంగా ఉండాలి

అమరావతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ షాపులు ఏర్పాటు చేసే ముందు డీలర్లకు సమానంగా కార్డులు పంపిణీ చేయాలని రేషన్ డీలర్ల సంఘం నేతలు కోరారు. ఈమేరకు ఆ సంఘం అధ్యక్షుడు దివి లీలామాధవరావు నేతృత్వంలో శుక్రవారం విజయవాడలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ వీర పాండ్యన్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే చాలీచాలని కార్డులతో డీలర్ల కుటుంబ పోషణ కష్టంగా మారిందని, ఇంకా షాపులు పెంచడం వల్ల ఆదాయం మరింత తగ్గుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 500 కార్డులు, తాలూకా కేంద్రాల్లో 800, కార్పొరేషన్లలో 1050, మండల కేంద్రాల్లో 700 కార్డులు ఉండేలా చూడాలన్నారు.

మాజీ ఎంపీ నందిగం సురేశ్ ఇంట్లో సోదాలు

తుళ్లూరు, సెప్టెంబరు 20: టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో అరెస్టయి.. రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ ఎంపీ నందిగం సురేశ్ ఇంట్లో మంగళగిరి రూరల్ పోలీసులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది.. ఉద్దండ్రాయునిపాలెంలోని సురేశ్ ఇంట్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు సోదాలు చేశారు. 2020లో వెలగపూడిలో మహిళ హత్య కేసు ఘటనలో అప్పట్లో మృతురాలి కుమారుడు నందిగం సురేశ్‌ను ప్రధాన నిందితుడిగా పేర్కొంటూ ఫిర్యాదు చేశాడు. ఆ కేసుకు సంబంధించి సోదాలు చేసినట్టు తెలిసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నీళ్ల మంటలు!

సింధు నదీజలాల ఒప్పందాన్ని సవరించుకుందామంటూ ఇటీవల భారతదేశం ఇచ్చిన నోటీసుకు పాకిస్థాన్ తనదైన ధోరణిలో స్పందించింది. ఆరుదశాబ్దాలనాటి ఆ ఒప్పందాన్ని సమీక్షించి, సవరించుకోవాలని భారత ప్రభుత్వం గత ఏడాది కూడా పాకిస్థాన్‌ను డిమాండ్ చేసింది. అప్పట్లో తీవ్రంగా స్పందించిన పాకిస్థాన్ ఈ మారు మాత్రం కాస్తంత తగ్గింది. పాకిస్థాన్ ఈ ఒప్పందాన్ని ఎంతో గౌరవిస్తుందని, భారత్ కూడా అలాగే భావిస్తూ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని హితవుచెప్పింది. తొమ్మిదేళ్ళ సుదీర్ఘచర్చల అనంతరం 1960లో నెహ్రూ–అయూబ్‌ఖాన్ సంతకాలు చేసిన ఈ ఒప్పందంలో పటిష్ఠమైన నిబంధనలు, పలుదశల వివాద పరిష్కారమార్గాలు ఉన్నందునే అది ఇప్పటికీ బలంగా నిలబడింది. ప్రపంచవ్యాప్తంగా చాలా నదీజలాల పంపకాలకు ఇది ఆదర్శమని కూడా అంటారు. మరీముఖ్యంగా, భారత్–పాకిస్థాన్ మధ్య ఇన్ని దశాబ్దాలుగా వీసమెత్తు సయోధ్య లేకున్నా, చివరకు యుద్ధాలు జరిగినా ఈ ఒప్పందం నిలిచింది. అయితే, కిషన్‌గంగ, రాటిల్ జల విద్యుత్ ప్రాజెక్టుల విషయంలో రెండుదేశాల మధ్యా ఉన్న వివాదం ఈ ఒప్పందాన్ని ప్రమాదంలో పడవేసేట్టు కనిపిస్తోంది.

పరిస్థితులు, అవసరాలు పూర్తిగా మారిపోయాయని, ఇప్పుడు ఒప్పందాన్ని తిరగరాసుకోవాలని భారత్ వాదిస్తూ, పెరిగిన జనాభా, క్లీన్ ఎనర్జీ, పర్యావరణ మార్పులు, ఉగ్రవాదం తదితర కారణాలను భారత్ ప్రస్తావించింది. నోటీసులు ఇవ్వడానికి ఇవన్నీ సముచిత కారణాలేనన్నది అటుంచితే, సరిహద్దు ఉగ్రవాదం హెచ్చినప్పుడో, కశ్మీర్‌తో అవసరాలు పెరిగినప్పుడో ఈ ఒప్పందాన్ని భారత్ తరచుగా పాకిస్థాన్‌కు గుర్తుచేస్తూ ఉంటుంది. గత ఏడాది ఇచ్చిన నోటీసుకు ఇప్పటిది కొనసాగింపు మాత్రమేనని, ఈ రెండు జలవిద్యుత్ ప్రాజెక్టుల విషయంలో పాకిస్థాన్ ఒత్తిడికి లొంగకూడదన్న పట్టుదలతోనే భారత్ ఈ విధంగా వ్యవహరిస్తున్నదని అంటారు. సింధునదీ జలాల ఒప్పందంలో భాగంగా సింధు, జీలం, చీనాబ్ నదులు పాకిస్థాన్‌కు దక్కాయి. రావి, బియాస్, సట్లెజ్ భారతదేశానికి వచ్చాయి. ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిగా కుదిరిన ఈ ఒప్పందం సజావుగా అమలుజరగడానికి సింధు శాశ్వత కమిషన్ ఏర్పాటైంది, రెండు దేశాలనుంచి అందులో కమిషనర్లు ఉన్నారు. చీనాబ్, జీలం నదులమీద జమ్మూకశ్మీర్‌లో ఈ జల విద్యుత్ ప్రాజెక్టుల అంశాన్ని ద్వైపాక్షిక చర్చలతో పరిష్కరించుకోవచ్చునన్నది భారత్ వాదన. కానీ, తనవాటా నదులమీద వీటి నిర్మాణంపై పాకిస్థాన్ దశాబ్దంన్నరకాలంగా రచ్చచేస్తున్నది. భారత్ స్వేచ్ఛగా ఉపయోగించుకోగలిగే జలాల పరిధిలోనే ఈ ప్రాజెక్టులు ఉన్నా, ఆ జలాలను విద్యుత్ వినియోగానికి తప్ప భారత్ ఇతరత్రా వినియోగించుకోకున్నా, ప్రవాహాలకు ఆటంకం కాకున్నా ఈ ప్రాజెక్టులను పాకిస్థాన్ వ్యతిరేకిస్తోంది. నిజానికి హేగ్ ఆర్బిట్రేషన్‌కోర్టు అనుమతించిన మేరకే జీలం నదిమీద కిషన్‌గంగ ప్రాజెక్టు పూర్తయింది. చీనాబ్ మీద రాటిల్ మాత్రం పూర్తికాని స్థితిలో ఉంది. ఈ నేపథ్యంలో, సింధునదీ జలాల ఒప్పందంలో భాగంగా వివాద పరిష్కారానికి తటస్థ నిపుణుడిని నియమించవలసిందిగా పాకిస్థాన్ ప్రపంచబ్యాంకును 2015లో కోరింది. అది జరిగిన మరుసటి ఏడాది పాకిస్థాన్ ఆ ప్రతిపాదన ఉపసంహరించుకొని, హేగ్ ఆర్బిట్రేషన్ కోర్టునుంచి న్యాయం కావాలన్నది. ఇందుకు కూడా ప్రపంచబ్యాంకు తలూపడంతో భారత్‌కు ఆగ్రహం కలిగింది. అంతవరకూ తటస్థ నిపుణుడికి సహకరించిన భారతదేశం హేగ్ ఆర్బిట్రేషన్ కోర్టు విచారణకు మాత్రం గైర్హాజరైంది. తనకు దక్కాల్సిన నీటిని ఈ రెండు ప్రాజెక్టులు అడ్డుకుంటున్నాయన్న పాకిస్థాన్ ఆరోపణకు తగిన ఆధారాలు లేవని భారతదేశం అంటోంది. పాక్ ఒత్తిడికి లొంగి ప్రపంచ బ్యాంకు ఏకకాలంలో రెండు సమాంతర ప్రక్రియలకు అనుమతించడం సరికాదనీ, భిన్నమైన తీర్పులతో మరింత గందరగోళం ఏర్పడుతుందనీ భారత్ వాదన. వివాద పరిష్కారానికి తనకు అర్హత ఉన్నదని హేగ్ కోర్టు ఇటీవల చెప్పినప్పటికీ, ముందుగా తటస్థ నిపుణుడే అమీతుమీ తేల్చాలని భారత్ వాదన. హేగ్ కోర్టు తీర్పును అడ్డుకోవడానికే సింధు నదీజలాల ఒప్పందాన్ని తిరగదోడాలన్న ప్రతిపాదన భారత్ తెస్తోందని పాకిస్థాన్ ఆరోపణ. 850 మెగావాట్ల రాటిల్ జలవిద్యుత్ ప్రాజెక్టును రక్షించుకోవడానికి వీలుగా, పాకిస్థాన్ మెడలు వంచేందుకు భారత్ ఈ ప్రతిపాదన చేస్తున్నదని ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు.

'జమిలి' సిఫారసు శాసనమయ్యేనా?

ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఒక అత్యున్నతస్థాయి కమిటీని నియమించడంలో ప్రభుత్వ నిజ ఉద్దేశం ఆ కమిటీ పరిశీలనాంశాలు బహిర్గతం చేశాయి. 'ఏకకాలంలో ఎన్నికల నిర్వహణ సాధ్యాసాధ్యాలను పరీక్షించి సిఫారసులు చేయాలని....' మొదటి పరిశీలనాంశం నిర్దేశించింది. లోక్‌సభ ఎన్నికలు, 29 రాష్ట్రాల, (శాసనసభ ఉన్న) కేంద్ర పాలిత ప్రాంతాల ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించడం సాధ్యమూ, వాంఛనీయమూ అన్నది ఆ అత్యున్నత స్థాయి కమిటీకి ప్రభుత్వ సూచిత ఆదేశం. ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలనే ప్రతిపాదనకు వ్యతిరేకంగా సిఫారసు చేయాలనే ఆదేశం ఆ కమిటీకి లేదు. ఆ కమిటీ నిష్పాపూర్వకంగా ఆ ఆదేశాన్ని పాటించింది.

ఆ అత్యున్నత స్థాయి కమిటీ కూర్పు సైతం ప్రభుత్వ వాస్తవ ఉద్దేశాన్ని వెల్లడించింది. ఛైర్మన్, 8 మంది సభ్యులలో రాజ్యాంగ నిపుణుడు ఒకే ఒక్కరు ఉన్నారు. మరో సభ్యుడు పార్లమెంటరీ కార్యసరళిలో ప్రవీణుడు. అయితే ఆయనకు న్యాయవాద వృత్తిలోను, న్యాయశాస్త్ర బోధనలోను బొత్తిగా ఎటువంటి అనుభవంలేని వ్యక్తి. ఇద్దరు రాజకీయవేత్తలుగా మారిన బ్యూరాక్రాట్లు. ముగ్గురు జీవితాంతం సివిల్ సర్వెంట్లు. సరే, ఆ అత్యున్నతస్థాయి కమిటీకి రామ్‌నాథ్ కోవింద్‌ను ఛైర్మన్‌గా నియమించడం అలంకార ప్రాయానికే అని చెప్పవచ్చు. కాదూ, ఆ కమిటీకి గాంభీర్యం, హుందా సంతరించేందుకు అయివుంటుంది. ఆ కమిటీ ఏమైనా కావచ్చు కాని, అది కచ్చితంగా రాజ్యాంగ కోవిదుల సంఘం కానేకాదు.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

అందరూ ఊహించినట్లుగానే లోక్‌సభకు, రాష్ట్ర శాసనసభలకు ఐదేళ్లకొకసారి ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలని కోవింద్ కమిటీ సిఫారసు చేసింది. నాకు తెలిసినంతవరకు ఒక పెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఇటువంటి రివాజు లేదు. అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ ఎన్నికల విధానాలు పోల్చదగిన నమూనాలు. అమెరికాలో ప్రతినిధుల సభ (కాంగ్రెస్ దిగువ సభ)కు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు జరుగుతాయి. దేశాధ్యక్షుడు, రాష్ట్ర గవర్నర్ల పదవులకు ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి జరుగుతాయి. అయితే ఏకకాలంలో కాదు. కాంగ్రెస్ ఎగువ సభ సెనేట్‌కు ఆరు సంవత్సరాల వ్యవధిలో మూడు ద్వివార్షిక ఎన్నికలు జరుగుతాయి. ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీలోని రెండు రాష్ట్రాలకు ఇటీవల ఎన్నికలు జరిగాయి. వాటి వాటి ఎన్నికల క్రమం ప్రకారమే అవి జరిగాయి. ఆ క్రమం బండేస్టాగ్ (నేషనల్ పార్లమెంట్)కు జరిగే ఎన్నికల క్రమానికి భిన్నమైనది.

ఫెడరల్, పార్లమెంటరీ ప్రజాస్వామ్య భావనకు విరుద్ధమైన ప్రతిపాదనను కోవింద్ కమిటీ అధ్యయనం చేసింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఎన్నికైన ప్రభుత్వం ప్రజా ప్రతినిధులకు ప్రతిరోజూ జవాబుదారీగా ఉండాలి. కార్యనిర్వాహక వర్గానికి ధ్రువపరిచిన పదవీకాలం ఉండదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య విధానాన్ని అనుసరించే విషయమై రాజ్యాంగ సభ కూలంకషంగా చర్చించింది. అధ్యక్ష తరహా పాలనా వ్యవస్థను రాజ్యాంగ నిర్మాతలు నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం వైపే వారు మొగ్గారు. భారతదేశ వైవిధ్యం, బహుళత్వంకు పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థే బాగా సరిపోతుందని వారు దృఢంగా విశ్వసించారు.



ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన రాజ్యాంగ సవరణ బిల్లులు పార్లమెంటు ఉభయ సభలలో ఆమోదం పొందలేవు. బహుళ సంస్కృతులతో, అన్నిటా అపార వైవిధ్యమున్న ఈ సువిశాల భారతదేశంపై ఒకే ఎన్నికల విధానాన్ని రుద్దేందుకే ఒకే దేశం, ఒకే ఎన్నిక ప్రతిపాదననుద్దేశించారు. ఆ ప్రతిపాదన ఆచరణ సాధ్యంకానిది. అది నిష్ప్రయోజనకరమైనది.

కోవింద్ కమిటీ నివేదిక కొందరికి మాత్రమే అర్థమయ్యే బీజగణిత సూత్రాలు, అతిగా సరళీకరించిన న్యాయ సూత్రీకరణల కలగూర గంప. ఏకకాలంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ ప్రతిపాదనను అమలుపరిచేందుకు రాజ్యాంగాన్ని విధిగా సవరించవలసిన అవసరమున్నదని కోవింద్ కమిటీ అంగీకరించింది. కొత్త అధికరణలు 82ఎ, 83(3), 83(4), 172(3), 172(4), 324ఎ, 325(2), 325(3) ప్రవేశపెట్టడంతో పాటు అధికరణ 327ను సవరించవలసి ఉన్నది. ఈ కొత్త నిబంధనలు, సవరణలు ఒక రాష్ట్ర అసెంబ్లీ పదవీకాల ముగింపు తేదీ, లోక్‌సభ పదవీకాల ముగింపు తేదీ సమకాలికమయ్యేలా చేస్తాయి. ప్రభుత్వం తలపెట్టినట్లు నవంబర్–డిసెంబర్ 2024లో రాజ్యాంగ సవరణలను ఆమోదించారని అనుకుందాం. ఏకకాలంలో ఎన్నికలు 2029లో జరగవలసి ఉంటుంది. మరి 2025, 2026, 2027, 2028 సంవత్సరాలలో జరిగే రాష్ట్ర శాసనసభ (ఇవి మొత్తం 24)ల పదవీకాల వ్యవధి 1 నుంచి 4 సంవత్సరాల పాటు తగ్గిపోతుంది! 2027లో ఒక శాసన సభను ఎన్నుకోవడమంటే కేవలం రెండు సంవత్సరాలకు మాత్రమే అవుతుంది. 2028లో ఎన్నుకునే శాసనసభలు కేవలం ఒకే ఒక్క సంవత్సరం మాత్రమే ఉంటాయి! ఇటువంటి ఎన్నికలను సదరు రాష్ట్రాల ప్రజలు, రాజకీయ పార్టీలు అంగీకరిస్తాయా? మరి ప్రజల తీర్పు త్రిశంకు సభ (హంగ్ అసెంబ్లీ) ఏర్పడడానికి మాత్రమే దారితీస్తే ఏమి చేయాలి? ప్రజలు ఎన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో విశ్వాసాన్ని కోల్పోతే ఉత్పన్నమయ్యే పరిస్థితి ఏమిటి? ఒక ముఖ్యమంత్రి రాజీనామా చేసినప్పుడు ముఖ్యమంత్రి పదవికి పోటీ పడేవారు అవసరమైన మెజారిటీని కూడగట్టుకోలేనప్పుడు ఏమి చేయాలి? అటువంటి పరిస్థితుల్లో సభ ఐదేళ్ల పదవీ కాలంలో మిగిలిన కాలానికి కొత్త అసెంబ్లీని ఎన్నుకునేందుకు మళ్లీ ఎన్నికలు నిర్వహించవలసి ఉంటుంది కదా. ఆ కొరవ కాలం కేవలం కొన్ని నెలలు మాత్రమే ఉండవచ్చు సుమా! అటువంటి ఎన్నికలు ప్రహసనప్రాయమవుతాయని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అపార ధనబలం ఉన్న రాజకీయ పార్టీలు, అభ్యర్థులు (ఎన్నికల బాండ్లతో సంపద్వంతమైన రాజకీయ పార్టీలున్న విషయాన్ని విస్మరించకూడదు) మాత్రమే అటువంటి ఎన్నికలలో పోటీ చేస్తారు. మరో ముఖ్యమైన విషయమేమిటంటే కోవింద్ కమిటీ సిఫారసులు ముఖ్యమంత్రి తన అధికారాన్ని నిలుపుకునేందుకు బాగా ఉపయోగపడతాయి. అసెంబ్లీని రద్దు చేస్తాననే బెదిరింపుతో అసంతృప్త ఎమ్మెల్యేలను ముఖ్యమంత్రి కట్టడి చేయగలుగుతాడు.


కోవింద్ కమిటీ సిఫారసులు మన ఎన్నికల చరిత్రను గమనంలోకి తీసుకోలేదు. అత్యధిక ప్రజల ఆలోచనలకు అవి విరుద్ధంగా ఉన్నాయి. 1951 నుంచి 2021 దాకా ఏడు దశాబ్దాల కాలంలో రాజకీయ అస్థిర పరిస్థితులు కేవలం రెండు దశాబ్దాల (1981–1990, 1991–2000)లో మాత్రమే ఉన్నాయి. 1999 నుంచి అసాధారణ స్థాయిలో రాజకీయ సుస్థిరత నెలకొనివుంది. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు / శాసనసభలు తమ ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేశాయి. దఫాలు, దఫాలుగా జరిగే ఎన్నికలు ఆర్థికాభివృద్ధిని ప్రతికూలంగా ప్రభావితం చేయదు. యూపీఏ ప్రభుత్వాలు తమ పదేళ్ల పాలనలో 7.5 శాతం సగటు వార్షిక వృద్ధిరేటును సాధించాయి. తమ పదేళ్ల పాలన అంతకంటే మెరుగైన వృద్ధిరేటును సాధించిందని ఎన్డీఏ పదే పదే చెప్పుతోంది. ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన రాజ్యాంగ సవరణలకు సంబంధించిన బిల్లులకు పార్లమెంటు ఆమోదాన్ని ఎన్డీఏ ప్రభుత్వం తప్పక పొందగలుగుతుందని కోవింద్ కమిటీ భావించినట్టుంది. ఆ కమిటీ కచ్చితంగా పొరపడిందని చెప్పక తప్పదు. ఎందుకని? పార్లమెంటులో ఆ బిల్లుల ఆమోదానికి అవసరమైన సంఖ్యా బలం ఎన్డీఏకు ఉన్నదా? లోక్‌సభలో ప్రతిపక్షం 182 మంది ఎంపీల మద్దతును కూడగట్టుకోగలుగుతుంది. రాజ్యసభలో విపక్షానికి 83 మంది ఎంపీలు ఉన్నారు. ఉభయ సభలలోను ఆ సవరణ బిల్లులు ఎట్టి పరిస్థితులలోను ఆమోదం పొందలేవు బహుళ సంస్కృతులతో, అన్నిటా అపార వైవిధ్యమున్న ఈ సువిశాల భారతదేశంపై ఒకే ఎన్నికల విధానాన్ని రుద్దేందుకే ఒకే దేశం, ఒకే ఎన్నిక ప్రతిపాదననుద్దేశించారు. ఆ ప్రతిపాదన ఆచరణ సాధ్యంకానిది. అది నిష్ప్రయోజనకరమైనది.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

అన్యమతస్థులతో అన్యోన్య బంధం

భిన్న మతాలకు చెందినవారు శాంతి సామరస్యాలతో కలసికట్టుగా జీవించేలా చేయడమెలా? ఇది, ఆధునిక ప్రపంచం ఎదుర్కొంటున్న మహా సవాళ్లలో ప్రధానమైనది. మత సంబంధమైన అధిక సంఖ్యాక వాదం ప్రాతిపదికన పశ్చిమాసియా, దక్షిణాసియాలలో జాతి–రాజ్యాల ఏర్పాటు, ఐరోపా, ఉత్తర అమెరికా దేశాలకు క్రైస్తవేతరుల వలసలు తీవ్ర కలహాలు, తరచు హింసాత్మక ఘర్షణలకు కారణమయ్యాయి. దురహంకారం, ఆధిక్యతా భావన పదే పదే సహనం, పరస్పర అవగాహనపై విజయం సాధిస్తున్నాయి.

భిన్న మతాల మధ్య మరింత అవగాహనను పెంపొందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అమెరికా విద్వజ్జుడు థామస్ ఆల్బర్ట్ హోవార్డ్ తన పుస్తకం 'The Faith of Others : A History of Interreligious Dialogue'లో ప్రేరణాత్మకంగా స్పష్టపరిచారు. హోవార్డ్ పుస్తకం ప్రధానంగా క్రైస్తవంపై దృష్టిని కేంద్రీకరించింది. క్రైస్తవ ధర్మశాస్త్రజ్ఞులు ఒకప్పుడు తమ మతమే నిజమైన మతమని సునిశ్చితంగా విశ్వసించేవారు. ఆ విషయమై గట్టిగా వాదించేవారు. ఇరవయో శతాబ్దంలో ఈ ధోరణి క్రమంగా మారింది. ఆధ్యాత్మిక అహంకారానికి పేరుబడిన రోమన్ కేథలిక్ చర్చ్ 1960లలో ఇతర మతాలను అంగీకరించడం ప్రారంభించింది. 1964లో పోప్ జారీ చేసిన ఒక ఆదేశంలో 'వివిధ క్రైస్తవేతర మతాల నైతిక, ఆధ్యాత్మిక విలువలను గుర్తించి, గౌరవించాలని' పేర్కొన్నారు.



హిందూ పాకిస్థాన్‌ను సృష్టించడానికి ఆరాటపడుతున్న హిందూత్వ.. సంపూర్ణ పెత్తనం చెలాయించలేక పోతున్నప్పటికీ క్రమంగా ప్రబలమవుతోంది. గాంధీ ప్రబోధించిన, ఆచరించిన మత సమైక్యతా మార్గ స్ఫూర్తిని భారతీయులు పునరుద్ధరించుకోవలసిన అవసరమున్నది. రాజకీయవేత్తలే కాదు సామాన్య పౌరులు సైతం అన్య మతాల వారితో స్నేహ సంబంధాలను పెంపొందించుకోవడం మన ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యం సమున్నత విలువలు, సంప్రదాయాల పునరుజ్జీవానికి తప్పనిసరైన తొలి అడుగు.

మతాల మధ్య సంభాషణను ప్రతిపాదించి, ప్రోత్సహించిన ఇద్దరు ప్రముఖ భారతీయుల గురించి హోవార్డ్ తన పుస్తకంలో విపులంగా రాశారు. వారిలో మొదటి వ్యక్తి మొగల్ చక్రవర్తి అక్బర్. 1952లో ప్రముఖ చరిత్రకారుడు మఖన్‌లాల్ రాయచౌధురి రాసిన 'దీన్ ఇ ఇలాహి : అక్బర్ మతం' అనే పుస్తకం ఆధారంగా అక్బర్ గురించి హోవార్డ్ రాశాడు. ఆయన ఉటంకించిన ఆ చక్రవర్తి లేఖ ఒకటి నన్ను బాగా చకితుడిని చేసింది. తన సమకాలికుడు అయిన స్పెయిన్ రాజు రెండవ ఫిలిప్‌కు రాసిన లేఖ అది. యూదులు, ముస్లింలను స్పెయిన్ నుంచి బహిష్కరించిన తరువాత ఆ యూరోపియన్ దేశంలో కేథలిక్ క్రైస్తవ మత విశ్వాసాలు, సిద్ధాంతాలలో సంకుచితత్వం పెరగసాగింది. భారత్ నుంచి స్పెయిన్ నేర్చుకోవాలని రెండవ ఫిలిప్‌కు రాసిన లేఖలో అక్బర్ సూచించాడు. 'ఇక్కడ తాను పుట్టి పెరిగిన, జ్ఞానార్జనకు, స్వీయ జీవన రీతులకు ఆలంబనగా ఉన్న మతాన్ని అనుసరించడంలో కారణాల గురించి ఎవరూ విచారణశీలురు కారు. ప్రతి ఒక్కరూ తమ స్వీయ మత మార్గంలో నడుస్తారు. తద్వారా మానవ మేధ ఉత్కృష్ట లక్ష్యమైన సత్యాన్ని తెలుసుకొనే సాధ్యాసాధ్యాల నుంచి తమకు తాము మినహాయింపబడతారు. ఈ కారణంగా మేము మా దేశంలో అన్ని మతాల ఆచార్యులు, విద్వాంసుల సదస్సులు నిర్వహించి, వారి సునిశితమైన చర్చలు, వివేకదాయక ప్రవచనాలు, ఉజ్వల ఆశంసల నుంచి జ్ఞానవంతులమవుతుంటాము'.

మతాల మధ్య సంభాషణను ప్రతిపాదించిన రెండవ మహోన్నత భారతీయుడు స్వామి వివేకానంద. అక్బర్‌కు కొన్ని శతాబ్దాల తరువాత జీవించిన వివేకానంద గురించి హోవార్డ్ సుదీర్ఘంగా రాశారు. 1893లో షికాగోలో జరిగిన సర్వ మత ప్రతినిధి సభలో వివేకానంద ప్రసంగానికి ప్రాధాన్యమిచ్చారు. తొలుత ఆ సభ లక్ష్యాలను ప్రస్తావించి వివేకానంద ప్రసంగ భాగాలను ఉటంకించారు. వాటిలో మొదటిది : 'సకల ప్రపంచానికి సహనాన్ని, విశ్వజనీనతను బోధించే ఒక శ్రేష్ఠమైన మతానికి చెందినవాడినని నా గురించి చెప్పుకోవడం నాకు ఎంతో గర్వంగా ఉంది. విశ్వ విశాలమైన సహనాన్నే కాక, మేము సమస్త మతాలూ సత్యమైనవే అని ఆమోదిస్తాము. ఈ సమస్త ధాత్రిపైన అసహనానికీ, హింసకు గురి అయిన అన్ని మతాల వారినీ, అన్ని దేశాలకు చెందిన వారిని, వారు శరణార్థులై వచ్చినప్పుడు ఆదరించి, వారికి భద్రత కలిపించిన ఉదార మయమైన మతం మాది అని చెప్పుకోవడానికి నేను గర్విస్తున్నాను'. రెండో ఉటంకింపు మరింత ముఖ్యమైనది: 'మత వైషమ్యం, అంధ విశ్వాసం. దీని భయంకర ప్రవృత్తి అయిన మత విద్వేష మాత్సర్యం ఈ సుందరమైన ధరిత్రిని ఎంతకాలంగానో అంటి పెట్టుకొని ఉండనే ఉన్నాయి. ఇవాళ ఉదయం ఈ మత మహాసభ గౌరవార్థం మోగిన ఘంటా నాదం అన్నిరకాల మత మూర్ఖత్వాన్ని, మత పరమైన హింసాపరత్వాన్ని కత్తితోనో లేదా కలంతోనో సాగించే మత దౌర్జన్యాన్ని, ఒక గమ్యాన్ని ఆశించి గమించే వారి మధ్య వైమనస్యాన్ని తుదముట్టించే మృత్యుఘంటిక అవుతుందని ఆశిద్దాం'.



■ రామచంద్ర గుహ

గతానుగతం

మహాత్మాగాంధీని కడాచిత్తుగా హోవార్డ్ ప్రస్తావించారు. ఆయన మత చింతనను లోతుగా పరామర్శించలేదు. వాస్తవానికి గాంధీ ఒక మత బహుళత్వ వాది. అక్బర్, వివేకానంద కంటే మరింత ప్రగాఢమైన, మౌలికంగా భిన్నమైన మత చింతకుడు. హిందూయేతర మతాలతో ఆయన తన సంభాషణను సాగించడమే కాదు ఒక సామాజిక కార్యక్రమంగా కూడా దాన్ని ఆచరించారు. దక్షిణాఫ్రికాలోను భారత్‌లోను ఆయన నిర్వహించిన సత్యాగ్రహాలు సమస్త ప్రపంచ మతాలకు చెందిన వారిని తమ ప్రభావశీల పరిధిలోకి తీసుకురావడానికి ప్రయత్నించాయి. ఆయన ఆశ్రమాలలో భిన్న మతాలకు చెందినవారు ఉండేవారు. నిరంతరం సన్నిహితంగా, పరస్పర గౌరవాదరాలతో కలసిమెలసి ఉండేవారు. గాంధీ ఆశ్రమాలలో రోజూ జరిగే సర్వ మత ప్రార్థనా సమావేశంలో భిన్న మతాల పవిత్ర గ్రంథాల నుంచి గీతాలు, శ్లోకాలు, సూక్తులు చదివేవారు, గానం చేసేవారు. ఇదొక వినూత్న, మత అనుష్ఠానం. యుద్ధాలతో సంక్షుభితమవుతున్న నేటి ప్రపంచానికి ఆ మానవీయ మతాచరణ ఉపయుక్తత ఎంతో ఉంది. నాస్తికుల వలే కాకుండా మానవ అవగాహనాశక్తికి అతీతమైన ఒక సర్వోన్నత శక్తి, ఒక ఉత్కృష్ట స్ఫూర్తి ఉందని గాంధీ అంగీకరించేవారు. మత విశ్వాసుల వలే కాకుండా తన మతమే భగవంతుడికి ఒక ప్రత్యేక, ఉన్నతోన్నతమైన బాట నిర్మించిందని గాంధీ ఎన్నడూ విశ్వసించలేదు. 1924లో 'భగవంతుడు ఒక్కడే' అన్న వ్యాసంలో ఆయన ఇలా పేర్కొన్నారు: భారతావని నుంచి ఇస్లాం, క్రైస్తవంను తొలగించాలని హిందువులు ఆశించడం ఒక పనికిమాలిన విషయం, అదొక వ్యర్థ వ్యవహారం మాత్రమే అవుతుంది. అలాగే ముస్లింలు తాము విశ్వసించే ఇస్లాం మాత్రమే ఈ ప్రపంచాన్ని ఏలాలని కోరుకోవడమూ వ్యర్థమే... సత్యం ఏ ఒక్క మతం, ఏ ఒక్క మత గ్రంథం సొంత సొత్తుకాదు. అటువంటి సంకుచితత్వాలను తిరస్కరించిన ఉదాత్తుడు కనుకనే మత మార్పిడులను ఏ మతస్థుడు చేపట్టినా దాని ప్రయోజనాన్ని గాంధీ సంశయించేవారు. 'మిషనరీ కార్యకలాపాల మూల కారణంలో తాము విశ్వసించే మతం తమకే కాదు యావత్ప్రంచానికి నిజమైనది, ఏకైక మోక్ష ప్రదాయిని' అన్న భావన ఉంటుంది. అయితే భగవంతుడు లక్షలాది మార్గాలలో మనకు సామీప్యంలో ఉన్నాడనేదే సత్యం. దీన్ని మనం అర్థం చేసుకోలేకపోతున్నాం. ఈ దృష్ట్యా మిషనరీ కార్యకలాపాలలో నిజమైన వినయం అనేది కొరవడింది. తన గురించి గాంధీ ఇలా చెప్పుకున్నారు: 'ఒక ఆదివాసీ కంటే నేను ఆధ్యాత్మికంగా సమున్నతుడిననే భావన నాకు లేదు. ఆధ్యాత్మిక ఆధిక్యతా భావం చాలా ప్రమాదకరమైనది'. తన సొంత మతానితో పాటు ఇతర మతాలనూ గౌరవించడం, భిన్న మతాల ప్రజలతో స్నేహపూరితంగా ఉండడం అనేది కేవలం గాంధీ వ్యక్తిగత అభీష్టం కాదు అదొక రాజకీయ అనివార్యత కూడా. 1941లో కాంగ్రెస్ సభ్యులు ప్రతి ఒక్కరూ అనుసరించి తీరవల్సిన 'నిర్మాణ కార్యక్రమం' నొకదాన్ని గాంధీ ప్రతిపాదించారు. ఒక చిన్న పుస్తకంలో దాన్ని వివరించారు. ఆ పుస్తకంలో ఆయన ప్రస్తావించిన అంశాలలో అస్పృశ్యత రద్దు, ఖాదీ ప్రచారం, మహిళాభ్యున్నతి, ఆర్థిక సమానత్వాన్ని సాధించడం మొదలైనవి ఉన్నాయి. మరింత ముఖ్యమైన విషయమేమిటంటే ఈ నిర్మాణ కార్యక్రమంలో మొదటి ప్రాథమికాంశం 'మత సమైక్యత. మత సామరస్యాన్ని సాధించేందుకు మొట్టమొదటి ఆవశ్యకం ప్రతి కాంగ్రెస్‌వాది తన మతం ఏదైనప్పటికీ హిందూ, ముస్లిం, క్రైస్తవ, జోరాష్ట్రియన్ మతాల ప్రతినిధిగా భాసించాలి. భారత్‌లోని కోట్లాది ప్రజల అస్తిత్వంతో మమేకమవ్వాలి. ప్రతి హిందువు, హిందూయేతరుడు ఆ విధంగా ప్రవర్తించాలి. ఇందుకు ప్రతి కాంగ్రెస్‌వాది తన వ్యక్తిగత స్నేహ సంబంధాలలో తన సొంత మతస్థులతో పాటు అన్య మతస్థులను కూడా విధిగా భాగస్వాములుగా చేసుకోవాలి. తన సొంత మతం పట్ల చూపుతున్న గౌరవాన్నే ఇతర మతాల పట్ల కూడా చూపాలి.

ఇది గాంధీ సునిశ్చిత విశ్వాసం. దాన్ని ఆయన అంతః ప్రేరణ, చిత్తశుద్ధితో అనుష్ఠానించారు. ఆయన స్నేహితులు, సహచరులలో హిందువులు కానివారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. వారి జాబితాను చూడండి. ముస్లింలు: అబ్దుల్ కడెర్ బావాజీర్, ఎ.ఎమ్. సచాలియా, అబుల్ కలామ్ ఆజాద్, జకీర్ హుస్సేన్, అసఫ్ అలీ, రైహ్నా త్యాబ్జీ; క్రైస్తవులు: జోసయ్య ఓల్డ్ ఫీల్డ్, జోసెఫ్ డోక్, సిఎఫ్ ఆండ్రూస్, జె.సి. కుమారప్ప; మరియెల్ లెస్టర్, రాజ్ కుమారి అమృత్ కౌర్; పార్శీలు: దాదా భాయి నౌరోజీ, జీవాన్జీ రుస్తోమ్జీ, ఖుర్షీద్ నౌరోజీ; యూదులు: హెర్మన్ కాలెన్ బాఖ్, సోంజా షెల్సిన్, హెన్రీ పోలక్, ఎల్‌డబ్ల్యు రిట్చ్; జైనులు: ప్రాణ్ జీవన్ మెహతా, రాయిచంద్; నాస్తికులు: గోరా (గోపరాజు రామచంద్రరావు).


హిందూ పాకిస్థాన్‌ను సృష్టించడానికి ఆరాటపడుతున్న హిందూత్వ సంపూర్ణ పెత్తనం చెలాయించలేకపోతున్నప్పటికీ క్రమంగా ప్రబలమవుతోంది. గాంధీ ప్రబోధించిన, ఆచరించిన మత సమైక్యతా మార్గ స్ఫూర్తిని భారతీయులు పునరుద్ధరించుకోవలసిన అవసరమున్నది. ఇది వారి తక్షణ కర్తవ్యం. మతం పేరిట సొంత దేశాన్ని సాధించుకున్న పాకిస్థానీయులు ఇస్లామిక్ మెజారిటేరియనిజంకు ప్రాధాన్యమివ్వడం ద్వారా మరింత శాంతి కాముకులు అయ్యారా? కనీసం మరింత సంపద్వంతులూ కాలేకపోయారు. శ్రీలంకలోనూ బౌద్ధుల ఆధిపత్య వాదం శాంతి సామరస్యాలకు దారితీయలేదు. ఈ వాస్తవాలను దృష్టిలో ఉంచుకుని రాజకీయవేత్తలే కాదు సామాన్య పౌరులు సైతం అన్య మతాల వారితో స్నేహ సంబంధాలను పెంపొందించుకోవడం మన ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యం సమున్నత విలువలు, సంప్రదాయాల పునరుద్ధరణకు తప్పనిసరైన తొలి అడుగు అవగలదు.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

తెలుగు సంస్కృతి సంతకం జాషువా

జాషువ పద్యం తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు నిలువెత్తు సంతకం. పద్యానికి అచ్చతెలుగు పదాలతో పట్టాభిషేకం చేసిన కవి. జానపదుల నాలుకలపై జాషువ పద్యం పల్లవించింది. పనిపాటల్లో భాగమై సాంస్కృతిక వైభవాన్ని సంతరించుకుంది. కవి తన సమకాలీన సమాజానికి ప్రతినిధి అన్న నానుడికి జాషువ నిదర్శనం. పద్య రూపాన్ని తీసుకొని ఆధునిక జీవితపు లోతుపాతులను విశ్లేషించిన సామాజికుడు జాషువ. ఆయన కావ్యాల్లో నాటి నేటి కాలపు సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులు చోటుచేసుకున్నాయి. జాషువ కవిత్వం జాతీయ భావాలతో నిండి మానవ శ్రేయస్సును, విశ్వకల్యాణాన్ని కాంక్షిస్తూ చైతన్యశీలంగా సాగింది. భరత ఖండము నా పాఠశాల / భాగవతము నా బాల శిక్ష– అంటూ సాగిన కవిత్వం దేశంలో నాడు సాగుతున్న పరాయి పాలనను ఖండిస్తూ, గాంధీ నాయకత్వాన సాగుతున్న జాతీయ ఉద్యమాన్ని బలపరచి కవిత్వం రాసిన దీర్ఘదర్శి మహాకవి. 'గాంధీ శాంతి సిద్ధాంత మార్దవ మార్గాటుడ'నని చెప్పుకున్నాడు. కాబట్టే కులమతాలు గీచుకున్న గీతల జొచ్చి, పంజరాన పట్టువడను నేను, నిఖిల లోక మెట్లు నిర్ణయించిన నాకు తరుగు లేదు విశ్వనరుడ నేనని ప్రకటించాడు. దేశం సంస్కృతీ భిన్న సాంప్రదాయాలను గౌరవిస్తూ అందరూ ఐకమత్యంతో, సహనంతో ముందుకు సాగాలని కాంక్షించాడు. మనుషులంతా సమానులేనని మరణం లేని మానవతను ప్రకటించాడు.

భారత ఇతిహాసయుగం నుంచి మొగలాయి యుగం వరకు, స్వాతంత్ర్యోద్యమం నుంచి స్వాతంత్ర్యానంతరం వరకు దేశంలో నెలకొన్న భిన్న సంఘర్షణలను జాషువా తన కవిత్వ దర్పణంలో చూపాడు. విశ్వమానవ లక్షణాలను పుణికిపుచ్చుకున్న జాషువ, విశ్వకల్యాణానికై తన కవిత్వాన్ని ఆయుధంగా మలిచాడు. జాషువ కవిత్వం నేటికీ ఎన్నటికీ ప్రాసంగికతను కలిగి ఉందనటంలో అతిశయోక్తి లేదు.



ఈ దేశాన్ని పాలించిన చక్రవర్తులను, గంగ–సింధు వంటి జీవనదులను, సకల సహజ సంపదలను పేర్కొంటూ, ఇంతటి సహజ సంపదలతో భరతమాత తన బిడ్డలను పోషించుకుంటున్న పచ్చిబాలెంతరాలుగా పేర్కొన్నాడు. మాతలకు మాత భరతమాత సకల సంపదల సమేతగా తన దేశాన్ని కీర్తిస్తూ గొప్ప కవిత్వం చెప్పాడు. సగరుడు, మాంధాత వంటి చక్రవర్తులు మొదలు అశోకుడు, గౌతమ బుద్ధుడు, కర్ణుడు, శివాజీ, మహాత్మా గాంధీ, అంబేడ్కర్ వంటి నేటికాల మేధావుల వరకూ జాషువ సాహిత్యంలో కన్పిస్తారు. భారతాంబామణి నమస్కారమమ్మా అని రెండు చేతుల నమస్కరించిన తీరు ఆయన దేశభక్తికి, జాతీయ భావజాలానికి ప్రబల నిదర్శనం.

జీవనదిగా ప్రవహిస్తున్న గంగానదిని 'జలకంబులాడించు చెలికత్తె' అని, ప్రపంచ ప్రసిద్ధిగన్న హిమాలయోన్నతిని 'తలమీద గుండు మల్లెలదండ' అని, పాదపీఠంగా అమరిన సింహళదీవిని 'పూత బంగారు సొమ్ముల పెట్టె' అని, హిందూ మహాసముద్రాన్ని 'నిగ్గుటద్దమ'ని, దేశ నైసర్గిక స్వరూపాన్ని కళ్ళకు కట్టినట్టు చూపి "ఇట్టి నిను జూచి బిచ్చంబు బెట్టుమనుచు నలుదిక్కులు యాచించుచున్నవమ్మ" అని భరతమాత కీర్తిని చాటాడు. స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత ఆనందాతిశయంతో "తల్లి భారతి నేడు దక్కె మాకు / పదియు రెండగు పుణ్యనదులు నదంబులు / చిరకాలమునకు జేజిక్కె మాకు / అమర సన్నుతమైన హస్తినాపుర రత్న పీఠంబు తిరుగు బ్రాప్తించె మాకు / అచ్చముగ భారతీయుడ నయితి" అంటూ మహాహర్షాన్ని వ్యక్తం చేశాడు.

చికాగోలో జరిగిన విశ్వమత మహాసభలో వివేకానందుని అద్భుత ప్రతిభాపాటవాలను, అహింసాయుధంతో మహాత్మాగాంధీ సాధించిన స్వాతంత్ర్యాన్ని, తెలుగువాడైన తత్త్వవేత్త సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను, విశ్వకవి రవీంద్రుని కొనియాడాడు. అన్ని సంపదలు పుష్కలంగా ఉన్న దేశంలో ప్రజల మధ్య అనైక్యత, ప్రాంతాలవారిగా, మతాలవారిగా విడిపోయి, పరమత సహనం, పరజాతి సహనం లోపించి మానవజాతి సహజగుణాల్ని కోల్పోయి అసహనంగా తయారయిందని వాపోయాడు.

జాతి సమైక్యతకు సహన సహిత జీవన విధానమే మహాకవి కవిత్వ తత్వంగా సాగింది. విశ్వమానవ గోత్రేయ వీరులైన / కవులకు ఖర్మబంధాలు కట్టబెట్టి / పులుముచుందురు తల మీద కులము రంగు అని చింతించాడు.

బాపూజీ అంటే మహాకవికి మహాభక్తి భావం. మహాత్ముని నిత్య సత్యవతుడిగా పేర్కొన్నాడు. "వడికిన నూలుపోగుతో ప్రపంచపు టేనుగు గట్టి అహింసా మార్గాన విరోధి గుండెలో పిడుగులు గుప్పువాడని, తన బోసినోట అమృత బిందువులను జిమ్మెడు వక్త" అని మహాత్ముని గొప్పగా స్తుతించాడు. అంతేగాక "ఈ గుజరాతు కోమటి సహింపడు పంచమజాతి హింస" అని గాంధీ వ్యక్తిత్వపు లోతులను తడిమాడు. 'మహాత్ముని చెప్పుల జాడలోన కాలాడ చరించెదన్' అని ప్రకటించాడు. గోచిపాత గట్టుకొని జాతి మానంబు నిలిపినట్టి ఖద్దరునేతగా, పండ్లు నూరుచున్న బహుమతంబులలోన సహనవిద్య నేర్పు సాధకుండని, భార్య బిడ్డలున్న ప్రత్యక్షదైవం అనీ, విశ్వసామరస్య విజ్ఞాన సంధాత అనీ మహాత్ముని కొనియాడాడు. నిమ్న జాతుల కంటినీరంబు దుడిచి ఓదార్చు నిరుపేదల బాంధవునిగా మహాత్ముని పేర్కొన్నాడు.

భారత స్వాతంత్ర్య దీప్తి సుభాష్ చంద్రబోస్ వంటి నాయకులు ప్రదర్శించిన ధైర్యసాహసాలకు ముగ్ధుడై "బోసు చరిత్ర అద్భుతమైనది, ఆయన మహాత్యాగి అని, ఇట్టి మహనీయునకు కావ్య నమస్కారము చేయక నా చేతులూరుకోవ"ని నేతాజీ కావ్యాన్ని రచించి, కావ్య నమస్కారములు తెలియజేశాడు.

భారతవీరుడు శీర్షికన కర్ణుని గుణగణాలను, శౌర్యప్రతాపాలను వర్ణించాడు. కర్ణుని పరాక్రమం, సత్యసంధత కవిని ముగ్ధుని చేశాయి. "ఈ కవచ గుండలము లీయకు" వంటి పద్యములో కర్ణుని సహజ కవచకుండలాలను మారువేషంలో దేవేంద్రుడు దానం కోరవస్తున్నాడని సూర్యభగవానుడు చేసిన హెచ్చరికను కర్ణుడు తిరస్కరిస్తూ, కీర్తి నశించి జీవించడం కంటే సత్కీర్తికై నేను మరణించడమే నాకు సమ్మతం అంటూ, దేవేంద్రునికి దానమొసగిన యశస్వి అన్న కీర్తియే చాలును అన్న కర్ణునిలోని దాన గుణాన్ని పలువిధాల పొగుడుతూ, స్వార్థం లేని తెగువని కర్ణునిలో చూశాడు కవి.

మనుషుల్లో పెరుగుతున్న అమానవీయ మౌఢ్యాలను ఖండిస్తూ– మనుజులార మాది ఘనమైన మతమని / ఒకడు తరిమి తరిమి ఉగ్గడించు పెక్కు మతములిట్లు పేచీలు సాగింప మార్గమేది అని మహాకవి జాషువా అన్ని మతాల వారిని ప్రశ్నించాడు. మతం కంటే మానవత్వమే గొప్పదని, మానవత్వానికి మకుటధారణ చేయమన్నాడు.

భారత ఇతిహాసయుగం నుంచి మొగలాయి యుగం వరకు స్వాతంత్ర్యోద్యమం నుంచి స్వాతంత్ర్యానంతరం దేశంలో నెలకొన్న భిన్న సంఘర్షణలను జాషువా తన కవిత్వ దర్పణంలో ప్రతిబింబంలా చూపాడు. విశ్వమానవ లక్షణాలను పుణికిపుచ్చుకున్న జాషువ, విశ్వకల్యాణానికై తన కవిత్వాన్ని ఆయుధంగా మలిచాడు. జాషువ కవిత్వం నేటికీ ఎన్నటికీ ప్రాసంగికతను కలిగి ఉందనటంలో అతిశయోక్తి లేదు.


■ డొక్కా మాణిక్య వరప్రసాద్
మాజీ మంత్రి

(ఈనెల 22 నుంచి 28 వరకు గుంటూరులో జాషువ జయంతి వారోత్సవాలు)

అపచారం.. అపవిత్రం

హిందువులకు ప్రసాదం అత్యంత పవిత్రం. అందునా తిరుపతి లడ్డూ అంటే ఎంతో భక్తి. స్వామివారి దర్శనం, లడ్డూ ప్రసాదం భక్తులందరికీ ఎంతో భాగ్యం. అటువంటి పరమ పవిత్ర లడ్డూను కల్తీ చేయడం భావ్యమా? స్వామికి ఎంతో ఇష్టమైన లడ్డూలో జంతు కొవ్వు, ఇతరాలు కలుపుతారా? ఇది ఎంతో శోచనీయం. కోట్లాది భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా గత ప్రభుత్వం వ్యవహరించింది. ఇది మన్నింపరాని అపచారం. స్వామికి నిత్యం ఎంతో పవిత్రంగా, శుద్ధంగా, శాస్త్రీయంగా అన్ని ఉపచారాలూ జరుగుతాయి. గతంలో ఎన్‌టి రామారావు హయాంలో తిరుపతి లడ్డూ, భోజనం ఎంతో రుచికరంగా, శుచిగా ఉండేవి. ఇప్పుడు ఇటువంటి సంఘటనలు చోటుచేసుకోవడం దారుణం. ఈ కల్తీ కొవ్వు వాడిన లడ్డూ తిన్న భక్తుల ఆరోగ్యం కూడా చెడిపోయే అవకాశం ఉంది. ఇంతటి నీచానికి, దారుణానికి పాల్పడిన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలి. తిరుమల పవిత్రతను కాపాడాలి.

– శ్రేష్టి శేషగిరి



• జగన్ దిష్టిబొమ్మ దహనం

తిరుపతి లడ్డూ విషయంలో హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించిన దుర్మార్గుడు వైఎస్ జగన్ అంటూ జనసేన నాయకురాలు తిరుపతి అనూష ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పార్టీ కార్యకర్తలు బందరు రోడ్డులో శుక్రవారం ర్యాలీ నిర్వహించి జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు.



6లో..

వరద బాధిత ప్రాంతాలకు రుణాలు

వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ఆర్థికంగా చేదోడు అందించటానికి బ్యాంకుల ద్వారా రుణాలు అందించే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఫ్లడ్ ఎన్యూమరేషన్ జరిగిన కుటుంబాలకు బ్యాంకులు ఆసరాగా నిలవనున్నాయి. ఈ మేరకు బ్యాంకర్లతో జిల్లా యంత్రాంగం సమావేశమైంది. ఎలాంటి హామీ లేకుండానే బ్యాంకర్లు రుణాలు ఇవ్వటానికి ముందుకు వచ్చాయి. రుణాలు తిరిగి చెల్లించే విషయంలో ఏడాది పాటు మారిటోరియం కూడా విధించాయి. పంట రుణాలు, ఆటోరిక్షాలు, ద్విచక్ర వాహనాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు, కిరాణా షాపులు, హోటళ్లు, ఇతర చిన్న పరిశ్రమలకు మాత్రమే ఏడాది పాటు మారిటోరియం ఉంటుంది. వినియోగ రుణాలు తీసుకునేవారికి మారిటోరియం వర్తించదు.

విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫెసిలిటేషన్ సెంటర్

- ప్రక్రియ ప్రారంభం
- గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్, సెకండ్ ఫ్లోర్‌లలో నివసిస్తున్న వారికి వినియోగ రుణాలు
- పంట రుణాల రీ షెడ్యూల్... ఏడాది మారిటోరియం, ఐదేళ్లలో చెల్లించవచ్చు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వరద ప్రభావిత పరిధిలోని నగరంలోని 179 సచివాలయాల పరిధిలోని వారికి మాత్రమే బ్యాంకుల ద్వారా రుణాలు పొందటానికి అవకాశం ఉంది. వినియోగ రుణాలను వరద బాధిత కుటుంబాలు తీసుకోవచ్చు. తిరిగి తమ కుటుంబ జీవనం సాధారణ స్థితికి తీసుకురావటానికి వీలుగా ఈ రుణాలు కొండంత ఆసరాగా నిలుస్తాయి. సాధారణ ప్రజలు తీసుకునే రుణాలకు సంబంధించి 3 నెలల మారటోరియం అమల్లో ఉంటుంది.



ఫెసిలిటేషన్ సెంటర్‌లో దరఖాస్తుల స్వీకరణ

బ్యాంకులు అందించే రుణాలు ఇలా



వరద ప్రభావిత ప్రాంతాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం బ్యాంకర్లకు అందజేసింది. వరద ప్రభావిత ప్రాంతానికి చెందినవారు రుణాల కోసం దరఖాస్తు చేసుకోగానే.. ఎలాంటి సెక్యూరిటీ లేకుండానే రుణాలు ఇస్తారు.

- వరద ప్రభావిత ప్రాంతాల సచివాలయాల పరిధిలోని ప్రజల ఇళ్లు గ్రౌండ్ ఫ్లోర్ మునిగితే రూ.50 వేల చొప్పున వినియోగ రుణం ఇస్తారు. ఫస్ట్‌ఫ్లోర్, సెకండ్ ఫ్లోర్ వాళ్లకు మాత్రం రూ.25 వేల చొప్పున వినియోగ రుణాలు ఇస్తారు. ఈ రుణాలను తిరిగి 36 నెలల్లో చెల్లించే అవకాశాన్ని కల్పించారు.
- వ్యవసాయ రుణాలకు సంబంధించి చూస్తే 12 నెలల మారటోరియంతో , 5 సంవత్సరాల్లో చెల్లింపు చేసేలా రుణాలు ఇస్తారు.
- ఆటో రిక్షాలు, ద్విచక్ర వాహనాలకు ఏడాది మారటోరియం ఉంటుంది. కిరాణా షాపులు, హోటల్స్, చిన్న పరిశ్రమలకు సంబంధించి పీఎం ముద్ర కింద రూ.10 లక్షల వరకు, పీఎం స్వనిధి కింద రూ.80 వేల వరకు, లఖ్‌పతి దీదీ కింద రూ.1,50,000 చొప్పున రుణాలు అందిస్తారు.

బ్యాంకింగ్ సేవలకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్

బ్యాంకుల ద్వారా రుణాలు పొందటానికి వీలుగా జిల్లా యంత్రాంగం తరపున సహాయ, సహకారాలు అందించటం కోసం విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి ఈ ప్రత్యేక ఫెసిలిటేషన్ సెంటర్ అందుబాటులోకి వస్తుంది. లీడ్ బ్యాంక్‌గా వ్యవహరిస్తున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) ద్వారా ఈ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులూ లేకుండా బ్యాంకింగ్ సేవలు అందించటానికి, అక్కడికక్కడే దరఖాస్తులను పరిష్కరించేందుకు ఈ ఫెసిలిటేషన్ కేంద్రం పనిచేస్తోంది. అన్ని బ్యాంకుల ప్రతినిధులు ఈ ఫెసిలిటేషన్ సెంటర్‌లో అందుబాటులో ఉంటారు. రుణాల రీ షెడ్యూల్, వినియోగరుణాలు, మూలధన రుణాలు వంటివి ఈ ఫెసిలిటేషన్ సెంటర్ ద్వారా వినియోగించుకోవచ్చు. ఈ ప్రత్యేక ఫెసిలిటేషన్ కేంద్రం ద్వారా జిల్లా యంత్రాంగం కూడా దరఖాస్తులను నిత్యం ఫాలోఅప్ చేస్తుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన చెప్పారు.

ఉన్నది ఒక్కటే బోటు

* నీటిలో ఉన్న మూడో బోటు * బ్యారేజీ వద్ద కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్

విజయవాడ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం బ్యారేజీ వెనుక ఇరుక్కుపోయిన బోట్లను తీసే రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. ఇప్పటివరకు రెండు బోట్లను పున్నమిఘాట్ వద్దకు చేర్చారు. మరో బోటు ఇంకా నీటిలోనే ఉంది. దీన్ని శుక్రవారం బయటకు తీస్తారని భావించినప్పటికీ సాధ్యపడలేదు. ఈ బోటుకు సీ లయన్ కంపెనీ డైవర్లు రంధ్రాలు చేస్తున్నారు. శనివారం కావడి బోట్లను తీసుకొచ్చి ముందుగా తొలగించిన రెండు బోట్ల మాదిరిగానే ఈ బోటును తొలగిస్తామని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ప్రకాశం బ్యారేజీకి ఈనెల ఒకటో తేదీన 11.47 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. ఆ సమయంలో మూడు బోట్లు ఒకసారి, రెండు బోట్లు ఒకసారి గొల్లపూడి వైపు నుంచి కొట్టుకుని వచ్చి బ్యారేజీ కౌంటర్ వెయిట్లను ఢీకొట్టిన విషయం తెలిసిందే. వాటిలో ఒక బోటు కొట్టుకుపోవడం జలవనరుల శాఖ సిబ్బంది గుర్తించారు. మూడు బోట్లు మాత్రం బ్యారేజీ వెనుక ఇరుక్కుపోయాయి. వాటిలో రెండు బోట్లను బెకమ్, సీ లయన్, కాకినాడ అబ్బులు టీం సంయుక్తంగా తొలగించింది. గేట్ల వెనుక నీటిలో మరో బోటు మునిగి ఉన్నట్టు డైవర్లు గుర్తించారు. నీటిలో అడుగు భాగాన ఒక బోటు మాత్రమే ఉందని నిర్ధారించారు. దీనితో నాలుగు బోట్లు మాత్రమే లెక్కకు వచ్చాయి. ఐదో బోటూ వరద ఉధృతికి కొట్టుకుపోయిందని జలవనరుల శాఖ అధికారులు భావించారు. ఈ బోటు కొట్టుకుపోయిన వీడియో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. దీంతో రెండు బోట్లు కిందికి కొట్టుకుపోయి, మూడు బ్యారేజీ వెనుక ఉండిపోయాయన్న నిర్ధారణకు అధికారులు వచ్చారు.



బ్యారేజీ వద్ద కొనసాగుతున్న రెస్క్యూ

గేట్ల పరిశీలన

ప్రకాశం బ్యారేజీ వద్ద రెండు బోట్లను తొలగించడంతో అధికారులు శుక్రవారం గేట్లను పరిశీలించారు. స్లూయిజ్ గేట్ల తర్వాత నుంచి ఉన్న ఐదు గేట్లను పరిశీలించి, వాటి పనితీరును గమనించారు. ఈ బోట్ల వల్ల గేట్లకు ఏమైనా నష్టం జరిగిందా అన్న విషయాన్ని పరిశీలించారు. ఐదు గేట్లను పైకి లేపడం, కిందికి దించడం చేశారు. గేట్లన్నీ ఎప్పటిలాగే పనిచేశాయి. దీంతో జలవనరుల శాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

తవ్వుకో.. తోలుకో..!



విచ్చలవిడిగా మట్టి తవ్వి అమ్మకాలు

తిరువూరు నియోజకవర్గంలో రెచ్చిపోతున్న మాఫియా

- ఎటువంటి అనుమతులూ లేని వైనం
- చోద్యం చూస్తున్న అధికారులు

తిరువూరు నియోజకవర్గంలో మట్టి, ఇసుక మాఫియా విజృంభిస్తోంది. ఎటువంటి అనుమతులూ లేకుండానే యంత్రాలతో తవ్వి తరలిస్తోంది. మట్టిని ప్రైవేటు వెంచర్లకు, పట్టణం సమీపంలోని తెలంగాణ ప్రాంతానికి యథేచ్ఛగా తరలిస్తూ రూ.లక్షల్లో దండుకుంటున్నారు. అయినా అధికారులు చోద్యం చూస్తున్నారు.



తరిగిపోతున్న కొండగట్టు ప్రాంతం (ఇన్‌సెట్‌లో) ప్రైవేటు వెంచరుకు మట్టితోలుతున్న టిప్పరు

తిరువూరు, ఏ కొండూరు : ఎ.కొండూరు మండలంలోని గోపాలపురంలో 4.5 ఎకరాల ప్రభుత్వ భూమిని గతంలో కొందరు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వారిలో కొందరు లబ్ధిదారుల నుంచి గతంలో వైసీపీ నాయకుడు అక్రమ మార్గంలో భూమిని కొనుగోలు చేసి, ఆ ప్రాంతంలో మట్టి క్వారీ నిర్వహించి అమ్మకాలు సాగించారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో తెలంగాణ ప్రాంతానికి చెందినవారు, వైసీపీ నాయకుడి చేతులోని భూమిని తిరిగి కొనుగోలు చేసి మట్టి అమ్మకాలు భారీ స్థాయిలో చేస్తున్నట్టు నియోజకవర్గంలో ఆరోపణలు వినిపిస్తున్నాయి. గోపాలపురం నుంచి ప్రైవేటు భవనాలకు, కల్యాణ మండపాలకు, లేఅవుట్‌లకు యథేచ్ఛగా మట్టితోలకాలు సాగిస్తున్నారు.

సాగు భూముల చదునుకు మాత్రం అనుమతి కావాలట

వ్యవసాయం చేసుకునే రైతులు తమ సాగుభూములు చదును చేసుకోవాలన్నా, మట్టిని బయటకు తోలుకోవాలన్నా అనుమతి కావల్సిందే అని కరాఖండిగా చెపుతున్న రెవెన్యూ అధికారులు, ప్రభుత్వ భూమిలో ఎటువంటి అనుమతులూ లేకుండా మట్టి తోలకాలు చేస్తున్నవారివైపు కన్నెత్తి చూడటం లేదు. గోపాలపురం కొండగట్టు ప్రాంతం నుంచి మట్టి టిప్పర్లు జాతీయ రహదారి మీదకు వచ్చేందుకు సమీపంలోని ఎన్నెస్పీ మైనర్ కల్వాలో సిమెంట్ తూరలు వేసి కాల్వను పూడ్చివేసినా సంబంధిత అధికారుల్లో స్పందన కరువైంది. ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టి తోలకాలు యథేచ్ఛగా సాగిస్తున్నా రెవెన్యూ, పోలీసు అధికారులు తమకు సంబంధం లేనట్టు వ్యవహరించడం గమనార్హం. ఇటీవల కొందరు ఇంటి అవసరాల నిమిత్తం మట్టి తోలుకుంటుంటే అధికారులు హుటాహుటిన ఆ గ్రామం వెళ్లి ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు. ఇదే సందర్భంలో అక్రమంగా మట్టితోలకం చేస్తున్న టిప్పర్లు కళ్లముందే వెళుతున్నా తమకు పట్టనట్టు వ్యవహరించారు.

అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్న ఇసుక, మట్టి

ఇటీవల సంభవించిన వరదలకు మండలంలోని పలు వాగుల్లో ఇసుక భారీగా చేరింది. ఒకవైపు ప్రభుత్వం ఉచిత ఇసుక అందిస్తున్నట్టు ప్రకటిస్తున్నా, మండలంలో ఇసుక తోలకందారులు అవసరాన్ని బట్టి రూ.4 వేల నుంచి రూ.5 వేలు వసూలు చేస్తున్నారు. మండలంలోని చింతలపాడు, చిట్యాల, కట్టలేరు, చిక్కుళ్లగూడెం విప్పవాగు నుంచి ఇసుక తోలకాలు నిరాటంకంగా సాగిస్తున్నారు. చిట్యాల వాగులో భారీగా ట్రాక్టర్లతో ఇసుక అక్రమ తోలకాలు జరుగుతున్న ఫిర్యాదుతో దాడులు నిర్వహించిన అధికారులు, మొక్కుబడిగా రెండు ట్రాక్టర్లు పట్టుకొని అపరాధ రుసుం విధించారు.

బోర్డర్ చెక్‌పోస్టు లేకపోవడం అక్రమార్కులకు వరం

గతంలో పట్టణం శివారుల్లో ఆంధ్ర, తెలంగాణ బోర్డర్‌లో పోలీస్ చెక్‌పోస్టు ఉండటంతో అక్రమ రవాణదారులకు చెక్‌పడేది. ప్రస్తుతం బోర్డర్ చెక్‌పోస్టు లేకపోవడంతో పాటుగా, బైపాస్‌లోని ఆర్‌టీఏ చెక్‌పోస్టు తీసివెయ్యాడంతో అక్రమ రవాణ దారులకు ఒక వరంలా మారింది. మట్టి , ఇసుక టిప్పర్లు బైపాస్‌రోడ్డు మీదుగా తెలంగాణ ప్రాంతానికి నిర్భయంగా వెళుతున్నాయి. సరిహద్దుల్లో నిఘా లేకపోవడంతో అసాంఘిక శక్తులు పట్టణంలోని మత్తుపదార్థుల అమ్మకాలు సాగిస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి.

11 రైళ్ల రద్దు

- నాన్ ఇంటర్ లాకింగ్ పనులతో నిర్ణయం
- 39 రైళ్లకు వరంగల్ స్టేషన్ హోల్టింగ్ రద్దు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బెజవాడ డివిజన్ పరిధిలో కొవ్వూరు - గోదావరి - రాజమండ్రి - కడియం సెక్షన్‌లో నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా మరోమారు భారీ సంఖ్యలో రైల్వే శాఖ రైళ్లను రద్దు చేసింది. ఈనెల 30వ తేదీ వరకు 11 రైళ్లను రద్దు చేసింది.

రద్దు చేసిన రైళ్లు ఇవీ

తిరుపతి - విశాఖపట్నం (22708), విశాఖపట్నం - తిరుపతి (22707), విజయవాడ - విశాఖపట్నం (12718), విశాఖపట్నం - విజయవాడ (12717), విశాఖపట్నం - గుంటూరు (22701), గుంటూరు - విశాఖపట్నం(22702), గుంటూరు - విశాఖపట్నం (17239), విశాఖపట్నం - గుంటూరు (17240), విజయవాడ - రాజమండ్రి (07768), రాజమండ్రి - విశాఖపట్నం (07466), విశాఖపట్నం - రాజమండ్రి (07467)

వరంగల్ స్టేషన్‌లో హోల్టింగ్ రద్దు


విజయవాడ - కాజీపేట, బల్లార్ష సెక్షన్‌లో హసన్‌పర్తి - కాజీపేట ఎఫ్ క్యాబిన్ - వరంగల్ స్టేషన్ల మధ్య నాన్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్న దృష్ట్యా మొత్తం 39 రైళ్లకు వరంగల్ స్టేషన్‌లో హోల్టింగ్ నిలుపుదల చేశారు. వీటిలో విజయవాడ - సికింద్రాబాద్ మధ్య నడిచే గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, షాలిమార్ ఎక్స్‌ప్రెస్, కోకనాడ ఎక్స్‌ప్రెస్, వందేభారత్ ఎక్స్‌ప్రెస్, సింహపురి ఎక్స్‌ప్రెస్, గోదావరి ఎక్స్‌ప్రెస్, గౌతమి ఎక్స్‌ప్రెస్, బీదర్ ఎక్స్‌ప్రెస్, చార్మినార్ ఎక్స్‌ప్రెస్, పద్మావతి ఎక్స్‌ప్రెస్, ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, షిర్డీ ఎక్స్‌ప్రెస్‌లకు వరంగల్ స్టేషన్‌ను మినహాయించారు.



అభివృద్ధి, సంక్షేమ పాలనకు 100 రోజులు

- లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాల అమలు
- రామలింగేశ్వరనగర్‌లో కలెక్టర్ సృజన

6లో..



మాజీ ఎమ్మెల్యే అడుసుమిల్లి కన్నుమూత

ప్రముఖుల నివాళి

మద్యం మత్తులో కొడుకు అసభ్య ప్రవర్తన

- రోకలితో కొట్టిన తల్లి
- చికిత్స పొందుతూ కుమారుడు మృతి

గంపలగూడెం, సెప్టెంబరు 20 : మద్యం మత్తులో తనతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న కుమారుడిని రోకలిబండతో ఓ తల్లి మోది చంపిన ఘటన శుక్రవారం రాత్రి గంపలగూడెం ఎస్సీ, బీసీ కాలనీలో జరిగింది. ఎస్సీ, బీసీ కాలనీకి చెందిన నాగెళ్ల వెంకటేశ్వరరావు (38) భార్య ఆరేళ్ల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి మద్యానికి బానిసై తనకు రెండో వివాహం చేయమని తల్లి మార్తమ్మను వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈనెల 18 రాత్రి వేళ తల్లిపై వెంకటేశ్వరరావు అసభ్యంగా ప్రవర్తిస్తుండటంతో ఆమె ప్రతిఘటించి చేతికి దొరికిన రోకలి బండతో కొడుకు తలపై కొట్టడంతో రాయిపై పడ్డాడు. తీవ్ర గాయాలు అయిన అతడిని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. మృతునికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్రీను తెలిపారు.


డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

సమస్యలు పరిష్కరించాలి

» నేటి నుంచి వైద్యుల విధుల బహిష్కరణ

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 20 : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు శనివారం నుంచి విధులకు గైర్హాజరు కానున్నట్టు సంఘ నాయకులు డాక్టర్ అరుణ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో 85ను వ్యతిరేకిస్తూ శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద సంఘ నాయకులు, వైద్యులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వం దిగి వచ్చేంత వరకు ఆందోళన చేపడతామన్నారు. నీట్ పీజీ కౌన్సెలింగ్‌లో గతంలో ఇచ్చిన విధంగా 30 మార్కులు రాయితీ ఇవ్వాలన్నారు. జీవో 85లో 30 నుంచి 15 శాతంకు తగ్గించడం దురదృష్టకరమన్నారు. ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారిని డిప్యూటీ సివిల్ సర్జన్‌గా, 12 ఏళ్ల పూర్తి చేసుకున్న వారిని సివిల్ సర్జన్‌గా పదోన్నతి కల్పించాలని సంఘ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నుంచి విధులకు గైర్హాజరవుతామని పేర్కొన్నారు. ప్రభుత్వం చర్చలకు రాని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, వైద్యులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే అడుసుమిల్లికి ప్రముఖుల నివాళి



వన్‌టౌన్ : వర్తమాన రాజకీయ విశ్లేషకునిగా జయప్రకాష్ తనదైన పాత్ర పోషించిన అడుసుమిల్లి జయప్రకాశ్‌కు పలువురు నివాళులు అర్పిస్తూ ప్రస్తుతించారు. మాజీ ముఖ్యమంత్రి నాదేండ్ల భాస్కర రావు హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో జయప్రకాష్ మృతదేహాన్ని దర్శించి నివాళులర్పించారు. రాజ్యసభ మాజీ సభ్యులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ విలువలు కలిగిన నాయకుడిని కోల్పోయామని పేర్కొన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం జయప్రకాష్ పనిచేశారన్నారు. కేవీపీ రామచంద్రరావు పంపిన సంతాప సందేశంలో రాజకీయాలకు అతీతంగా విజయవాడ ప్రజలకు జయప్రకాష్ సేవలు అందించటంలో ముందున్నారని తెలిపారు. విజయవాడ తూర్పు మాజీ ఎమ్మెల్యే యలమంచిలి రవి విజయవాడ ప్రత్యక్ష రాజకీయాల్లో జయప్రకాష్‌ది క్రియాశీలక పాత్ర అని పేర్కొన్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు సంతాపం తెలియజేస్తూ అడుసుమిల్లి జయప్రకాష్‌తో తనకున్న పరిచయాలను నెమరువేసుకున్నారు. చిరంజీవి తిరుమలేష్‌కు, కుటుంబసభ్యులకు ఆయన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. జయప్రకాష్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

ల్యాండ్‌పూలింగ్ స్కీంకు చిన్న సవరణ

అమరావతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి రాజధాని నిర్మాణానికి భూముల కోసం ల్యాండ్‌పూలింగ్ చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. ఆ చట్టం ప్రకారం భూములిచ్చిన రైతులకు ప్లాట్‌ల కేటాయింపులో లాటరీ విధానం అవలంబించారు. అయితే ఇప్పుడు సీఆర్‌డీఏ ల్యాండ్ పూలింగ్ స్కీం రూల్స్ 2015 చట్టానికి చిన్నపాటి సవరణ తెస్తూ మున్సిపల్‌శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ చట్ట సవరణ ద్వారా ఇక నుంచి ల్యాండ్ పూలింగ్ స్కీం ద్వారా భూములిచ్చే రైతులకు కేటాయించే ప్లాట్‌లను గతంలో మాదిరిగా లాటరీ మాదిరిగా గానీ, ఏదైనా పారదర్శక విధానంలో గానీ సీఆర్‌డీఏ కమిషనర్ నిర్ణయం మేరకు కేటాయించవచ్చని ల్యాండ్ పూలింగ్ చట్టంలోని షెడ్యూల్-2(1)(సి)ను సవరించారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

» జగన్, వైసీపీ నేతల కమీషన్ల కక్కుర్తి

» హిందువుల మనోభావాలతో చెలగాటం

» తిరుమలలో కల్తీ నెయ్యి వాడకంపై బ్రాహ్మణ సాధికార సమితి ఆగ్రహం



తిరుమల ఘటన బాధ్యులను శిక్షించాలని ధర్నా చేస్తున్న బ్రాహ్మణ సాధికార సమితి సభ్యులు

వన్‌టౌన్, సెప్టెంబరు 20 : జగన్, వైవీ సుబ్బారెడ్డి శ్రీవారి భక్తులకు క్షమాపణ చెప్పాలని ఎన్టీఆర్ జిల్లా బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ కె.శివశర్మ డిమాండ్ చేశారు. గురునానక్‌నగర్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తిరుమలలో లడ్డూల తయారీకి వినియోగించిన నెయ్యి కల్తీ చేయడం దారుణమన్నారు. ఇందుకు సబంధించిన దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. జగన్, వైసీపీ నాయకులు కమీషన్ల కోసం కక్కుర్తిపడ్డారని, అన్నదానాన్ని కూడా భ్రష్టుపట్టించారని, తిరుమలలో ఆధ్యాత్మికత లోపించిందని విమర్శించారు. వైసీపీ నాయకులకు దేవుడు అంటే భయం లేదని, భక్తులు అంటే గౌరవం లేదని, హిందువుల మనోభావాలతో చెలగాటమాడారని విమర్శించారు. కల్తీ నెయ్యి వాడకాన్ని ప్రోత్సహించిన దుర్మార్గులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని తెలిపారు. లడ్డూను అపవిత్రం చేయటం దుర్మార్గమైన చర్యని పేర్కొన్నారు. అన్నదానంలో కూడా నాసిరకమైన వస్తువులు వాడారని విమర్శించారు. తిరుమలలో జగన్ పాలన సమయంలో ఎన్నో అపవిత్ర పనులు జరిగాయని ఆరోపించారు. టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చేసిన తప్పులు కప్పిపుచ్చుకునేందుకు చంద్రబాబును విమర్శించటం విడ్డూరంగా ఉందన్నారు. వైవీ సుబ్బారెడ్డి క్షమార్హుడు కాదన్నారు. సిట్టింగ్ జడ్జితో విచారణ అంటూ కొత్త డ్రామాలాడుతున్నారని పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ కూడా ప్రమాణం చేస్తానని ప్రకటించటంతో వైవీ సుబ్బారెడ్డి తోకముడిచారని విమర్శించారు. తిరుమలను అపవిత్రం చేసిన ఎమ్మెల్యే జగన్, వైవీ సుబ్బారెడ్డి ఇద్దరూ శ్రీవారి భక్తులకు క్షమాపణలు చెప్పాలని, లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని, దేవుడు కూడా త్వరలో శిక్షిస్తాడని చెప్పారు. తిరుమలకు జగన్ రెడ్డి తన భార్యతో వెళ్లిన సందర్భం లేదని గుర్తుచేశారు. తన ఇంటిలో ఉత్సవాలకు తిరుమల సెట్టింగ్‌లు వేయించుకుని స్వామివారి ప్రతిష్ఠను దిగజార్చారని చెప్పారు. టీడీపీ పశ్చిమ నియోజకవర్గ నాయకులు నక్కా కృష్ణ, నెల్లూరు నాని, రెంటపల్లి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

జగన్ దిష్టిబొమ్మ దహనం

తిరుపతి లడ్డూ విషయంలో హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించిన దుర్మార్గుడు జగన్ మోహన్ రెడ్డి అంటూ అతడి దిష్టిబొమ్మను జనసేన నాయకురాలు తిరుపతి అనూష ఆధ్వర్యంలో శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జగన్ మోహన్ రెడ్డి, ఆయన అనుచరులను దేవదాయశాఖ మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావును అరెస్టు చేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తిరుమల లడ్డూ తయారీకి కల్తీ నెయ్యిని వాడటం ఎంతో దుర్మార్గమని, వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జగన్ మోహన్ రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి ఏమి మాట్లాడుతున్నాడో అతనికే అర్థమవుతుందా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మంతాపురం రాజేష్, కూరాకుల సురేష్, దాసి రామ్మోహన్, కానాల వినోద్‌కుమార్, ఎండీ అయాజ్, షేక్ భక్షు, ప్రవీణ్, మూర్తిరాజు, ఎస్‌కె.ఆలీ, దాసరి బుజ్జి, ఆదిత్య రెడ్డి, ఆచంటి రాజశేఖర్, మణికంఠ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోండి

» ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ : పరమ పవిత్రమైన తిరుమలలో ఘోర అపచారానికి పాల్పడిన నీచులు ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రజావేదికలో విలేకర్లతో మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం కమీషన్‌ల కోసమే లడ్డూ నాణ్యతను తగ్గించారని ఆరోపించారు. భక్తుల మనోభావాలను దెబ్బతీశారని, అవకతవకలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణలో మరిన్ని విషయాలు బయటపడతాయన్నారు. తిరుమల పవిత్రతను కాపాడేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పాలనకు 100 రోజులు

» లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాల అమలు

» ఇంటింటికీ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన


రామలింగేశ్వర నగర్‌లో ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న కలెక్టర్ సృజన

వన్‌టౌన్, సెప్టెంబరు 20 : ప్రజల ఆకాంక్షల మేరకు సుపరిపాలన అందిస్తూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్న మంచి ప్రభుత్వం మనముందు ఉందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అన్నారు. కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన పూర్తిచేసిన సందర్భంగా శుక్రవారం రామలింగేశ్వరనగర్‌లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వృద్ధాప్య పెన్షన్‌లు రూ4వేలు, దివ్యాంగులకు రూ.6వేలకు పెంచారని, ఆకలితో ఉన్న నిరుపేదలకు అన్నా క్యాంటీన్లను పునఃప్రారంభించి రూ.5లకే భోజనం పెట్టి ఆదుకుంటున్న ప్రభుత్వం ఇది అన్నారు. ధాన్యం కొనుగోలు బకాయిలను రూ.1,674 కోట్లు చెల్లించి రైతులను ఆదుకుందన్నారు. సొంత భూమి పరులపాలవుతుందన్న భయాన్ని పోగొట్టారని, మెగా డీఎస్సీ ప్రకటన సాహసోపేత నిర్ణయమన్నారు. బుడమేరు ముంపు ప్రాంతాలను హుటాహుటిన క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను గమనించి చంద్రబాబు బాధితులకు అండగా నిలిచారని చెప్పారు. రాత్రి, పగలు నిద్రాహారాలు మాని, ఉన్నతాధికారులు, మంత్రివర్గం, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులందరినీ విజయవాడకు రప్పించారన్నారు. ప్రజాప్రతినిధులతో పాటు ఐఏఎస్ అధికారులకు కూడా బాధ్యతలు అప్పగించి బాధితులకు పూర్తి సహాయ సహకారాలు అందించారన్నారు. సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం వినూత్న పథకాలను అమలు చేస్తుందని ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ఈఓ రామారావుకు చెక్కు అందజేస్తున్న సికింద్రాబాద్‌కు చెందిన బొర్రా నిరంజన్

దుర్గమ్మ ఆలయ స్వర్ణతాపడానికి

రూ.8లక్షల విరాళం

వన్‌టౌన్, సెప్టెంబరు 20 : దుర్గామల్లేశ్వర దేవస్థానం స్వర్ణతాపడం పనుల నిమిత్తం సికింద్రాబాద్‌కు చెందిన ఏపీఎస్‌ఈబి డిపార్టుమెంట్ రిటైర్డ్ ఉద్యోగి బొర్రా నిరంజన్ శుక్రవారం దేవస్థానం ఈ.ఓ కె.ఎస్. రామరావుకు రూ.8లక్షల విరాళం చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు నిరంజన్ అతని కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం చేయించారు. వేద పండితులు వారికి ఆశీర్వచనం అందచేశారు. అనంతరం ఈ.ఓ నిరంజన్‌కు అమ్మవారి లడ్డూ ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందచేశారు. బొర్రా నిరంజన్ (86) ఇటీవల ట్రైన్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో ఆయన ఆరోగ్యం కోలుకుంటే అమ్మవారి దర్శనం చేసుకుంటానని మొక్కుకున్నారు. అమ్మవారి దయతో ఆయన ఆరోగ్యం కుదుటపడి మామూలు స్థితికి చేరుకున్నారు. శుక్రవారం ఆయన కుటుంబసభ్యులతో ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని, ఆలయ స్వర్ణతాపడం నిమిత్తం ఈ.ఓకు చెక్కును అందచేశారు. అమ్మవారి దయతో తాను మళ్లీ యధావిధిగా ఆరోగ్యంగా ఉన్నానని తెలిపారు.

ఇద్దరు డీటీలకు షోకాజ్ నోటీసులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : గన్నవరం పీడీఎస్ డీటీ పోస్టు కోసం పోటీ పడుతూ పరస్పర వ్యక్తిగత ఆరోపణలతో రచ్చకెక్కిన ఇద్దరు [ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్] డిప్యూటీ తహసీల్దార్‌లకు(పీడీఎస్ డీటీ ప్రధాన్, రెవెన్యూ డీటీ వెంకటరమణ) గుడివాడ, ఆర్డీవో పద్మావతి గురువారం సాయంత్రం షోకాజ్ నోటీసులు జారీచేశారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'డీటీ కోసం పోటీ' కథనానికి స్పందించిన ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పరస్పరం అవినీతి, లైంగిక వేధింపుల ఆరోపణలతో రచ్చకెక్కడం, అనుకూల రేషన్ డీలర్లతో నిరసన కార్యక్రమాలు నిర్వహించడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులిద్దరిపై చర్యలు ఎందుకు తీసుకోకూడదో చెప్పాలంటూ నోటీసులు జారీ చేశారు. పీడీఎస్ డీటీ కోసం వ్యక్తిగత ఆరోపణలతో శాఖ ప్రతిష్ఠను దిగజార్చడంపై రెవెన్యూ ఉద్యోగులు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీకి కౌన్సిలర్ల రాజీనామా

జగ్గయ్యపేట/పెనుగంచిప్రోలు : జగ్గయ్యపేట పురపాలకసంఘానికి చెందిన వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్ సహా 12 మంది వైసీపీ కౌన్సిలర్లు పార్టీకి రాజీనామా చేసినట్టు ప్రకటించారు. పెనుగంచిప్రోలుకు చెందిన వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాదల వీరయ్య చౌదరి తన పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అంతా ఉదయభానుతో పాటు 22వ తేదీన జనసేన పార్టీలో చేరుతున్నట్టు తెలిపారు.

ఎన్టీఆర్ జిల్లా అటవీశాఖ ఇన్‌చార్జి అధికారిగా రాజశేఖర్‌రావు



వన్‌టౌన్ : ఎన్టీఆర్ జిల్లా అటవీశాఖ ఇన్‌ఛార్జి అధికారిగా గురువారం కృష్ణాజిల్లా అటవీ శాఖ అధికారి కె. రాజశేఖర్‌రావు బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా అటవీ శాఖ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎవి ఎస్‌ఆర్‌కె అప్పన్న వ్యక్తిగత కారణాల వల్ల సుమారు నెల రోజుల పాటు సెలవు పై వెళ్లారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కృష్ణాజిల్లా అటవీశాఖ అధికారి రాజశేఖర్‌రావుకు ఎన్టీఆర్‌జిల్లా అటవీశాఖ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. గురువారం బాధ్యతలు తీసుకున్న ఆయన ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు.


50 ఏళ్లనాటి అపురూప చిత్రంతో అభిమాని రేపాక వెంకటేశ్వర్లు

ఏనాటిదో.. ఈ బంధం

» అక్కినేని వీరాభిమాని

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 20 : మచిలీపట్నంకు చెందిన అక్కినేని నాగేశ్వరరావు అభిమాని, సినీ ఆపరేటర్ రేపాక వెంకటేశ్వర్లు అక్కినేని నాగేశ్వరరావు చలనచిత్ర రజతోత్సవ వేడుకల సందర్భంగా ప్రచురించిన 'ఆంధ్రజ్యోతి' కాపీని భద్రపరిచి అక్కినేని నాగేశ్వరరావు పట్ల అభిమానాన్ని చాటుకున్నారు. 1970 సెప్టెంబరు 20న రజతోత్సవం సందర్భంగా ప్రచురించిన 'ఆంధ్రజ్యోతి' పత్రికను భద్రపరిచి ఫ్రేమ్ కట్టించారు. అక్కినేని నాగేశ్వరరావు నటించిన పలు చిత్రాలను ఈయన పలుమార్లు చూసేవారు. చెన్నై నుంచి హైదరాబాద్‌కు చలనచిత్ర సీమను తీసుకువచ్చి హైదరాబాద్‌లో అన్నపూర్ణ స్టూడియోను స్థాపించి అక్కినేని నాగేశ్వరరావు తెలుగు చలనచిత్ర పరిశ్రమకు జీవం పోశారన్నారు. గుడివాడ ఏఎన్‌ఆర్ కళాశాల భవన నిర్మాణాలకు నిధులు అందజేశారన్నారు. గుడివాడ తాలూకాలో పుట్టిన అక్కినేని సినిమాలు సందేశాత్మకంగా ప్రేక్షకుల హృదయాలలో నిలిచిపోయాయన్నారు.

న్యూస్ బాక్స్

ప్రశాంతంగా సివిల్స్ మెయిన్ పరీక్షలు

వన్‌టౌన్, సెప్టెంబరు 20 : విజయవాడ ఎస్‌ఆర్‌ఆర్, సీవీఆర్ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో శుక్రవారం నిర్వహించిన యూపీఎస్సీ సివిల్స్ మెయిన్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షా కేంద్రాలను జేసీ నిధి మీనా పరిశీలించారు. శుక్రవారం నాటి పరీక్షకు 135 మంది అభ్యర్థులకుగాను 128 మంది హాజరయ్యారు.


అక్రమ తవ్వకాల ప్రాంతాలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

విజిలెన్స్ తనిఖీలు

వన్‌టౌన్ : విజయవాడ రూరల్ పరిధిలోని పాతపాడు, నైనవరం రెవెన్యూ భూముల్లో అక్రమ తవ్వకాలు జరిగిన ప్రదేశాలను శుక్రవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా విజిలెన్స్ ఏజీ సుధాకర్ బృందం సర్వే నిర్వహించారు. మొత్తం ప్రాంతాన్ని పరిశీలించారు. రెవెన్యూ అధికారి రఘుబాబు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్ : వేదవిద్యలో ఉత్తీర్ణత పొందిన నిరుద్యోగులకు దేవదాయశాఖ ఆధ్వర్యంలో నెలకు రూ.3వేలు భృతి పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు దేవదాయ శాఖ అధికారిణి కెసుపద్మావేవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేదవిద్యలో పై కోర్సుల్లో ఉత్తీర్ణత పొందిన వారు దరఖాస్తు చేయవచ్చునని, దరఖాస్తుతో పాటు వేదవిద్య సర్టిఫికెట్ల నకళ్లు, ఆధార్ నకలు, ఎటువంటి ఉద్యోగం చేయటం లేదని స్వీయ అఫిడవిట్‌లు జతచేయాలన్నారు. ఈనెల 26వ తేదీ సాయంత్రం 5లోగా విజయవాడలోని కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 0866-2572004 ఫోన్‌చేసి తెలుసుకోవచ్చునని తెలిపారు.

గడువు పొడిగింపు

మచిలీపట్నం టౌన్ : ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరంలో టెన్త్, ఇంటర్ ప్రవేశం కోరే అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ఈనెల 28వరకు గడువు పొడిగించినట్టు డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. నిర్ణీత ఫీజుతో పాటు రూ. 200 అపరాధ రుసుముతో 29, 30 తేదీల్లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. వివరాలకు 80084 03506కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

బ్యాంకింగ్ సేవలకు ప్రత్యేక కేంద్రం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన


బ్యాంకింగ్ సేవల ప్రత్యేక ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సృజన

వన్‌టౌన్, సెప్టెంబరు 20 : భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన రైతులకు బ్యాంకింగ్ సేవలను అందించేందుకు ప్రత్యేకంగా విజయవాడ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో 'బ్యాంకింగ్ ఫెసిలిటేషన్ కేంద్రం' ఏర్పాటు చేశామని, బాధితులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన సూచించారు. శుక్రవారం ఆమె ఫెసిలిటేషన్ కేంద్రాన్ని రాష్ట్రా ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి జె.నివాస్, విజయవాడ ఆర్డీవో సీహెచ్ భవానీశంకర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె బ్యాంకింగ్ సేవలపై పలు సూచనలు చేశారు. దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించటంతో పాటు ఫాలోఅప్ కూడా జరుగుతుందన్నారు. యూబీఐ, ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి, ఐసీఐసీఐ ప్రతినిధులు అందుబాటులో ఉంటారన్నారు. రుణాల రీషెడ్యూల్ అవకాశాన్ని పొందటంతో పాటు వినియోగ రుణాలు, కొత్త మూలధన రుణాలు వంటి సేవలను పొందవచ్చునని తెలిపారు. లీడ్ బ్యాంక్, యుబీఐ భాగస్వామ్యంతో బ్యాంకింగ్ సేవలను సులువుగా పొందేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ ఏజీఎం డి.శ్రీనివాస్, యుబీఐ డిప్యూటీ రీజనల్ హెడ్ ఐఎ్‌ఎస్ మూర్తి, ఎల్డీఎం కె.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను నమ్మించి మోసం

» కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్ ఆగ్రహం


మాట్లాడుతున్న తిరుమలై రామన్

ధర్నాచౌక్, సెప్టెంబరు 20 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులను నమ్మించి మోసం చేశాయని ఏఐవైఎఫ్ జాతీయ ప్రధానకార్యదర్శి తిరుమలై రామన్ మండిపడ్డారు. 100 రోజుల పాలనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఎన్ని ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ స్థానిక రెవెన్యూ అధికారుల సంఘం కార్యాలయంలో శుక్రవారం జరిగింది. తొలుగ సంఘం పతకాన్ని రాష్ట్ర మాజీ నాయకుడు దోనేపూడి శంకర్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రారంభోత్సవ సభలో ఆర్.తిరుమలై రామన్, ఏఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, మాజీ రాష్ట్ర నాయకుడు దోనేపూడి శంకర్ మాట్లాడారు. ప్రతీ ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు అని గత పదేళ్లుగా ప్రధాని నరెంద్రమోదీ నిరుద్యోగులను మభ్యపెడుతున్నారన్నారని విమర్శించారు. ప్రతీ ఏడాది 20 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు 100 రోజుల పాలనలో నిరుద్యోగుల గురించి ఆలోచన చేయకపోవడం బాధాకరమన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మూడు నెలలు గడుస్తున్నా ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న రెండు లక్షల 30 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. 100 రోజుల పాలనలో నిరుద్యోగులకు ఏం చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి నక్కి లెనిన్‌బాబు ఉపాధ్యాక్షులు ఎంవి.సుబ్బారావు, జి.నాగరాముడు, సంతోష్‌కుమార్, కత్తి రవి, ఎం.యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.


షటిల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న యార్లగడ్డ వెంకట్రావు

క్రీడాకారులు స్పోర్టివ్‌గా ఉండాలి

» ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

» గన్నవరంలో ఉమ్మడి జిల్లా షటిల్ టోర్నమెంట్ ప్రారంభం

గన్నవరం, సెప్టెంబరు 20 : క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని.. ప్రతి క్రీడాకారుడు స్పోర్టివ్‌నెస్ కలిగి ఉండాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లా షటిల్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే వెంకట్రావు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. గన్నవరం కేవీఆర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన సభకు అసోసియేషన్ ఛైర్మన్ కలపాల వెంకటరమణ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, ఎందరో మహానుభావులు కృష్ణాజిల్లా గడ్డపై జన్మించి జిల్లా ఖ్యాతిని ప్రపంచానికి విస్తరింపజేశారన్నారు. క్రీడాకారుల్లో స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు దోహదం చేస్తాయన్నారు. క్రీడలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నానని గన్నవరాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతానన్నారు. మల్లవల్లి పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చెందుతుందన్నారు. ఎన్నికల ముందు అక్కడ రూ.50లక్షలు ఎకరం ఉంటే ఇప్పుడు రూ.2కోట్లకు చేరిందన్నారు. కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కేవీఆర్ కిషోర్ మాట్లాడుతూ, 65 టీములు వచ్చాయని, క్రీడాకారులకు ఉచిత భోజన వసతి కల్పించామన్నారు. ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్‌లను సన్మానించారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు, టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీఎస్‌ఆర్ మూర్తి, న్యాయవాదులు గారపాటి రవికుమార్, అమర్తల సోమేశ్వరరావు, నల్లమోతు రమేష్, కెఎస్ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డేకు విశేష స్పందన



వన్‌టౌన్ : గవర్నర్‌పేటలోని ఏపీ సీఆర్‌డిఏ కార్యాలయంలో శుక్రవారం జరిగిన అమరావతి రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ డేకు విశేష స్పందన వచ్చింది. ఏపీ సిఆర్‌డిఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ ఆధ్వర్యంలో జరిగిన గ్రీవెన్స్ డేలో వివిధ గ్రామాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను విన్నవించుకున్నారు. అదనపు కమిషనర్ రైతుల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో అమరావతి రైతులు, రైతు కూలీలు విచ్చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఏపీ చాంబర్ సభ్యుల వితరణ



వన్‌టౌన్ : వరద బాధిత సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ బృందం అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, మాజీ అధ్యక్షుడు ముత్తవరపు మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్‌లు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి కోటి రూపాయల విలువైన చెక్కులను అందచేశారు. ఈ బృందంలోని మరికొందరు సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు రూ.42,50,000 చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందచేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అంకితభావం, నాయకత్వానికి సహాయక చర్యలు విజయవంతంగా నడిపించినందుకు ఏపీ ఛాంబర్ సభ్యులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి నాయకత్వం లక్షలాది మంది ప్రజలను వరద సహాయక చర్యల్లో పాల్గొనేలా ప్రేరేపించిందని ఏపీ ఛాంబర్ సభ్యులు పేర్కొన్నారు.

మునేరులో వ్యక్తి గల్లంతు

కంచికచర్ల రూరల్ : వేములపల్లికి చెందిన జక్కుల వెంకటేశ్వరరావు (35) స్నేహితులతో కలిసి చేపల వేటకు వెళ్లి మునేరులో శుక్రవారం సాయంత్రం గల్లంతయ్యాడు. స్నేహితులతో కలిసి మునేరు ఆవలి వైపునకు వెళుతుండగా మధ్యలో లోతుగా ఉండటంతో గల్లంతయ్యాడు. వెంకటేశ్వరరావు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వెంకటేశ్వరరావుకు భార్య ఇద్దరు ఆడ పిల్లలున్నారు.

37 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

ఇబ్రహీంపట్నం రూరల్: మూలపాడులో అక్రమంగా నిల్వ ఉంచిన 37 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పీడీఎస్ డీటీ బత్తిన రామకృష్ణ శుక్రవారం తనిఖీ చేసి స్వాధీనం చేసుకున్నారు. వాటిని షాపు నంబరు 49కి తరలించారు. ఆర్ఐ ఐ.గోపి తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	119, 128, 139
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.50

వరద బాధితులకు భోజన కేంద్రం ఏర్పాటు

అజిత్‌సింగ్‌నగర్, సెప్టెంబరు 20 : 59వ డివిజన్ లెనిన్ సెంటర్ వద్ద శుక్రవారం సీపీఎం నేతలు వరద బాధితులకు భోజన కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు వరద బాధితులకు భోజనం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 రోజులుగా వరద బాధితులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వరద సహాయం బాధితులకు అందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరద బాధితుల పేర్ల నమోదులో లోపాలను సరిచేయాలని డిమాండ్ చేశారు. నగర ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా తమ బాధ్యతలు నెరవేర్చాలని లేని పక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

కేన్సర్ వ్యాధిగ్రస్తులకు మానసిక ధైర్యానిద్దాం

- డాక్టర్ పోలవరపు విజయభాస్కర్

పటమట, సెప్టెంబరు 20 : కేన్సర్ వ్యాధిని అధిగమించడానికి వ్యాధిగ్రస్తులకు మనమిచ్చే ధైర్యమే కొండంత బలమని రూట్స్ హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పోలవరపు విజయభాస్కర్ అన్నారు. ప్రపంచ కేన్సర్ డే సందర్భంగా శుక్రవారం కానూరులోని అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్‌లోని కేన్సర్ రోగులు కోలుకోవాలని వారికి గులాబీలు, పండ్లు ఇచ్చి వారికి ధైర్యానిచ్చారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ మాట్లాడుతూ మిలిందా రోజ్ అనే 12 సంవత్సరాలు బాలిక అరుదైన అస్కిన్స్ ట్యూమర్ అనే బ్లడ్ కేన్సర్ బారిన పడిందని, ఆమె ఆరు నెలలు మించి బతకదని వైద్యులు తెలిపారని, కానీ రోజ్ తన మనో ధైర్యం కోల్పోకుండా ఆత్మవిశ్వాసంతో కేన్సర్ రోగులకు ధైర్యం చెబుతూ తన కవితలతో, సందేశాలతో వారికి జీవితం మీద నమ్మకం కలిగించిందన్నారు. సెప్టెంబరు 22న ఆమె మరణించిందని, ఆమె గౌరవార్థం ప్రపంచ కేన్సర్ డేను ఐక్యరాజ్యసమితి నిర్వహిస్తోందన్నారు.



లయన్స్‌క్లబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

గుణదల, సెప్టెంబరు 20: లయన్స్‌క్లబ్ సేవలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ ఫ్లోర్‌లీడర్ నెలిబండ్ల బాలస్వామి అన్నారు. మారుతీనగర్‌లో ఉన్న లయన్స్‌క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం 12మందికి కంటి ఆపరేషన్ చేయించినట్లు లయన్స్‌క్లబ్ పూర్వ గవర్నర్ జెఎన్ శంకర్ గుప్తా తెలిపారు. ఉచితంగా ఆపరేషన్ చేయించుకున్న వారికి నెలిబండ్ల బాలస్వామి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు డి.గోపీనాథ్, బి.మోహన్ రావు, బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీయే 100 రోజుల పాలన పై ప్రజల హర్షాతిరేకాలు

● గద్దె క్రాంతికుమార్

వన్‌టౌన్, సెప్టెంబరు 20: ఎన్డీయే కూటమి 100 రోజుల పాలనపై ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారని టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక పెన్షన్ మొత్తాన్ని పెంచటం, బకాయి పెన్షన్‌ను కూడా ఏప్రిల్‌లోనే ఇవ్వటం, మెగా డీఎస్సీ ప్రకటించటం, అన్న క్యాంటీన్లను ప్రారంభించటం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయటం, ఉచిత ఇసుక పాలసీని తేవటం వంటి అనేక అంశాలను 100 రోజుల పాలనలో అమలు చేశారని తెలిపారు. 100 రోజుల్లో 100 సంస్కరణలను తీసుకువచ్చారని ప్రశంసించారు.

ఓటరు ఉత్తీర్ణుడయ్యాడు.. జగన్ ఫెయిల్ అయ్యాడు

● బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి

వన్‌టౌన్, సెప్టెంబరు 20: వైసీపీ డైనోసార్ పార్టీ అని బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి వ్యాఖ్యానించారు. విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం 100 రోజుల పరిపాలన, మూడోసారి మోదీ ప్రధానిగా 100 రోజులు పూర్తిచేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం, రాష్ట్రం అభివృద్ధి పంథాల్లో నడుస్తున్నాయన్నారు. వైసీపీ డైనోసార్ పార్టీ అని, దోపిడి పాలన విధానాన్ని అవలంభించారని తెలిపారు. ఓటర్ ఉత్తీర్ణుడు కాగా, జగన్ మోహన్ రెడ్డి ఫెయిలయ్యాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణా సంఘం చైర్మన్ పాకా సత్యనారాయణ, కార్యదర్శి నాగోతి రమేష్ నాయుడు, వారధి సమన్వయకర్త కిలారు దిలీప్ పాల్గొన్నారు.

అందరి మన్ననలు పొందిన కూటమి

ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బొండా ఉమా



మాట్లాడుతున్న బొండా ఉమా

పాయకాపురం, సెప్టెంబరు 20 : సంక్షోభంలోనూ ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందించి కూటమి ప్రభుత్వం అందరి మన్ననలు పొందుతోందని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వర రావు అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు అయిన సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం 63వ డివిజన్ రాజీవ్‌నగర్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు, నేతలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు బత్తుల కొండ, లబ్బా వైకుంఠం, మొత్యూరి ఖాసీం, కోలా శ్రీను, బెజ్జం జైపాల్ పాల్గొన్నారు.

వన్‌టౌన్: కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా కూటమి ప్రభుత్వం చేసిన మంచి పనులను కరపత్రాల



ఇంటింటికీ కరపత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు ఫతాఉల్లా

రూపంలో ప్రతి ఇంటికి వెళ్లి అందించటంతో పాటు స్టిక్కర్లను కూడా అంటించినట్లు టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఫతాఉల్లా తెలిపారు. వించిపేటలో జరిగిన ఈ కార్యక్రమం విజయవంతంగా సాగిందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఈ 100 రోజుల్లో చేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితో పాటు మైనార్టీ సెల్ నాయకులు తమీమ్ అన్సార్, మల్లేశ్వరి, ఫిరోజ్, గౌస్, కరిముల్లా పాల్గొన్నారు.

విద్యాధరపురం: 40వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పివి చిన సుబ్బయ్య ఆధ్వర్యంలో పార్టీశ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజలందరూ ఎన్డీయే ప్రభుత్వ పనితీరు పట్ల సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.నారాయణరావు, ఎం. ఆదినారాయణ, ఎ.వెంకటేశ్వర్లు, వెంకట నారాయణ ప్రసాద్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న సర్వేశ్వరరావు

ఘనంగా అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు

ధర్నాచౌక్, సెప్టెంబరు 20: అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు ఆలిండియా అక్కినేని నాగార్జున యువసేన సర్దార్ ఎస్.సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో నగర వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా జరిగాయి. గాంధీనగర్‌లోని శ్రీ కామాక్షి కార్యాలయంలో కేక్ కట్ చేశారు. గుణదల సెంటర్ సమీపంలోని నవజీవన్ బాలభవన్‌లో అన్నదానం నిర్వహించారు. టి.శేఖర్, బి.కృష్ణ, కే.ప్రభాకర్, డి.రాజా, నన్నీ, బాషా, వాసు, లక్ష్మణ్, సుబ్బు, ఈడీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ వస్తువుల నిషేధంపై అవగాహన ర్యాలీ

పటమట, సెప్టెంబరు 20 : ప్లాస్టిక్ వస్తువుల వాడకం వలన జరిగే అనర్థాలను వివరిస్తూ ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం- భూతాన్ని తగ్గిద్దాం అంటూ స్పెషలాఫీసర్ రాజు ఆధ్వర్యంలో శుక్రవారం పటమటలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ చెన్నుపాటి కాంతి శ్రీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పటమటలంకకు చెందిన ఆదిత్య కళాశాల విద్యార్థులు పటమటలంక గర్ల్స్ హైస్కూల్ వద్ద నుంచి ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా దర్శిపేట వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కార్పొరేషన్ సిబ్బంది, స్థానిక సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థినుల శ్రమదానం

ప్రభుత్వాసుపత్రి, సెప్టెంబరు 20: స్వచ్ఛతా హి సేవలో భాగంగా ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో 4వ సంవత్సరం నర్సింగ్ విద్యార్థినులు శుక్రవారం పరిసరాలను శుభ్రం చేశారు. చీపుర్లు పట్టి చెత్త, చెదారాన్ని శుభ్రం చేశారు. స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.పద్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కడియం శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వెల్డర్ ఆత్మహత్య

వన్‌టౌన్, సెప్టెంబరు 20: అనారోగ్య బాధలతో హెచ్‌బీ కాలనీకి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం భవానీపురం, వెల్లంపల్లి కాలనీ, 450ఎస్ఎఫ్‌టీ బ్లాక్‌లో అంకెం జయరామ్ (46), భార్య నాగమల్లేశ్వరి, ఇద్దరు కుమార్తెలతో ఉంటున్నాడు. ఇతను వెల్డింగ్ పనులు చేస్తుండగా అతని భార్య నాగమల్లేశ్వరి కిరాణ షాపులో పనికి వెళుతుంది. నాలుగేళ్ల నుంచి జయరామ్ అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రిలో మందులు వాడుతున్నాడు. అనారోగ్యం తగ్గడం లేదని మనస్తాపంతో అతను ఉన్నాడు. శుక్రవారం మధ్యాహ్నం అతని భార్య భోజనానికి ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో ఫ్యాన్‌కు లుంగీతో ఉరేసుకుని ఉన్నాడు, స్థానికులు 108 సిబ్బందికి సమాచారం తెలియపరిచారు. వారు వచ్చి పరీక్షించగా అప్పటికే జయరామ్ చనిపోయినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

రాజరాజేశ్వరిపేటలో యువకుడు ..

అజిత్‌సింగ్‌నగర్: స్థానిక రాజరాజేశ్వరిపేటలో ఉంటున్న షేక్ బాజి(22) కూలి పనులు చేస్తుంటాడు. గత కొంత కాలంగా అతడు మద్యానికి బానిసయ్యాడు. గురువారం రాత్రి కూడా మద్యం తాగి ఇంటికి రావడంతో తల్లి అతన్ని మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన బాజీ దండెంకు ఉరేసుకుని మృతి చెందాడు. సమాచారం అందుకున్న అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పూనే నుంచి ఏపీకి రవాణా సౌకర్యాలు కల్పించండి

● ఎమ్మెల్యే గద్దెను కోరిన పూనే వాసులు



పటమట, సెప్టెంబరు 20 : పూనే నుంచి ఆంధ్రప్రదేశ్‌కు విమాన, రైలు సర్వీసులు కల్పించాలంటూ పూనేలోని ప్రముఖులు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని గద్దె హామీ ఇచ్చారు. మహారాష్ట్రలో ఉన్న గద్దె రామ్మోహన్‌ను శుక్రవారం తెలుగు రాష్ట్రాల నుంచి అక్కడకి వెళ్లి స్థిరపడిన వ్యాపారవేత్తలు,ఉద్యోగస్తులు కలిసి మాట్లాడారు. పూనేలో ఎక్కువ మంది తిరుమల తిరుపతి దేవస్థానానికి వెళుతుంటారని, అందువల్ల పూనే నుంచి తిరుపతికి విమాన సర్వీసులు కల్పించాలని కోరారు. ఈ విషయమై కేంద్ర పౌర, విమానయానశాఖ మంత్రి కె. రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకెళతానని గద్దె వారికి హామీ ఇచ్చారు. పూనే నుంచి పలు ప్రాంతాలకు రవాణా సౌకర్యాలను కల్పించాలని వారు ఎమ్మెల్యే గద్దెకు విజ్ఞప్తి చేశారు. సీఎంకు వివరిస్తానని గద్దె వారికి హామీ ఇచ్చారు.

కేబీఎన్ కళాశాల కార్యదర్శి శ్రీనివాస్‌కు సత్కారం



తూనికుంట్ల శ్రీనివాసరావును సత్కరిస్తున్న చిట్టా అమరసుధీర్, రామచంద్రరావు, వేముల

వన్‌టౌన్, సెప్టెంబరు 20: కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాస్‌ను ఆ కళాశాలలో ఘనంగా సత్కరించారు. విద్యారంగంలో అందించిన సేవలకు అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ అమెరికా గౌరవ డాక్టరేట్‌ను తూనికుంట్ల శ్రీనివాస్‌కు ప్రకటించింది. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాల సెమినార్ హాల్‌లో వాసవీ విజయవాడ సంస్థ ఆధ్వర్యంలో ఆయనకు అభినందన సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ విజయవాడ సంస్థ అధ్యక్షుడు చిట్టా అమర సుధీర్ మాట్లాడుతూ విద్యారంగ వికాసానికి కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాస్ విశేష సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో వాసవీ సంస్థ కార్యదర్శి మాజేటి రామచంద్రరావు, వాసవీ సంస్థల కమిటీల ప్రముఖులు వేముల హజరతయ్య గుప్తా, వాసవి సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసర కిట్లను అందజేస్తున్న వరదరాజులు, పారామెడిక్స్ అసోసియేషన్ నాయకులు, వైబ్రేటింగ్ హార్ట్స్ సంస్థ ప్రతినిధులు, సుబ్బారెడ్డి

వరద బాధితులకు బాసటగా...

పాయకాపురం, సెప్టెంబరు 20 : అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతంలో వరదల వలన నిరాశ్రయులైన బాధితులకు అండగా నిలిచేందుకు క్యాటరర్స్ అసోషియేషన్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సభ్యులు ముందుకు వచ్చారు. పాయకాపురం కండ్రికలోని లగడపాటి కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం 1000 కుటుంబాలకు నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వరదరాజులు వరద బాధితులకు కిట్లను అందజేశారు. జాస్తి ఉమా మహేశ్వరరావు, తల్లం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సత్యనారాయణపురం: ఫెడరేషన్ ఆఫ్ కమ్యూనిటీ పారామెడిక్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ది గ్రామీణ వైద్యుల్య సంక్షేమ సహకార సంఘం సహకారంతో రూ.3.20 లక్షల ఇరవై వేల విలువైన నిత్యావసరాలు, రూ.3.20లక్షల నగదును విరాళంగా అందచేశారు. రామకృష్ణాపురంలోని అసోసియేషన్ కార్యాలయంలో 160 మంది గ్రామీణ వైద్యులు 6.40లక్షల విలువైన నిత్యావసర సరుకులు, నగదు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు వీబీటీ రాజు, వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఎంఎస్ రాజు, రాష్ట్ర అధ్యక్షుడు రొక్కం నాగేశ్వర రెడ్డి, ప్రధానకార్యదర్శి బల్లా శ్రీనివాసరావు, కోశాధికారి కె.కృష్ణమూర్తి, పీఎంపీల రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు, ఆర్ఎంపీల రాష్ట్ర కోశాధికారి పి.నాగేంద్ర రావు, విజయవాడ అర్బన్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

1500 కుటుంబాలకు

నిత్యావసర సరుకుల పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్ : వైబ్రేటింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ వరద బాధితులను ఆదుకోవటానికి ముందుకు వచ్చింది. సోషల్ మీడియా ద్వారా వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించింది. రూ. 15 లక్షలు విరాళాలు సేకరించి వచ్చిన నగదుతో నిత్యావసర సరుకుల కిట్లను సిద్ధం చేసింది. సంస్థ వ్యవస్థాపకుడు నల్లమోతు శ్రీధర్, వీఆర్ కన్నెగంటి ఆధ్వర్యంలో సంస్థ సభ్యులు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ఇంటింటికీ వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. అలాగే 1500 కుటుంబాల బాధితులకు వారం రోజులకు సరిపడా నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు.

విజయవాడ బులియన్ అసోసియేషన్ సాయం

వన్‌టౌన్: వన్‌టౌన్‌లోని విజయవాడ బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అసోసియేషన్ కార్యాలయంలో బాధితులకు వంటసామాగ్రి, వస్త్రాలు, బిస్కెట్ల కిట్లను అందచేశారు. సుమారు 200 మందికి రూ.3లక్షల విలువ చేసే సామాగ్రి, వస్త్రాలను అందచేసినట్లు అసోసియేషన్ నాయకులు జువ్వాది సత్యనారాయణ (రుద్రయ్య) తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎ.ఎస్.ఆర్.నాయుడు, కోశాధికారి రామనాథం కృష్ణబాబు, కార్యవర్గ సభ్యులు వై.చలంబాబు, సహాయ కార్యదర్శి పి.రామారావు, పలువురు అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

భవానీపురం: 43వ డివిజన్ ఊర్మిళానగర్ కాలనీలో శుక్రవారం 900 మందికి దుప్పట్లు, వాటర్ బాటిళ్లను మాజీ కార్పొరేటర్ ఆలుగడ్డ సుబ్బారెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహేష్ యాదవ్, వెలుగు పిచ్చయ్య, బొమ్మనబోయిన శ్రీను, ఎం రాంబాబు, టీడీపీ నేతలు కొనికి కొండయ్య, మల్లెబోయిన కొండ, మాగం ఆత్మారామ్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా పయనించాలి

చిట్టినగర్, సెప్టెంబరు 20: అభివృద్ధి దిశగా అహర్నిశలు శ్రమిస్తూ ముందుకు సాగాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర చెప్పారు. వీఎంసీలో విజన్ 2047పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2047 విజయవాడ నగరాన్ని ఎలా అభివృద్ధి చేయాలన్న దానిపై చర్చించారు. దీనికి అనుగుణంగా ఐదేళ్ల ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఈ ప్రణాళికలకు సంబంధించిన నివేదికలను విభాగాల వారీగా ఇవ్వాలని ఆదేశించారు.

చిరస్మరణీయుడు దేవినేని వెంకట రమణ



దేవినేని వెంకట రమణ చిత్రపటానికి నివాళులు అర్పించిన టీడీపీ నాయకులు

వన్‌టౌన్, సెప్టెంబరు 20: ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా పనిచేసిన దేవినేని వెంకట రమణ చిరస్మరణీయుడని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ అన్నారు. గాంధీనగర్ లోని ఆయన కార్యాలయంలో శుక్రవారం దేవినేని వెంకటరమణ 68వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, మిత్రులతో కలిసి వెంకట రమణ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు సమర్పించారు. ● మల్లికార్జునరావుపేటలో కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రమణ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవినేని వెంకటరమణ ప్రణీతల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వన్‌టౌన్, సెప్టెంబరు 20: భవానీపురంలో సుజనా ఫౌండేషన్, షేర్ ఇండియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నడుస్తున్న ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభిస్తోంది. ఆగస్టులో ఎమ్మెల్యే సుజనా చౌదరి ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారని, అప్పటి నుంచి విజయవంతంగా నడుస్తోందని నిర్వాహకులు తెలిపారు. వరదల కారణంగా వాయిదా పడిన వైద్య శిబిరం మళ్లీ అందుబాటులోకి వచ్చింది. ఈనెల 29వరకు ఎన్డీయే కార్యాలయంలో ఈ శిబిరం నడవనున్నదని నిర్వాహకులు తెలిపారు. గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ సీఎల్ వెంకట్రావు, ఈఎన్‌టీ డాక్టర్ బాలకోటేశ్వరరావు, డాక్టర్ సురేష్, గైనకాలజీ నిపుణులు డాక్టర్ రత్నప్రభలు ఈ శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్నారు. హెల్త్ క్యాంపు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బొమ్మకంటి వెంకటరమణ, సుజనా ఫౌండేషన్ కో ఆర్డినేటర్ వీరమాచినేని కిరణ్, సిబ్బంది శిబిరంలో సేవలను అందిస్తున్నారు.

పర్యావరణం - అధ్యయనం

పర్యావరణాన్ని ఆంగ్లంలో ఎన్విరాన్‌మెంట్ అంటారు. ఈ పదాన్ని ఫ్రెంచ్ భాష నుంచి గ్రహించారు. ఫ్రెంచ్‌లో ఎన్విరానర్ అంటే చుట్టూ ఆవరించి ఉండటం లేదా చుట్టుకొని ఉండటం అని అర్థం.

నిర్వచనాలు: మనచుట్టూ ఆవరించి ఉన్న గాలి, నీరు, నేల, జంతువులు, వృక్షాలు అనగా జీవ, నిర్జీవ వ్యవస్థల సమ్మేళనాన్ని 'పర్యావరణం' అంటారు. (లేదా) మానవుని చుట్టూ పరిసరాలు ఏర్పడటానికి కారణమయ్యే సాంఘిక, ఆర్థిక, జీవ, భౌతిక రసాయనిక కారకాల సమ్మేళనాన్ని పర్యావరణం అంటారు.

డగ్లస్, హాలెండ్: జీవరాశుల జీవితాన్ని, స్వభావాన్ని, ప్రవర్తనను, అభివృద్ధిని, పరిపక్వతను ప్రభావితం చేసే అన్ని బాహ్య శక్తులు, ప్రభావాలు, పరిస్థితుల సమిష్టి స్వరూపాన్ని వర్ణించడానికి పర్యావరణం అనే పదాన్ని ఉపయోగిస్తారు.

- **ఎ.గౌడై:** తన గ్రంథం ద నేచర్ ఆఫ్ ద ఎన్విరాన్‌మెంట్‌లో భౌతిక పరిణామాలే పర్యావరణమని, దానిని ప్రభావితం చేసే వారిలో మానవుడు అతి ముఖ్యమైన వాడని చెప్పారు.
- **బోరింగ్:** ఈయన పిండోత్పత్తి నుంచి మృత్యువు వరకు వ్యక్తి పొందే భౌతిక స్పందనల సమ్మేళనమే పర్యావరణమని చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా పర్యావరణంపై అవగాహన కలిగించేందుకు 1974 నుంచి ఏటా జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి నిర్ణయించింది.

పర్యావరణ అనుఘటకాలు

పర్యావరణం, జీవులు, నిర్జీవులు అనే రెండు ప్రాకృతికమైన అనుఘటకాలతో నిండి ఉంటుంది. పర్యావరణంలో రెండు అనుఘటకాలు ఉంటాయి. అవి-

ఎ) **జీవ అనుఘటకాలు:** వృక్షాలు, జంతువులు, సూక్ష్మజీవులు మొదలైనవి.

బి) **నిర్జీవ అనుఘటకాలు:** ఇవి మూడు రకాలు

1) **శీతోష్ణస్థితిపరమైనవి:** కాంతి, ఉష్ణం, వర్షపాతం మొదలైనవి.

2) **భౌతికపరమైనవి:** గాలి, నేల(మైదానాలు, పీఠభూములు, లోయలు మొదలైనవి), నీరు.

3) **రసాయనికపరమైనవి:** సేంద్రీయపరమైన కార్బొహైడ్రేట్స్, ప్రోటీన్స్, లిపిడ్స్, నిరింద్రీయ పరమైన సోడియం, పొటాషియం, కాల్షియం, పాస్ఫరస్ మొదలైనవి.

పర్యావరణం - వర్గీకరణ

దీనిని మూడు రకాలుగా వర్గీకరించవచ్చు.

1) మానవ నిర్మిత పర్యావరణం/ కృత్రిమ పర్యావరణం

2) సహజసిద్ధ పర్యావరణం

1) మానవ నిర్మిత పర్యావరణం: మానవ నిర్మిత పర్యావరణాన్ని సామాజిక - సాంస్కృతిక పర్యావరణం అంటారు. సహజంగా ఏర్పడినవి కాకుండా మానవుడు తయారు చేసిన లేదా నిర్మించిన ఆవరణాన్ని మానవ నిర్మిత పర్యావరణంగా చెప్పుకోవచ్చు. ఉదాహరణకు పంట పొలాలు, అక్వేరియాలు, పూల తోటలు, చేపల చెరువులు, విద్యాసంస్థలు, పార్కులు, వాణిజ్య సంస్థలు మొదలైన వాటిని మానవ నిర్మిత పర్యావరణంగా పరిగణించవచ్చు.

2) సహజసిద్ధ పర్యావరణం: సౌర మండలంలో ఏ గ్రహానికి లేని విశిష్ట లక్షణం భూ మండలానికి ఉంది. జీవరాశికి అనువైన వాతావరణం ఒక్క భూ మండలానికే ఉంది. మన చుట్టూ ఉండే గాలి, నీరు, వివిధ జీవరాశులు అంటే మానవులు, జంతువులు, వృక్షాలు, పక్షులు, క్రిమికీటకాలు, సూక్ష్మజీవులు మొదలైన వాటిని కలిపి సహజసిద్ధ పర్యావరణం అంటారు. మానవుని ప్రమేయం లేకుండా భూమిపై గల అనుకూల శీతోష్ణస్థితి ప్రభావాల కారణంగా ఏర్పడినదే 'సహజసిద్ధ పర్యావరణం' అంటారు.



పోటీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ జాగ్రఫీ

సహజసిద్ధ పర్యావరణాన్ని వాటి స్థితిని బట్టి నాలుగు రకాలుగా విభజించారు.

ఎ) వాతావరణం బి) జలావరణం

సి) శిలావరణం డి) జీవావరణం

ఎ) **వాతావరణం:** ఈ పదాన్ని గ్రీకు పదాలైన Atoms (vapour), Sphaira (Sphere) ఆవరణం నుంచి ఉద్భవించింది. గ్రీకుభాషలో అట్మాస్ అంటే గాలి/ఆవిరి అని అర్థం. ఈ ఆవరణాన్ని ఆంగ్లంలో అట్మాస్ఫియర్ అంటారు. భూమి పైభాగాన్ని కప్పి ఉన్న దుమ్ము, ధూళి, వాయువుల మిశ్రమాన్ని వాతావరణం అంటారు(లేదా) భూమిపై వ్యాపించి ఉన్న గాలి పొరను వాతావరణం అంటారు.

- భూమి చుట్టూ వాతావరణం లేకుంటే అంతరిక్షం నుంచి వెలువడే కాస్మిక్ కిరణాలు, సౌర కిరణాలు భూమిపై ప్రసరించి అన్ని గ్రహాల వలే ఒక ఉష్ణగోళంగా మారిపోయి, జీవరాశులకు ఆవాసం లేకుండా పోయేది. భూగోళం చుట్టూ వాతావరణం ఉండటం వల్ల జీవరాశి మనుగడకు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. కాబట్టి సహజంగా వాతావరణంలో ఉన్న ఆక్సిజన్, నైట్రోజన్, కార్బన్ డై ఆక్సైడ్, నీటి ఆవిరి మొదలైన వాటికి జీవ వైవిధ్యంలో కీలకపాత్ర ఉంది.
- వీటితోపాటు వాతావరణంలో దుమ్ము, ధూళి, లవణ కణాలు, సూక్ష్మ కణ రూపంలో ఉండి వాతావరణ ప్రక్రియల్లో ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయి.
- వాతావరణం గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని మెటరాలజీ అంటారు.
- వాతావరణం మనల్ని వెచ్చగా ఉంచుతుంది. ఇది భూ ఉపరితల ఉష్ణోగ్రతలను నియంత్రిస్తుంది. తీవ్రమైన పగలు - రాత్రి ఉష్ణోగ్రత వ్యత్యాసాలను తగ్గిస్తుంది.
- గాలి, వర్షం, మంచు మొదలైన అంశాలు, వాతావరణంపైనే ఆధారపడతాయి. వర్షం, గాలులు లేకుంటే జీవుల మనుగడ కష్టమవుతుంది. ఈ విధులే కాకుండా వాతావరణం సూర్యుని నుంచి విడుదలయ్యే హానికర అతి నీలలోహిత కిరణాల వల్ల కలిగే నష్టాన్ని నివారించడంలో సహాయపడుతుంది.
- ప్రపంచ వాతావరణ దినోత్సవం మార్చి 23(1950 నుంచి మొదలు)
- **ప్రపంచ వాతావరణ దినోత్సవం 2021 థీమ్:** పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ
- **ఉద్దేశం:** పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణకు చెట్లను చురుకుగా నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడం, పెరుగుతున్న కాలుష్య స్థాయిని తగ్గించడం.

దిక్సూచి
DIKSUCHI

వాతావరణం లక్షణాలు

- దీనికి రంగు, రుచి, వాసనలు ఉండవు. అయితే ఇది వాసనలను శబ్దాలను, ఒకచోట నుంచి మరో చోటకు మోసుకెళ్తుంది.
- ఇది పారదర్శకమైన లక్షణాన్ని కలిగి స్థితిస్థాపక శక్తిని కలిగి ఉంటుంది.
- భూమిని ఆవరించి ఉండటంతో సూర్యుని నుంచి వెలువడే హానికరమైన అతి నీలలోహిత కిరణాలను భూమిని చేరనీయకుండా జీవజాతిని రక్షిస్తుంది.
- వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులకు సంబంధించి వాతావరణంపై అధ్యయనం చేసేందుకు 1950 మార్చి 23న 180 దేశాల సభ్యత్వంతో ప్రపంచ వాతావరణ సంస్థను ప్రారంభించారు. ఈ సంస్థ ఏర్పడిన రోజును ప్రపంచ వాతావరణ దినోత్సవంగా నిర్ణయించారు. యూఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ దినోత్సవం జరుగుతుంది.



వి.వెంకట్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

నవ్య | చిత్రజ్యోతి



చిరంజీవికి అక్కినేని అవార్డ్

మెగాస్టార్ చిరంజీవికి ఏయన్నార్ జాతీయ అవార్డ్ ఇవ్వనున్నట్లు హీరో నాగార్జున శుక్రవారం ప్రకటించారు. వచ్చే నెల 28న ఈ అవార్డ్‌ను ఆలిండియా మెగాస్టార్ అమితాబ్ చేతుల మీదుగా అందజేస్తామని ఆయన తెలిపారు. ఇకపై రెండేళ్లకు ఒకసారి ఈ అవార్డ్‌ను ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ విషయం చెప్పగానే చిరంజీవి ఎమోషనల్ అయ్యారనీ, ఇంతకంటే పెద్ద అవార్డ్ లేదన్నారని నాగార్జున చెప్పారు.లుగు చిత్ర పరిశ్రమలోనే కాకుండా భారతీయ చలన చిత్ర పరిశ్రమకు విశేష సేవలు అందించిన చిత్ర ప్రముఖులకు తన పేరుతో జాతీయ అవార్డ్ ఇచ్చి సత్కరించాలని అక్కినేని తన పేరుతో జాతీయ అవార్డ్ ప్రారంభించి తొలిసారిగా 2006లో బాలీవుడ్ నటుడు దేవానంద్‌కు ఇచ్చారు. ఏటా క్రమం తప్పకుండా అవార్డులు ఇవ్వడానికి టీ.సుబ్బరామిరెడ్డి అధ్యక్షుడిగా రూ.కోటి మూలధనంతో అక్కినేని ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు.


నవ్వుతూ జీవించడం నాన్న నేర్పించారు

నాగార్జున

మహానటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న 'కింగ్ ఆఫ్ ద సిల్వర్ స్ర్కీన్ ఫిల్మ్ ఫెస్టివల్'ను శుక్రవారం అభిమానులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ప్రారంభించారు అక్కినేని నాగార్జున. హెరిటేజ్ ఫౌండేషన్, ఎన్.ఎఫ్.డీ.సి. నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్స్ సహకారంతో 31 నగరాల్లో ఈ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. 'దేవదాసు' చిత్రంతో ఫెస్టివల్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ 'నవ్వుతూ జీవించడాన్ని నాన్న మాకు నేర్పించారు. అందుకే ఆయన పేరు తలచుకుని నవ్వుతుంటాం. ఈ ఫెస్టివల్ నిర్వహిస్తున్న శివేంద్ర సింగ్ దుంగార్పూర్‌కు ధన్యవాదాలు. వాళ్ళ సెలెక్ట్ చేసిన చిత్రాల ప్రింట్స్ చక్కని క్వాలిటీతో ఉన్నాయి. నార్త్‌లో ఈ ఫెస్టివల్‌కు మంచి స్పందన వస్తోందని శివేంద్ర చెప్పారు. నాన్నగారి శత జయంతి రోజున పోస్టల్ డిపార్ట్‌మెంట్ ప్రత్యేక స్టాంప్ విడుదల చేయడం ఆనందంగా ఉంది. అలాగే తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి నాన్నగారి సీనియర్ అభిమానులు హైదరాబాద్ వచ్చారు. వారికి కూడా ధన్యవాదాలు' అని చెప్పారు. వెంకట్ అక్కినేని మాట్లాడుతూ 'నాన్నగారి శత జయంతి రోజున ప్రభుత్వం పోస్టల్ స్టాంప్ విడుదల చేసింది. బాపుగారు గీసిన ఫొటోతో స్టాంప్ రూపొందింది. ఈ రోజే స్టాంప్ రిలీజ్ అయ్యేలా ప్లాన్ చేసిన కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు కృతజ్ఞతలు' అన్నారు. కేంద్రసమాచార శాఖ కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ 'నవంబర్‌లో గోవాలో నిర్వహించే అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అక్కినేని చిత్రాలను ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అక్కినేని కుటుంబ సభ్యులతో పాటు పలువురు చిత్ర ప్రముఖులు పాల్గొన్నారు.







మళ్లీ కెమెరా ముందుకు..

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్‌కల్యాణ్ గతంలో తాను అంగీకరించిన చిత్రాలను పూర్తి చేయాలని నిర్ణయించుకున్నారు. 'హరిహర వీరమల్లు' చిత్రం మొదటి భాగంలో మిగిలిన షూటింగ్ చేయడానికి సమయం కేటాయించారు. ఈ నెల 23 నుంచి విజయవాడలో ఈ సినిమా కొత్త షెడ్యూల్ మొదలవుతుంది. హాలీవుడ్ యాక్షన్ కొరియోగ్రాఫర్ నిక్ పావెల్ సారథ్యంలో భారీ యుద్ధ సన్నివేశం చిత్రీకరించనున్నట్లు నిర్మాత దయాకరరావు చెప్పారు. ఇంతకు మునుపెన్నడూ చూడని స్థాయిలో ఈ యుద్ధ సన్నివేశాలు చిత్రీకరించడానికి దర్శకుడు జ్యోతికృష్ణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో బాలీవుడ్ నటులు బాబీ డియోల్, అనుపమ్ ఖేర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఏ.ఎం.రత్నం ఈ సినిమాకు సమర్పకుడు.

కె.బాలచందర్ స్త్రీలోలుడు

\- గాయని సుచిత్ర





తమిళ దర్శక శిఖరం కె.బాలచందర్ ఓ స్త్రీలోలుడు అని గాయని, నటి సుచిత్ర సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన జీవించివున్నంతకాలం కామవాంఛతో రగిలిపోయారంటూ ఇటీవల ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. కె.బాలచందర్ చనిపోయేంత వరకు ఒక 'లస్ట్‌మేన్'గా ఉన్నారు. మహిళలను తప్పుడు దృష్టికోణంలోనే చూశారు. వారిపట్ల అసభ్యంగా నడుచుకున్నారు. ఆయన గురించి అనేక మందికి తెలుసు. నన్ను కూడా కొందరు ఫామ్‌హౌస్‌లకు రమ్మని పిలిచారు. కానీ, నేను వెళ్ళలేదు' అని చెప్పారు. ఆమె ఆరోపణలను తమిళ చిత్ర దర్శకుల సంఘం, దక్షిణ భారత సినీ రచయితల సంఘం తీవ్రంగా ఖండించాయి. తమిళ చిత్రపరిశ్రమకు ఎంతో మేలు చేసి, అనేక అవార్డులు అందుకుని, అనేకమంది యువ దర్శకులకు మార్గనిర్దేశం చేసిన కె.బాలచందర్‌ను ఉద్దేశించి సుచిత్ర చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు సౌత్ ఇండియన్ ఫిల్మ్ రైటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ దర్శక నటుడు కె.భాగ్యరాజ్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, కోలీవుడ్ సినీ దర్శకుల సంఘం అధ్యక్షుడు ఆర్.వి.ఉదయకుమార్ విడుదల చేసిన ప్రకటనలో, ' భౌతికంగా మన మధ్యలేని గొప్ప వ్యక్తి గురించి ఇలా మాట్లాడి, వారి కుటుంబ సభ్యులను మనోవేదనకు గురిచేయడం పట్ల విచారం వ్యక్తం చేస్తున్నాం' అని పేర్కొన్నారు.

\- చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఓటుకు నోటు కేసు బదిలీకి సుప్రీం తిరస్కృతి!

- కేసు దర్యాప్తులో జోక్యం వద్దని రేవంత్‌కు ఆదేశం
- క్షమాపణలను అంగీకరించిన ధర్మాసనం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఓటుకు నోటు కేసును వేరే రాష్ట్రానికి బదిలీ చేయడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. స్పష్టమైన ఆధారాలు లేకుండా కేవలం ఊహాజనితమైన అంశాలతో పిటిషన్ వేశారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ కేసులో పిటిషనర్లు ప్రాసిక్యూషన్‌పై పూర్తి విశ్వాసం వ్యక్తం చేసినందున ఈ కేసు విచారణను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. అలాగే సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో దర్యాప్తు చేయాలన్న పిటిషనర్ల అభ్యర్థనను తోసిపుచ్చింది. ఓటుకు నోటు కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని ఈ ఏడాది జనవరి 31న బీఆర్ఎస్ నేతలు జగదీశ్‌రెడ్డి, మహ్మద్ అలీ, సత్యవతి రాథోడ్, కల్వకుంట్ల సంజయ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. కేసు విచారణలో ఎటువంటి పరిస్థితుల్లోనూ జోక్యం చేసుకోవద్దని రేవంత్‌రెడ్డిని ఆదేశించింది. ఇక నుంచి కేసు విచారణను సీఎంకు నివేదించవద్దని ఏసీబీ డీజీని ఆదేశించింది. ప్రతివాది అయిన సీఎం రేవంత్‌రెడ్డి ఈ కేసు విచారణలో జోక్యం చేసుకుంటే మళ్లీ కోర్టును ఆశ్రయించే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొంది. ఇదే సందర్భంలో ట్రయల్ కోర్టు కేసు విచారణను పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించింది.

రేవంత్.. క్షమాపణలు స్వీకరిస్తున్నాం

ఢిల్లీ మద్యం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టు బెయిల్ ఇవ్వడంపై రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ గతంలో ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. శుక్రవారం కేసు విచారణ సందర్భంగా మరోసారి ఆ అంశం ప్రస్తావన వచ్చింది. రేవంత్‌రెడ్డి ఒకసారి సోషల్ మీడియా వేదికగా, మరోసారి బహిరంగంగా రెండుసార్లు సుప్రీంకోర్టుకు క్షమాపణలు చెప్పారని రోహత్గీ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. రాజ్యాంగబద్ధ హోదాలో ఉన్న వ్యక్తులు జాగ్రత్తగా వ్యవహరించాలని కోర్టు మరోసారి హితవు పలికింది. ప్రజాస్వామ్యంలోని 3 కీలక వ్యవస్థలు తమ పరిధిలోని రాజ్యాంగ విధులను నిర్వర్తించాలని సూచించింది.

టిడ్కో సముదాయాలు ఇక 'ఎన్టీఆర్ నగర్'లు

అమరావతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టిడ్కో ఇళ్ల కాలనీలకు ఇక నుంచి పీఎంఏవై-ఎన్టీఆర్ నగరాలుగా పేరు మార్చనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టిడ్కో ఇళ్ల నిర్మాణాలను అప్పట్లో టీడీపీ ప్రభుత్వం నిర్మించింది. వైసీపీ సర్కార్ వచ్చిన తర్వాత వాటికి వైఎస్ఆర్ జగనన్న నగరాలుగా పేరు పెడుతూ అప్పట్లో మున్సిపల్‌శాఖ ఆదేశాలిచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి ఈ కాలనీలకు ఎన్టీఆర్ నగర్‌లుగా మార్చారు.

చంచల్‌గూడ జైలుకు జానీ మాస్టర్

- రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపరిచిన పోలీసులు
- దురుద్దేశంతోనే బాలికను అసిస్టెంట్‌గా చేర్చుకున్నాడు
- చేరిన నెలలోపే ముంబైకి తీసుకెళ్లి అత్యాచారం
- రిమాండ్ రిపోర్టులో వెల్లడి



పోలీసు వాహనంలో జానీ మాస్టర్

హైదరాబాద్ సిటీ/ రాజేంద్రనగర్/నార్సింగి, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): అత్యాచారం కేసులో అరెస్టయిన ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అలియాస్ షేక్ జానీ బాషా(42)ను పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఆయన్ను గోవా నుంచి నగరానికి తీసుకొచ్చిన సైబరాబాద్ ఎస్‌వోటీ, నార్సింగి పోలీసులు.. శుక్రవారం మధ్యాహ్నం ఒకటిన్నరకు రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లిలోని 13వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరు పరిచారు. పోలీసులు సమర్పించిన ఆధారాలను పరిశీలించి, ఇరువర్గాల వాదనలూ విన్న న్యాయమూర్తి.. అక్టోబర్ 3 వరకు (14 రోజుల) రిమాండ్ విధించారు. అనంతరం జానీ మాస్టర్‌ను అత్తాపూర్ జాయ్ హాస్పిటల్ తీసుకెళ్లి అక్కడ వైద్య పరీక్షలు చేయించిన పోలీసులు.. చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా.. రిమాండ్ రిపోర్టులో పోలీసులు విస్తుపోయే వెల్లడించారు. జానీమాస్టర్ దురుద్దేశంతోనే బాధితురాలిని అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా తీసుకున్నట్లు తెలిపారు. ఆమెకు ప్రముఖ డ్యాన్స్ షోలో పాల్గొనే అవకాశం రావడంతో 2017లో నగరానికి వచ్చిందని.. తర్వాత జానీ మాస్టర్ వద్ద అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా చేరిందని తెలిపారు. 2019, డిసెంబర్ 15 నుంచి జానీ మాస్టర్ వద్దే పనిచేస్తూ అల్కాపురికాలనీలో ఉంటోందని.. ఆ సమయంలో ఇద్దరూ ఒక సూపర్ హిట్ సినిమాకు పనిచేశారని పేర్కొన్నారు. ఆ సినిమా పని నిమిత్తం 2020 జనవరి 10న (అంటే చేరిన నెలరోజుల్లోపే) జానీ మాస్టర్, బాధితురాలు, మరో ఇద్దరు సహాయకులు ముంబై వెళ్లారని.. ఆ రోజు రాత్రి 12 గంటలకు బాధితురాలిని ఆధార్‌కార్డు, ఇతర డాక్యుమెంట్లు తీసుకొని తన గదికి రావాలని ఆదేశించిన మాస్టర్.. ఆమె గదిలోకి రాగానే గడియ పెట్టి అత్యాచారం చేశాడని.. అప్పటికీ బాలిక వయసు 16 ఏళ్లని తెలిపారు. అందుకే జానీమాస్టర్‌పై పోక్సో చట్టం కింద కూడా కేసు పెట్టినట్టు వెల్లడించారు. హోటల్ గదిలో జరిగినదాని గురించి ఎవరికైనా చెప్తే ఉద్యోగం నుంచి తొలగించడంతోపాటు పరిశ్రమలోనే లేకుండా చేస్తానంటూ బాధితురాలిని జానీమాస్టర్ బెదిరించినట్టు తెలిపారు. భయపడిన బాధితురాలు మిన్నకుండా ఉండిపోయిందన్నారు. చెప్పినట్లు వినకుంటే షూటింగ్ లొకేషన్‌లో అందరి ముందూ అసభ్యకరంగా మాట్లాడి అవమానించేవాడని.. మతం మార్చుకొని తనను పెళ్లి చేసుకోవాలంటూ ఆమెపై ఒత్తిడి కూడా తెచ్చేవాడని వెల్లడించారు. రోజురోజుకూ అతని వేధింపులు ఎక్కువ అవడంతో ఆమె సొంతగా పనిచేయడం ప్రారంభించిందని.. దీంతో ఒకరోజు జానీమాస్టర్, ఆయన భార్య ఆమె ఇంటికి వెళ్లారని, బాధితురాలి చెంపపై మాస్టర్ భార్య కొట్టారని.. కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు బాధితురాలిపై దాడికి యత్నించారని, ఏదో పార్సిల్ పంపి భయపెట్టాలని చూశారని పోలీసులు పేర్కొన్నారు. తనపై జరుగుతున్న అకృత్యాల గురించి బాధితురాలు.. జానీ మాస్టర్ వద్ద పనిచేస్తున్న మరో అసిస్టెంట్‌కు చెప్పుకొందని, అతని సూచన మేరకే పోలీసులకు ఫిర్యాదు చేసిందని తెలిపారు.

పీహెచ్‌సీ వైద్యులు విధుల్లో చేరాలి: కమిషనర్

అమరావతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య సేవలు నిత్యావసర, అత్యవసరమైనవి అయినందున పీహెచ్‌సీ వైద్యులంతా వెంటనే విధుల్లో చేరాలని ఆరోగ్యశాఖ కమిషనర్ పి.హరికిరణ్ కోరారు. ఈ మేరకు పీహెచ్‌సీ వైద్యులకు, డా.యూనస్‌కు ఆయన లేఖ రాశారు. ఇన్‌సర్వీస్ రిజర్వేషన్‌కు సంబంధించి పీహెచ్‌సీ డాక్టర్లు తమ ఆందోళనలను తిరిగి ప్రారంభిస్తారంటూ పీహెచ్‌సీ వైద్యుల సంఘం అధ్యక్షుడు డా.యూనస్ మీర్ ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబుకు లేఖ అందించారు. దానిపై స్పందించిన ఆరోగ్య శాఖ కమిషనర్ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని విధుల్లో చేరాలని తిరిగి లేఖ రాశారు. పీహెచ్‌సీ వైద్యుల సంఘం అధ్యక్షుడు తన లేఖలో వాడిన భాష, ఆందోళన కార్యక్రమాల కొనసాగింపు ప్రతిపాదన ఈనెల 18న ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆధ్వర్యంలో జరిగిన చర్చల స్ఫూర్తికి విరుద్ధంగా ఉందన్నారు.

ఒకేరోజు 1.03కోట్ల పుస్తకాల పంపిణీ

అమరావతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లోని విద్యార్థులకు రెండో సెమిస్టర్ పుస్తకాలను ఒకేరోజు పంపిణీ చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. రెండో సెమిస్టర్‌కు సంబంధించిన 1.03కోట్ల పుస్తకాలను ఈనెల 30న పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే మండల పాయింట్లకు పుస్తకాలు చేరుకున్నాయని, 28లోగా పాఠశాలలకు చేరుకుంటాయని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు తెలిపారు. 30న పంపిణీ ఈ ప్రక్రియను ఆర్జేడీలు, డీఈవోలు, ఎంఈవోలు పర్యవేక్షించాలని సూచించారు.

నాపై పరువు నష్టం కేసు కొట్టివేయండి

- హైకోర్టుకు జగన్... ఎల్లుండి విచారణ

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టులో మంత్రి నారాయణ తనపై వేసిన పరువు నష్టం కేసును కొట్టివేయాలని కోరుతూ మాజీ సీఎం జగన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ వద్ద విచారణకు రానుంది. రాజధాని భూముల వ్యవహారంలో తన పరువుకు భంగం కలిగించేలా వార్త ప్రచురించారని పేర్కొంటూ 2018లో మంత్రి నారాయణ, విజయవాడ ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టులో జగన్మోహన్‌రెడ్డి, తదితరులపై పరువు నష్టం కేసు వేశారు. ఈ కేసులో కోర్టు పలుసార్లు సమన్లు జారీ చేసినా జగన్ వాటిని అందుకోలేదు. పాస్‌పోర్టు పునరుద్ధరణ నిమిత్తం ఎన్‌వోసీ కోసం ఇటీవల ఆయన విజయవాడ కోర్టును ఆశ్రయించగా, ఎన్‌వోసీ జారీకి షరతులు విధించింది. ఈ ఉత్తర్వులను హైకోర్టు కూడా సమర్థించింది. పరువునష్టం కేసులో ప్రజాప్రతినిధుల కోర్టు జగన్‌కు తాజాగా సమన్లు ఇచ్చింది. విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. దీంతో పరువు నష్టం కేసును కొట్టివేయాలని కోరుతూ జగన్ హైకోర్టును ఆశ్రయించారు.

విద్యార్థినులకు డైట్ చార్జీల పెంపు

కర్నూలు సిల్వర్ జూబ్లీ కళాశాల, కలికిరి, కంచికర్ల సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కాలేజీల్లోని విద్యార్థినులకు డైట్ చార్జీలు పెంచుతూ ఉన్నత విద్యాశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. రూ.1,400 నుంచి రూ.1,600కు పెంచింది.

నా ఆరోపణలు అవాస్తవం

- ఎమ్మెల్యే ఆదిమూలంపై కేసులో హైకోర్టుకు బాధిత మహిళ వెల్లడి
- కేసు కొట్టేయాలంటూ అఫిడవిట్.. తీర్పును రిజర్వ్ చేసిన కోర్టు
- ఈ నెల 25న నిర్ణయం ప్రకటిస్తామని వెల్లడి

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై నమోదైన లైంగిక వేధింపుల కేసులో శుక్రవారం అనూహ్య పరిణామం చోటు చేసుకొంది. ఎమ్మెల్యే లైంగికంగా వేధించాడని కేసు పెట్టిన మహిళ స్వయంగా హైకోర్టు ముందు హాజరై పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తాను చేసిన ఆరోపణలు, ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న అంశాలు అన్నీ అవాస్తవమేనని న్యాయస్థానానికి నివేదించారు. ఈ మేరకు న్యాయవాదితో నోటరీ చేసిన అఫిడవిట్ దాఖలు చేశామని ఆమె తరఫు న్యాయవాది జితేందర్ కోర్టుకు దృష్టికి తీసుకొచ్చారు. న్యాయస్థానం సైతం ఫిర్యాదుదారును పిలిచి మాట్లాడగా వాస్తవాలను వివరిస్తూ అఫిడవిట్ వేశానని, ఆదిమూలంపై నమోదు చేసిన తప్పుడు కేసును కొట్టివేయాలని కోరారు. ఈ వివరాలు పరిగనణలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ ఈ నెల 25న తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రకటించారు. అప్పటివరకు ఆదిమూలంపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనపై పలుమార్లు లైంగికదాడి చేసి, అత్యాచారానికి పాల్పడ్డారంటూ సత్యవేడు నియోజకవర్గానికి చెందిన ఓ మహిళ ఈ నెల 5న ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తిరుపతి తూర్పు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ టీడీపీ నుంచి సస్పెండ్ అయిన సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా ఫిర్యాదుదారు నేరుగా కోర్టుకు హాజరయ్యారు. ఆదిమూలం తరఫున సీనియర్ న్యాయవాది సి.రఘు వాదనలు వినిపిస్తూ... 'పిటిషనర్ ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయనపై కేసు నమోదులో పోలీసులు చట్ట నిబంధనలు అనుసరించలేదు. మహిళా పోలీసు అధికారిణి కేసు నమోదు చేయాల్సి ఉండగా, పురుష అధికారి కేసు పెట్టారు. ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన సెక్షన్లు పిటిషనర్‌కు వర్తించవు. జూలై, ఆగస్టు నెలల్లో ఘటన జరిగితే సెప్టెంబరు 5న ఫిర్యాదు చేశారు. మూడో వ్యక్తి చేసిన ఒత్తిడితోనే మహిళ కేసు పెట్టింది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని కేసును కొట్టివేయాలి' అని కోరారు. బాధిత మహిళ తరఫున న్యాయవాది జితేందర్ వాదనలు వినిపిస్తూ... పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు అన్నీ అవాస్తవమేనని బాధితురాలు కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారన్నారు. దానిని పరిగణనలోకి తీసుకొని కేసును కొట్టివేయాలని కోరారు.

ముందస్తు బెయిలు మంజూరు చేయండి

- హైకోర్టును ఆశ్రయించిన కాంతిరాణా తాతా

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ముంబయి సినీనటి కాదంబరి జెత్వానీ ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఐపీఎస్ అధికారి కాంతిరాణా తాతా హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ ముందు విచారణకు రానుంది. ఆ పిటిషన్‌లో... 'తన ఆధార్ కార్డు, ఇతర డాక్యుమెంట్లను ఫోర్జరీ చేశారని, తప్పుడు క్రిమినల్ కేసు పెట్టి పోలీసుల చేత అరెస్టు చేయించి వేధించాడని కుక్కల విద్యాసాగర్‌పై సినీనటి కాదంబరి జత్వాని ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో నిందితులుగా కుక్కల విద్యాసాగర్, ఇతరులని పేర్కొన్నారు. ఈ కేసులో పోలీసులు తనను అరెస్టు చేసే అవకాశం ఉంది. ఫిర్యాదులో నాపై నిర్దిష్టంగా ఎలాంటి ఆరోపణలు లేవు. జత్వానిపై కేసు, ఇంటిలో సోదాలు, అరెస్టు వ్యవహారంలో చట్ట నిబంధనల ప్రకారమే నడుచుకున్నాం. ఈ వ్యవహారంలో ప్రభుత్వం ఇప్పటికే నన్ను ఏకపక్షంగా సస్పెండ్ చేసింది. వ్యాజ్యం తేలేవరకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలి' అని కాంతిరాణా తాతా కోరారు.



ఇరవైల్లో నాజూగ్గా కనిపించడంలో వింతేమీ లేదు. కానీ... యాభైల్లోనూ అదే శారీరక సౌందర్యంతో అలరిస్తుంటే..! కాజోల్ దేవ్‌గణ్..! కిలకిల నగవులు... మిలమిల మెరుపులతో ఒకప్పుడు వెండితెరను ఏలిన సితార. పరిశ్రమలోకి వచ్చి మూడు దశాబ్దాలు దాటినా... ఇద్దరు బిడ్డల తల్లి అయినా... ఆమెలో నేటికీ అదే ఆకర్షణ.

యాభైల్లోనూ ఇరవైలా..!

సెలబ్ ఫిట్



వెండితెర మీదే కాదు... వేదిక ఏదైనా కాజోల్ ఉందంటే అక్కడ పదివేల ఓల్టుల ఎనర్జీ. వాతావరణం ఉత్సాహంగా... ఉల్లాసంగా మారిపోతుంది. 'దిల్‌వాలే దుల్హనియా లేజాయేంగే, కుచ్ కుచ్ హోతాహై, కభీ ఖుషీ ఖభీ గమ్'... లాంటి ఆణిముత్యాలు ఆమె కెరీర్‌లో ఎన్నో. పక్కింటి అమ్మాయిని తలపించే పాత్రలతో... ఇండస్ట్రీ హిట్స్‌కు ఒకప్పుడు కేరాఫ్ అడ్రెస్. స్కూల్లో చదివే రోజుల్లోనే పరిశ్రమలోకి అడుగుఎట్టిన కాజోల్... ఉత్తమ నటిగా ఐదు ఫిలిమ్‌ఫేర్ అవార్డులతో కలిపి నలభైకి పైగా పురస్కారాలు అందుకుంది. సినీ రంగానికి చేసిన అసమాన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2011లో కాజోల్‌కు 'పద్మశ్రీ' పురస్కారం ఇచ్చి గౌరవించింది. అలనాటి నటి తనూజా ముఖర్జీ వారసురాలిగా కెమెరా ముందుకు వచ్చినా... అద్భుతమైన నటనతో తల్లిని మరిపించింది. ఆమె కుటుంబం మొదటి నుంచీ సినీ రంగంతో మమేకమైంది. తండ్రి సోము ముఖర్జీ దర్శకనిర్మాత. అమ్మమ్మ శోభనా సమ్మర్థ్, అత్తయ్య నూతన్, మామయ్యలు జాయ్ ముఖర్జీ, దేవ్ ముఖర్జీ, చెల్లి తనీషా... ఇలా చెప్పుకొంటూ పోతే, ఆమె దాదాపు అందరూ పరిశ్రమతో అనుబంధం ఉన్నవారే. చిన్నప్పుడే తల్లితండ్రులు విడిపోయినా... ఆ ప్రభావం తనపై పడనివ్వలేదు ఆమె అమ్మమ్మ. కాజోల్ స్వతంత్ర భావాలతో పెరిగింది. ఏదైనా పట్టుపడితే అది నెరవేరే వరకు వదలదు. అమ్మ నుంచి మహారాష్ట్ర సంస్కృతి, నాన్న నుంచి బెంగాలీ సంప్రదాయం అలవర్చుకుంది. స్టార్ హీరో అజయ్ దేవ్‌గణ్‌ను ప్రేమించి పెళ్లాడింది. వారికి ఇద్దరు పిల్లలు... నైసా, యుగ్. ఇప్పటికీ పలు ప్రాజెక్టుల్లో బిజీగా ఉన్న కాజోల్... తెరంగేట్రం చేసి మూడు దశాబ్దాలు దాటింది. అయినా నేటికీ ఆమెలో అదే జోష్. అదే నాజూకైన రూపం. అందుకే నడివయసువారికే కాదు... యువతరానికి కూడా ఆమె ఆదర్శంగా నిలుస్తోంది.

పది గంటల నిద్ర...

కాజోల్ జీవనశైలి చూడ్డానికి చాలా సాధారణంగా ఉటుంది. కానీ పోషక విలువలున్న ఆహారం, క్రమం తప్పని వ్యాయామం ఆమె జీవితంలో భాగం. అదే తనను ఆరోగ్యంగా, నిత్యయవ్వనంగా ఉంచుతుందని అంటుంది ఈ బాలీవుడ్ బ్యూటీ. అన్నిటికంటే ముఖ్యంగా రోజుకు కనీసం పది గంటలు నిద్ర పోతుంది. 'పడుకొనే ముందు శుభ్రంగా ముఖం కడుక్కోకపోతే నాకు నిద్ర పట్టదు. ఎంత బిజీగా ఉన్నా రోజూ కచ్చితంగా పది గంటలు నిద్ర పోవాల్సిందే' అంటూ ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. ఆమె నిద్ర గురించి అప్పట్లో పెద్ద చర్చే జరిగేది. భర్త అజయ్‌దేవ్‌గణ్ కూడా ఓసారి 'ఇక నిద్ర పోయింది చాలు' అంటూ ఆమె ఫొటోతో ట్వీట్ చేశాడు.

అదేవిధంగా చర్మ సౌందర్యానికి సంబంధించి కూడా చాలా జాగ్రత్తలు తీసుకొంటుంది కాజోల్. ఇంత మందాన ముఖానికి రంగులు పులిమేయకుండా... సింపుల్ మేకప్‌తో కనిపించడానికే ఇష్టపడుతుంది. ఆమె కిట్‌లో సన్‌స్క్రీన్ లోషన్ తప్పనిసరి. 'పదహారేళ్ల వయసులో నాకు సన్‌స్క్రీన్ ప్రయోజనం గురించి తెలిసింది. అప్పటి నుంచి వాటిని ఉపయోగిస్తున్నా. అంతేకాదు... పుష్కలంగా నీళ్లు తాగుతాను. దానివల్ల చర్మానికి నిగారింపు వస్తుంది' అంటుంది.

వర్కవుట్ ఇలా...

శరీరంలో సత్తువ, జీవక్రియ పెంపొందించడానికి రోజుకు కనీసం రెండు గంటలు వర్కవుట్స్‌కు కేటాయిస్తుంది కాజోల్. వీటిల్లో వెయిట్, ఎండ్యూరెన్స్ ట్రైనింగ్‌తో పాటు యోగా కూడా ఉంటుంది. రెండో కాన్పు తరువాత కాజోల్ కేవలం ఐదు నెలల్లో ఇరవై కిలోల బరువు తగ్గింది.

- ఉదయం అరగంట జిమ్‌లో కార్డియో ఎక్సర్‌సైజ్‌లు. అప్పుడప్పుడూ స్విమ్మింగ్. ఇరవై నిమిషాలు వెయిట్‌లిఫ్టింగ్ సెషన్. డెడ్‌లిఫ్ట్ ఆమె ఫేవరెట్ వ్యాయామం. దానివల్ల అధిక మొత్తంలో కేలరీలు కరుగుతాయి. శరీరం దృఢంగా మారుతుంది.
- తరువాత స్క్వాట్స్, లంగెస్, పిలెట్స్, డ్యాన్స్ కూడా ఆమె వ్యాయామాల్లో భాగం.
- అరగంట యోగా, ధ్యానం. యోగా శరీరాన్ని ఫ్లెక్సిబుల్‌గా ఉంచుతుంది. ధ్యానంతో మానసిక ప్రశాంతత, ఏకాగ్రత కుదురుతాయి.

జంక్‌ఫుడ్‌కు దూరం...

పిండి పదార్థాలు తక్కువ మోతాదులో, పీచు పదార్థాలు పుష్కలంగాగల స్వచ్ఛమైన, పరిశుభ్రమైన ఆహారంతో ఆమె మెనూ నిండివుంటుంది. అలాగే చేప, చికెన్ మెనూలో తప్పనిసరి. పిజ్జాలు, బర్గర్లు, ఇతర జంక్, ప్రాసెస్‌డ్ ఫుడ్స్‌కు దూరం. ఆ మధ్య అతిథుల కోసం కాజోల్ తన ఇంట్లో ఇచ్చిన విందుకు సంబంధించి, రకరకాల ఫుడ్ ఐటెమ్స్ ఫొటో ఒకటి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. పాలక్ పనీర్, గార్లిక్ బ్రెడ్, ఫిష్ ఫ్రై, స్పైసీ మహారాష్ట్రియన్ పట్వాడీ, దాల్ రైస్ అందులో కొన్ని వంటలు. ఆ విందుకు ఆమె ఓ కొత్త పేరు పెట్టింది... 'లిండర్' అని. అంటే లంచ్, డిన్నర్‌లను అలా కలిపేసిందన్నమాట. ఆహార నియమాల విషయంలో ఎంత కచ్చితంగా ఉన్నా... అప్పుడప్పుడు నచ్చిన వెరైటీలను ఓ పట్టు పడుతుంది ఈ భామ. భర్త అజయ్ దేవ్‌గణ్‌లానే ఆమెకు చైనీస్, గోవా ఫుడ్స్ చాలా ఇష్టం. కాజోల్ షెఫ్‌లను తలదన్నే అద్భుతమైన కుక్ కూడా.

ముల్లంగి అంటే వ్యాధులకు హడల్!

"సుకలిత మతిసూక్ష్మం బాలమూలస్య మూలం లవణమథిత మూర్ధ్నా పీడితం పాణియుగ్మే!! సురభితమతినింటూ హింగుధూపేన యుక్తం భవతి జఠరవహ్నేస్తూర్ణమృద్దీపనాయ!!' అంటాడు క్షేమశర్మ తన క్షేమకుతూహలంలో! రకరకాల వ్యాధులకు ముల్లంగి గొప్ప మందు అనేది ఈ శ్లోకార్థం.



ఏది శ్రేష్ఠం?: ముదిరిన దుంపల కన్నా లేత ముల్లంగి దుంపలకే ఎక్కువ శక్తి ఉంటుంది. లేత ముల్లంగి కంఠ స్వరాన్ని మెరుగుపరుస్తుంది. ఆహారాన్ని తేలికగా అరిగేలా చేస్తుంది.

ముల్లంగి దుంపలకు, ఆ చెట్టు ఆకులకు విశేషమైన ఔషధ గుణాలు ఉన్నాయని మన పూర్వీకులు ఎప్పుడో గమనించారు. అందుకే మన పూర్వీకులు ముల్లంగిని ఒక విశిష్టమైన దుంపగా గుర్తించారు. కాలేయం దెబ్బతిన్నప్పుడు.. మొలలు తగ్గటానికి.. అజీర్తి సమస్య తొలగిపోవటానికి.. మూత్ర పిండాల్లో రాళ్లు కరగటానికి.. సొరియాసిస్ లాంటి చర్మవ్యాధులు రాకుండా ఉండటానికి ముల్లంగి ఉపకరిస్తుందని ఆయుర్వేద గ్రంథాల్లో పేర్కొన్నారు. అంతే కాదు- ముల్లంగి వల్ల అనేక ఇతర ఆరోగ్య సమస్యలు తొలగిపోతాయి.

- ముల్లంగి దుంపను ముక్కలుగా తరిగి- దానిని రాత్రి నీళ్లలో నానబెట్టి- ఉదయాన్నే లేచి ఆ నీళ్లు తాగితే స్థూలకాయం తగ్గుతుంది.
- ముల్లంగి ముక్కలతో జ్యూస్ చేసి.. దానిలో నీళ్లు, నిమ్మకాయ రసం కలిపి- ఉదయాన్నే తాగితే మధుమేహం తగ్గుతుంది. చెడు కొలస్ట్రాల్‌కు చెక్ పడుతుంది.
- ముల్లంగి దుంప, ఆకులను తీసుకొని విక్సీలో వేసి జ్యూస్ చేసి తాగితే కళ్లకు సంబంధించిన సమస్యలు తొలగిపోతాయి.
- ముల్లంగి రసం, నువ్వుల నూనె కలిపి బాగా కాచి- చల్లారిన తర్వాత ఒక సీసాలో పోసుకోవాలి. దీనిని క్రమం తప్పకుండా రాస్తే బొల్లి మచ్చలు తగ్గిపోతాయి.
- మన మెదడు మధ్యభాగంలో ఉండే పీనియల్ గ్రంథి- రాత్రి సమయంలో మెలటోనిన్ అనే హార్మోనుని ఉత్పత్తి చేస్తుంది. పగలు ఈ హార్మోను ఉత్పత్తి కాదు. రాత్రిళ్లు మెలుకువగా ఉండేవారిలో ఈ హార్మోను ఉత్పత్తి కాదు. దీని వల్ల రకరకాల ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయి. వీటికి ముల్లంగి పరిష్కారాన్ని చూపిస్తుంది.

కూర ఎలా చేయాలి?

లేత ముల్లంగి దుంపలను ఎంచుకొని.. పై తొక్క తీసేయాలి. దుంపలను చిన్న ముక్కలుగా తరిగి ఉప్పు చల్లాలి. అప్పుడు కొన్ని నీళ్లు ఊరతాయి. వాటిని తీసేయాలి. ఒక మూకుడులో నూనె వేసి కాచాలి. ఆ నూనెలో తాలింపు పెట్టాలి. ఇంగువ కూడా వేయాలి. ఆ తర్వాత ముల్లంగి ముక్కలను వేసి మూత పెట్టి కొద్ది సేపు మగ్గనివ్వాలి. వేడి తగ్గిన తర్వాత కూరలో నిమ్మకాయ రసాన్ని కలపాలి. కొందరు ముల్లంగిని తురిమి పెరుగులో కలిపి పచ్చడి కూడా చేస్తారు.

• గంగరాజు అరుణాదేవి

స్మార్ట్ కిచెన్...


మహిళలకు వంటింటి పనుల్లో చేదోడుగా నిలించేందుకు కొన్ని స్మార్ట్ గ్యాడ్జెట్స్ మార్కెట్లోకొచ్చేశాయి. వేడి పాత్రలను సింపుల్‌గా స్టౌ మీద నుంచి దించాలన్నా, వెల్లుల్లి చకచకా రోస్ట్ చేయాలన్నా, టమాటో ముక్కలు సరిగ్గా కట్ చేయాలన్నా ఇకపై చిటికెలో పని. మరి ఇంతకీ ఆ స్మార్ట్ గ్యాడ్జెట్స్ ఏంటో చూద్దామా..

గరిటకు రెస్ట్..



రోజూ వంట చేసే క్రమంలో ఆయా పదార్థాల్ని కలపడానికి వేర్వేరు గరిటలు వాడుతుంటాం. పనైపోయాక వాటిని స్టౌ మీదనో లేదో ప్లాట్‌ఫామ్ మీదో గబగబా పెట్టేస్తుంటాం. దీనివల్ల ఆ ప్రదేశమంతా నూనె మరకలు పడి అపరిశుభ్రంగా తయారవుతుంది. అందుకే ఈ సమస్యకు చెక్ పెట్టడానికి 'స్పూన్ రెస్ట్ హోల్డర్' మార్కెట్లోకొచ్చేశాయి. వీటిలో గరిట మాత్రమే కాదు పాత్రలపై పెట్టే మూతల్ని అమర్చుకునే సౌకర్యం కూడా ఉంది.

గార్లిక్ రోస్టర్



వెల్లుల్లి రోస్ట్ చేయడం కాస్త కష్టంతో కూడుకున్నదే. వాటిని పొయ్యి మీద లేదా ఓవెన్‌లో కాల్చాలన్నా ఆరంతం వెల్లుల్లి వాసనే వస్తుంది. అందుకోసమే ప్రత్యేకించి ఈ 'గార్లిక్ రోస్టర్' అందుబాటులోకి వచ్చింది. ఈ ఎలక్ట్రానిక్ పరికరంలో వెల్లుల్లి చివరలు కత్తిరించి కాస్త వంటనూనె లేదా ఆవనూనె గానీ వెయ్యాలి. అవసరమైతే పెప్పర్, సాల్ట్ చల్లి మూత పెట్టేకొని, ముందరున్న బటన్‌ని ఆన్ చేస్తే చాలు. అదే చక్కగా కాలతాయి. 30 నిమిషాల్లోనే గ్లారిక్ రోస్ట్ రెడీ అవుతుంది.

చేతులు కాలవిక



స్టౌ మీద నుంచి వేడి పాత్రలను దించడానికి చాలామంది క్లాత్స్ ఉపయోగిస్తుంటారు. అయితే ఒక్కోసారి వాటిని ఉపయోగించినా చేతులు కాలుతుంటాయి. ఆ సమస్యకు చెక్ పెట్టేందుకు ఈ 'కుకింగ్ గ్లోవ్స్' బాగా ఉపయోగపడతాయి. వీటి సాయంతో చేతులు కాలకుండా వేడి గిన్నెల్ని కిందకు దించొచ్చు. సిలికాన్ మెటీరియల్‌తో తయారైన ఈ గ్లోవ్స్ విభిన్న రంగుల్లో మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. వీటిని ఉడికిన గుడ్లు బయటకు తీసేందుకు, ఓవెన్‌లో బేకింగ్ ట్రేలు పెట్టేటప్పుడు, తీసేటప్పుడు కూడా వాడొచ్చు. ఇవి పూర్తిగా ఉష్ణ నిరోధకంగా పనిచేస్తాయి. పైగా శుభ్రం చేయడమూ తేలికే.

చకచకా తరగొచ్చు



ఉల్లిపాయలు, టమాటో ముక్కలను వేగంగా కోసేటప్పుడు అవి కొంచెం పక్కకు కదిలిపోతూ ఇబ్బంది పెడుతుంటాయి. అలా కదలకుండా ఉండేందుకు ఈ 'వెజిటబుల్ స్లైసర్' చక్కగా ఉపయోగపడుతుంది. దీనిని వాడడం కూడా తేలికే. రెండు హ్యాండిల్స్ మధ్యలో టమాటో లేదా బంగాళదుంప లేదా ఉల్లిపాయను పెట్టి కాస్త గట్టిగా నొక్కి పట్టుకుంటే అవి స్థిరంగా ఉంటాయి. అప్పుడిక ముక్కలు చకచకా తరగొచ్చు.

వంటిల్లు



చాలా మందికి హైదరాబాద్ బిర్యానీ అంటే ఇష్టం. బిర్యానీతో పాటుగా మిర్చి సాలన్ అంటే కూడా ఇష్టమే! అయితే ఈ సాలన్‌ను రకరకాలుగా ఇంట్లోనే చేసుకోవచ్చు. అలాంటి కొన్ని వంటలను చూద్దాం..

సై... సాలన్!

సఫేద్ మిర్చి కా సాలన్

కావాల్సిన పదార్థాలు

బజ్జీ మిర్చి- అర కిలో, జీలకర్ర- ఒక టేబుల్ స్పూను, నిమ్మరసం- నాలుగు టేబుల్ స్పూన్లు, నూనె- అరకప్పు, నువ్వుపప్పు- 100 గ్రాములు, ఎండు కొబ్బరి పొడి- 200 గ్రాములు, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

- బజ్జీ మిర్చిని సన్నగా తరగాలి. వాటి మధ్యలో ఉండే గింజలను తీసేయాలి.
- నువ్వులు, కొబ్బరి పొడిలను మిక్సీలో వేసి కొద్దిగా నీళ్లు పోసి బాగా రుబ్బాలి.
- ఒక మూకుడులో నూనె వేడి చేసి జీలకర్రను వేయించాలి. ఈ నూనెలో నువ్వులు, కొబ్బరి పొడి మిశ్రమాన్ని వేయాలి. కొద్దిగా నీళ్లు పోసి ఉడకనివ్వాలి. కొద్ది సేపటి తర్వాత నీళ్లు పైకి తేలుతూ ఉంటాయి.
- ఆ సమయంలో తరిగిన మిర్చిని మిశ్రమంలో కలపాలి. మిర్చి ముక్కలు మెత్తగా అయిన తర్వాత స్టౌ మీద నుంచి కిందకు దింపాలి.
- కొద్దిగా చల్లబడిన తర్వాత ఆ మిశ్రమంలో నిమ్మరసం వేసి కలపాలి.



జాగ్రత్తలు

- వీలైనంత వరకు మార్కెట్లో లభించే బజ్జీ మిర్చి మాత్రమే వాడాలి. మామూలు మిర్చి వాడితే సరైన టేస్ట్ రాదు.
- వీలైనంత వరకు ఎండు కొబ్బరి పొడినే వాడాలి. దీనివల్ల మంచి రుచి వస్తుంది.
- ఇది చపాతీలలోకి చాలా బాగుంటుంది.

ప్యాజ్ కీ ఘట్టికా సాలన్



కావాల్సిన పదార్థాలు

చుక్క కూర- ఐదు కట్టలు, సాంబారు ఉల్లిపాయలు- పావు కిలో, మామూలు ఉల్లిపాయ ముక్కలు- 100 గ్రాములు, టమోటా ముక్కలు- 100 గ్రాములు, అల్లం వెల్లులి పేస్ట్- ఒక టేబుల్ స్పూను, కారం- ఒక టేబుల్ స్పూను, పసుపు- అర టీ స్పూను, నూనె- అర కప్పు, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

- చుక్క కూరను బాగా కడగాలి. ఆ తర్వాత ఆకులను విడదీసి సన్నగా తరగాలి.
- ఒక మూకుడులో నూనె తీసుకొని వేడి చేయాలి. ఉల్లిపాయ ముక్కలను వేసి బాగా వేయించాలి.
- ఆ ముక్కలకు అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను కలపాలి. ఆ తర్వాత కారం, పసుపు, ఉప్పులను వేయాలి. ఆ మిశ్రమంలో సాంబారు ఉల్లిపాయలను వేసి మూత పెట్టాలి.
- ఉల్లిపాయలు ఉడికిన తర్వాత- దానిలో తరిగిన చుక్కకూరను, టమోటా ముక్కలను వేయాలి.
- దీనిలో తగినన్ని నీళ్లు పోసి బాగా ఉడకనివ్వాలి. సాంబారు ఉల్లిపాయలు పైకి తేలిన తర్వాత స్టౌ నుంచి కిందకు దింపేయాలి.

జాగ్రత్తలు

- చుక్క కూరను ఉప్పు కలిపిన నీళ్లలో కడగాలి. అప్పుడు దానిపై ఉన్న మలినాలు, రసాయన పదార్థాలు తొలగిపోతాయి.
- సాంబారు ఉల్లిపాయలు మృదువుగా ఉంటాయి. వాటిని ఎక్కువ సేపు మగనివ్వాల్సిన అవసరం ఉండదు.

ముంగోడీ ఔర్ టమోటర్ కా సాలన్

ముంగోడీలకు కావాల్సిన పదార్థాలు

పెసరపిండి- 100 గ్రాములు, శనగపిండి- నాలుగు టీ స్పూనులు, నూనె- తగినంత, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

సాలన్‌కు కావాల్సిన పదార్థాలు

తరిగిన టమోటా ముక్కలు- అర కిలో, పెసర పప్పు పకోడీలు- 150 గ్రాములు, తరిగిన ఉల్లిపాయ- ఒకటి, అల్లం వెల్లులి పేస్ట్- ఒక టేబుల్ స్పూను, కారం- అర టీస్పూను, పసుపు- అర స్పూను, తరిగిన కొత్తిమీర- అరకప్పు, నూనె- అర కప్పు, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

- ముందుగా ఒక గిన్నెలో పెసరపిండి, శనగపిండిలను నీళ్లతో కొద్దిగా గట్టిగా కలపాలి. దానిలో తగినంత ఉప్పు వేయాలి.
- ఒక మూకుడులో నూనెను వేసి- పెసర పిండి మిశ్రమాన్ని పకోడీల మాదిరిగా వేసి వేయించాలి. ఇలా వేగిన పకోడీలను ఒక ప్లేటులో పెట్టి చల్లార్చాలి.
- అదే మూకుడులో మరి కొంత నూనె వేసి, ఉల్లిపాయ ముక్కలను బాగా వేయించాలి. ఆ తర్వాత దానిలో అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి వేయించాలి.
- ఆ తర్వాత కారం, పసుపు, ఒక పావు కప్పు తరిగిన కొత్తిమీర, ఉప్పు వేసి మూత పెట్టి ఉడకనివ్వాలి. ఆ తర్వాత టమోటా ముక్కలను వేయాలి. తగనన్ని నీళ్లు పోయాలి. ఈ మిశ్రమం బాగా ఉడికి- నూనె పైకి తేరుతున్న సమయంలో మూంగోడీలను వేసి మరి కొంత సేపు ఉడకనివ్వాలి.

జాగ్రత్తలు

- మూంగోడీలు లేకపోతే సోయా ముక్కలను కూడా వాడవచ్చు.
- మూంగోడీల తయారీలో శనగ పిండికి బదులుగా బియ్యపు పిండి కూడా వాడవచ్చు.
- దేశీ టమోటాలను వాడితే ఎక్కువ రుచిగా ఉంటుంది.
- దీనిని చపాతీలలో కానీ వేడి అన్నంలో కానీ తింటే బావుంటుంది.



మేకప్ చెక్కుచెదరకుండా..



కష్టపడి వేసుకున్న మేకప్ చిటికెలో చెదిరిపోతే, శ్రమంతా వృథా అవుతుంది. అలా కాకుండా ఎక్కువ సమయం పాటు చెక్కుచెదరకుండా ఉండాలంటే, ఈ చిట్కాలు పాటించాలి.

సెట్టింగ్ పౌడర్ ఇలా...

మేకప్ పూర్తయిన తర్వాత, దాన్ని సెట్ చేసుకోవడం అవసరం. అందుకోసం మేకప్ సెట్టింగ్ స్ప్రేలు, పౌడర్లు ఉన్నాయి. మేకప్‌లో తడి, పొడి ఉత్పత్తులను కలిపితే, అవి రెండూ జత కట్టి, ఎక్కువకాలం చెక్కుచెదరకుండా ఉంటాయి. మేకప్‌లో లిక్విడ్ ఫౌండేషన్, కన్‌సీలర్.. ఈ రెండూ తడి ఉత్పత్తులు. సెట్టింగ్ పౌడర్ పౌడర్ రూపంలో ఉంటుంది. కాబట్టి దీన్ని ఉపయోగించేటప్పుడు, ఎలాంటి భయం లేకుండా తడి ఉత్పత్తులను వాడుకోవచ్చు. ముఖం మీద జిడ్డుగా మారే వీలున్న ప్రదేశాలైన నుదురు, చుబుకం, ముక్కు మీద సెట్టింగ్ పౌడర్ అప్లై చేసుకోవాలి. నిజానికి మేకప్ వేసుకున్న ప్రదేశమంతా సెట్టింగ్ పౌడర్ అప్లై చేసుకోవచ్చు. కానీ చమట, చర్మపు నూనెలతో మేకప్ తేలికగా చెదిరిపోయే వీలున్న ప్రాంతాల మీద ప్రధానంగా దృష్టి పెట్టాలి.

సెట్టింగ్ స్ప్రే ఇలా...

ఫౌండేషన్, కన్‌సీలర్, బ్లష్ ముఖానికి అప్లై చేసుకున్న ఉత్పత్తులన్నీ చెక్కుచెదరకుండా ఉండడం కోసం సెట్టింగ్ స్ప్రేను వాడుకోవచ్చు. చక్కని బేస్ మేకప్‌లో భాగంగా ప్రైమర్‌కు బదులుగా సెట్టింగ్ స్ప్రే ముఖం మీద స్ప్రే చేసుకోవచ్చు. అందుకోసం ముఖానికి మొదట మాయిశ్చరైజర్ అద్దుకుని, సన్‌స్క్రీన్ అప్లై చేసుకుని, ముఖానికి 6 అంగుళాల దూరం నుంచి సెట్టింగ్ స్ప్రేను స్ప్రే చేసుకోవాలి. ఐ షాడో అద్దుకున్న కొద్ది సేపటికే ముడతలు తలెత్తుతుంటే, ఐ షాడో వేసుకున్న తర్వాత సెట్టింగ్ స్ప్రేను వాడుకోకుండా, ఐషాడోలో సెట్టింగ్ స్ప్రే కలుపుకుని, అప్లై చేయడం అలవాటు చేసుకోవాలి. ఇందు కోసం బ్రష్‌తో ఐషాడోను తీసుకుని, దాని మీద నాలుగైదు సార్లు సెట్టింగ్ స్ప్రేను స్ప్రే చేసి, కనురెప్పల మీద అప్లై చేసుకోవాలి. తడి స్పాంజ్ మీద సెట్టింగ్ స్ప్రేను స్ప్రే చేసి, హైలైటర్‌లో అద్ది, బుగ్గలు, కనుబొమల పైన, ముక్కు మీద అద్దుకుంటే మేకప్ మెరుపు రెట్టింపవుతుంది.

వాళ్లు దోమలను ఆకర్షిస్తారు

దోమలు బాగా కుడుతున్నాయని కొందరిని అదే పనిగా ఫిర్యాదు చేయడం చూస్తూనే ఉంటాం. నిజంగానే దోమలు అలా కొందరినే పనిగట్టుకుని ఎక్కువగా కుడతాయా? అంటే నిజమేనని అంటున్నారు పరిశోధకులు. దీనికి కారణం వాళ్ల శరీరం నుంచి వచ్చే ఒకరకమైన వాసనే అని అంటున్నారు. ఆ వాసనకు దోమలు ఆకర్షితమవుతాయట. అంటే వాళ్లకు తెలియకుండానే దోమలను ఆకర్షిస్తుంటారు. శరీరం నుంచి వచ్చే చెమటలో ఉండే రకరకాల కెమికల్స్ కీటకాలను ఆకర్షిస్తున్నట్టు పరిశోధకులు గుర్తించారు. దోమలు దాదాపు 60 అడుగుల దూరం నుంచే వాసనలు పసిగడతాయి. అలాగే రాత్రి 10 నుంచి ఉదయం 2 గంటల మధ్య దోమలు ఎక్కువ యాక్టివ్‌గా ఉంటున్నట్టు వీరి అధ్యయనంలో తేలింది. ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలతో దోమల కదలికలను ట్రాక్ చేసి మరీ ఈ విషయాలను వెల్లడించారు. దోమలు కార్బాక్సిలిక్ యాసిడ్, బ్యుటిరిక్ యాసిడ్‌లకు ఎక్కువ ఆకర్షితమవుతాయి. ఈ కార్బాక్సిలిక్ యాసిడ్‌ను మనిషి చర్మంపైన బ్యాక్టీరియా ఉత్పత్తి చేస్తుంది. ఆ వాసనకు ఆకర్షితమయ్యే దోమలు వచ్చేస్తాయి. ప్రాణాంతకమైన మలేరియా దోమలు కుట్టడం వల్ల వస్తుందన్న సంగతి తెలిసిందే. ప్లాస్మోడియం అనే పరాన్నజీవి మనిషి రక్తంలో చేరినప్పుడు మలేరియా వస్తుంది. మలేరియా సోకిన వ్యక్తిని దోమ కుట్టినప్పుడు రక్తంతో పాటు ఆ పరాన్నజీవి దోమలోకి చేరుతుంది. దోమ పొట్టలో ఈ పరాన్నజీవి వృద్ధి చెందుతుంది. మరో మనిషిని కుట్టినప్పుడు అతనికి వ్యాపింపజేస్తుంది. ఇలా మలేరియా విస్తరిస్తూ పోతుంది. మలేరియా వల్ల ప్రపంచవ్యాప్తంగా ఏటా 6 లక్షల మంది చనిపోతున్నారు. ఇందులో ఐదేళ్లలోపు పిల్లల సంఖ్యే ఎక్కువ.



84,500 పైకి సెన్సెక్స్



సూచీ 1,360 పాయింట్లు అప్.. 25,800 స్థాయికి నిఫ్టీ

సరికొత్త రికార్డు గరిష్ఠాలకు స్టాక్ మార్కెట్ సూచీల పరుగు ● రూ.6.24 లక్షల కోట్ల సంపద వృద్ధి

ముంబై: భారత స్టాక్ మార్కెట్ సూచీలు వారాంతం ట్రేడింగ్‌లో సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్ తొలిసారిగా 84,000 మైలురాయిని దాటగా.. నిఫ్టీ 25,500 ఎగువకు చేరుకుంది. ఫెడ్ రేటు 0.50 శాతం తగ్గిన నేపథ్యంలో అమెరికా, ఆసియా మార్కెట్లతో పాటు దేశీయ సూచీలూ ఉవ్వెత్తున ఎగిశాయి. వడ్డీ ప్రభావిత రంగాలైన బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, రియల్టీ, ఆటో, క్యాపిటల్ గూడ్స్ షేర్లలో మదుపరులు జోరుగా కొనుగోళ్లు జరిపారు. చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లకూ డిమాండ్ పెరగడం, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు కూడా మార్కెట్ ర్యాలీకి దోహదపడ్డాయి. దాంతో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్క రోజులో రూ.6.24 లక్షల కోట్లు పెరిగి మొత్తం రూ.471.72 లక్షల కోట్లకు (5.65 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.

- సెన్సెక్స్ ఒక దశలో 1,509.66 పాయింట్లు (1.81 శాతం) ఎగబాకి 84,694.46 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 1,359.51 పాయింట్లు (1.63 శాతం) లాభంతో 84,544.31 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు కూడా.
- నిఫ్టీ సైతం ఒక దశలో 433.45 పాయింట్లు (1.70 శాతం) వృద్ధితో 25,849.25 వద్ద సరికొత్త ఇంట్రాడే రికార్డును, చివరికి 375.15 పాయింట్లు (1.48 శాతం) పెరుగుదలతో 25,790.95 వద్ద ఆల్‌టైం గరిష్ఠ ముగింపును నమోదు చేసింది.
- సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 26 లాభపడ్డాయి. ఎం అండ్ ఎం షేరు 5.57 శాతం రాణించి సూచీ టాప్ గెయినర్‌గా అవతరించింది. బీఎస్ఈలో మొత్తం 4,059 కంపెనీల షేర్లు ట్రేడవగా.. 2,383 లాభపడ్డాయి. ఐసీఐసీఐ బ్యాంక్, ఎయిర్‌టెల్, హెచ్‌యూఎల్, బజాజ్ ఫిన్‌సర్వ్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సహా 265 కంపెనీల షేర్లు సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని నమోదు చేశాయి.

హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ రూ.2,500 కోట్ల ఐపీఓ: తన అనుబంధ విభాగమైన హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఐపీఓ ద్వారా షేర్లను స్టాక్ మార్కెట్లో నమోదు చేసేందుకు బోర్డు ఆమోదం తెలిపిందని ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ శుక్రవారం వెల్లడించింది. ఐపీఓలో భాగంగా హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ రూ.2,500 కోట్ల విలువైన తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత, అర్హులైన వాటాదారులకు చెందిన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించేందుకు సైతం బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తెలిపింది. హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో హెచ్‌డీఎఫ్ బ్యాంక్ 94.64 శాతం వాటా కలిగి ఉంది.

- రాజస్థాన్‌కు చెందిన కేఆర్ఎన్ హీట్ ఎక్స్ఛేంజర్ అండ్ రిఫ్రిజిరేషన్ కంపెనీ రూ.342 కోట్ల ఐపీఓ ఈనెల 25న ప్రారంభమై 27న ముగియనుంది. ఐపీఓ ధరల శ్రేణిని కంపెనీ రూ.209-220గా నిర్ణయించింది.

ఐపీఓల బిజీ

14 ఏళ్లలో అత్యంత సందడి మాసమిదే: ఆర్‌బీఐ

ఈ నెలలో ప్రైమరీ మార్కెట్ వరుస పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)లతో కోలాహలంగా మారింది. ప్రధాన ప్లాట్‌ఫామ్స్‌తో పాటు ఎస్ఎంఈ విభాగంలో లిస్ట్ కానున్న కంపెనీల ఐపీఓలకు గడిచిన 14 ఏళ్లలో అత్యంత సందడి (బిజీ) మాసమిదేనని శుక్రవారం విడుదల చేసిన బులెటిన్‌లో ఆర్‌బీఐ వెల్లడించింది. ఇప్పటికే 28 కంపెనీలు ఐపీఓకు వచ్చాయి. వచ్చే వారంలో మరిన్ని రాబోతున్నాయి. ప్రైమరీ మార్కెట్లో ఐపీఓల ద్వారా సమీకరణ ఈ ఏడాదిలో సమృద్ధిగా ఉందని, 2024 ప్రథమార్ధానికి ప్రపంచవ్యాప్త ఐపీఓల్లో అత్యధికం (27 శాతం) భారత్‌లోనే నమోదైనట్లు ఆర్‌బీఐ తెలిపింది. అందులో ఎస్ఎంఈ ఐపీఓలే అధికమని పేర్కొంది. ఐపీఓల ద్వారా సమీకరించిన నిధుల విలువలో మాత్రం భారత్ వాటా 9 శాతంగా ఉంది. దేశీయ ఆర్థిక సేవల మార్కెట్ గణనీయ మార్పులకు లోనవుతున్నదని, గడిచిన కొద్దికాలంలో ఎస్ఎంఈ ఐపీఓలపైనా ఇన్వెస్టర్ల ఆసక్తి పెరిగిందని ఆర్‌బీఐ నివేదిక పేర్కొంది.

ఎస్ఎంఈ ఐపీఓల్లో పెట్టుబడులు పెట్టేందుకు మ్యూచువల్ ఫండ్లు సైతం ఎగబడుతుండటంతో ఇష్యూ సైజుకు పదులు, వందల రెట్లలో సబ్‌స్క్రిప్షన్ లభిస్తోందని రిపోర్టులో ప్రస్తావించింది. కాగా, క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) ద్వారా లిస్టెడ్ కంపెనీల నిధుల సమీకరణ కూడా గణనీయంగా పెరిగిందని, ఈ ఏడాది ఆగస్టు నాటికి రూ.60,000 కోట్లకు చేరుకుని ఉండవచ్చని ఆర్‌బీఐ పేర్కొంది.

హైదరాబాద్‌లో 'మేబాక్' ప్రత్యేక లాంజ్

- ఈక్యూఎస్ సిరీస్‌లో మరో ఈవీ
- మెర్సిడెస్ బెంజ్ ఎండీ సంతోష్ అయ్యర్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జర్మనీ లగ్జరీ కార్ల సంస్థ మెర్సిడెస్ బెంజ్.. హైదరాబాద్‌పై ప్రత్యేక దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా శనివారం తన మేబాక్ సిరీస్ కార్ల కోసం హైదరాబాద్‌లో ప్రత్యేక లాంజ్ ప్రారంభిస్తోంది. మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ ఈ విషయం వెల్లడించారు. తాజాగా భారత మార్కెట్లో విడుదల చేసిన తమ లేటెస్ట్ ఎలక్ట్రిక్ వెర్షన్ (ఈవీ) మేబాక్ ఈక్యూఎస్ 680 ఎస్‌యూవీకి హైదరాబాద్ నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. రూ.2.25 కోట్ల ఎక్స్‌షోరూమ్ ధర ఉండే ఈ ఈవీని కంపెనీ అమెరికా తర్వాత భారత్‌లో మాత్రమే అసెంబుల్ చేస్తోంది. తమ విద్యుత్ వాహనాలు ఏవైనా ఒకసారి చార్జి చేస్తే 600 నుంచి 700 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చని అయ్యర్ చెప్పారు.

బ్యాటరీపై పదేళ్ల హామీ: తమ ఈవీల్లో ఉపయోగించే బ్యాటరీలకు పదేళ్ల హామీ ఉంటుందని సంతోష్ అయ్యర్ తెలిపారు. పన్నులు, ప్రభుత్వ సబ్సిడీలు ఈవీల ధరల నిర్ణయంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. పుణెలోని ప్లాంట్‌పై మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఇప్పటి వరకు రూ.3,000 కోట్లు పెట్టుబడి పెట్టింది. ఈ సంవత్సరం మరో రూ.200 కోట్లు పెట్టుబడి పెడుతున్నట్లు వెల్లడించారు.

తెలంగాణ, ఏపీల్లో గోద్రెజ్ ఇంటీరియో విస్తరణ

కొత్తగా 25 షోరూమ్స్, 150 రిటైల్ ఔట్‌లెట్స్ ఏర్పాటు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కార్యకలాపాలను మరింతగా విస్తరించేందుకు గోద్రెజ్ ఎంటర్‌ప్రైజెస్ గ్రూప్‌నకు చెందిన హోం, ఆఫీస్ ఫర్నీచర్ సంస్థ గోద్రెజ్ ఇంటీరియో రెడీ అవుతోంది. విస్తరణలో భాగంగా వచ్చే మూడేళ్లలో కొత్త 25 షోరూమ్స్ 150 రిటైల్ ఔట్‌లెట్స్‌ను ప్రారంభించనున్నట్లు గోద్రెజ్ ఇంటీరియో సీనియర్ వైస్ ప్రెసిడెంట్, కన్స్యూమర్ బిజినెస్ హెడ్ (బీ2సీ) దేవ్ సర్కార్ వెల్లడించారు. కొత్తగా నెలకొల్పనున్న షోరూమ్స్‌లో 20 తెలంగాణలో, 5 ఏపీలో ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఒక్కో స్టోర్ ఏర్పాటుకు రూ.60 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకు పెట్టుబడి అవసరవుతుందని చెప్పారు. ప్రస్తుతం ఇంటీరియో తెలంగాణలో 15 షోరూమ్స్, 55 మంది డీలర్లు, 25 మంది రిటైలర్లతో కార్యకలాపాలు సాగిస్తోందన్నారు. 2027 నాటికి తెలుగు రాష్ట్రాల హోమ్ ఫర్నీచర్ మార్కెట్లో వాటాను 21 శాతం నుంచి 30 శాతానికి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సర్కార్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో హైదరాబాద్ నుంచి రూ.100 కోట్ల రెవెన్యూను, కిచెన్ వ్యాపారం ద్వారా రూ.12 కోట్ల వరకు ఆదాయాన్ని అంచనా వేస్తున్నట్లు సర్కార్ చెప్పారు.

మరో విడత 'వివాద్ సే విశ్వాస్'

న్యూఢిల్లీ: ప్రత్యక్ష పన్ను వివాదాల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం మరోసారి 'వివాద్ సే విశ్వాస్' పథకం ప్రవేశ పెడుతోంది. వివాద్ సే విశ్వాస్ 2.0 పేరుతో వచ్చే నెల 1వ తేదీ నుంచి ఈ స్కీమ్ ప్రారంభం కానుంది. ఈ ఏడాది జూలై 22వ తేదీ నాటికి పెండింగ్‌లో ఉన్న ప్రత్యక్ష పన్నుల వివాదాలను ఈ స్కీమ్ ద్వారా పరిష్కరించుకోవచ్చు. 2020లో ప్రవేశపెట్టిన వివాద్ సే విశ్వాస్ 1.0 స్కీమ్ ద్వారా దాదాపు రూ.75,000 కోట్ల ప్రత్యక్ష పన్ను వివాదాలు పరిష్కారం కావడంతో ప్రభుత్వం మరోసారి ఈ స్కీమ్‌ను తీసుకొస్తోంది. వివాద్ సే విశ్వాస్ 1.0 ద్వారా 1.2 లక్షల ప్రత్యక్ష పన్నుల వివాదాలు పూర్తయినా, ఇంకా రూ.35 లక్షల కోట్ల మొత్తానికి సంబంధించి 2.7 కోట్ల పన్ను వివాదాలు పెండింగ్‌లో ఉన్నాయి. వివాద్ సే విశ్వాస్ 2.0 ద్వారా ఇందులో కొన్నిటినైనా పరిష్కరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఇక ఎలక్ట్రానిక్ విధానంలోనే డివిడెండ్, వడ్డీ చెల్లింపులు!

సెబీ కొత్త ప్రతిపాదన

న్యూఢిల్లీ: లిస్టెడ్ కంపెనీలు తమ సెక్యూరిటీ హోల్డర్లకు ఇకపై డివిడెండ్లు, వడ్డీతో పాటు అన్ని రకాల చెల్లింపులను కేవలం ఎలక్ట్రానిక్ విధానంలోనే నెరిపేందుకు అనుమతించాలని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ ప్రతిపాదించింది. చెల్లింపులను క్రమబద్ధీకరించడంతో పాటు ఇన్వెస్టర్ల సొమ్ముకు భద్రత, సౌకర్యం పెంచే ఉద్దేశంతో సెబీ ఈ ప్రతిపాదన చేసింది. ఇందుకు సంబంధించిన చర్చా పత్రాన్ని శుక్రవారం విడుదల చేసిన నియంత్రణ మండలి.. అక్టోబరు 11లో సలహాలు, సూచనలు పంపాలని ప్రజలను కోరింది. ప్రస్తుత లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్క్లోజర్ రిక్వైర్‌మెంట్ (ఎల్ఓడీఆర్) నిబంధనలు కూడా ఎలక్ట్రానిక్ చెల్లింపులను అనుమతిస్తాయి. కానీ, ఎలక్ట్రానిక్ విధానంలో బదిలీ చేయలేని పక్షంలో రూ.1,500 పైగా సొమ్మును చెక్కు లేదా వారంట్ రూపంలో జారీ చేసేందుకూ వీలుంటుంది. సాధారణంగా సెక్యూరిటీ హోల్డర్ బ్యాంక్ ఖాతా వివరాలు అందుబాటులో లేకపోవడం లేదా తప్పులుంటే ఎలక్ట్రానిక్ విధానంలో బదిలీ విఫలమతుంది. సెబీ తాజా డేటా ప్రకారం.. టాప్ 200 లిస్టెడ్ కంపెనీలకు చెందిన 1.29 శాతం ఎలక్ట్రానిక్ డివిడెండ్ చెల్లింపులు ఫెయిలవుతున్నాయి. కాబట్టి, ఇన్వెస్టర్లు తమ బ్యాంక్ ఖాతా వివరాలను డిపాజిటరీల వద్ద అప్‌డేట్ చేసుకోవాలని సెబీ సూచించింది.

ఎంఎఫ్‌లు సీడీఎస్‌లు విక్రయించేందుకూ అనుమతి

క్రెడిట్ డీఫాల్ట్ స్వాప్‌ల(సీడీఎస్) కొనుగోళ్లతో పాటు విక్రయాలు జరిపేందుకూ మ్యూచువల్ ఫండ్ల (ఎంఎఫ్)కు సెబీ అనుమతిచ్చింది. కార్పొరేట్ బాండ్ మార్కెట్లో ద్రవ్య లభ్యతను పెంచే ఉద్దేశంతో క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి ఈ నిర్ణయ తీసుకుంది. ఈ వెసులుబాటు ఎంఎఫ్‌లకు అదనపు పెట్టుబడి సాధనంగా ఉపయోగపడనుందని శుక్రవారం జారీ చేసిన సర్క్యులర్‌లో సెబీ పేర్కొంది. ఇప్పటివరకు కార్పొరేట్ బాండ్ల క్రెడిట్ రిస్క్‌కు రక్షణగా సీడీఎస్‌ల కొనుగోలుకు మాత్రమే ఫండ్లకు అనుమతి ఉండేది. సెబీ తాజా నిర్ణయంతో సీడీఎస్‌ల కొనుగోలు, విక్రయాలతో ఫండ్లకు కార్పొరేట్ బాండ్లపై క్రెడిట్ రిస్క్ నిర్వహణకు మరింత వెసులుబాటు లభించనుంది. రుణగ్రహీత (బాండ్ల జారీ ద్వారా నిధులు సమీకరించిన కార్పొరేట్ కంపెనీ) దివాలా నుంచి రక్షణ కల్పించే బీమా కాంట్రాక్టే సీడీఎస్.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	75,110 ▲	68,850 ▲	97,500 ▲
ముంబై	74,093 ▲	67,869 ▲	88,917 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

21వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	550
వరంగల్	517	గోదావరి	545
చిత్తూరు	553	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	105	విజయవాడ	113
వరంగల్	105	గుంటూరు	116
కరీంనగర్	105	ఒంగోలు	116
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	110
కర్నూలు	105	నెల్లూరు	110
విశాఖపట్నం	103	అనంతపురం	110
గోదావరి	113		

స్పోర్ట్స్

బంగ్లా ఢమాల్

తొలి ఇన్నింగ్స్ 149 ఆలౌట్

చెలరేగిన పేసర్లు

- బుమ్రాకు నాలుగు వికెట్లు
- భారత్ తొలి ఇన్నింగ్స్ 376
- రెండో ఇన్నింగ్స్ 81/3
- ప్రస్తుత ఆధిక్యం 308



చెన్నై: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో భారత్ తొలి రోజు బ్యాట్ పవర్ చూపగా.. రెండో రోజు తమ బంతి పదునేంటో రుచి చూపించింది. దీంతో శుక్రవారమే మ్యాచ్‌పై పట్టు బిగించింది. ప్రస్తుతం రోహిత్ సేన 308 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. స్టార్ పేసర్ బుమ్రా (4/50) పేస్ ధాటికి పర్యాటక జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 47.1 ఓవర్లలో కేవలం 149 పరుగులకే కుప్పకూలింది. బుమ్రాకు జతగా ఆకాశ్‌దీప్ (2/19), సిరాజ్ (2/30), జడేజా (2/19) ప్రత్యర్థిని కట్టడి చేశారు. షకీబ్ (32), మెహిదీ హసన్ (29), లిట్టన్ దాస్ (22), కెప్టెన్ షంటో (20) మాత్రమే ఓ మాదిరిగా ఆడారు. అయితే 227 పరుగులు వెనుకబడిన బంగ్లాదేశ్‌ను ఫాలోఆన్ ఆడించకుండా భారత్ రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగి 81/3 స్కోరుతో కొనసాగుతోంది. కెప్టెన్ రోహిత్ (5), విరాట్ (17) మరోసారి నిరాశపర్చగా.. క్రీజులో గిల్ (33 బ్యాటిం గ్), పంత్ (12 బ్యాటింగ్) ఉన్నారు. ఈ ఒక్క రోజే 17 వికెట్లు నేలకూలడం విశేషం. అంతకుముందు 339/6 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు ఆరంభించిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 376 పరుగుల వద్ద ఆలౌటైంది. తొలి సెషన్ ఆరంభంలోనే రెండో కొత్త బంతి తీసుకున్న బంగ్లా బౌలర్లు మిగిలిన 4 వికెట్లను వేగంగా పడగొట్టారు. ఇందులో మూడింటిని టస్కిన్ తీయగా.. హసన్ వరుసగా రెండోసారి ఐదు వికెట్ల ఫీట్‌ను పూర్తి చేశాడు. ముందుగా జడేజా 86 రన్స్ వద్దే టస్కిన్‌కు చిక్కడంతో ఏడో వికెట్‌కు అశ్విన్‌తో 199 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత టెయిలెండర్లు ఇలా వచ్చి అలా వెళ్లగా అశ్విన్ (113) తొమ్మిదో వికెట్‌గా వెనుదిరిగాడు.

ఒకటిన్నర సెషన్‌లోనే..: రెండో రోజు భారత్‌ను త్వరగానే ఆలౌట్ చేశామనే సంతోషంతో బంగ్లా తొలి ఇన్నింగ్స్ ఆరంభించింది. అయితే భారత పేసర్ల ధాటికి వారి బ్యాటింగ్ ఆర్డర్ కకావికలమైంది. బుమ్రాకు తోడు సిరాజ్-ఆకాశ్‌దీప్ చెలరేగడంతో బంగ్లా ఆట ఒకటిన్నర సెషన్‌లోనే ముగిసింది. స్పిన్నర్ జడేజా కీలక వికెట్లతో ఆకట్టుకున్నాడు. ముందుగా కళ్లు చెదిరే ఇన్‌స్వింగర్‌తో ఓపెనర్ షాద్‌మన్ ఇస్లాం (2)ను బుమ్రా బౌల్డ్ చేశాడు. అనంతరం వరుస ఓవర్లలో జకీర్ (3), మోమినుల్ (0)లను ఆకాశ్ పెవిలియన్‌కు చేర్చాడు. కెప్టెన్ షంటో కాసేపు క్రీజులో నిలిచినా సిరాజ్ ఓవర్‌లో కోహ్లీకి క్యాచ్ ఇచ్చాడు. 40/5 స్కోరుతో బంగ్లా పరిస్థితి దయనీయంగా మారిన వేళ షకీబ్-లిట్టన్ ఆదుకున్నారు. వీరు ప్రమాదకరంగా మారుతున్న వేళ జడ్డూ వరుస ఓవర్లలో ఈ ఇద్దరినీ పెవిలియన్‌కు చేర్చడంతో బంగ్లా మరిక కోలుకోలేకపోయింది. టెయిలెండర్లను బుమ్రా చకచకా అవుట్ చేశాడు.

1 చెపాక్‌లో జరిగిన టెస్టుల్లో ఒకే రోజు 17 వికెట్లు పడడం ఇదే తొలిసారి.

2 స్వదేశంలో జరిగిన మూడు ఫార్మాట్లలో కలిపి 12 వేల పరుగులు పూర్తి చేసిన రెండో భారత బ్యాటర్‌గా విరాట్. సచిన్ (14,192) తొలి స్థానంలో ఉన్నాడు.

4 తొలి 10 టెస్టుల్లో ఎక్కువ పరుగులు (1094) సాధించిన నాలుగో బ్యాటర్‌గా జైస్వాల్. డాన్ బ్రాడ్‌మన్ (1446) టాప్‌లో ఉన్నాడు.

5 అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్ తరఫున వేగంగా 400 వికెట్లు పూర్తి చేసిన ఐదో బౌలర్‌గా బుమ్రా. ఓవరాల్‌గా టీమిండియా తరఫున పదో స్థానంలో ఉండగా కుంబ్లే (953) టాప్‌లో ఉన్నాడు.


ఫాలోఆన్ ఎందుకు ఆడించలేదంటే..

బంగ్లాదేశ్ ఆలౌట్ అయ్యే సమయానికి 227 పరుగులు వెనుకంజలో ఉండడంతో భారత్ కచ్చితంగా ఆ జట్టును ఫాలో ఆన్ ఆడిస్తుందని భావించారు. కానీ రోహిత్ సేన మాత్రం రెండో ఇన్నింగ్స్ ఆడేందుకే మొగ్గు చూపింది. ఎందుకంటే..ప్రస్తుతం చెన్నైలో అధిక వేడితో పాటు తేమ ఎక్కువగా ఉంది. దీంతో వరుసగా తమ బౌలర్లను మరోసారి బౌలింగ్‌కు దింపకుండా విశ్రాంతినివ్వాలని భావించింది. దీంతో బంగ్లా బౌలర్లు మాత్రం ఒకే రోజు రెండుసార్లు బౌలింగ్‌కు దిగాల్సి వచ్చింది. అంతేకాకుండా వేగంగా పరుగులు సాధించి బంగ్లా ముందు మరింత భారీ లక్ష్యం ఉంచి ఒత్తిడిలోకి నెట్టాలన్న ఆలోచనతోనూ టీమిండియా బ్యాటింగ్‌కు దిగింది.

వాట్.. విరాట్?

తొలి ఇన్నింగ్స్‌లో ఆరు పరుగులే చేసిన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ రెండో ఇన్నింగ్స్‌లో 37 బంతుల్లో 17 పరుగులతో కాస్త కుదురుకున్నట్టే కనిపించాడు. కానీ అంపైర్ తప్పిదంతో తను ఎల్బీగా వెనుదిరగాల్సి వచ్చింది. అయితే విరాట్ మాత్రం ఈ అవుట్‌పై డీఆర్ఎస్‌కు వెళ్లకపోవడం ఆశ్చర్యపరిచింది. ఎందుకంటే రీప్లేలో బంతి ప్యాడ్‌కన్నా ముందే స్పష్టంగా బ్యాట్‌ను తాకుతున్నట్టు తేలింది. విరాట్ నాన్‌స్ట్రయిక్ ఎండ్‌లో ఉన్న గిల్ అభిప్రాయాన్ని తీసుకుని పెవిలియన్‌కు వెళ్లిపోయాడు. రీప్లేలో దీన్ని తిలకించిన కెప్టెన్ రోహిత్ కూడా 'అరె.. అతడికేమైంది' అన్నట్టుగా పక్కనున్న వారితో అసంతృప్తి వ్యక్తం చేశాడు.

షకీబ్ నోట్లో హెల్మెట్ స్ట్రాప్



షకీబ్ అల్ హసన్.. బ్యాటింగ్ సమయంలో తన హెల్మెట్ స్ట్రాప్‌ను నోట్లో పెట్టుకోవడం కాస్త వింతగా కనిపించింది. అయితే దీని వెనుక కారణాన్ని మాజీ కీపర్ దినేశ్ కార్తీక్ వెల్లడించాడు. బంతిని ఎదుర్కొనేటప్పుడు అతడి తల లెగ్ సైడ్‌కు వాలిపోకుండా.. నిటారుగా ఉంచేందుకే అలా చేస్తాడని తెలిపాడు. ఓసారి తమీమ్ ఇక్బాల్ ఈ విషయాన్ని డీకేకు చెప్పాడట. అలాగే స్పిన్నర్లను ఎదుర్కొనేటప్పుడు తల వాలిపోకుండా మెడ చుట్టూ క్లాత్‌ను చుట్టుకోవాలని తమ కోచ్ సూచించినట్టు ఓపెనర్ షాద్‌మన్ ఇస్లాం కూడా గతంలో చెప్పాడు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) షాద్‌మన్ (బి) నహీద్ 56; రోహిత్ (సి) షంటో (బి) హసన్ 6; గిల్ (సి) లిట్టన్ (బి) హసన్ 0; విరాట్ (సి) లిట్టన్ (బి) హసన్ 6; పంత్ (సి) లిట్టన్ (బి) హసన్ 39; రాహుల్ (సి) జకీర్ (బి) మెహిదీ హసన్ 16; జడేజా (సి) లిట్టన్ దాస్ (బి) టస్కిన్ 86; అశ్విన్ (సి) షంటో (బి) టస్కిన్ 113; ఆకాశ్‌దీప్ (సి) షంటో (బి) టస్కిన్ 17; బుమ్రా (సి) జకీర్ హసన్ (బి) హసన్ 7; సిరాజ్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 30; మొత్తం: 91.2 ఓవర్లలో 376 ఆలౌట్.** వికెట్ల పతనం: 1-14, 2-28, 3-34, 4-96, 5-144, 6-144, 7-343, 8-367, 9-374, 10-376. **బౌలింగ్:** టస్కిన్ 21-4-55-3; హసన్ మహమూద్ 22.2-4-83-5; నహీద్ 18-2-82-1; మెహిదీ హసన్ 21-2-77-1; షకీబ్ 8-0-50-0; మోమినుల్ హక్ 1-0-4-0.

బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: షాద్‌మన్ (బి) బుమ్రా 2; జకీర్ హసన్ (బి) ఆకాశ్ దీప్ 3; షంటో (సి) విరాట్ (బి) సిరాజ్ 20; మోమినుల్ (బి) ఆకాశ్‌దీప్ 0; ముష్ఫికర్ (సి) రాహుల్ (బి) బుమ్రా 8; షకీబ్ (సి) పంత్ (బి) జడేజా 32; లిట్టన్ (సి సబ్) జురెల్ (బి) జడేజా 22; మెహిదీ హసన్ (నాటౌట్) 27; హసన్ (సి) విరాట్ (బి) బుమ్రా 9; టస్కిన్ (బి) బుమ్రా 11; నహీద్ రాణా (బి) సిరాజ్ 11; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 47.1 ఓవర్లలో 149 ఆలౌట్.** వికెట్ల పతనం: 1-2, 2-22, 3-22, 4-36, 5-40, 6-91, 7-92, 8-112, 9-130, 10-149. **బౌలింగ్:** బుమ్రా 11-1-50-4; సిరాజ్ 10.1-1-30-2; ఆకాశ్‌దీప్ 5-0-19-2; అశ్విన్ 13-4-29-0; జడేజా 8-2-19-2.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) లిట్టన్ (బి) నహీద్ 10; రోహిత్ (సి) జకీర్ (బి) టస్కిన్ 5; గిల్ (బ్యాటింగ్) 33; విరాట్ (ఎల్బీ) మెహిదీ హసన్ 17; పంత్ (బ్యాటింగ్) 12; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 23 ఓవర్లలో 81/3.** వికెట్ల పతనం: 1-15, 2-28, 3-67. **బౌలింగ్:** టస్కిన్ 3-0-17-1; హసన్ 5-1-12-0; నహీద్ 3-0-12-1; షకీబ్ 6-0-20-0; మెహిదీ హసన్ 6-0-16-1.



'సాయ్' కేంద్రంలో క్రీడామంత్రి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): కేంద్ర క్రీడా మంత్రి మన్సుఖ్ మాండవ్య శుక్రవారం హైదరాబాద్ గచ్చిబౌలి శాట్ క్రీడా సముదాయంలోని 'సాయ్' శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ కొద్దిసేపు పీవీ సింధుతో బ్యాడ్మింటన్ ఆడిన మాండవ్య ఆ తర్వాత పారాలింపిక్స్‌లో పతకం నెగ్గిన అథ్లెట్ జి.దీప్తిని సన్మానించారు. అనంతరం గోపీచంద్ అకాడమీకి వెళ్లిన మాండవ్య షట్లర్లు కశ్యప్, కిడాంబి శ్రీకాంత్, సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ షెట్టితో ముచ్చటించారు. ఈ సందర్భంగా స్టార్ షట్లర్లందరూ సంతకాలు చేసిన టీషర్ట్‌ను మంత్రికి వారు బహూకరించారు.

శ్రీలంక 237/4

గాలె: కరుణరత్నే (83), చాందిమల్ (61) రాణించడంతో న్యూజిలాండ్‌తో తొలిటెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో మూడోరోజు ఆఖరికి శ్రీలంక 237/4 స్కోరు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 255/4తో శుక్రవారం తొలిఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్ 340 రన్స్‌కు ఆలౌటైంది. లంక తొలి ఇన్నింగ్స్‌లో 305 రన్స్ చేసింది.

చెస్ ఒలింపియాడ్ ట్రోఫీ మాయం

చెన్నై: అఖిల భారత చెస్ సమాఖ్య (ఏఐసీఎఫ్) ఆఫీసులో ఉంచిన చెస్ ఒలింపియాడ్ గ్రప్రిన్‌దాష్విలి ట్రోఫీ మాయమైంది. దీనిపై తాము పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఏఐసీఎఫ్ అధికారులు వెల్లడించారు. తాజా ఎడిషన్‌కు ఆతిథ్యమిస్తున్న బుడాపెస్ట్ (హంగేరీ)కు ఈ ట్రోఫీని తీసుకురావాల్సిందిగా అంతర్జాతీయ చెస్ సమాఖ్య(ఫిడే) కోరడంతో.. ట్రోఫీ చోరీకి గురైందన్న విషయం వెలుగులో కొచ్చింది. వివరాల్లోకెళితే.. గత ఎడిషన్ ఒలింపియాడ్ రెండేళ్లక్రితం చెన్నైలో జరిగింది. అందులో ఉజ్బెకిస్థాన్ విజేతగా నిలవగా, భారత పురుషుల జట్టు కాంస్యం గెలిచింది. అయితే.. ఒలింపియాడ్ టోర్నీలో ఓపెన్, మహిళల విభాగాల్లో మెరుగైన ప్రదర్శన చేసిన జట్టుకు గ్రప్రిన్‌దాష్విలి ట్రోఫీని అందజేస్తారు. గత ఎడిషన్‌లో భారత జట్టు ఈ ట్రోఫీని గెలుచుకుంది. కాగా, రోలింగ్ ట్రోఫీని జట్టుకు ఇచ్చి.. అసలైన ట్రోఫీని నిర్వాహకుల దగ్గరే ఉంచుకుంటారు. ఆ అసలైన ట్రోఫీనే ఇప్పుడు చోరీకి గురైంది.

ఈశ్వరన్ శతకం

- ఇండియా 'బి' 210/6
- ఇండియా 'డి'తో దులీప్ ట్రోఫీ

అనంతపురం క్లాక్‌టవర్ (ఆంధ్రజ్యోతి): కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (116) టోర్నీలో రెండో శతకంతో చెలరేగడంతో ఇండియా 'డి'తో దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో ఇండియా 'బి' రెండోరోజు ఆఖరికి తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లకు 210 పరుగులు చేసింది. 100/5తో కష్టాల్లో పడగా.. సుందర్ (39 బ్యాటింగ్) జతగా ఆరో వికెట్‌కు ఈశ్వరన్ 105 పరుగులు జోడించి పరిస్థితి చక్కదిద్దాడు. అంతకుముందు ఓవర్‌నైట్ 306/5 స్కోరుతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇండియా 'డి' 349 రన్స్‌కు ఆలౌటైంది. కిందటి రోజు 89 పరుగులతో ఆడుతున్న సంజూ శాంసన్ సెంచరీ (106) పూర్తిచేశాడు. నవ్‌దీప్ సైనీ (5/74) ఐదు వికెట్లు పడగొట్టాడు.

ఇండియా 'సి' 216/7

అభిషేక్ పోరెల్ (82) సత్తా చాటడంతో ఇండియా 'ఎ'తో మరో మ్యాచ్‌లో ఇండియా 'సి' తొలి ఇన్నింగ్స్‌లో శుక్రవారం ఆట చివరకు 216/7 స్కోరు చేసింది. 41/4తో ఇబ్బందుల్లో పడిన వేళ బాబా ఇంద్రజీత్ (34 రిటైర్డ్ హర్ట్) జతగా ఐదో వికెట్‌కు 51 రన్స్ జత చేసిన పోరెల్ ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 224/7తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇండియా 'ఎ' 73 రన్స్ జోడించి మిగిలిన 3 వికెట్లు కోల్పోయింది. అవేశ్ ఖాన్ (51 నాటౌట్) హాఫ్ సెంచరీతో మెరిశాడు.

హెడ్ సూపర్ సెంచరీ

- లబుషేన్ ఆల్‌రౌండ్ షో ● ఇంగ్లండ్‌పై ఆసీస్ గెలుపు

నాటింగ్‌హామ్: ఇంగ్లండ్‌తో ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా గురువారం అర్ధరాత్రి జరిగిన తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఏడు వికెట్లతో గెలిచింది. టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్.. బెన్ డకెట్ (95), విల్ జాక్స్ (62) అర్ధ సెంచరీలతో రాణించడంతో 49.4 ఓవర్లలో 315 పరుగులకు ఆలౌటైంది. ఛేదనలో ఓపెనర్ ట్రావిస్ హెడ్ (154 నాటౌట్) శతకానికి తోడు లబుషేన్ (77 నాటౌట్) సత్తా చాటడంతో ఆసీస్ 44 ఓవర్లలో 317/3 స్కోరు చేసి గెలిచింది. హెడ్‌కిది కెరీర్‌లో అత్యుత్తమ వ్యక్తిగత స్కోరు. ఇక మార్కస్ లబుషేన్ ఈ మ్యాచ్‌లో అర్ధసెంచరీకి పైగా రన్స్ చేయడంతో పాటు 3 వికెట్లు పడగొట్టాడు. ఇంకా 4 క్యాచ్‌లు కూడా పట్టాడు. ఓ వన్డే మ్యాచ్‌లో ఇలాంటి ఘనత సాధించిన తొలి ఆటగాడిగా లబుషేన్ రికార్డులకెక్కాడు.

తొమ్మిదో రౌండ్ డ్రా

చెస్ ఒలింపియాడ్‌లో భారత్

బుడాపెస్ట్: చెస్ ఒలింపియాడ్ పురుషుల విభాగంలో రెండో సీడ్ భారత పురుషుల జట్టు ఓటమే లేకుండా దూసుకుపోతోంది. అయితే శుక్రవారంనాటి తొమ్మిదో రౌండ్‌ను విజయంతోకాక డ్రాతో సరిపెట్టుకుంది. 2-2 స్కోరుతో డిఫెండింగ్ చాంపియన్ ఉజ్బెకిస్థాన్ జట్టు మనోళ్లను నిలువరించింది. మరోవైపు భారత మహిళల జట్టు కూడా 2-2తో అమెరికాతో డ్రా చేసుకుంది. గుకేష్-అబ్దుసత్తోరోవ్, ప్రజ్ఞానంద-సిందరోవ్, విదిత్-వఖిదోవ్, అర్జున్-షంసిద్దిన్ వొఖిదోవ్ గేమ్‌లన్నీ ఫలితం తేలకుండా ముగిశాయి. అయితే, తొమ్మిదో రౌండ్ తర్వాతా 17 పాయింట్లతో పురుషుల జట్టు అగ్రస్థానంలోనే నిలిచింది. మహిళల్లో అమెరికాతో పోరులో..తోఖిర్‌జొనోవా చేతిలో వైశాలి ఓడగా, ఇరీనాపై వంతిక అగర్వాల్ గెలిచింది. ఇక, కరీసాతో దివ్య, లీ అలైస్‌తో తానియా గేమ్‌లను డ్రాగా ముగించారు. ఈ రౌండ్ తర్వాత మహిళల జట్టు 15 పాయింట్లతో కొనసాగుతోంది.



భక్తులను బాధిస్తోంది: రాహుల్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి లడ్డూ పసాదం కల్తీ అయినట్లు వస్తున్నట్లు వార్తలు కలవరపెడుతున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ 'ఎక్స్' వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా బాలాజీకి ఉన్న కోట్లాది మంది భక్తులను ఈ ఘటన బాధిస్తోందని, దీనిని క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని న్నారు. దేశవ్యాప్తంగా ఉన్న మతపరమైన ప్రదేశాల పవిత్రతను అధికారులు కాపాడాలని రాహుల్ విజ్ఞప్తి చేశారు.

వైసీపీ అక్రమాలకు పరాకాష్ట: మంత్రి పయ్యావుల

బెళుగుప్ప, సెప్టెంబరు 20: వైసీపీ ఐదేళ్ల పాలనలో అక్రమాలకు తిరుమల శ్రీవారి లడ్డూలో కల్తీ పరాకాష్ఠ అని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. తిరుమల ఆలయ పవిత్రతకు భంగం కలిగించేలా వైసీపీ ప్రభుత్వం వ్యవహరించిందని మండిపడ్డారు. జగన్ పాలనలో టీటీడీ నిబంధనలను ఏనాడూ పాటించలేదని పయ్యావుల ఆరోపించారు.

జగన్ పని అయిపోయింది.. వైసీపీ ఇక పైకి లేవదు

- లడ్డూ ప్రసాదంపై సీబీఐతో విచారణ చేయించాలి: షర్మిల



అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో రాజకీయంగా జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైసీపీ పైకి లేవదు. ఐదేళ్ల అధికారంతోనే జగన్ పని అయిపోయింది. ఇక అధికారంలోకి వచ్చే అవకాశమేలేదు' అని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. శుక్రవారం ఆమె విజయవాడలో మీడియాతో మాట్లాడారు. 'వైఎస్ ఐదేళ్ల పాలనలో ప్రజలకు మంచి చేసే ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకుంటే.. జగన్ ఐదేళ్ల పాలనలో ప్రజల్లో చెడ్డపేరు తెచ్చుకున్నారు. తిరుమల లడ్డూ ప్రసాదం కోసం వాడే నెయ్యిలో జంతు కొవ్వు ఉందన్న ఆరోపణలపై సీబీఐతో విచారణ జరిపించాలి. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశాం. ఇదే అంశంపై శనివారం గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలుస్తున్నాం. ఈ విషయాన్ని చంద్రబాబు సర్కారు తేలిగ్గా తీసుకున్నా, కాంగ్రెస్ పార్టీ మాత్రం అంత సులువుగా వదిలేయదు. వంద రోజుల కూటమి పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే ఈ విషయాన్ని ఇప్పుడు బయటపెట్టారా చంద్రబాబూ..!' అని షర్మిల ప్రశ్నించారు.

సనాతన ధర్మంపై దాడి: అయోధ్య ప్రధాన పూజారి

అయోధ్య సెప్టెంబరు 20: తిరుమల లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేయడం చాలా బాధాకరమని, ఇలాంటి చర్యలకు పాల్పడినవారెవరైనా ద్రోహులని అయోధ్య ఆలయం ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ మహారాజ్ అన్నారు. ప్రభుత్వం ఈ ఘటనను తీవ్రంగా పరిగణించి ఉన్నతస్థాయి దర్యాప్తు సంస్థతో విచారణ చేయించాలని కోరారు. ఈ ఘటన సనాతన ధర్మంపై కుట్ర, దాడిగా పేర్కొన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

బాధ్యులు విచారణను ఎదుర్కోక తప్పదు

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఆగ్రహం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేయడం అత్యంత దారుణమని కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులు చట్ట పరిధిలో విచారణ ఎదుర్కోక తప్పదన్నారు. కోట్లాది మంది భక్తుల విశ్వాసాన్ని గత వైసీపీ ప్రభుత్వం దెబ్బ తీసిందని, ఆ పార్టీకి ఈ ఘటనపై మాట్లాడటానికి హక్కు లేదని తెలిపారు.

లడ్డూ పవిత్రతను దెబ్బతీశారు: ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కోట్లాది మంది భక్తుల విశ్వాసంతో ముడిపడి ఉన్న తిరుపతి లడ్డూల పవిత్రతను గత వైసీపీ ప్రభుత్వం దెబ్బతీసిందని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ ఆరోపించారు. టీటీడీకి నందిని నెయ్యి సరఫరాను అడ్డుకోవడంపై వైసీపీ పెద్దలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

కట్టుకథలు చెబుతున్న జగన్: ఎంపీ బైరెడ్డి శబరి

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): వివేకా హత్య జరిగినప్పుడు చెప్పినట్టుగానే ఇప్పుడు తిరుమల లడ్డూ విషయంలోనూ జగన్ కట్టుకథలు చెబుతున్నారని ఎంపీ బైరెడ్డి శబరి విమర్శించారు. 'పవిత్రమైన గోవు మాంసం నుంచి తీసిన నూనెను లడ్డూలో వాడటం దుర్మార్గం. అత్యంత పాపం. ఈ పాపం జగన్‌దే' అని ఆమె వ్యాఖ్యానించారు. 'తిరుమల లడ్డూను కల్తీ చేసినవారిని ఉరి తీసినా తప్పు కాదు. హిందువుల మనోభావాలను దెబ్బ తీసిన వైసీపీ దుర్మార్గులకు కఠిన శిక్ష పడాలి' అని ఆమె ఆకాంక్షించారు.

ఉద్దేశపూర్వకంగానే తిరుమల ప్రసాదం అపవిత్రం

- ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద

పొందూరు, సెప్టెంబరు 20: తిరుమల వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం, అన్నప్రసాదాన్ని జగన్ ఉద్దేశపూర్వకంగానే అపవిత్రం చేశారని ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు, శ్రీకాకుళం జిల్లా కృష్ణాపురం ఆనందాశ్రమ పీఠాధిపతి స్వామి శ్రీనివాసానంద ఆరోపించారు. రాజకీయ లబ్ధి కోసం జగన్ హిందూత్వ తోలు కప్పుకుని కోట్లాది మంది హిందువులను మోసగించడంతో పాటు తిరుమల పవిత్రతను పూర్తిగా మంటగలిపారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అపచారం చేసినవారిపై కఠిన చర్యలు

- టీడీపీ కర్ణాటక కన్వీనర్ రావి మోహన్ చౌదరి

బెంగళూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ప్రసాదం విషయంలో అపచారానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ కర్ణాటక కన్వీనర్ రావి మోహన్ చౌదరి డిమాండ్ చేశారు. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వుతో తయారైన నూనెలు, చేప నూనెను వాడటం క్షమించరాని నేరమని మండిపడ్డారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని సీఎం చంద్రబాబును కోరారు.

విచారణ జరిపించండి: బండి సంజయ్

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వును వినియోగించారని వస్తున్న ఆరోపణలపై తక్షణమే సమగ్ర విచారణకు ఆదేశించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్.. సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. శ్రీవారి ప్రసాదం కల్తీతోపాటు అవినీతి, అన్యమత ప్రచారంపై విచారణ జరిపి.. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లడ్డూలో జంతువుల కొవ్వు వాడటం అత్యంత నీచమని.. ఇది టీటీడీపై కోట్లాది మంది భక్తులకు ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసేందుకు చేసిన కుట్రే అని వ్యాఖ్యానించారు.

మా నెయ్యిలో లోపం లేదు: ఏఆర్ డెయిరీ

చెన్నై, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): తమ నెయ్యిలో ఎలాంటి నాణ్యతా లోపం లేదని తిరుమల ఆలయానికి గతంలో నెయ్యి సరఫరా చేసిన సంస్థల్లో ఒకటైన దిండుగల్‌కు చెందిన ఏఆర్ డెయిరీ శుక్రవారం ప్రకటించింది. తమ ఉత్పత్తి నాణ్యతను ల్యాబ్‌లు ధ్రువీకరించి, క్లియరెన్స్ కూడా ఇచ్చాయని స్పష్టం చేసింది. కాగా, తిరుపతి లడ్డూలో జంతువుల కొవ్వు కలిపిన జగన్ ప్రభుత్వ నిర్వాకంపై తమిళనాడు బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఆ పార్టీ రాష్ట్ర సమన్వయ కమిటీ అధ్యక్షుడు హెచ్.రాజా శుక్రవారం చెన్నైలో మాట్లాడుతూ హిందూమతంపై నమ్మకం లేనివారిని ఆలయ నిర్వాహకులుగా నియమిస్తే ఇలాంటి ఘోరాలే జరుగుతాయని వ్యాఖ్యానించారు.

శ్రీవారి లడ్డూ విషయంలో మాపై దుష్ప్రచారం

- హైకోర్టులో వైవీ పిల్.. 25న విచారిస్తామన్న ధర్మాసనం

అమరావతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి ఉపయోగించిన నెయ్యి విషయంలో తమపై దుష్ప్రచారం చేస్తున్నారని, వాస్తవాలు తేల్చేందుకు హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారించాలని.. లేదంటే హైకోర్టు నేతృత్వంలో కమిటీ వేయాలని వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి హైకోర్టును కోరారు. ఈ మేరకు ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఆయన తరఫు సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి స్పందిస్తూ.. భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్నందున ఈ విషయంలో తాము వేసిన పిల్‌పై అత్యవసరంగా విచారణ జరపాలని కోరారు. ఈ వివరాలు పరిగణనలోని తీసుకున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం 25వ తేదీన విచారణ జరుపుతామని స్పష్టం చేసింది.

'సుప్రీం' సుమోటోగా కేసు నమోదు చేయాలి

- నెల్లూరులో టీడీపీ నేతల ఆందోళన

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 20: తిరుమల లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు వాడారన్న అభియోగాలపై సుప్రీంకోర్టు సుమోటోగా కేసు నమోదు చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నెల్లూరులోని గాంధీబొమ్మ కూడలిలో టీడీపీ నేత ఉచ్చి భువనేశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీవారి చిత్రపటానికి హారతులిస్తూ లడ్డూను ప్రదర్శించారు. అనంతరం ప్లకార్డులు చేతబట్టి వైసీపీ నేతల తీరును విమర్శిస్తూ నినాదాలు చేశారు. బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు, అర్చక సమాఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరులో శ్రీవారి చిత్రపటం వద్ద లడ్డూలు ఉంచి హారతి ఇస్తున్న టీడీపీ నాయకులు, బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు, అర్చక సమాఖ్య నాయకులు

'లడ్డూ'పై రచ్చ రచ్చ

జాతీయస్థాయిలో తీవ్ర ప్రకంపనలు

- చంద్రబాబుకు స్వయంగా ఫోన్ చేసిన నడ్డా
- పలువురు కేంద్రమంత్రుల ఆందోళన
- సీబీఐతో విచారణ జరిపించాలి : గిరిరాజ్ సింగ్
- ఇది విషాదకరం: కాంగ్రెస్ నేత పవన్ ఖేడా
- సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలంటూ పిటిషన్
- ధర్మారెడ్డి చాలా దుర్మార్గుడు: సీపీఐ నారాయణ
- అయోధ్య ప్రాణ ప్రతిష్ఠ టైమ్‌లోనూ అదే ప్రసాదం
- జగన్‌పై జాతీయ భద్రతా చట్టం ప్రయోగించాలి
- అమిత్‌షా, ఏపీ డీజీపీకి న్యాయవాది లేఖ

తిరుమల స్వామి లడ్డూ ప్రసాదం కలుషితం అయినట్టు నిర్ధారణ కావడంతో కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. కోట్లాది భక్తుల మనోభావాలతో ముడిపడిన ఈ అంశంపై తీవ్రంగానే స్పందించింది. ముఖ్యమంత్రి చంద్రబాబుకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా శుక్రవారం ఫోన్ చేశారు.

"తిరుపతి లడ్డూ కలుషితం కావడం చాలా తీవ్రమైన అంశం. ఈ వార్త అందగానే నేను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో మాట్లాడాను. ఆయన నాకు వివరాలు తెలిపారు. ఆయన వద్ద ఉన్న నివేదికను పంపమని కోరాను. ఆ నివేదికను నేను పరిశీలిస్తాను. రాష్ట్ర నియంత్రణ అధికారులతో కూడా మాట్లాడాను. అందుకు తగ్గట్లుగా చర్యలు తీసుకొంటాం. భారత ప్రభుత్వ ఆహార భద్రతా ప్రమాణాల అథారిటీ నిబంధనలకు అనుగుణంగా కూడా చర్యలు తీసుకుంటాం" అని నడ్డా అన్నారు. టీటీడీ ప్రసాదం అంశంపై సీబీఐ విచారణ జరపాల్సిన అవసరం ఉన్నదని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ అన్నారు. ఇది హిందూ మతాన్ని అంతం చేసేందుకు జరిగిన కుట్ర గా ఆయన అభివర్ణించారు. ఈ అంశంతో పాటు ప్రసాదంలో కలిపిన నెయ్యి కోసం ఎంత డబ్బు ఖర్చు పెట్టారో సీబీఐ దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధాన నిందితులకు మరణ శిక్ష విధించాలని ఆయన తీవ్రంగా వాఖ్యానించారు. అత్యంత తీవ్రమైన ఈ విషయంపై క్షుణ్ణంగా విచారించి దోషులను కఠినంగా శిక్షించాలని కేంద్ర ఆహార శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అభిప్రాయపడ్డారు కాగా జగన్ అండ్ కంపెనీ చేసిన దారుణాలు అన్నీ ఇన్నీ కావని బీజేపీ కర్ణాటక ఎంపీ శోభా కరంద్లజే అన్నారు. తిరుమల కళాశాలలనుంచి శ్రీనివాసుడు, పద్మావతి ఫొటోలు తీసేశారని, హిందువు కాని వారిని బోర్డు కుర్చీలో కూర్చోబెట్టారని, చివరకు జంతువుల కొవ్వును కూడా పవిత్ర ప్రసాదంలో చేర్చారని ఆమె ఆగ్రహించారు. ఇది భక్తుల విశ్వాసం, నమ్మకంపై స్పష్టమైన దాడిగా కనిపిస్తోందని, ఇందుకు బాధ్యులైన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత ముఖ్తార్ అబ్బాస్ నక్వీ డిమాండ్ చేశారు. దోషులకు ఎలాంటి మినహాయింపు ఇవ్వకూడదన్నారు. ఇది విషాదకరమని కాంగ్రెస్ మీడియా విభాగం చీఫ్ పవన్ ఖేడా వ్యాఖ్యానించారు

సుప్రీంకోర్టులో పిటిషన్

మత సంప్రదాయాలను ఘోరంగా ఉల్లంఘించిన పూర్వ తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్‌పై చర్యలకు ఆదేశించాలంటూ సుప్రీంకోర్టులో శుక్రవారం పిటిషన్ దాఖలైంది. దీనిని నేరపూరిత కుట్రగా, అధికార దుర్వినియోగంగా పరిగణించి తక్షణం జోక్యం చేసుకోవాలని సుదర్శన్ న్యూస్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రధాన సంపాదకుడు సురేశ్ చవహంకే తరఫున సత్యం సింగ్ అనే న్యాయవాది... సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ కు లేఖ రూపంలో పిటిషన్ దాఖలు చేశారు. ఆలయాల యాజమాన్యాన్ని భక్తులకే అప్పజెప్పి, హిందూ సంస్కృతి, వారసత్వ సంపదను కాపాడేలా చూడాలని తాను రెండు దశాబ్దాలుగా ఉద్యమిస్తున్నానని ఆయన తెలిపారు గత టీటీడీ యాజమాన్యం హయాంలో తయారు చేసిన ప్రసాదంలో మాంసాహార ఉత్పత్తులను ఉపయోగిస్తున్నారని తేలిందన్నారు. లడ్డూ ప్రసాదాన్ని పవిత్రమైన ఆశీర్వాదంగా భావించే అసంఖ్యాకమైన భక్తుల మనోభావాలను ఇది లోతుగా గాయపరచిందన్నారు. ఈ ప్రసాదానికి ఒక ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉన్నదని చెప్పారు. తమ విశ్వాసానికి అనుగుణంగా ఆచారాలను పాటించే భక్తుల హక్కులను కాలరాశారని విమర్శించారు. ఇది హిందూ మత పద్ధతులకు తీవ్ర విఘాతం కలిగించిందని, మౌలికమైన మత సంప్రదాయాలను ఉల్లంఘించిందని ఆయన అన్నారు. ఇది భారత రాజ్యాంగంలోని 25వ అధికరణకు తీవ్ర నష్టం కలిగించిందన్నారు. మత ఆచారాలను పరిరక్షించడంలో ఉన్న ప్రాధాన్యతను సుప్రీంకోర్టు రకరకాల తీర్పుల్లో గుర్తించిందని, కమిషనర్ ఆఫ్ పోలీస్ వర్సెస్ ఆచార్య జగదీశ్వరానంద అవధూత 2004 కేసులో ఆచారాలు మతానికి మౌలికమైన వని, వాటిని ఆర్టికల్ 25 క్రింద పరిరక్షించాలని చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పూరీలోని జగన్నాథమందిరం యాజమాన్య కమిటీ వర్సెస్ చింతామణి ఖుంటియా కేసులో కూడా ఆరాధ్య మందిరాల పవిత్రతను, సంప్రదాయాలను కాపాడే విషయంలో న్యాయస్థానాల పాత్రను కూడా సుప్రీం ఉల్లేఖించిందని తెలిపారు.

సుమోటాగా సుప్రీం స్పందించాలి

లడ్డూ వ్యవహారంపై సుప్రీంకోర్టు సుమోటాగా విచారణ జరిపించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో పనిచేసిన ధర్మారెడ్డి చాలా దుర్మార్గుడని, నాడు టీటీడీ అదనపు ఈవోలా కాకుండా, వైసీపీ నేతగా వ్యవహరించారని ఆరోపించారు. తిరుపతి లడ్డూ తయారీలో ఎద్దు కొవ్వు, పంది కొవ్వు, చేపల నూనె ఉపయోగించడం నేరపూరిత చర్య కిందకే వస్తుందని శివసేన(యూబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేది అన్నారు.

జాతీయ భద్రతా చట్టం ప్రయోగించాలి

ప్రసాదాన్ని కలుషితం చేసిన గత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, టీటీడీ అధికారులు, నెయ్యి సరఫరా చేసిన కాంట్రాక్టర్‌పై జాతీయ భద్రతా చట్టం కింద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సుప్రీంకోర్టు న్యాయవాది వినీత్ జిందాల్ కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఏపీ, యూపీ డీజీపీలకు లేఖలు రాశారు. ఈ ప్రసాదాన్ని ఆయోధ్యలో బాల శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ జరిగినప్పుడు కూడా పంపి పంచి పెట్టారని, తద్వారా మరో ప్రధాన ఆరాధ్య మందిరం పవిత్రతను కూడా కాలరాచారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, జంతువుల కొవ్వు, చేప నూనె, పామాయిల్ , పంది మాంసంతో తయారు చేసిన నెయ్యిని ప్రసాదంలో ఉపయోగించారని ఒక ప్రైవేట్ లాబొరేటరీ నివేదిక ఇచ్చిన నిర్ధారణలను ఉటంకిస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, డీజీపీ ద్వారకా తిరుమలరావులకు వినీత్ జిందాల్ అనే న్యాయవాది లేఖ రాశారు. "మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో ఈ కుట్ర జరిగింది. ఇది హిందువులు ఆరాధించే ఆధ్యాత్మిక పవిత్రతను సామూహికంగా ఉల్లంఘించడం ద్వారా జాతీయ భద్రతకు ముప్పు తెచ్చేందుకే ఈ కుట్రను చేశారు. కోట్లాది మంది హిందువుల మతవిశ్వాసాలకు సంబంధించిన వ్యవహారం ఇది. కనుక అతి వేగంగా స్పందించాలి" అని ఆయన కోరారు.

బాధ్యులపై చర్యలు తప్పవ్

- లడ్డూ ప్రసాదంలో కొవ్వు కలవడం ఏమిటి?
- గత టీటీడీ బోర్డు సమాధానం చెప్పాలి
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ డిమాండ్
- దేశంలో సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు అవసరమని వ్యాఖ్య
- వచ్చే కేబినెట్‌లో ఈ అంశంపై చర్చిస్తానని వెల్లడి



అమరావతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ ప్రసాదంలో కొవ్వు, కల్తీ నెయ్యి కలిసిన ఘటనలో బాధ్యులపై చర్యలు తప్పవని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హెచ్చరించారు. లడ్డూ కల్తీ అయిందని తెలిసి దిగ్భ్రాంతికి గురైనట్లు ఆయన తెలిపారు. తిరుపతి లడ్డూపై పవన్ ఎక్స్‌లో పోస్టు చేయడంతో పాటు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. స్వామి వారి లడ్డూను భక్తులంతా మహాప్రసాదంగా భావిస్తారని, అలాంటి బాలాజీ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసినట్లు పరీక్షల్లో తేలడం దారుణమన్నారు. దీనిపై నాటి వైసీపీ ప్రభుత్వం కొనసాగిన టీటీడీ బోర్డు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇందుకు బాధ్యులైనవారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. స్వచ్ఛమైన నెయ్యి ధర ఎక్కువ ఉంటుందన్న పవన్, తక్కువ ధరకు వస్తుందని ఎలా కొంటారని గత ప్రభుత్వాన్ని నిలదీశారు. లడ్డూ ప్రసాదంపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయని, ల్యాబ్ పరీక్షలు నిర్వహించాలని చాలా మంది ఫిర్యాదు చేశారని తెలిపారు. ప్రతిరోజూ 15000 కేజీల నెయ్యి ప్రసాదం తయారీకి ఉపయోగిస్తారని చెప్పారు. టీటీడీలో నిధుల దుర్వినియోగం, శ్రీవాణి నిధులు దుర్వినియోగంపై దృష్టిపెట్టామన్నారు. ప్రజలు ఇలాంటి వాటిని సహించరని తెలిపారు. దేశంలో దేవాలయాలకు పరిరక్షణకు, ఆలయాల సమస్యలను పర్యవేక్షించేందుకు సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం పవన్ సూచించారు. సనాతన ధర్మాన్ని కాపాడుకునేందుకు అందరం కలిసి రావాలని పిలుపునిచ్చారు. తాను వ్యక్తిగతంగా సనాతన ధర్మ పరిరక్షణ బోర్డుపై దృష్టిపెడతానన్నారు. రాష్ట్రంలో జరగబోయే తర్వాత కేబినేట్‌లో ఈ అంశంపై చర్చిస్తానన్నారు. సనాతన ధర్మ పరిక్షణ బోర్డు ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తామన్నారు. దేశం వ్యాప్తంగా దేవాలయాల అపవిత్రత, ఇతర ధార్మిక పద్ధతులకు సంబంధించిన అనేక సమస్యలు వెలుగులోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నింటినీ కట్టడి చేయాలంటే సనాతన ధర్మ పరిక్షణ బోర్డు రావాలని పవన్ ఆకాంక్షించారు.

దేవదాయ శాఖ కమిషనర్‌కు జనసేన ఫిర్యాదు

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పవిత్రమైన తిరుమల వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసినవారిపై చర్యలు తీసుకోవాలని తిరుపతి జనసేన పార్టీ ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం వెలగపూడి సచివాలయంలో దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణను కలసి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. మాజీ ఈవో ధర్మారెడ్డి, చైర్మన్లను విచారించాలని డిమాండ్ చేశారు.

తేడా తెలియనంతగా కల్తీ చేశారు!

- నెయ్యా-నూనా.. అన్నది గుర్తించేందుకు పలు చోట్ల అనేక పరీక్షలు చేయించాం
- కల్తీ జరిగినట్టు ఎన్‌డీడీబీ నిర్ధారించింది
- టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడి




తిరుమల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూ, అన్నప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యిలో పంది, గొడ్డు వంటి జంతువుల కొవ్వు కలిసినట్టు నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డ్(ఎన్‌డీడీబీ) నివేదికతో పాటు పలు పరీక్షల్లో నిర్ధారణ అయిందని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుమలలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. లడ్డూల్లో వినియోగించే నెయ్యి నాణ్యతపై ఫిర్యాదులు వస్తున్నాయని సీఎం చెప్పారన్నారు. ఈ క్రమంలో తాను బాధ్యతలు తీసుకున్న తర్వాత పలువురు నిపుణులతో ప్రసాదాల నాణ్యతపై చర్చించినట్టు తెలిపారు. నాణ్యమైన నెయ్యి లేకపోవడంతోనే లడ్డూల రుచి తగ్గిందనే విషయం తెలిసిందన్నారు. అయితే, టెండర్ల ద్వారా వచ్చే నెయ్యిని వందశాతం పరీక్షించే ల్యాబ్ తిరుమలలో లేదన్నారు. రూ.75 లక్షలు ఖర్చు పెడితే ఆధునిక ల్యాబ్‌ను సిద్ధం చేసుకోవచ్చని, కానీ.. ఇప్పటి వరకు ఆ ప్రయత్నం జరగలేదన్నారు. వంద శాతం పరీక్షలు చేసే సామర్థ్యం లేకపోవడంతో.. టెండరుదారులు దీనిని తమకు అనుకూలంగా మార్చుకుని కల్తీ నెయ్యిని పంపుతున్నారని పేర్కొన్నారు. కాగా, ప్రస్తుతం టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తున్న 5 సంస్థల్లో దుండిగల్‌కు చెందిన ఏఆర్ డెయిరీ ఫుడ్స్ పంపుతున్న నెయ్యిలోనే నాణ్యత లేదన్నారు. ఎన్‌డీడీబీ ల్యాబ్‌కు పంపగా.. నెయ్యి కల్తీ అయినట్టు తేలిందని చెప్పారు. దీంతో ఏఆర్ సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టామన్నారు. "అది నెయ్యా లేదా నూనా అని తెలియనంతగా ఏఆర్ డెయిరీ ఫుడ్స్ సంస్థ సరఫరా చేసింది. త్వరలో ఈ సంస్థపై చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. ఈ కల్తీ విషయంలో తొలిసారి మీడియాతో మాట్లాడినప్పుడు నెయ్యిలో జంతువుల కొవ్వు ఉన్నట్టు స్పష్టత రాలేదు. తర్వాత అధికారులతో మాట్లాడి నిర్ధారించుకున్నాం. ఎలాంటి నెయ్యి కొనుగోలు చేయాలనే అంశంపై ఇప్పటికే ఐదుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశాం. డిసెంబరు నాటికి అత్యాధునిక ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తాం. 'నందిని' నెయ్యిని తిరిగి కొనుగోలు చేస్తున్నాం" అని ఈవో శ్యామలరావు వివరించారు.

నాణ్యతను నిర్ధారించే వరకు తిరుమల శ్రీవారికి ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహారపదార్థాలతో నైవేద్యాలు సమర్పిస్తున్నామని, అయితే వీటి నాణ్యత విషయంలోనూ కొన్ని అనుమానాలు ఉన్నాయని ఈవో శ్యామలరావు తెలిపారు. దీంతో ఈ ప్రసాదాలను కూడా తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు చెప్పారు. వీటి నాణ్యత పరిశీలనపై ఓ కమిటీని నియమించామన్నారు.

తిరుమల సంప్రోక్షణ

అపవిత్ర నెయ్యితో ఘోర అపచారం

- శ్రీవారి ఆలయ శుద్ధికి సీఎం ఆదేశం



అమరావతి/ఒంగోలు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి పవిత్ర లడ్డూ ప్రసాదం కల్తీ జరిగిన మాట వాస్తవమని సీఎం చంద్రబాబు మరోసారి స్పష్టం చేశారు. కిలో రూ.320కే ఇస్తున్నారని కల్తీ నెయ్యిని కొనుగోలు చేశారని పేర్కొన్నారు. దీనిలో జంతువులు, వెజిటబుల్ కొవ్వు వంటివి వాడారని తెలిపారు. ఇప్పుడు ఆ విషయం ఆధారాలతో సహా వెలుగు చూశాక.. బుకాయిస్తున్నారని వైసీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆవు నెయ్యి కిలో రూ.500 ఉంటే రూ.320కే ఇస్తామంటే ఎలా నమ్మారని నిలదీశారు. వైసీపీ హయాంలో తిరుమల నిత్యాన్న ప్రసాదం బాగాలేదని, లడ్డూ ప్రసాదం బాగోలేదని భక్తులు మొత్తుకున్నా పట్టించుకోలేదని విమర్శించారు. ఈ కారణంగానే తిరుమలకు వచ్చేవారి సంఖ్య తగ్గిపోయిందన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడులో ఆయన మాట్లాడారు.

అధికారులకు దిశానిర్దేశం

తిరుమల పవిత్రతను పునరుద్ధరించే విషయంపై సీఎం చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆగమ, వైదిక శాస్త్రాల ప్రకారం తిరుమలలో సంప్రోక్షణ చేపట్టాలని ఆదేశించారు. టీటీడీ అధికారులతో శుక్రవారం ఆయన రెండుసార్లు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనికి ముందు.. గత వైసీపీ హయాంలో శ్రీవారి లడ్డూ తయారీలో నాణ్యతా లోపాలపై సీఎం చంద్రబాబు సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అందుబాటులో ఉన్న మంత్రులను పిలిచి ఈ విషయంపై సుదీర్ఘంగా చర్చించారు. అత్యంత పవిత్రమైన లడ్డూ అపవిత్రం కావడాన్ని అత్యంత తీవ్రంగా పరిగణించారు. లడ్డూలో వాడకూడని పదార్థాలను వినియోగించిన నేపథ్యంలో తిరుమల అపవిత్రం అయిందని భావించిన సీఎం క్షేత్రాన్ని పవిత్రం చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై దృష్టిపెట్టారు. ఈ నేపథ్యంలో తొలుత లడ్డూలు తయారు చేసే పోటుతో పాటు, నెయ్యి భద్రపరిచిన ప్రదేశాలను సంప్రోక్షణ చేయాలని ఆదేశించారు. దీనికిగాను వైదిక, ఆగమ శాస్త్ర పద్ధతులను ఆచరించాలని సూచించారు. లడ్డూ తయారీ విషయంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలపై శుక్రవారం సాయంత్రంలోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని టీటీడీ ఈవో శ్యామలరావును సీఎం ఆదేశించారు. కాగా, తిరుమల సంప్రోక్షణకు సంబంధించిన విధివిధానాలు తెలియజేసేలా ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈవో శ్యామలరావు ఇచ్చిన నివేదిక ఆధారంగా వైదిక, ఆగమ శాస్త్ర పండితులతో కమిటీ ఏర్పాటు చేయనున్నారు.

బాబును అందరూ తిట్టాలి!

- తిరుమల లడ్డూపై దుష్ప్రచారానికి మోదీ, సీజేఐ అక్షింతలు వేయాలి
- వారికి లేఖ రాస్తా: జగన్



అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ ప్రసాదంలో వాడే నెయ్యిలో పశువుల కొవ్వు ఉందంటూ సీఎం హోదాలో చంద్రబాబు దుష్ప్రచారం చేశారని.. దీనికిగాను అందరూ ఆయన్ను తిట్టాలని మాజీ సీఎం జగన్ అన్నారు. దీనిపై విచారణ జరగాలని.. చంద్రబాబుకు అక్షింతలు వేయాలని ప్రధాని మోదీ, సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌లకు లేఖ రాస్తానని చెప్పారు. వైసీపీ హయాంలో లడ్డూ ప్రసాదంలో వాడే నెయ్యి కల్తీ అయినట్లు లేబొరేటరీ ధ్రువీకరించిన నేపథ్యంలో జగన్ శుక్రవారం మాట్లాడారు. తిరుమల లడ్డూపై బీజేపీ కూ డా ఆగ్రహం వ్యక్తం చేస్తోందని ప్రస్తావించగా.. 'బీజేపీవాళ్లకు చిత్తశుద్ధి లేదు. వాళ్లకు సగం తెలుసు సగం తెలీదు. టీటీడీ బోర్డులోనూ బీజేపీ సీనియర్ మంత్రులకు సంబంధించిన ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. వాళ్లకు టీటీ డీ నిర్వహించే ప్రాసెస్ తెలియదా? తెలియకపోతే కనుక్కోమనండి. చంద్రబాబు దుష్ప్రచారం చేస్తుంటే.. ఆయనపై అక్షింతలు చల్లే ధైర్యం బీజేపీకి ఉందా? వాళ్లలో చిత్తశుద్ధి ఉంటే.. నిజంగానే హిందువుల ప్రతినిధులైతే.. బాబును తిట్టాలి. ఇంత దుర్మార్గం చేయడం ధర్మమేనా అని గట్టిగా కడిగేయాలి' అని డిమాండ్ చేశారు. తిరుమల లడ్డూ ఎంతో పవిత్రమైనదని, అందులో నెయ్యికి బదులు జంతువుల కొవ్వు వాడారని చెప్పి.. కోట్ల మంది భక్తుల మనోభావాలతో చంద్రబాబు ఆడుకోవడం ధర్మమేనా అని ప్రశ్నించారు. నెయ్యి సరఫరాకు ఆన్‌లైన్‌లో టెండర్లు పిలిస్తే ఎల్-1గా వచ్చి న సంస్థకు ఆర్డర్ ఇస్తారని.. నేషనల్ అక్రిడేషన్ బోర్డు ఫర్ ల్యాబ్స్(ఎన్ఏబీఎఫ్ఎల్) నుంచి సర్టిఫికెట్‌ను తీసుకురావలసి ఉంటుందని చెప్పారు. 'మనంత మనమే మన దేవుడిని తగ్గించుకుంటున్నాం. దుర్బుద్ధితో బు రద వేస్తున్నాం. జాతీయ మీడి యా తెలిసి ప్రచారం చేస్తాం దో.. తెలియకచేస్తోందో అర్థం కావడం లేదు' అన్నారు.

జగన్‌కు దెబ్బ మీద దెబ్బ!

వైసీపీ.. ముఖ్య నేతలు, స్థానిక ప్రజాప్రతినిధుల వలసలతో విలవిలలాడుతోంది. ఇలాంటి తరుణంలో తిరుమల లడ్డూలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు ఉందని వెలుగులోకి రావడం, భక్తులు, మఠాధిపతులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తుండడం.. కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుండడం ఆ పార్టీని.. ముఖ్యంగా జగన్‌ను ఆత్మరక్షణలోకి నెట్టింది. దెబ్బమీద దెబ్బ పడుతుండడంతో హడలిపోతున్నారు. జగన్ హయాంలో టీటీడీ భ్రష్టుపట్టిందని, అన్యమతస్థులను తీసుకొచ్చి పాలక మండలి బాధ్యతలు అప్పగించారన్న ఆరోపణలు ఉన్నాయి. లడ్డూ, అన్న ప్రసాద నాణ్యతపై విమర్శలు వచ్చినప్పుడల్లా పాలక మండలి ఎదురుదాడికి దిగేది. కనీసం అంతర్గత విచారణ చేపట్టినా నిజానిజాలు తెలిసిఉండేవని.. వైసీపీ నేతలు అంటున్నారు.

గత ఐదేళ్లూ మహాపాపం జరిగిపోయింది


- నెయ్యి కల్తీ గురించి గత బోర్డుకు, అధికారులకు తెలుసు: రమణదీక్షితులు



తిరుమల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): టీటీడీలో గత ఐదేళ్లూ మహాపాపం జరిగిపోయిందని తిరుమల శ్రీవారి ఆలయ మాజీ ప్రధాన అర్చకుడు రమణదీక్షితులు అన్నారు. నెయ్యిలో జంతువుల కొవ్వును కలిపారనే వార్తలపై ఆయన స్పందించారు. శుక్రవారం తిరుమలలో మీడియాతో మాట్లాడారు. 'శ్రీవారి ఆలయంలో ఇటువంటివి జరగడం భక్తులను మనోవేదనకు గురిచేస్తోంది. ఒక అర్చకుడిగా, భక్తుడిగా మూడురోజులుగా నేను కూ డా ఆ బాధను అనుభవించా. గోవు ద్వారా వచ్చే పాలు, పెరుగు, నెయ్యి, వెన్నను స్వామివారి కైంకర్యాలు, ప్రసాదాల్లో వినియోగిస్తాం. అలాంటి పవిత్రమైన గోవు నెయ్యిని కల్తీ చేయడం అపచారం. ఒక్కోసారి ఇవన్నీ చూసే పాపం మనం చేశామా అనిపిస్తోంది(కళ్లు చెమ్మగిల్లాయి). గత ఐదేళ్లలో నిరభ్యంతరంగా మహాపాపం జరిగిపోయింది. నెయ్యిలో వెజిటబుల్, జంతువుల కొవ్వు కలిసినట్టుగా ల్యాబ్ రిపోర్టుల్లో ఉంది. కల్తీపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలి. నాణ్యమైన నందిని నెయ్యిని మళ్లీ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. స్వామిపై, ఆగమాలపై, శాస్త్రాలపై విశేష భక్తి, గౌరవం ఉన్నవారికి తిరుమలలో సేవచేసే అవకాశం ఇవ్వాలని సీఎంను కోరుతున్నా. స్వామి ప్రసాదాల్లో కల్తీ జరగడమనేది నా 50 ఏళ్ల ప్రయాణంలో ఎప్పుడూ లేదు. నెయ్యిలో కల్తీ ఉందనే విషయం గత బోర్డుకు, అధికారులకు తెలిసే జరిగింది. ల్యాబ్‌లో కూడా కల్తీని గుర్తించకపోవడాన్ని బట్టి గోల్‌మాల్ జరిగిందని అర్థమవుతోంది. పరీక్షకు పంపేవి నాణ్యంగా ఉండి, ఆ తర్వాత వినియోగానికి వచ్చేవి కల్తీ అయివుండొచ్చు. స్వామివారికి సక్రమంగా కైంకర్యాలు జరిగితేనే రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉంటుంది' అని అన్నారు.

లోతుగా విచారణ చేయాలి

- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్న సీఎస్ రంగరాజన్
- సీబీఐ విచారణకు డిమాండ్ చేసిన వీహెచ్



మొయినాబాద్ రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీపై లోతుగా విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ డిమాండ్ చేశారు. లడ్డూ ప్రసాదంలో కల్తీ జరగడం ఘోరమని ఆవేదన వ్యక్తం చేశారు.

కాగా, మోదీ, అమిత్‌షాలకు నిజంగా దేవుడిపైన భక్తి ఉంటే లడ్డూ కల్తీ వ్యవహారంపై వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించాలని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు డిమాండ్ చేశారు. మూడు నెలల్లో విచారణను ముగించి బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగం పరమ దుర్మార్గమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు బక్కని నర్సింహులు చెప్పారు.

ఎన్నికల్లో, పాదయాత్రలో ఇచ్చిన.. ప్రతి హామీ అమలు చేస్తాం

- జగన్‌రెడ్డివి ఫేక్ ప్రచారాలు: లోకేశ్
- పాదయాత్ర తొలి హామీ అమలు కార్యక్రమంలో విద్యామంత్రి ధ్వజం
- బంగారుపాళ్యంలో డయాలసిస్ కేంద్రానికి శ్రీకారం



డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించి పేషెంటుతో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

బంగారుపాళ్యం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): యువగళం పాదయాత్రలో తాను, ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ఇచ్చిన ప్రతి హామీకీ కట్టుబడి ఉన్నామని విద్యాశాఖ మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. యువగళం పాదయాత్రలో వంద కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా ఇచ్చిన తొలి హామీ మేరకు చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించారు. 30పడకల ఆస్పత్రి నూతన భవనాన్ని ప్రారంభించి, రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని పరిశీలించారు. అనంతరం అదే మండలంలోని ఎస్.కోటూరులో ప్రజావేదిక కార్యక్రమాన్ని ప్రారంభించి గ్రామస్థులతో ముచ్చటించారు. ఆయా సందర్భాల్లో మాట్లాడారు. 'మెగా డీఎస్సీ, సంపూర్ణ మద్యపాన నిషేధం వంటి హామీలు అమలు చేయకుండా జగన్ మాట తప్పారు. మేం పద్ధతి ప్రకారం హామీలు అమలు చేస్తున్నాం. పెన్షన్‌ను రూ.2 వేల నుంచి రూ.3 వేలకు పెంచడానికి జగన్ రెడ్డికి ఐదేళ్లు పడితే.. చంద్రబాబు ఒక్క సంతకంతో రూ.4 వేలకు పెంచేశారు. మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశారు. ఇప్పటికే పలు పరిశ్రమలు తెచ్చారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేసి ప్రజల ఆస్తులకు రక్షణగా నిలిచారు. గతంలో తిరుమలలో పింక్ డైమండ్ మాయమైందంటూ మాపై దుష్ప్రచారం చేశారు. తిరుమల లడ్డూలో నాణ్యత లేకుండా చేస్తే.. చంద్రబాబు వచ్చిన వెంటనే టీటీడీ ప్రక్షాళన మొదలుపెట్టారు. దేవుడితో పెట్టుకున్నారు కాబట్టే 11 సీట్లకు పరిమితమయ్యారు' అన్నారు. పాదయాత్ర సమయంలో ఇదే బంగారుపాళ్యంలో జగన్ ప్రభుత్వంలోని పోలీసులు ఎంత అరాచకం సృష్టించారో అంతా చూశారని, జీవో 1తో ప్రచార రథాన్ని అడ్డుకున్నారని గుర్తు చేశారు. లోకేశ్ వెంట చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు అమరనాథ్‌రెడ్డి, పులివర్తి నాని, నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, గురజాల జగన్మోహన్, గాలి భానుప్రకాశ్, మురళీమోహన్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కిలారు రాజేశ్, బీవీ రాముడు ఉన్నారు.

ఉపాధ్యాయుల్ని గౌరవించడమంటే ఇదీ!

బంగారుపాళ్యంలో పర్యటన ముగించుకుని వెనుదిరిగిన లోకేశ్ మార్గమధ్యంలో పూతలపట్టు మండలంలోని ఆకనంబట్టు జడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. లోటుపాట్ల గురించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలితో చర్చించారు. విద్యాశాఖ మంత్రిగా ఆయన ఆమె సీటులో కూర్చునే అవకాశమున్నా.. ఉపాధ్యాయులను గౌరవించడం ఎలాగో ఆయన చూపించారని సోషల్ మీడియాలో చర్చ నడుస్తోంది.

యజ్ఞం చేస్తున్నాం..!

"వైసీపీ ప్రభుత్వంలో మందు బాబులను కూడా వదలకుండా భారీగా ధరలు పెంచారు. వారి ఆరోగ్యాన్నీ దెబ్బతీశారు. ఇప్పుడు మేం నూతన పాలసీ తెచ్చి ధరలు తగ్గిస్తున్నాం." - సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని శుక్రవారం ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడులో ఆయన ప్రారంభించారు. తొలుత గ్రామంలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ ఆర్థిక, సామాజిక స్థితిగతులు, సమస్యలతోపాటు ప్రభుత్వ పథకాల లబ్ధి గురించి చంద్రబాబు తెలుసుకున్నారు. అనంతరం కూడలిలోని ఆంజనేయస్వామి విగ్రహం సమీపంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వంద రోజుల పాలనలో తన అనుభవాన్ని ఉపయోగించి ఇచ్చిన హామీల అమలుకు, ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ వంద రోజుల్లో ప్రతికూల ఆర్థిక పరిస్థితులను అధిగమిస్తూ కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చామన్నారు. అందుబాటులో ఉన్న వనరులతో సంపద సృష్టిస్తూ పలు పథకాల అమలుకు శ్రీకారం చుట్టామని తెలిపారు. దీపావళికి ఉచిత గ్యాస్ సరఫరా అమలు చేస్తామన్నారు. ఇన్ని కార్యక్రమాలను వంద రోజుల్లో చేస్తే ఏమి చేయలేదంటూ కొందరు అబద్ధపు ప్రచారం చేస్తున్నారని, వారి పాలనలో తొలి ఆరు నెలల్లో ఒక్క మంచిపనైనా చేశారా అని నిలదీశారు. ఇంకా ఏం చెప్పారంటే..

ఏ-1, ఏ-2 నుంచి పాలన తెలుసుకోవాలా?

నాకు పరిపాలన తెలియదని ఏ-2 (విజయసాయిరెడ్డి) అంటున్నాడు. ఇన్నేళ్ల రాజకీయ జీవితం, నాలుగోసారి సీఎం అయిన నేను ఏ-1, ఏ-2 నుంచి పాలన తెలుసుకోవాలా..? ప్రతి ఇంటికి లాభం జరగాలని, దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఉండాలన్న సంకల్పంతో పనిచేస్తున్నాం. అందుకు కేంద్రం నుంచి కూడా సహకారం అందుతోంది. ఈ వంద రోజుల్లో కేంద్రం నుంచి రూ.15 వేల కోట్లు రాజధాని అమరావతికి, రూ.12,500 కోట్లు పోలవరం ప్రాజెక్టుకు, రూ.5 వేల కోట్లు మూడు పారిశ్రామిక కేంద్రాలకు, విశాఖ రైల్వే జోన్ సాధించాం.గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకంతో నిలిచిపోయిన కేంద్ర గ్రాంట్లను సాధించి పంచాయతీలకు ఇస్తున్నాం. పెన్షన్లు పెంచి ఇవ్వడమే కాక ప్రతి నెలా ఒకటిన 'పేదల సేవలో' పేరుతో ప్రజాప్రతినిధులు, అధికారులు వారి ఇళ్లకు వెళ్లి మేమున్నామన్న భరోసా ఇస్తున్నారు. పేదల పట్ల మా ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది నిదర్శనం. అర్హులైన వారందరికీ పెన్షన్లు ఇచ్చేందుకు వచ్చే నెలలో రాష్ట్రమంతటా గ్రామసభలు నిర్వహిస్తాం. అదే సమయంలో అనర్హులకు తీసేస్తాం. వారికి సహకరించే వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఉచిత ఇసుక సరఫరాకు కట్టుబడి ఉన్నాం. ఇసుక అందుబాటులో ఉన్న ప్రాంతాల వారు సొంత అవసరాల కోసం బండ్లు, ట్రాక్టర్లపై నిరంతరంగా తీసుకెళ్లవచ్చు. దగ్గరలో లేని వారు పేర్లు నమోదు చేసుకుని ప్రభుత్వం సూచించిన రవాణా, ఇతర చార్జీలు చెల్లించి తీసుకెళ్లవచ్చు.



మద్దిరాలపాడు పర్యటనలో భాగంగా అల్లుదాసు శ్రీను, రేణుక దంపతులతో సీఎం చంద్రబాబు



ఖాజావలి, పఠాన్ బీబీ సారా కుటుంబంతో సీఎం చంద్రబాబు

ఆ హక్కు ఎవరిచ్చారు?

ప్రజలకు వారసత్వంగా వచ్చిన భూములు, పాసుపుస్తకాలపైనా జగన్ తన ఫొటో వేసుకున్నారు. ఆ హక్కు ఎవరిచ్చారు? మీరంటూ (ప్రజలు) కూటమిని గెలిపించకపోతే మీ ఆస్తులు మీ వద్ద ఉండేవే కావు. అందుకే అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుచేశాం. రాజముద్రతో ఉన్న పుస్తకాలు అందజేస్తాం. నిరుద్యోగుల ఉపాధి, ఉద్యోగాల కల్పన కోసం ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తాం. తొలిగా మెగా డీఎస్సీ ప్రకటించాం. గతంలో జనాభా నియంత్రణకు విస్తృత ప్రచారం చేసిన నేను ప్రస్తుతం జనాభా పెంపునకు పిలుపిస్తున్నాను. సంతానోత్పత్తి రేటు 2.1 శాతం ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 1.6 శాతానికి పడిపోయింది. దీనివల్ల సమతుల్యత దెబ్బతింటుంది. చాలామంది డబుల్ ఇన్‌కం, నోకిడ్స్, ఎంజాయ్ ధోరణిలో పోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. జనాభా నిర్వహణపై అందరూ దృష్టిసారించాలి. ప్రజల్లో దానిపై అవగాహన కల్పించాలి.

నేడు పార్టీ కార్యాలయానికి బాబు

అమరావతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం ఇక్కడి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి రానున్నారు. ఉదయం 11 గంటలకు ఆయన వస్తారని టీడీపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. సందర్శకులను కలవడంతోపాటు అందుబాటులో ఉన్న పార్టీ నేతలతో ఆయన సమావేశం అవుతారని పేర్కొన్నాయి. విజయవాడ వరదల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తక్షణ సహాయక చర్యల స్వీయ పర్యవేక్షణలో ఉన్న సీఎం చంద్రబాబు.. రెండు వారాలుగా పార్టీ కార్యాలయానికి రాలేకపోయారు.

భవిష్యత్‌కు బాబు భరోసా

- మద్దిరాలపాడులో 3 పేద కుటుంబాలతో భేటీ
- ముస్లిం మహిళకు అప్పటికప్పుడు 65,150కి చెక్కు

నాగులుప్పలపాడు సెప్టెంబరు 20: 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు శుక్రవారం ప్రకాశం జిల్లా మద్దిరాలపాడుకు వచ్చిన సీఎం చంద్రబాబు.. మూడు పేద కుటుంబాలను కలిశారు. వారితో మాట్లాడి కుటుంబ స్థితిగతులను తెలుసుకున్నారు. తొలుత ముస్లిం కాలనీకి చెందిన పఠాన్ ఖాజావలీ, బీబీసారా ఇంటికి వెళ్లారు. బీబీసారా మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇంటి నిర్మాణానికి రెండు బిల్లులు మంజూరయ్యాయని, మిగిలిన మొత్తం ఆగిపోయాయని తెలిపారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా కుమారుడు, కుమార్తె చదువు మధ్యలో మానేసి పనికి వెళ్తున్నారని సీఎం దృష్టికి చెప్పగా.. ఇంటినిర్మాణ బిల్లుల మొత్తం రూ.65,150కి అప్పటికప్పుడు చెక్కు అందజేశారు. ఇద్దరు పిల్లల చదువులకు హామీ ఇచ్చారు. జీవనోపాధికి కుట్టుమిషన్ అందించాలని కలెక్టర్‌కు సూచించారు. దివ్యాంగుడికి బ్యాటరీ వీల్ చైర్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. తర్వాత కల్లుగీత కార్మికుడు అలుదాసు శ్రీను, రేణుక ఇంటికి సీఎం వెళ్లారు. తమకు నివాస గృహం మంజూరుచేయాలని, ఇద్దరు పిల్లల చదువులకు ప్రభుత్వ సాయం అందేలా చూడాలని వారు కోరారు. నూతన మద్యం పాలసీ విధానంలో భాగంగా కల్లుగీత కార్మికుల కోటాలో మద్యం దుకాణం మంజూరు చేయాలని కోరగా తప్పకుండా చేస్తానని హామీ ఇచ్చి వివరాలు నమోదు చేసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

క్రమం తప్పకుండా పెన్షన్ వస్తోంది

అనంతరం చిన్నకారు రైతు తాళ్లూరి శ్రీనివాసరావు ఇంటికి సీఎం వెళ్లారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా పింఛను అందుతోందా అని శ్రీనివాసరావు తల్లిని అడిగారు. అమ్మకు ప్రతినెలా అందుతోందని అతడు చెప్పారు. బీబీసారా కుటుంబంతో మాట్లాడేందుకు వెళుతున్న సీఎంను ముస్లిం కాలనీకి చెందిన షేక్ జిలానీ అనే మహిళ మధ్యలో ఆపి.. తమ రేకుల ఇల్లు దెబ్బతిని, వర్షాలకు నీరు చేరుతోందని, పక్కా ఇల్లు మంజూరు చేయాలని వేడుకుంది. మురుగు కాలువల్లో పాములు తిరుగుతూ తమ నివాసాల్లోకి వస్తున్నాయని, భయంతో గడపాల్సి వస్తోందని చెప్పింది. అన్ని సమస్యలూ పరిష్కరిస్తానని.. తనలాగా గత సీఎం ఎప్పుడైనా ప్రజల మధ్యకు వచ్చాడా అని ప్రశ్నిస్తూనే సదరు మహిళ వివరాలను నమోదు చేసుకుని ఇల్లు మంజూరుచేయాలని కలెక్టర్‌కు సూచించారు. 'ఇది మంచి ప్రభుత్వం'లో సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, మంత్రులు డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, గొట్టిపాటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాయం.. న్యాయం చేయండి!

- టీడీపీ నేతల గ్రీవెన్స్‌లో బాధితుల ఫిర్యాదులు, వినతులు

అమరావతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నిర్వహిస్తున్న గ్రీవెన్స్ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి మోసాలకు, అన్యాయాలకు గురైన బాధితులు పోటెత్తుతున్నారు. తమ గోడు వెల్లబోసుకుంటూ.. సాయం, న్యాయం చేయాలని పార్టీ నాయకులకు వినతిపత్రాలు అందజేస్తున్నారు. టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో మాజీ మంత్రులు కేఎస్ జవహర్, నెట్టెం రఘురామ్ వినతులు స్వీకరించారు. మోసానికి పాల్పడిన ఒక బ్యాంకు మేనేజర్ తన పేరుపై రూ.50 లక్షలు స్వాహా చేశాడని ఓ బాధితుడు, తన భూమిని కొట్టేయాలని బంధువులే కుట్ర చేస్తున్నారని ఓ ఒంటరి మహిళ ఫిర్యాదులు చేశారు. రెండు కిడ్నీలు పాడైపోయిన తన ప్రాణాలు కాపాడాలని మరొకరు వేడుకున్నారు. రుణం కోసం తణుకులోని తన రెండు దుకాణాలకు సంబంధించిన పత్రాలతో బ్యాంకులో దరఖాస్తు చేస్తే.. రుణం ఇవ్వకపోగా, తన డాక్యుమెంట్లపై బ్యాంక్ మేనేజరే రూ.50 లక్షలు లోన్ తీసుకుని మోసం చేశాడని, దీనిపై కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రాజమండ్రికి చెందిన కే భగవత్‌రావు టీడీపీ నేతల దృష్టికి తెచ్చారు. బ్యాంకు మేనేజర్‌పై చర్యలు తీసుకుని, తన డాక్యుమెంట్లు తిరిగి ఇప్పించాలని కోరారు. మరోవైపు తన రెండు కిడ్నీలు పాడైపోయి, డయాలసిస్‌తో జీవిస్తున్నానని, తన తల్లి కిడ్నీ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా.. ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు రూ.17 లక్షల ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారని ఎన్టీఆర్ జిల్లా గంగ్రాయి గ్రామానికి చెందిన రాయల మహేష్ వాపోయారు. ఆర్థిక సాయం చేసి, తన ప్రాణాలు కాపాడాలని వేడుకున్నారు. భర్త చనిపోవడంతో తనకు రావాల్సిన భూమిని తనకు ఇవ్వకుండా మరిది, చిన్న మామ కుటుంబసభ్యులు చంపేస్తామని బెదిరిస్తున్నారని ఓ మహిళ ఫిర్యాదు చేశారు. ఆంధ్రా యూనివర్సిటీ పరీక్షల విభాగంలో అవినీతిని అరికట్టి, తన కుమారుడికి న్యాయం చేయాలని డీవీ సూర్యనారాయణ అనే వ్యక్తి కోరారు. 2021లో తహశీల్దార్ కార్యాలయాల్లో కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుకు ఉత్తీర్ణత సాధించినా.. పోస్టు ఇవ్వడం లేదని ఎన్టీఆర్ జిల్లాకు చెందిన పి.సూర్య ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని పార్టీ నేతలు వారికి చెప్పారు.

జెత్వానీ కేసులో కుక్కల విద్యాసాగర్ అరెస్టు

- డెహ్రాడూన్‌లో వైసీపీ నేత అదుపులోకి
- నేడు ట్రాన్సిట్ వారెంట్‌పై బెజవాడకు

విజయవాడ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వానీని వేధించిన కేసులో వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్‌ను విజయవాడ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. కాదంబరి కేసు వ్యవహారం వెలుగులోకి వచ్చాక విద్యాసాగర్ అజ్ఞాతంలోకి వెళ్లిన సంగతి తెలిసిందే. కొన్నిరోజులు ముంబైలో, మరికొన్ని రోజులు ఢిల్లీలో తలదాచుకున్నారని పోలీసులు గుర్తించారు. చివరకు డెహ్రాడూన్‌లోని ఓ రిసార్ట్ వద్ద అరెస్టు చేశారు. అక్కడి మూడో అదనపు చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చిన తర్వాత ట్రాన్సిట్ వారెంట్‌పై శనివారం విజయవాడకు తీసుకొస్తారు. తనపై తప్పుడు కేసు నమోదుచేసి మానసికంగా వేధించారని కుక్కల విద్యాసాగర్‌తో పాటు ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా, విశాల్‌గున్నీ, పలువురు పోలీసు అధికారులపై జెత్వానీ ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు వివిధ సెక్షన్ల కింద ఈ నెల 13న కేసు నమోదు చేశారు. ఇందులో కుక్కల విద్యాసాగర్‌ను ప్రధాన నిందితుడిగా పేర్కొన్నారు. జెత్వానీ విజయవాడకు వచ్చి వాంగ్మూలం ఇచ్చినప్పటి నుంచి విద్యాసాగర్ పరారీలో ఉన్నారు. తాను నమోదు చేయించిన కేసుకు సంబంధించిన వివరాలు మీడియాలో ప్రసారం కాకుండా చర్యలు తీసుకోవాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాగా కాదంబరి వ్యవహారం వెలుగులోకి వచ్చాక ఉన్నతాధికారులు విచారణాధికారిని నియమించారు. ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌లోని ఏసీపీ స్రవంతిరాయ్‌కు బాధ్యతలు అప్పగించారు. ఆమె కాదంబరితో పాటు తండ్రి నరేంద్రకుమార్ జెత్వానీ, తల్లి ఆశా జెత్వానీ నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. 100 పేజీలతో విచారణ నివేదికను రూపొందించి ప్రభుత్వానికి పంపారు. కాదంబరి మొత్తం నాలుగుసార్లు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. మూడుసార్లు పోలీసు కమిషనర్‌కు, నాలుగోసారి ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా, విశాల్ గున్నీని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. అజ్ఞాతంలోకి వెళ్లిన విద్యాసాగర్‌ను పట్టుకోవడానికి పోలీసులు రెండు ప్రత్యేక బృందాలను నియమించారు. ఎట్టకేలకు అదుపులోకి తీసుకున్నారు.

కాపాడాల్సిన పోలీసులే చట్టాన్ని బ్రేక్ చేశారు

- రఘురామను కస్టడీలో హింసించిందెవరో తేలాలి
- విజయ్‌పాల్‌ను ప్రశ్నిస్తేనే వాస్తవాలు తెలుస్తాయి
- సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు
- కస్టడీలోని నిందితుడి బాధ్యత దర్యాప్తు అధికారిదే
- విచారణ సందర్భంగా హైకోర్టు వ్యాఖ్యలు
- ముందస్తు బెయిల్ పిటిషన్ పై ముగిసిన వాదనలు
- తీర్పు రిజర్వ్... 24న వెల్లడిస్తామని స్పష్టీకరణ

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కస్టడీలో ఉన్న నిందితుడిని సంరక్షించాల్సిన బాధ్యత దర్యాప్తు అధికారిదేనని, నిందితుడికి కస్టడీలో ఏదైనా హాని జరిగితే వివరణ ఇవ్వాల్సిన బాధ్యత ఆ అధికారిపైనే ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. రఘురామకృష్ణంరాజు కస్టోడియల్ టార్చర్ ఘటన జరిగిన గుంటూరు సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో పిటిషనర్ విజయ్‌పాల్ అడిషనల్ ఎస్పీ హోదాలో ఉన్నారని, రఘురామపై నమోదుచేసిన కేసుకు ఆయనే దర్యాప్తు అధికారి అని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో కస్టోడియల్ టార్చర్ ఆరోపణలపై వివరణ ఇచ్చుకోవాల్సిన బాధ్యత ఆయనపై ఉంటుందని వ్యాఖ్యానించింది. రఘురామ పెట్టిన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ విజయ్‌పాల్ వేసిన వ్యాజ్యం విచారణ సందర్భంగా జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ ఈ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం జరిగిన విచారణలో ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ హైకోర్టులో వాదనలు వినిపించారు. "రఘురామ విషయంలో చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసులే దానిని ఉల్లంఘించారు. ఆయనను కస్టోడియల్ టార్చర్‌కు గురిచేసినప్పుడు పోలీసు అధికారి విజయ్‌పాల్ కస్టడీలో ఉన్నారు. కస్టడీలో తనను పలువురు ఉన్నతాధికారులు టార్చర్‌కు గురిచేశారని రఘురామ చెబుతున్న నేపథ్యంలో ఎవరి పాత్ర ఏమిటో తేల్చాల్సి ఉంది. అందుకు విజయ్‌పాల్‌ను ప్రశ్నించడం (ఇంటరాగేషన్) అవసరం. ఆ సమయంలో విజయ్‌పాల్ కింద పనిచేసిన అధికారులను కూడా ప్రశ్నించాల్సి ఉంది. తప్పుడు మెడికల్ రిపోర్ట్ ఇవ్వాలని డాక్టర్‌ను ఎవరు ప్రభావితం చేశారో తేల్చాలి. రఘురామను కస్టోడియల్ టార్చర్‌కు గురిచేశారని ఆర్మీ ఆసుపత్రి నివేదిక ఇచ్చినప్పటికీ సంబంధిత అధికారులపై ప్రభుత్వ యంత్రాంగం ఎలాంటి చర్యలు అప్పట్లో తీసుకోలేదు. తనను చంపుతారనే భయంతో రఘురామ ఆ సమయంలో ఫిర్యాదు చేయలేదు. ప్రభుత్వం మారిన తర్వాత కేసు పెట్టారు. ఈ వ్యవహారంలో విజయ్‌పాల్ దర్యాప్తునకు సహకరించడం లేదు. ముందస్తు బెయిల్ పొందేందుకు ఆయన అనర్హుడు" అని తెలిపారు. పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది వీరారెడ్డి వాదనలు వినిపించారు. "ఘటన జరిగిన మూడేళ్ల తర్వాత రఘురామ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కస్టడీలో ఉండగా ఎవరు దాడి చేశారనేది రఘురామకు అవగాహన ఉంది. అప్పుడే పోలీసులకు ఫిర్యాదు చేయకుండా తనకు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడిన తర్వాత కేసు పెట్టారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదులో పిటిషనర్‌పై నిర్దిష్టమైన ఆరోపణలు లేవు. కస్టోడియల్ టార్చర్ వ్యవహారంలో పిటిషనర్‌కు ఎలాంటి పాత్ర లేదు. పిటిషనర్‌కు ప్రస్తుతం 63 ఏళ్లు. అనేక ఆరోగ్యసమస్యలతో బాధపడుతున్నారు. దర్యాప్తుకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నారు. ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు ఎలాంటి షరతులు విధించినా అభ్యంతరం లేదు" అని తెలిపారు. రఘురామ తరఫు న్యాయవాది పీవీజీ ఉమేష్‌చంద్ర వాదనలు వినిపించారు. "తన కస్టడీలో ఉన్న నిందితుడిని చిత్రహింసలకు గురిచేస్తే, అందులో తన పాత్రలేదని పిటిషనర్ తప్పించుకోలేరు. ఓ ఎంపీ (అప్పటి)పై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తే సామాన్య ప్రజల పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవాలి. రఘురామను చిత్రహింసలకు గురిచేయడంలో పోలీసు ఉన్నతాధికారుల పాత్ర ఉంది. ఈ ఘటనపై మేజిస్ట్రేట్ వద్ద ప్రైవేటు ఫిర్యాదు చేసినప్పటికీ, తిరిగి ఆ కేసును పోలీసులే విచారించాలి. ఈ నేపథ్యంలోనే న్యాయం కోసం ప్రభుత్వం మారిన తర్వాత రఘురామ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పిటిషనర్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే తప్పుడు సంకేతాలు వెళ్తాయి. పిటిషన్‌ను కొట్టివేయాలి" అని కోరారు. ఇరువైపుల వాదనలు ముగియడంతో న్యాయమూర్తి తీర్పు రిజర్వ్ చేశారు. ఈ నెల 24న నిర్ణయం వెల్లడిస్తామన్నారు.

చెత్త పన్ను రద్దు

- నిర్ణయం తీసుకొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- మరో ఎన్నికల హామీ నెరవేర్చిన టీడీపీ

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం విధించిన చెత్త పన్నును రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల పురపాలక శాఖపై జరిగిన సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ మేరకు నిర్ణయం తీసుకొన్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. గత వైసీపీ ప్రభుత్వం విధించిన చెత్తపన్ను తీవ్ర వివాదాస్పదమైంది. నగరాలు, పట్టణాల్లో ప్రతి ఇంటి నుంచీ ప్రతి నెలా ఈ పన్ను వసూలు చేయాలని నిర్ణయించి వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను రంగంలోకి దించారు. అనుకొన్న స్థాయిలో చెత్త పన్ను వసూళ్లు లేవని భావించి ఆస్తి పన్నులో దీనిని కలిపేసి వసూలు చేయాలని కూడా భావించారు. చెత్త పన్నును టీడీపీ తీవ్రంగా వ్యతిరేకించింది. తాము అధికారంలోకొస్తే దాన్ని రద్దు చేస్తామని కూడా ప్రకటించింది. ఇటీవల పురపాలక శాఖపై సమీక్షలో ఈ అంశం చర్చకు వచ్చింది. "చెత్త పన్ను రద్దు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. దానికి కట్టుబడి ఉన్నాం. ఇకపై వసూలు చేయవద్దు" అని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. చెత్త తరలింపునకు అయ్యే ఖర్చును కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు తమ సొంత ఆదాయ వనరుల నుంచి భరించాలని ఆయన సూచించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

నాపై విజిలెన్స్ విచారణను కొట్టివేయండి

▸▸ హైకోర్టులో వైవీ సుబ్బారెడ్డి పిటిషన్.. ఎల్లుండి విచారణ

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు ఛైర్మన్‌గా తాను తీసుకున్న నిర్ణయాలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణను కొట్టివేస్తూ ఆదేశాలివ్వాలంటూ వైసీపీ రాజ్యసభ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. బోర్డు ఛైర్మన్‌గా పలు అక్రమాలకు పాల్పడ్డానని, తీసుకున్న పలు నిర్ణయాలపై వివరణ ఇవ్వాలని విజిలెన్స్ ఎస్పీ కోరారని.. ఆరోపణలపై వివరణ ఇచ్చేందుకు సంబంధిత డాక్యుమెంట్లు ఇవ్వాలని కోరితే ఆయన స్పందించలేదని తెలిపారు. టీటీడీ వ్యవహారాలపై విచారణ జరిపే అధికార పరిధి రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు లేదన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాధారణ పరిపాలన శాఖ (విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్) ముఖ్యకార్యదర్శి, డైరెక్టర్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ, టీటీడీ ఈవోలను ప్రతివాదులుగా చేర్చారు. ఈ వ్యాజ్యం సోమవారం న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ ముందు విచారణకు రానుంది.

బెంగళూరు ప్రైవేట్ కాలేజీ టాయ్‌లెట్‌లో కెమెరా

▸▸ విద్యార్థి వద్ద ఎనిమిది వేల వీడియోలు.. అరెస్టు చేసిన పోలీసులు

బెంగళూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీ టాయిలెట్‌లో సీక్రెట్ కెమెరా బయటపడింది. ఈ వ్యవహారంలో పోలీసులు ఓ విద్యార్థిని శుక్రవారం అరెస్టు చేశారు. మైసూరు రోడ్డులోని ఓ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని టాయ్‌లెట్‌కు వెళ్లిన సమయంలో సీక్రెట్ కెమెరాను గుర్తించింది. భయంతో కేకలు వేస్తూ బయటకు వచ్చింది. సహ విద్యార్థులు అక్కడికి వెళ్లి విషయం తెలుసుకున్నారు. కెమెరా పెట్టిన విద్యార్థి కుశాల్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విషయం తెలుసుకున్న కుంబళగోడు పోలీసులు కళాశాలకు చేరుకున్నారు. కెమెరా పెట్టిన కుశాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. కుశాల్ అదే కళాశాలలో కంప్యూటర్‌సైన్స్ చదువుతున్నాడు. అతని వద్ద ఏకంగా ఎనిమిది వేల వీడియో క్లిప్పింగ్‌లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

23 నుంచి నైరుతి నిష్క్రమణ

విశాఖపట్నం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల నిష్క్రమణ మరో రెండు రోజుల్లో ప్రారంభం కానుంది. ఈ నెల 23న వాయవ్య భారతంలోని పశ్చిమ రాజస్థాన్, కచ్ పరిసరాల నుంచి నైరుతి రుతుపవనాలు నిష్క్రమించనున్నాయని, అందుకు అనువైన వాతావరణం నెలకొందని భారత వాతావరణ శాఖ శుక్రవారం వెల్లడించింది. పశ్చిమ మధ్య, నైరుతి బంగాళాఖాతంలో శుక్రవారం ఆవరించిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉత్తర కోస్తాలో పలుచోట్ల ఉరుములు, పిడుగులతో తేలికపాటి నుంచి ఒక మోస్తరుగా, అక్కడక్కడా భారీవర్షాలు కురిశాయి. అయితే దక్షిణ కోస్తాలో ఎండ తీవ్రత కొనసాగింది. ఈ వారంలో రెండోసారి కావలిలో 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. నెల్లూరులో 39 డిగ్రీలు నమోదైంది. దక్షిణ కోస్తాలో వేడి వాతావరణం కొనసాగుతుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. రానున్న రెండు రోజుల్లో నైరుతి రుతుపవనాలు చురుగ్గా మారనున్నందున ఆదివారం నుంచి కోస్తాలో వర్షాలు పెరుగుతాయని తెలిపింది.

ఫిర్యాదుకు వెళ్తే అరెస్టు చేసి లైంగికంగా వేధించారు

భువనేశ్వర్, సెప్టెంబరు 20: పోలీసులతో అనుచితంగా ప్రవర్తించారని భువనేశ్వర్‌లో అరెస్టు చేసిన సైనికాధికారి స్నేహితురాలు... కస్టడీలో పోలీసులు తనను లైంగికంగా వేధించారని ఆరోపించింది. ఈ ఘటనకు సంబంధించి ఐదుగురు పోలీసులను సస్పెండ్ చేసినట్లు ఒడిశా పోలీసు ఉన్నతాధికారులు ప్రకటించారు. భువనేశ్వర్‌లోని భరత్‌పూర్ పోలీసులు సెప్టెంబరు 15న ఆమెను అరెస్టు చేయగా... హైకోర్టు బెయిలు ఇవ్వడంతో గురువారం విడుదల చేశారు. భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌లో ఆమె చికిత్స పొందుతోంది. ఘటనపై ఆమె మాట్లాడుతూ... తమ రెస్టారెంటును మూసివేశాక అర్ధరాత్రి తన స్నేహితుడైన సైనికాధికారితో కలిసి ఇంటికి వెళుతుండగా కొందరు వ్యక్తులు తమతో అనుచితంగా ప్రవర్తించారని చెప్పింది. దీంతో భరత్‌పూర్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయబోగా.. పోలీసులు తన స్నేహితుడిని లాకప్‌లో పెట్టారని వాపోయింది. అనంతరం ఒక అధికారి వచ్చి తనను కొట్టి, లైంగికంగా వేధించినట్లు వాపోయింది. ఈ కేసును సుమోటోగా తీసుకున్న జాతీయ మహిళా కమిషన్ ఒడిశా డీజీపీ నుంచి నివేదిక కోరింది.

రాహుల్ గాంధీపై ఛత్తీస్‌గఢ్‌లో 3 ఎఫ్‌ఐఆర్‌లు

రాయ్‌పూర్, ఢిల్లీ, సెప్టెంబరు 20: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అమెరికా పర్యటనలో భాగంగా ఈ నెల 9న సిక్కులపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ ఆయనపై 3ఎఫ్‌ఐఆర్‌లు దాఖలు చేసింది. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్, బిలాస్‌పూర్, దుర్గ్ జిల్లాల్లో బీజేపీ నేతలు వీటిని దాఖలు చేశారు. రాహుల్ వ్యాఖ్యలు సిక్కుల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయంటూ భారత న్యాయ సంహిత సెక్షన్ 299, సెక్షన్ 302ల ప్రకారం కేసులు పెట్టారు. మరోవైపు, రాహుల్ వ్యాఖ్యలను నిరసిస్తూ ఢిల్లీలోని కాంగ్రెస్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆందోళన నిర్వహించింది.

మోదీ ప్రభుత్వం, సెబీ లాగా కళ్లు మూసుకోం

▸▸ స్విస్ ఖాతాల వ్యవహారంలో అదానీల చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

▸▸ అక్రమార్కులు తప్పించుకోలేరన్న ఆ దేశ అటార్నీ జనరల్ ఆఫీసు

బెర్న్ (స్విట్జర్లాండ్): స్విట్జర్లాండ్‌లో అదానీ గ్రూప్ పప్పులు ఉడికేలా లేవు. ఈ నెల 12న తమ ఫెడరల్ క్రిమినల్ కోర్టు స్తంభింప చేసిన 31 కోట్ల డాలర్ల (సుమారు రూ.2,589 కోట్లు) బ్యాంకు ఖాతాల్లోని నిధులు ఏ భారత పారిశ్రామికవేత్తవి? ఈ ఖాతాల్లోకి ఆ నిధులు ఎలా వచ్చాయనే విషయాలపై స్విస్ అటార్నీ జనరల్ ఆఫీస్(ఓఏజీ) దర్యాప్తు చేస్తోంది. అయితే ఈ దర్యాప్తు వివరాలను వెల్లడించేందుకు ఓఏజీ నిరాకరిస్తోంది. కనీసం ఈ ఖాతాల వెనక ఎవరున్నారనే విషయం చూచాయగా వెల్లడించేందుకు కూడా ఇష్టపడడం లేదు. అయితే తమ దర్యాప్తు నరేంద్ర మోదీ ప్రభుత్వం, మార్కెట్ నియంత్రణ మండలి సెబీ చేపట్టినట్టుగా తూతూమంత్రంగా ఉండదని, నిజాల నిగ్గు తేల్చి అక్రమార్కుల భరతం పట్టేలా ఉంటుందని ఓఏజీ అధికార వర్గాలు తెగేసి చెబుతున్నాయి. అసలు దోషులెవరో తేల్చాక, తమ చట్టాల ప్రకారం వారిపై భారీ జరిమానాలతో పాటు జైలు తప్పదని స్పష్టం చేశారు. నిజానికి ఈ ఖాతాలు స్తంభింపచేసినప్పుడే స్విస్ మీడియా ఈ ఖాతాల అసలు మాయగాళ్లు ఎవరో స్పష్టమైన సంకేతాలే ఇచ్చింది. అదానీ సోదరుల్లో ఒకరైన వినోద్ అదానీ ఈ రహస్య ఖాతాల నిధులతో భారత్‌లోని అదానీ గ్రూప్ కంపెనీల షేర్ల దందా నడిపిస్తున్నట్టు హిండెన్‌బర్గ్ గతేడాదే బయటపెట్టింది. అయితే దీనికి ఆధారాల్లేవని సెబీ.. సుప్రీంకు తెలపడంతో అదానీలు బయట పడ్డారు.

ఆ వివరాలూ చెప్పం: సెబీ

మరోవైపు ఈ మొత్తం వ్యవహారంలో సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ పాత్రపై అనుమానాలు తొలగడం లేదు. ఆమె ఏ ఏ కంపెనీల ఫైల్స్ తన పరిశీలనకు వచ్చినప్పుడు ఆమె ఆ బాధ్యత నుంచి తప్పుకున్నారనే వివరాలు వెల్లడించేందుకు సెబీ నిరాకరిస్తోంది. ఆర్‌టీఐ కింద లోకేశ్ బాత్రా అనే ఒక మాజీ సైన్యాధికారి అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చేందుకు సెబీ నిరాకరించింది. తన, తన కుటుంబ సభ్యుల ఆర్థిక ఆస్తుల వివరాలు ఆమె సెబీకి ఎప్పుడు వెల్లడించారు? అందుకు సంబంధించిన పత్రాల కాపీలు ఇచ్చేందుకు కూడా సెబీ అంగీకరించడం లేదు.

హస్తకళలకు మరింత ప్రాచుర్యం

▸▸ లేపాక్షి కళాకృతులను పరిశీలించిన పవన్..కుమార్తె ఆద్యతో కలిసి షాపింగ్



మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఉన్న లేపాక్షి సంస్థలోని కళాకృతులు, కలంకారీ వస్త్రాలను పరిశీలించి, తన కుమార్తె ఆద్యకు కలంకారీ వస్త్రంతో చేసిన బ్యాగ్, కొయ్య బొమ్మలు కొనుగోలు చేసి ఇస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హస్త కళాకారులు రూపొందించిన కళాకృతులు, కలంకారీ వస్త్రాలు కీలకమైన సందర్భాల్లో అతిథులకు ఇచ్చి సత్కరించడం ద్వారా మన రాష్ట్ర కళా సంపదకు ప్రాచుర్యం అందించడంతో పాటు హస్త కళాకారులకు తగిన ప్రోత్సాహం లభిస్తుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. శుక్రవారం ఆయన లేపాక్షి సంస్థలో కొలువుదీరిన వివిధ ప్రాంతాలకు చెందిన కళాకృతులను కుమార్తె ఆద్యతో కలిసి తిలకించారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన కళాకృతులతో గిఫ్ట్ హ్యాంపర్ సిద్ధం చేయించి వాటిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముద్ర, అందులో కళాకృతుల వివరాలతో కూడి కార్డు ఉంచాలని పవన్ నిర్ణయించారు. వాస్తవానికి ప్రభుత్వ సమావేశాలకు, వేడుకలకు రాష్ట్ర అతిథుల హోదాలో వచ్చే ప్రముఖులు, ప్రతినిధులను గౌరవించి సత్కరించేటప్పుడు, అదే విధంగా మన రాష్ట్రం తరఫున ఇతర రాష్ట్రాలకు వెళ్లినప్పుడు మర్యాదపూర్వకంగా జ్ఞాపికలు ప్రదానం చేస్తుంటారు. అయితే, నిబంధనల ప్రకారం డిప్యూటీ సీఎం హోదాలో అతిథులకు ఇచ్చే జ్ఞాపికల్లో 60 శాతం ప్రభుత్వం నుంచి ఖర్చు చేయవచ్చు. కానీ పవన్ కల్యాణ్ కేవలం 40 శాతం మాత్రమే ప్రభుత్వం నుంచి తీసుకుని, మిగిలిన 60 శాతం తన సొంత సొమ్మును ఇచ్చేందుకు నిర్ణయించారు. ఈ మేరకు పేషీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే, పవన్ ఈ సందర్భంగా తన కుమార్తె ఆద్య ముచ్చటను కూడా తీర్చారు. కలంకారీ వస్త్రంతో చేసిన బ్యాగ్, కొండపల్లి బొమ్మలు చూసి ఆద్య ముచ్చటపడగా, పవన్ వాటిని కొనుగోలు చేసి ఆమెకు కానుకగా ఇచ్చారు.

ఇజ్రాయెల్‌పై 140 రాకెట్లతో దాడి!

▸▸ లెబనాన్‌లో దాడులకు ప్రతిగానే: హిజ్బుల్లా

▸▸ ఇజ్రాయెల్ దాడుల్లో హిజ్బుల్లా కమాండర్ మృతి

జెరూసలెం, సెప్టెంబరు 20: ఉత్తర ఇజ్రాయెల్‌పై హిజ్బుల్లా రాకెట్ల వర్షం కురిపించింది. శుక్రవారం 140 రాకెట్లతో దాడి చేసింది. దక్షిణ లెబనాన్‌లో దాడులకు ప్రతీకారంగానే ఈ దాడులకు దిగినట్లు తెలిపింది. ఉత్తర ఇజ్రాయెల్‌లోని పలు మిలటరీ బ్యారెక్స్‌పై ఈ దాడులు జరిపినట్లు ప్రకటించింది. లెబనాన్ సరిహద్దుల నుంచి మూడు విడతలుగా రాకెట్లు దూసుకొచ్చిన విషయాన్ని ఇజ్రాయెల్ ఆర్మీ కూడా ధ్రువీకరించింది. ఎక్కువ శాతం రాకెట్లు మైదాన ప్రాంతాల్లో పడినట్లు తెలిపింది. మరోవైపు, లెబనాన్‌పై ఇజ్రాయెల్ విమానాలు ఎడతెరిపి లేకుండా దాడులు చేస్తున్నాయి. వైమానిక దాడుల్లో 100 రాకెట్ లాంచర్లను ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ రక్షణ దళం(ఐడీఎఫ్) ప్రకటించింది. మరోవైపు ఇజ్రాయెల్ వాయుసేన జరిపిన దాడిలో వెస్ట్‌బ్యాంక్‌లోని క్యాబాటియాలో కీలక ఉగ్ర కమాండర్ షాదీ జక్రానే హతమైనట్లు ఐడీఫ్ ప్రకటించింది. బీరుట్‌లో జరిపిన లక్షిత దాడుల్లో హిజ్బుల్లా అగ్ర కమాండర్ ఇబ్రహీం సహా 8మంది ఉగ్రవాదులు హతమైనట్లు తెలిపింది. కాగా, లెబనాన్‌లో పేజర్లు, వాకీటాకీల పేలుళ్లలో 879 మంది హిజ్బుల్లా సభ్యులు మరణించినట్లు హిజ్బుల్లా అంతర్గత నిఘా విభాగం పత్రాల ద్వారా వెల్లడైంది.

లాలు ప్రాసిక్యూషన్‌కు రాష్ట్రపతి అనుమతి



▸▸ భూములకు ఉద్యోగాల కేసుపై ముందుకు సాగనున్న సీబీఐ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20: తక్కువ ధరకు భూములు తీసుకొని వాటి యజమానులకు ఉద్యోగాలు ఇచ్చారన్న కేసులో రైల్వే శాఖ మాజీ మంత్రి లాలూ ప్రసాద్‌ను సీబీఐ ప్రాసిక్యూట్ చేసేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అనుమతి ఇచ్చారు. 2004-09 మధ్య లాలూ రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు బహుమతులుగా భూములను పొందడం, తక్కువ ధరకు కొనుగోలు చేయడం ద్వారా లబ్ధి పొందారని, వాటి యజమానులకు రైల్వే ఉద్యోగాలు ఇచ్చారంటూ సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ కేసులో లాలు, ఆయన కుటుంబంతో పాటు మరో 30మందికిపైగా నిందితులు ఉన్నారు. రాష్ట్రపతి అనుమతి పత్రాన్ని సీబీఐ ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టుకు సమర్పించింది.

'స్టార్ హెల్త్' వినియోగదారుల డేటా చోరీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20: దేశంలోని ప్రఖ్యాత ఆరోగ్య బీమా సంస్థ అయిన స్టార్ హెల్త్ సమాచారం అపహరణకు గురయింది. దాదాపు 31 లక్షల మంది వినియోగదారుల వ్యక్తిగత వివరాలు, సున్నితమైన మెడికల్ రిపోర్టులు కూడా బహిర్గతమయ్యే ప్రమాదం ఏర్పడింది. ఈ సమాచారాన్ని డౌన్‌లోడ్ చేసుకున్న కొందరు వ్యక్తులు టెలిగ్రాం యాప్‌లోని చాట్‌బోట్స్ ద్వారా అమ్మకానికి పెట్టారు. క్సెన్‌జెన్ పేరుతో ఓ యూజర్ చాట్‌బోట్స్ రూపొందించాడు. దాని సాయంతో స్టార్‌హెల్త్ వినియోగదారులకు చెందిన వివిధ రకాల పత్రాలు, పాలసీ, క్లెయిముల వివరాలు, మెడికల్ రిపోర్టులు, పేర్లు, ఫోన్ నెంబర్లు, అడ్రసులు, పన్ను వివరాలు, ఐడీ కార్డులు, ఇతర సమాచారం కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపాడు. వినియోగదారుల సమాచారం బహిర్గతం కావడంపై స్టార్ హెల్త్ స్పందించింది. దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపింది.

న్యాయ వ్యవస్థపైనే ఆరోపణలా?

▸▸ సీబీఐపై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20: పశ్చిమ బెంగాల్‌లోని కోర్టుల్లో న్యాయ విచారణ సరిగ్గా జరగడం లేదంటూ సీబీఐ చేసిన ఆరోపణలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బెంగాల్‌లో 2021 ఎన్నికల తర్వాత జరిగిన హింసకు సంబంధించిన కేసులను ఆ రాష్ట్రం వెలుపలకు బదిలీ చేయాలని సీబీఐ గతంలో వేసిన పిటిషన్‌ను జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిథాల్‌ల ధర్మాసనం తాజాగా విచారించింది. అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) ఎస్వీ రాజును ఉద్దేశించి ఈ సందర్భంగా తీవ్ర వ్యాఖ్యలు చేసింది. 'మిస్టర్ రాజు.. ఏం ఆధారాలున్నాయని బెంగాల్‌లోని అన్ని కోర్టుల్లోనూ ప్రతికూల వాతావరణం ఉందని చెబుతున్నారు.. మీ అధికారులు(సీబీఐ) ఆ రాష్ట్రాన్ని ఇష్టపడకపోవచ్చు అంతమాత్రాన అక్కడ న్యాయవ్యవస్థే సరిగ్గా పనిచేయడం లేదంటారా..? సీబీఐ లాంటి కేంద్ర సంస్థలు ఇటువంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం. బెంగాల్ కేసులను బదిలీ చేస్తే కోర్టులే శత్రువులని ధ్రువీకరించినట్లవుతుంది. పిటిషన్‌ను ఉపసంహరించుకోండి..' అంది.

ముస్లింలెక్కువుంటే పాకిస్థానా?

▸▸ కర్ణాటక హైకోర్టు జడ్జికి సుప్రీం ప్రశ్న

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20: ఓ కేసు విచారణ సందర్భంగా కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేదవ్యాసాచార్ శ్రీశానంద చేసిన వ్యాఖ్యలను శుక్రవారం సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. దీనిపై నివేదిక సమర్పించాలని ఆ హైకోర్టును ఆదేశించింది. యజమాని-అద్దెదారు మధ్య తలెత్తిన వివాదంపై విచారణ జరిపే సమయంలో బెంగళూరులోని ముస్లిం మెజార్టీ ప్రాంతాన్ని పాకిస్థాన్‌గా అభివర్ణించారు. ఆ కేసును వాదించిన మహిళా న్యాయవాదిని ఉద్దేశించి.. "ఎదుటి పక్షం గురించి ఆమెకు చాలా తెలిసినట్టుంది. ఎంతగా అంటే వారి లోదుస్తుల రంగు కూడా చెప్పేటంతగా..." అని వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యల వీడియోలు వైరల్‌గా మారడంతో సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ స్పందించారు. రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని హైకోర్టును ఆదేశించారు.

సుప్రీం యూట్యూబ్ చానల్ హ్యాక్

సుప్రీంకోర్టు యూట్యూబ్ ఛానెల్ శుక్రవారం హ్యాకింగ్‌కు గురయింది. అమెరికాకు చెందిన రిపిల్ ల్యాబ్స్ అనే సంస్థకు క్రిప్టో కరెన్సీ ప్రకటన వీడియో దీంట్లో ప్రత్యక్షమయింది. దాంతో తాత్కాలికంగా ఛానెల్‌ను నిలిపివేశారు.

సీఎంఆర్‌ఎఫ్‌కు విరివిగా విరాళాలు

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సమాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి పలువురు దాతలు, నేతలు విరాళాలు విరివిగా ఇస్తున్నారు. శుక్రవారం పలువురు సీఎం చంద్రబాబును కలసి విరాళాల చెక్కులను అందించారు. వారిని చంద్రబాబు అభినందించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ద్వారా అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్స్ రూ.67 లక్షల 29 వేల 398, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల రామకృష్ణ దంపతులు రూ.25 లక్షలు, నియోజకవర్గం ప్రజల నుంచి అందిన విరాళలు రూ.4.82 లక్షలు, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి రూ.15 లక్షల చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేశారు. వరదలో చిక్కుకు పోయిన మూడు గ్రామ పంచాయతీలకు ఒక్కొక్క దానికి రూ.లక్ష చొప్పున మొత్తం రూ.3 లక్షల చెక్కులను యువనటుడు ఆది డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు అందించారు.



టీడీపీ జిల్లా కార్యాలయంలో కూటమి ప్రభుత్వ పాలన వంద రోజులు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న నాయకులు

100 రోజుల అద్భుత పాలన: గన్నె ప్రసాద్

వన్‌టౌన్, సెప్టెంబరు 20: రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో 100 రోజుల్లో అనేక అద్భుతాలు చేసిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నె ప్రసాద్(అన్న) అన్నారు. ఆటోనగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం కూటమి ప్రభుత్వ పాలన 100 రోజుల పూర్తయిన సందర్భంగా వేడుకలు నిర్వహించారు. గన్నె ప్రసాద్‌తో పాటు టీడీపీ నాయకులు సింహాద్రి కనకాచారి, మాజీ కార్పొరేటర్ నరసింహచౌదరి తదితరులు కేక్ కట్ చేశారు. జగన్‌రెడ్డి పాలనలో అప్పులు పాలైన రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు గాడిలో పెడుతున్నారని గన్నె ప్రసాద్ అన్నారు. చెన్నుపాటి ఉషారాణి, గొల్లపూడి నాగేశ్వరరావు, గరిమెళ్ల నరేంద్ర, పొన్నం రవికుమార్, కోడూరు ఆంజనేయ వాసు, పామర్తి కిషోర్‌బాబు, భక్తుల దుర్గారావు, దేవరపల్లి ఆంజనేయులు, అబిద్ హుస్సేన్, జాస్తి సురేష్, యార్లగడ్డ రమేష్, సజ్జా రవి పాల్గొన్నారు.

మిస్ అండ్ మిస్టర్ టీన్ ఇండియా విజేతగా నేహాంజలి

భవానీపురం, సెప్టెంబరు 20: అలీ క్లబ్ మిస్ అండ్ మిస్టర్ టీన్ ఇండియా-2024 ఫైనల్లో విజేతగా భవానీపురానికి చెందిన దండా రాంబాబు, సామ్రాజ్యం కుమార్తె నేహాంజలి(14) నిలిచింది. కఠోర సాధన, తపస్సుతో టైటిల్‌ను కైవసం చేసుకుంది. నేహాంజలికి చిన్నతనం నుంచి మోడలింగ్‌లో ఆసక్తి ఉండటంతో ఇటీవల ఢిల్లీ వేదికగా నిర్వహించిన అలీ క్లబ్ మిస్ ఇండియా-2024 ఫైనల్ పోటీల్లో బరిలో దిగింది. 167 నగరాలకు చెందిన 90 మంది పాల్గొన్నారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 50 మందిని ఫైనల్‌కు ఎంపిక చేయగా అందులో నేహాంజలి విజేతగా నిలిచింది. ఆమెను మొఘ ల్రాజపురం శ్రీచైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ షబానా ఫిర్దోస్, రీజనల్ ఇన్‌చార్జి ఆర్.పద్మ, డీన్ టి.చరణ్ సన్మానించారు.



మిస్ అండ్ మిస్టర్ టీన్ ఇండియా టైటిల్‌తో నేహాంజలి



ఒప్పందం కుదుర్చుకుంటున్న ఏపీ జనాభా గణన డైరెక్టరేట్, పీబీ సిద్దార్థ కళాశాల సాంఖ్యక శాస్త్ర విభాగం

పీబీ సిద్ధార్థలో జనాభా గణన సమాచార పరిశోధనా కేంద్రం

మొగల్రాజపురం, సెప్టెంబరు 20: పర్వతనేని బ్రహ్మయ్య ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జనాభా గణన సమాచార పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు భారత ప్రభుత్వ గృహ మంత్రి త్వశాఖ ఆధ్వర్యంలో ఏపీ జనాభా గణన డైరెక్టరేట్, కళాశాల సాంఖ్యక శాస్త్ర విభాగం మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తెలిపారు. కళాశాల వెబినార్ హాల్‌లో శుక్రవారం మధ్యాహ్నం ఒప్పంద కార్యక్రమం నిర్వహించారు. జనాభా గణన సమాచార పరిశోధనా కేంద్రం, ప్రాధాన్యాన్ని దాని ప్రయోజనాలను ఏపీ జనాభా గణన డైరెక్టరేట్ సంచాలకుడు వి.బాలకిరణ్ వివరించారు. అందరూ ఈ కేంద్రాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఏపీ జనాభా గణన ఉప సంచాలకులు శిశుకుమార్, కళాశాల డైరెక్టర్ వి.బాబూరావు, డీన్ రాజేష్, సి.జంపాల, సాంఖ్యక శాస్త్ర విభాగాధిపతి జి.చక్రవర్తి పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

విద్యార్థుల సమస్యలపై సీఎం స్పందించాలి: ఏఐఎస్‌ఎఫ్



ధర్నాచౌక్‌లో నిరసన తెలుపుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

ధర్నాచౌక్, సెప్టెంబరు 20: "రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు, కస్తూర్బా హాస్టళ్లలో విద్యార్థుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి. సమస్యలపై సీఎం చంద్రబాబు స్పందించాలి." అని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్‌బాబు, శివారెడ్డి డిమాండ్ చేశారు. ధర్నాచౌక్‌లో శుక్రవారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేశారు. "ఆరు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను తక్షణమే విడుదల చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 1500 వార్డెన్, కుక్, కామాటి, వాచ్‌మెన్, అటెండర్ పోస్టులను భర్తీ చేయాలి. శిథిలావస్థకు చేరిన వసతిగృహాల మరమ్మతులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి. బాలికల రక్షణకు ప్రతీ హాస్టల్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను రూ.2500లకు పెంచాలి. వచ్చే బడ్జెట్‌లో సాంఘిక సంక్షేమ వసతి గృహాల అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాలి. విద్యార్థులకు న్యాయం చేయకుంటే భారీగా విద్యార్థులను సమీకరించి పోరాటాన్ని ఉధృతం చేస్తాం."అని నాయకులు హెచ్చరించారు. న్యాయవాది చలసాని అజయ్‌కుమార్ దీక్షను ప్రారంభించారు. ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి, నాజర్ జి, సహాయ కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, షాబీర్ బాషా, రాష్ట్ర కోశాధికారి సాయికుమార్ పాల్గొన్నారు.

బుద్దా వెంకన్నను కలిసిన ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



ఎంపీకి స్వాగతం పలుకుతున్న బుద్దా వెంకన్న

వన్‌టౌన్, సెప్టెంబరు 20: దుర్గమ్మ దర్శనానికి వచ్చిన విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు శుక్రవారం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న నివాసానికి విచ్చేశారు. ఆయనకు వెంకన్న స్వాగతం పలికి సత్కరించారు. ఇద్దరు తాజా రాజకీయాలపై చర్చించారు. ఉత్తరాంధ్ర ఇన్‌చార్జిగా టీడీపీని బలోపేతం చేశారని అప్పలనాయుడు కొనియాడారు.

వెస్ట్ ఏసీపీగా దుర్గారావు



విజయవాడ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఏసీపీగా ఎస్ఎస్‌వీకే దుర్గారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీసు కమిషనర్ రాజశేఖర బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంటెలిజెన్స్ డీఎస్పీగా పనిచేస్తున్న ఆయన కొద్దిరోజుల క్రితం ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇంతకు ముందు పశ్చిమలో కొత్తపేట ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు.

సౌత్‌జోన్ ఏసీపీగా బంగార్రాజు



వన్‌టౌన్, సెప్టెంబరు 20: సౌత్‌జోన్ ఏసీపీగా యు.బంగార్రాజు శుక్రవారం సూర్యారావుపేటలోని ఏసీపీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ ఏసీబీలో ఏసీపీగా పనిచేస్తున్న ఆయన బదిలీలో భాగంగా సౌత్‌జోన్ ఏసీపీగా వచ్చారు.

స్టేడియాల నిర్వహణపై సమావేశం నిర్వహించండి

● కలెక్టర్ సృజనకు కేపీ రావు లేఖ

విజయవాడ స్పోర్ట్సు, సెప్టెంబరు 20: "నగరంలోని దండమూడి రాజగోపాలరావు, చెన్నుపాటి రామకోటయ్య స్టేడియాల నిర్వహణను అధికారులు సక్రమంగా చేయకపోవడంతో ప్రైవేట్ వ్యక్తుల జోక్యం పెరిగింది. వీటి సక్రమ నిర్వహణను కోసం డీఎస్ఏ, వీఎంసీ కమిషనర్, స్పోర్ట్సు అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించేలా చూడండి." అని కలెక్టర్ సృజనకు శుక్రవారం ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ కేపీ రావు లేఖ రాశారు. ఎన్టీఆర్ జిల్లాలోను, నగరంలో క్రీడలకు తగు ప్రాధాన్యత ఇచ్చేలా వారితో చర్చించి కీలకమైన నిర్ణయాలను చేయాలని కలెక్టర్‌ను లేఖలో ఆయన కోరారు.

టీటీడీ ప్రసాదంలోనూ అవినీతి శోచనీయం

● ఏపీ ప్రొఫెషనల్ ఫోరం అధ్యక్షుడు నేతి మహేశ్వరరావు

ధర్నాచౌక్, సెప్టెంబర్ 20: "భక్తుల విశ్వాసాలతో ముడిపడిన అంశాల్లోనూ కమీషన్లకు కక్కుర్తిపడుతున్న రాజకీయ నాయకులను చూస్తే ఈ దేశం ప్రమాదంలో పడిందా అని ఆందోళన కలుగుతోంది. హిందువులు పవిత్రంగా భావించే టీటీడీ ప్రసాదంలోనూ అవినీతికి పాల్పడటం శోచనీయం." అని ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్ ఫోరం అధ్యక్షుడు నేతి మహేశ్వరరావు అన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. టీటీడీకి ఆవు నెయ్యి సరఫరా చేస్తున్న నందిని డెయిరీ సంస్థను కాదని మాంసం ఎగుమతులకు ప్రసిద్ధి చెందిన ఉత్తరప్రదేశ్‌లోని కంపెనీకి ఆవునెయ్యి కాంట్రాక్టు ఇవ్వడంలో ఉన్న దురుద్దేశం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఒంగోలు నుంచి రేషన్ బియ్యం టీటీడీ అన్నదానానికి వెళ్తున్న విషయం అప్పటి ఛైర్మన్ సుబ్బారెడ్డికి తెలికుండా జరిగిందా? అని ప్రశ్నించారు. సున్నితమైన, మతపరమైన అంశంపై రాజకీయ పార్టీలు, సంయమనంతో వ్యవహరించాలన్నారు.

రేపటి నుంచి గో ధ్వజస్థాపన భారత్ యాత్ర

ధర్నాచౌక్, సెప్టెంబరు 20: గో ప్రతిష్ఠ ఆందోళన- గో ధ్వజస్థాపన భారత్ యాత్ర ఈనెల 22 నుంచి అక్టోబరు 10 వరకు నిర్వహిస్తామని యాత్ర తెలంగాణ కమిటీ ఛైర్మన్ సీఎల్ రాజన్ తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. అమరావతి లోగో ధ్వజాన్ని స్థాపించి, గోమాతను జాతీయమాతగా ప్రకటించేందుకు శంకరాచార్య అవిముక్తేశ్వరానంద్ హాజరవుతారన్నారు. గోమాతకు జాతీయ మాతగా గౌరవం ఇవ్వడం, గో హత్యను నిలిపివేసేందుకు గో ప్రతిష్ఠా ఆందోళన దేశవ్యాప్తంగా కొనసాగుతుందన్నారు. యాత్రలో భాగంగా దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానుల్లో గో ధ్వజాన్ని ప్రతిష్ఠిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకరాచార్య స్వాగత కమిటీ రాష్ట్ర చైర్మన్ వేమూరి ఆనంద్ సూర్య, స్వామీజీలు బ్రహ్మచారి అఖిలేష్ కృపాజీ, వికాస్ పట్నాజీ, సమ న్వయకర్తలు గార్లపాటి విజయ్‌కుమార్, వారణాశి దుర్గా సారధి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు పరిహారంపై హర్షం

ధర్నాచౌక్, సెప్టెంబరు 20: వరద బాధితులు, వ్యాపారులకు సీఎం చంద్రబాబు నష్టపరిహారం ప్యాకేజీ ప్రకటించడంపై ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఏపీఎఫ్‌సీసీఐ) అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కరరావు శుక్రవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. నగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వరద బాధితులను ఆదుకునేందుకు ప్రజలు, వ్యాపారుల రుణాలకు బ్యాంకులు ఏడాదిపాటు మారటోరియం కల్పించినందుకు, ఇళ్లు, దెబ్బతిన్న గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న కుటుంబాలకు రూ.50 వేలు, మొదటి అపై అంతస్తుల్లో ఉన్నవారికి రూ.25 వేలు, వినియోగదారులు రుణాలు పొందడానికి వీలు కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. దుకాణాలు, వాణిజ్య సంస్థలకు, ఎంఎస్ఎంఈల రుణాలకు రీషెడ్యూల్ చేసి రెండేళ్లపాటు మారటోరియం ఇవ్వాలని బ్యాంకులను కోరినందుకు ఏపీ ఫెడరేషన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ తరఫున సీఎంకు వక్కలగడ్డ భాస్కరరావు ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్ర అభివృద్ధిలో చురుకైన పాత్ర పోషిస్తాం

● గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక


వన్‌టౌన్, సెప్టెంబరు 20: రాష్ట్ర అభివృద్ధిలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులుగా చురుకైన పాత్ర పోషిస్తామని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక జీఎస్‌డబ్ల్యూఎస్‌గేర్ స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎండీ జానీపాషా, షేక్ అబ్దుల్ రజాక్, వేల్పుల ఆర్లయ్య, బత్తుల అంకమ్మరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై దయ చూపించి ప్రభుత్వ శాఖల్లో విలీనం చేస్తూ పదోన్నతులు కల్పించాలని కోరారు. పే స్కేలు మార్పు చేయాలని, ఇంటింటికీ వెళ్లి అందించే సేవల నుంచి తమకు విముక్తి కల్పించాలని, సమాజంలో గౌరవం పెంపొందించే విధులు అప్పగించాలని వారు కోరారు. 1.3 లక్షల సచివాలయ ఉద్యోగుల మనోగతాన్ని పరిగణనలోకి తీసుకుని పరిష్కారం చూపాలని పేర్కొన్నారు. 100 రోజుల పాలన పూర్తిచేసిన కూటమి ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని, అందరిలో స్ఫూర్తి నింపుతున్నారని పేర్కొన్నారు.

బ్యాడ్మింటన్ ఫీజులు కార్పొరేషన్‌కు జమ చేస్తున్నారు

● డీఎస్ఏ బ్యాడ్మింటన్ కోచ్ కె.భాస్కర్ వివరణ

భవానీపురం, సెప్టెంబరు 20: శాప్ ఆదేశాల మేరకు చెన్నుపాటి రామకోటయ్య స్టేడియంలో ప్రతీ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు క్యూఆర్ కోడ్ ద్వారా రూ.1500 యూజర్ ఫీజును, రూ.500ను కార్పొరేషన్ కార్యాలయానికి జమచేస్తున్నారని డీఎస్ఏ బ్యాడ్మింటన్ కోచ్ కె.భాస్కర్ తెలిపారు. ప్రైవేట్ చేతిలో వీఎంసీ స్టేడియాలు 'శిక్షణ పేరుతో భారీ ఫీజుల బాదుడు' శీర్షికన ఈనెల 19న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి కోచ్ వివరణ ఇచ్చారు. తాను జూలై 12 నుంచి రామకోటయ్య స్టేడియంలో ఉదయం, సాయంత్రం జాతీయ పోటీల్లో పాల్గొనే 21 మంది క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నానని తెలిపారు. తానేమీ వారినుంచి వసూళ్లు చేయడం లేదన్నారు.

త్రోబాల్ రాష్ట్ర పోటీలకు ఉమ్మడి కృష్ణా జట్లు



ఎంపికైన జిల్లా అండర్-19 త్రోబాల్ జట్లు

విజయవాడ స్పోర్ట్సు, సెప్టెంబరు 20: విశాఖపట్నం ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఈనెల 21, 22వ తేదీల్లో నిర్వహించే త్రోబాల్ అండర్-19 ఉమ్మడి కృష్ణా పురుషులు, మహిళా జట్లు శుక్రవారం నగరంలోని ఇందిరాగాంధీ స్టేడియం నుంచి పయనమయ్యాయని త్రోబాల్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఈదా సులోచన తెలిపారు. జిల్లాకు పతకాలను సాధించాలని ఆమె ఆకాంక్షించారు. పురుష జట్టుకు కోచ్‌గా ఎ.దుర్గాప్రసాద్, మేనేజర్ గణేష్‌లు వ్యవహరిస్తారని సులోచన తెలిపారు.

పురుషుల జట్టు..

జె రవివర్మ, జె.ప్రమోద్, సీహెచ్ చరణ్‌తేజ్, సీహెచ్ చరణ్‌సాయి, ఎం.యశ్వంత్, కె.రాము, బి.సాయి సంతోష్, ఆర్.రాజ్‌దీప్, జ్యోతివర్మ, లక్కీ అక్షయ్, కె.గురుగణపతి, వెంకటేష్, భాస్కర్, డి.జోసెఫ్, ఎస్‌కే అఖిల్.

మహిళా జట్టు..

శర్వాణి, జోషిత, సాయిదుర్గ, ఎల్.దాక్షాయణి, బి.నీరజ, దుర్గ, ఎం.రిషిత, కె.మౌనిక, ఎస్.షణ్ముఖి, జి.మణిహాసిని, యుక్తా, టి.సుకీర్తి, ఎస్.హర్షిత, పి.కీర్తిశ్రీ.

నేటి నుంచి టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్

విజయవాడ స్పోర్ట్సు, సెప్టెంబరు 20: పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య వీఎంసీ ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 కృష్ణాజిల్లా ఆధ్వర్యంలో ఈనెల 21, 22వ తేదీల్లో బాల, బాలికల రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్(అంతర్ జిల్లాల) చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహిస్తున్నట్లు కృష్ణాజిల్లా ఆర్ఐవో, ఎన్టీఆర్ జిల్లా డీఐఈవో ఎస్ఎస్ఎన్‌రెడ్డి, కృష్ణాజిల్లా డీఐఈవో స్టాలన్‌రాజు, ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-19 సెక్రటరీ వేమూరి రవికాంత్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను శనివారం ఉదయం 10 గంటలకు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వి.విజయరాజు, సర్వశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ప్రారంభిస్తారని తెలిపారు. ఇందులో సత్తా చాటిన క్రీడాకారులతో రాష్ట్ర జట్టును ఎంపిక చేసి అక్టోబరు 5 నుంచి 9 వరకు లడక్‌లో నిర్వహించే టేబుల్ టెన్నిస్ జాతీయ చాంపియన్‌షిప్‌కు పంపుతామని వారు వివరించారు.

ఏపీ పర్యాటకంపై వియత్నాం ఆసక్తి

▸▸ విజయవాడలో 'ఏపీ-వియత్నాం టూరిజం కాన్‌క్లేవ్-2024'

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, వియత్నాం మధ్య పర్యాటక, సాంస్కృతిక బదలాయింపును పెంచే లక్ష్యంతో అనేక కార్యక్రమాలు చేపట్టామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడించారు. విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో శుక్రవారం 'ఆంధ్రప్రదేశ్-వియత్నాం టూరిజం కాన్‌క్లేవ్-2024' నిర్వహించారు. ఐరా ఓవర్సీస్ స్టడీస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి 200 మందికి పైగా పర్యాటక ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున పర్యాటక శాఖ



విజయవాడలో నిర్వహించిన ఏపీ- వియత్నాం టూరిజం సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేశ్

మంత్రి కందుల దుర్గేశ్, వియత్నాం తరఫున ఆ దేశ రాయబారి ఎన్‌గుయెన్ థన్హయ్ పాల్గొన్నారు. స్థానిక పర్యాటకంలో బౌద్ధరామాలు, స్మారకాలపై వియత్నాం ఆసక్తి కనబరిచింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రెండు ప్రధాన బౌద్ధ సర్క్యూట్లను అభివృద్ధి చేయాలని మంత్రి వారికి ప్రతిపాదించారు. అలాగే ఏపీలో పర్యాటకాభివృద్ధికి గల విస్తృత అవకాశాలను వివరించారు. ఎన్‌గుయెన్ థన్హయ్ మాట్లాడుతూ.. ఏపీలో తొలిసారి పర్యటిస్తున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని చెప్పారు. కాగా, శుక్రవారం ఏపీటీడీసీ కార్యాలయంలో ఆయన పర్యాటక శాఖపై మంత్రి దుర్గేశ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులంతా ఐకమత్యంతో పనిచేసి పర్యాటక సంస్థ అభివృద్ధికి పాటుపడాలన్నారు. సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయాలన్నారు.



స్లూయిజ్ గేటు చైన్‌ను పరిశీలిస్తున్న సిబ్బంది

ప్రకాశం బ్యారేజీ 'స్లూయిజ్' చైన్ల మార్పు!

▸▸ కొత్తవి ఏర్పాటు చేయాలని కన్నయ్యనాయుడు సూచన

▸▸ దెబ్బతిన్న చైన్‌ను పరిశీలించిన బెకమ్ కంపెనీ

విజయవాడ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీకి ఉన్న స్లూయిజ్ గేట్ల చైన్లను మార్చాలని జలవనరుల శాఖ అధికారులు యోచిస్తున్నారు. బ్యారేజీకి విజయవాడ వైపున ఆరు, గుంటూరు వైపున ఎనిమిది స్లూయిజ్ గేట్లు ఉన్నాయి. వాటికి ఇరువైపులా సమాంతరంగా రెండు చైన్లను బ్యారేజీపై ఉన్న మోటార్లకు అనుసంధానం చేశారు. 2019లో ప్రకాశం బ్యారేజీకి సుమారు 10 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. ఆ సమయంలో విజయవాడ వైపు ఉన్న స్లూయిజ్ గేట్ల చైన్లు దెబ్బతిన్నాయి. వాటిని మార్చాలని అధికారులు ప్రతిపాదనలు పంపినా అప్పటి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కొద్దిరోజుల క్రితం బ్యారేజీకి 11.47 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. ఆ సమయంలో ఐదు కార్గో బోట్లు వచ్చి బ్యారేజీ గేట్లను ఢీకొట్టాయి. ఈ క్రమంలో మూడు కౌంటర్ వెయిట్లు ధ్వంసం కాగా, వాటి స్థానంలో ఇనుప కౌంటర్ వెయిట్లు ఏర్పాటు చేశారు. కాగా, కౌంటర్ వెయిట్లు దెబ్బతిన్నప్పుడు జలవనరుల శాఖ ముఖ్యసలహాదారుడు కన్నయ్యనాయుడు బ్యారేజీ మొత్తాన్ని పరిశీలించారు. బ్యారేజీకి చేయాల్సిన మరమ్మతుల గురించి ఇంజనీరింగ్ అధికారులకు వివరించారు. అందులో భాగంగానే స్లూయిజ్ గేట్ల చైన్లు మార్చాలని సూచించారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద బోట్ల రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్న బెకమ్ కంపెనీ శుక్రవారం ఒక స్లూయిజ్ గేటుకు ఉన్న చైన్‌ను పరిశీలించి కొలతలు తీసుకుంది. ఈ నేపథ్యంలో త్వరలోనే అన్ని స్లూయిజ్ గేట్లకు కొత్త చైన్లు వస్తాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలోకి ఎంఎన్‌సీ కంపెనీల మద్యం

▸▸ కమీషన్ల బెడదతో గత ప్రభుత్వంలో వెనక్కి

▸▸ మళ్లీ ఇప్పుడు రాష్ట్రంలోకి ఎంఎన్‌సీ బ్రాండ్లు



అమరావతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో కమీషన్ల బెడదతో వెనక్కి వెళ్లిపోయిన ఎంఎన్‌సీ కంపెనీల మద్యం బ్రాండ్లు మళ్లీ రాష్ట్రంలోకి వస్తున్నాయి.వ్యాపారంలో రాజకీయ జోక్యం ఉండదని చంద్రబాబు ప్రభుత్వం హామీ ఇవ్వడంతో ఆయా కంపెనీలు తిరిగి సరుకు సరఫరా ప్రారంభించాయి. చాలాకాలంగా రాష్ట్రంలో కనిపించని మెక్‌డోవెల్స్, ఇంపీరియల్ బ్లూ బ్రాండ్లు శుక్రవారం రాష్ట్రంలో మద్యం డిపోలకు చేరాయి. మెక్‌డోవెల్స్ కంపెనీ 10వేల కేసులు, ఇంపీరియల్ బ్లూ కంపెనీ 60వేల కేసులు సరఫరా చేశాయి. వాటిలో కొన్ని మద్యం షాపులకు కూడా చేరాయి. వచ్చే పది రోజుల్లో మెక్‌డోవెల్స్ లక్ష కేసులు సరఫరా చేయనుందని ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంకే మీనా ఓ ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా పాపులర్ బ్రాండ్లను త్వరలోనే రాష్ట్రంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. యాంటిక్విటీ, రాయల్ చాలెంజ్, వాట్ 69, బ్లాక్‌డాగ్, వోడ్కా, జానీవాకర్ బ్రాండ్లు త్వరలోనే వస్తాయని తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్ల బదిలీలకు కౌన్సెలింగ్

▸▸ రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల

అమరావతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సబ్ రిజిస్ట్రార్ల బదిలీలకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. రెండేళ్లు దాటిన వారిని కచ్చితంగా బదిలీ చేయాలని నిర్ణయించారు. జూలై 31, 2024 నాటికి ఒకే స్టేషన్‌లో రెండేళ్లు పూర్తి చేసుకున్న వారు బదిలీల పరిధిలోకి వస్తారు. వీరందరినీ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేస్తారు. గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల్లో ఆఫీస్ బేరర్లుగా ఉన్న వారికి బదిలీల నుంచి మినహాయింపు ఉంటుంది. సబ్ రిజిస్ట్రార్లను ఏ, బీ, సీ అనే 3 భాగాలుగా విభజించారు. అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీలు, స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీలు, 3 ఏళ్ల సగటు నికర ఆదాయం రూ.50 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ నమోదైన జిల్లా హెడ్‌క్వార్టర్లు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఏ విభాగంలో, మూడేళ్ల సగటు నికర ఆదాయం రూ.50 కోట్ల కంటే తక్కువగా ఉన్న జిల్లా హెడ్‌క్వార్టర్లు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను బీ విభాగంలో, మూడేళ్ల సగటు నికర ఆదాయం రూ.15 కోట్లు లేదా అంత కంటే తక్కువగా నమోదైన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, అన్ని అసిస్టెంట్ చిట్ రిజిస్ట్రార్లు, ఆడిట్ యూనిట్లలో, డీఐజీ, కమిషనర్ కార్యాలయంలో పనిచేస్తున్న సబ్ రిజిస్ట్రార్లను సీ విభాగంలో ఉంచారు.

పాత విధానంలోనే సరుకుల పంపిణీ

▸▸ బీసీ గురుకులాల సెక్రటరీ ఆదేశాలు

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): బీసీ గురుకులాలు, హాస్టళ్లలో ప్రొవిజన్లు, ఇతర నిత్యావసర సరుకులను ఇప్పటికే సరఫరా చేస్తున్న సరఫరాదారులతోనే చేపట్టాలని బీసీ సంక్షేమశాఖ ఆదేశాలిచ్చింది. ఇటీవల అన్ని సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలకు పౌరసరఫరాల శాఖ ద్వారా ప్రొవిజన్స్ సరఫరా చేసేందుకు ఆ శాఖ కసరత్తు చేస్తోంది. దానిపై ఉన్నతస్థాయి నిర్ణయం జరిగిపోయిందని సమాచారముంది. ఈ నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ టెండర్లు పిలిచి 19 రకాల ప్రొవిజన్లకు ఖరారుచేసే పనిలో ఉందని చెప్తున్నారు. ఇప్పటికే సరఫరా చేస్తున్న సరఫరాదారుల కాంట్రాక్టు గడువు ముగియడంతో వారినుంచి ప్రొవిజన్లు తీసుకోవాలా?, పౌరసరఫరాలశాఖ అందిస్తుందా? అనే విషయం తెలియని వార్డెన్లు, గురుకులాల ప్రిన్సిపాళ్లకు స్పష్టతనిస్తూ బీసీ గురుకులాల సొసైటీ సెక్రటరీ మెమో జారీచేశారు.

25 నుంచి రంగా వర్సిటీలో వెబ్ ఆప్షన్ల ప్రక్రియ

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరం బైపీసీ విభాగంలో బీఎస్సీ అగ్రికల్చర్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీలో ప్రవేశాలకు మొదటి దశ ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఈ నెల 25, 26, 27 తేదీల్లో జరుగుతుందని రిజిస్ట్రార్ రామచంద్రరావు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు నిర్ణీత తేదీల్లో ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్ ప్రక్రియలో పాల్గొనాలని కోరారు.

విపత్తుకు 1,15,151 హెక్టార్ల పంట నష్టం

అమరావతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవలి భారీ వర్షాలు, వరదల వల్ల రాష్ట్రంలో 1,15,151 హెక్టార్లలో వ్యవసాయ పంటలకు నష్టం జరిగిందని అధికారులు తేల్చారు. ప్రభుత్వం ప్రకటించిన పరిహారం ప్రకారం 1,86,576మంది బాధిత రైతులకు రూ.278.49కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ అవసరమని డైరెక్టర్ ఢిల్లీరావు శుక్రవారం తెలిపారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా 1,12,721కోళ్లు మృతి చెందినట్లు పశుసంవర్థకశాఖ నిర్ధారించింది. పాలిచ్చే పశువులు 564, మేకలు, గొర్రెలు 719, ఇతర పశువులు 207 చనిపోయినట్లు గుర్తించింది. పశుపోషకులకు పరిహారంగా రూ.3.14కోట్లు అవసరమని అంచనా వేసినట్లు పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ అమరేంద్రకుమార్ తెలిపారు.

మార్కెటింగ్‌శాఖ ఇంజనీర్లపై క్రమశిక్షణ చర్యలు

అమరావతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లకు సంబంధించిన గోడౌన్లను షెడ్యూల్ ప్రకారం నిబద్ధతతో పూర్తి చేయనందుకు మార్కెటింగ్‌శాఖలో ముగ్గురు ఇంజనీరింగ్ అధికారులపై ప్రభుత్వం శాఖాపరంగా క్రమశిక్షణ చర్యలకు ఆదేశించింది. విజయవాడ ఈఈ శ్రీనివాసరావు, కాకినాడ డీఈఈ వెంకటేశ్వరరావు, ఏఈ శ్రీనివాసులుపై సాధారణ ప్రక్రియలో క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

స్వర్ణాంధ్ర 2047 రూపకల్పనకు మార్గదర్శకాలు

▸▸ ఉత్తర్వులు జారీ చేసిన పీయూష్ కుమార్

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యంగా విజన్ 2047 ప్రణాళికలు రూపొందించేందుకు కలెక్టర్లకు, మండల స్థాయి అధికారులకు ప్రభుత్వం మరికొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. గ్రామ, వార్డు స్థాయిల్లో కూడా 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల స్పందన ఆధారంగా మండల, జిల్లా స్థాయి విజన్ 2047 ప్రణాళికలు రూపొందించాలని ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. సెప్టెంబరు 20 నుంచి 26వ తేదీ వరకు గ్రామ/వార్డు స్థాయిల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంపై సభలు నిర్వహించి ముందుగానే సిద్ధం చేసుకున్న ప్రశ్నలకు ప్రజల నుంచి సూచనలు, సమాధానాలు స్వీకరించాలని ఆదేశించారు. 27 నుంచి 29 వరకు పాఠశాలలు, కళాశాలల్లో ఈ అంశంపై వ్యాసరచన, ఉపన్యాసాలు, చర్చలు నిర్వహించాలని సూచించారు. 30 నుంచి అక్టోబరు 5 వరకు జిల్లా కలెక్టర్ ఆ జిల్లా పరిధిలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో స్వర్ణాంధ్ర 2047 అంశంపై సూచనలు, ప్రణాళికలు స్వీకరించాలన్నారు. ఆ తర్వాత జిల్లా కలెక్టర్లు రైతులు, ప్రముఖులు, ఇతర వ్యాపార అసోసియేషన్లతో చర్చించి సూచనలు తీసుకోవాలని పేర్కొన్నారు. మండల స్థాయి ప్రణాళిక తయారు చేయడానికి తుది గడువు సెప్టెంబరు 30గా, జిల్లా స్థాయిలో స్వర్ణాంధ్ర 2047 ప్రణాళిక సిద్ధం చేయడానికి తుది గడువు అక్టోబరు 5గా ప్రభుత్వం నిర్ణయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సీఐడీ విచారణపై భయమెందుకో!

▸▸ లడ్డూలో నెయ్యి కల్తీపై జగన్ ఎంక్వైరీ చేయాలంటారు..

▸▸ వద్దంటూ సుబ్బారెడ్డి కోర్టుకెళ్తారు

▸▸ వైసీపీ జమానాలో ఒక్క జ్యుడీషియల్ ఎంక్వైరీ అయినా వేశారా?

▸▸ ప్రతిదీ సీఐడీకి అప్పగింత

▸▸ బాబు సహా తప్పుడు కేసులతో అరెస్టులే!

▸▸ ఇప్పుడు తిరుమల లడ్డూ ప్రసాదంపై.. సీఐడీ దర్యాప్తునకు ఆదేశించే చాన్సు!

▸▸ ఇరుక్కుంటామన్న ఆందోళనతోనే ముఖ్య నేతల విన్యాసాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు ఉందన్న రిపోర్టు ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశిస్తుందేమోనన్న భయం మాజీ సీఎం జగన్‌ను వణికిస్తోందా? సీఐడీ దర్యాప్తునకు ఆదేశించే అవకాశం ఉందని తెలియడంతోనే .. వైసీపీ ముఖ్యనేతల్లో భయం ఆవహించిందా..? తాజా పరిణామాలు అదే సూచిస్తున్నాయని రాజకీయ వర్గాలు అంటున్నాయి. తప్పేమైనా జరిగితే ఎలాంటి విచారణకైనా సిద్ధమేనని మాజీ ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్మోహనరెడ్డి, టీడీడీ మాజీ చైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి సవాల్ విసరాలి. కానీ అందుకు విరుద్ధంగా శుక్రవారంనాడు జగన్, సుబ్బారెడ్డి వ్యవహరించారు. వారి మాటల్లో తొట్రుపాటు అడుగడుగునా కనిపించింది. మాజీ సీఎం విలేకరులతో మాట్లాడుతూ.. లడ్డూ వ్యవహారంపై విచారణ జరగాలన్నారు. గంటా పదినిమిషాల పాటు మాట్లాడితే.. కేవలం ఒకేసారి విచారణ కోరారు. మిగిలిన సమయమంతా .. చంద్రబాబును బీజేపీ, ప్రధాని మోదీ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి తిట్టాలని కోరుకున్నారు. ఎలాంటి విచారణకైనా సిద్ధమేనని సవాల్ విసరడం తర్వాత.. మాటమాత్రంగానైనా అనలేదు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం తనపై విజిలెన్స్ విచారణ జరపకుండా స్టే విధించాలని వైవీ సుబ్బారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి చేత గానీ.. అది నియమించే కమిటీతో గానీ న్యాయ విచారణ జరిపించాలని సుబ్బారెడ్డి కోరారు. ఒకవైపు విజిలెన్స్ విచారణపై స్టే కోరుతూ.. మరోవైపు న్యాయవిచారణ అడగడంపై న్యాయ నిపుణులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఒక్కటంటే ఒక్కటైనా..

చంద్రబాబు 2014-19 నడుమ సీఎంగా ఉన్నప్పుడు జరిగినవాటిపై తన ఐదేళ్ల పాలనలో జగన్మోహన్‌రెడ్డి ఏనాడూ న్యాయ విచారణకు ఆదేశించలేదు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో గవర్నర్ ఆమోదం కూడా తీసుకోకుండా సీఐడీ పోలీసులు చంద్రబాబును అరెస్టు చేశారు. జగన్ జమానాలో ఎవరైనా విమర్శిస్తూ సోషల్ మీడియా పోస్టులు పెట్టినా.. వాటిని లైక్ చేసినా.. భూఆక్రమణలున్నాయంటూ ఫిర్యాదులు వచ్చినా సీఐడీ దర్యాప్తునకు ఆదేశించడం.. అర్ధరాత్రి సమయంలో గోడలు దూకి మరీ పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం జరిగాయి. ఏనాడూ న్యాయ విచాణకు జగన్ ఆదేశించలేదు. ప్రతి చిన్న విషయానికీ సీఐడీని వాడేసుకున్న జగన్ అండ్ కో.. ఇప్పుడు కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసిన తిరుమల లడ్డూ విషయంలో సీఐడీ విచారణను ఎదుర్కొనేందుకు ఎందుకు భయపడుతున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జగన్ మాటలకూ.. సుబ్బారెడ్డి చేతలకూ పొంతన లేకపోవడంపై తీవ్ర చర్చకు దారితీసింది. గతంలో చంద్రబాబును, టీడీపీ నేతలను పలు కేసుల్లో సీఐడీ జైలు పాలు చేసినప్పుడల్లా.. నాటి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మీడియా ముందు ప్రత్యక్షమయ్యేవారు. బెయిల్ కోరకుండా జైళ్లలోనే మగ్గి.. నిజాయితీ నిరూపించుకోవాలని సలహా ఇచ్చేవారు. కానీ ఇప్పుడాయన కనిపించడమే గగనమైపోయింది. కీలక అంశాలపై మీడియాతో మాట్లాడానికే ఒక్క వైసీపీ నేత కూడా ముందుకు రావడంలేదు.

జగన్ జైలుకెళ్లడం ఖాయం

▸▸ కరుణాకరరెడ్డి, వైవీకీ అదే గతి.. మంత్రి సత్యకుమార్ యాదవ్

తిరుపతి(విద్య), సెప్టెంబరు 20: జగన్ జైలుకు వెళ్లడం ఖాయమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తిరుపతిలో శుక్రవారం జరిగిన 'పీఎం విశ్వకర్మ పథకం' ప్రథమ వార్షికోత్సవ సభలో ప్రసంగించారు. మాజీ సీఎం జగన్‌కు తెలిసే లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు పదార్థాలు కలిశాయని ఆరోపించారు. దీనిపై విచారణ పూర్తయిన తరువాత జగన్ జైలుకు వెళ్తారని, భూమన కరుణాకర్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డికీ అదేగతి పడుతుందని అన్నారు. వైసీపీ నేతలను వేంకటేశ్వరస్వామి ఎన్నటికీ క్షమించరని, కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసిన వైసీపీకి పుట్టగతులు ఉండవని మండిపడ్డారు. జగన్ రాజకీయ సన్యాసం తీసుకునే సమయం దగ్గర పడిందని వ్యాఖ్యానించారు.

లడ్డూ ప్రసాదంలో గొడ్డు మాంసమా?

▸▸ బ్రాహ్మణ చైతన్య వేదిక మండిపాటు

గుంటూరు, సెప్టెంబరు 20: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి కైంకర్యాలలో జగన్ ప్రభుత్వం అపచారాలు చేయటం క్షమించరాని నేరమని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ ఆక్షేపించారు. శుక్రవారం గుంటూరులో ఆయన మాట్లాడుతూ 'తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో గొడ్డు మాంసం నూనె, పంది మాంసం నూనె, చేప నూనె, పత్తి గింజల నూనె, పామాయిల్, సోయాబీన్ ఆయిల్ వాడి ప్రసాదంగా విక్రయించడం నీచమైన విషయం. జుగుప్సాకరమైన పదార్థాలతో స్వామివారికి నైవేద్యాలు పెట్టారంటే జగన్ ప్రభుత్వం పెద్ద అపచారం చేసింది. దైవంపట్ల చేసిన తప్పుడు పనులకే ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశాడని, చివరికి వైసీపీ పార్టీనే లేకుండా చేస్తాడని' శ్రీధర్ అన్నారు.

ప్రధాని అమెరికా పర్యటనలో
నిరసనలకు ప్లాన్

▸▸ ఉగ్రవాది పన్నూ ప్రణాళికలు: నిఘా వర్గాలు

▸▸ నేటినుంచి 3 రోజులు అగ్రరాజ్యంలో మోదీ పర్యటన



న్యూఢిల్లీ, సెప్టెంబరు 20: తనను హత్య చేసేందుకు భారత ప్రభుత్వం కుట్ర పన్నిందని అమెరికా కోర్టులో పిటిషన్ వేసిన ఖలిస్థానీ ఉగ్రవాది గురపత్వంత్ సింగ్ పన్నూ.. ఇప్పుడు ప్రధాని మోదీ అమెరికా పర్యటన వేళ పెద్దసంఖ్యలో నిరసనలకు ప్లాన్ చేసినట్లు ఉన్నత నిఘా వర్గాలు పేర్కొన్నాయి. అమెరికా పౌరసత్వం కలిగిన పన్నూ పలు దేశాల్లో ఉగ్రవాద చర్యలకు బాధ్యుడు. అతడిపై భారత్‌లో ఎన్ఐఏతో పాటు రాష్ట్ర పోలీసు శాఖల్లో పలు కేసులు నమోదయ్యాయి. నిజ్జర్ హత్యతో పాటు తనపై జరిగిన హత్యాయత్నాన్ని సాకుగా చూపుతూ పన్నూన్ మద్దతు కోరుతున్నట్లు నిఘా వర్గాలు చెబుతున్నాయి. 'అమెరికాతో పాటు పాక్‌కు చెందిన ఐఎస్ఐ సహా వివిధ ఏజెన్సీల నుంచి పన్నూకు భారీగా నిధులు అందుతున్నాయి. దీనికి బదులుగా అమెరికా, యూకే, కెనడా, పాకిస్థాన్ వంటి పలు దేశాలకు అతను సేవలు అందిస్తున్నాడు. యుద్ధ సమయంలో రష్యాతో భారత్ సాన్నిహిత్యంపై ఆందోళన చెందుతున్న ఈ దేశాలు భారత్‌ను స్వీయరక్షణలోకి నెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయి. ప్రపంచం ముందు భారత ప్రధానిని ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నించే ఇలాంటి ఉగ్ర గ్రూపుల సహాయంతో వారు ఈ పని చేస్తున్నారు. అయితే ప్రధానికి ప్రవాసాంధ్రులు, వివిధ హిందూ సంఘాలు భారీ ఎత్తున స్వాగతం పలుకుతాయన్న విషయాన్ని వీరు మర్చిపోతున్నారు. మోదీకి స్వాగతం పలికేందుకు సిక్కులు కూడా వస్తున్నారు" అని ఆ వర్గాలు వివరించాయి. కాగా, ఈ నెల 21 నుంచి 23 వరకూ ప్రధాని మోదీ అమెరికాలో పర్యటించనున్నారు. వరుసగా మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన అమెరికాలో పర్యటించడం ఇదే మొదటిసారి.

అత్యాచార కేసుల్లో కఠిన శిక్షలు

▸▸ రెండు కేసుల్లో నిందితులకు 20 ఏళ్లు,

▸▸ మరో కేసులో 25 ఏళ్ల జైలుశిక్ష

▸▸ గతంలో గుంటూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఘటనలు

గుంటూరు లీగల్/రాజవొమ్మంగి, సెప్టెంబరు 20: రాష్ట్రంలో గతంలో చోటుచేసుకొన్న పలు అత్యాచార ఘటనలకు సంబంధించి న్యాయస్థానాలు తాజాగా ఇచ్చిన తీర్పుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడ్డాయి. 2018 జూన్ 29న ఓ నర్సింగ్ యువతిపై అత్యాచార కేసులో గుంటూరు జిల్లా మంగళగిరి మండలం ఆత్మకూరుకు చెందిన యాదగిరి శ్రీనివాస్‌కు 20 ఏళ్ల జైలు, రూ.10 వేల జరిమానా విధిస్తూ గుంటూరు ఐదవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి కె.నీలిమ శుక్రవారం తీర్పు ఇచ్చారు. అదేవిధంగా మైనర్ బాలికపై 2018 జూన్ 22న జరిగిన అత్యాచారం కేసులో గుంటూరులోని ఏటుకూరు రోడ్డు సుగాలి కాలనీకి చెందిన బాణవతు గోపినాయక్, నెహ్రూనగర్‌కు చెందిన షేక్ మహమ్మద్ రఫీకి 20 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ గుంటూరు పోక్సో కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి కె.నీలిమ తీర్పునిచ్చారు. ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున జరిమానా కూడా విధించారు. 2020 నాటి ఆరేళ్ల బాలికపై అత్యాచారానికి సంబంధించి నమోదైన మరో పోక్సో కేసులో అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలం ఎర్రంపాడు గ్రామానికి చెందిన నిందితుడు వరహాలబాబుకు 25 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.11 వేల జరిమానా విధిస్తూ కాకినాడ స్పెషల్ పోక్సో కోర్టు తీర్పు ఇచ్చింది. బాధిత కుటుంబానికి రూ.7 లక్షలు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. నర్సింగ్ యువతి కేసులో మరో నిందితుడు రాసగిరి రాఘవయ్య కోర్టు విచారణకు హాజరుకాకపోవడంపై న్యాయస్థానం అతనిపై వారెంట్ జారీచేయడంతోపాటు, గతంలో కేసు నుంచి అతన్ని వేరు చేసింది. శ్రీనివాస్‌పై నేరారోపణలు రుజువు కావటంతో న్యాయమూర్తి పై మేరకు తీర్పు వెలువరించగా, రాఘవయ్యపై కేసు పెండింగ్‌లో ఉంది.

'నేను ఉన్నాను... నేను విన్నాను'
అంతా బోగస్

▸▸ జగన్ వైఖరితో వైసీపీకి భవిష్యత్తు లేదు: సామినేని



జగ్గయ్యపేట, సెప్టెంబరు 20: "జగన్... 'నేను విన్నాను... నేను ఉన్నాను' అని చెప్పే మాటలు ఉత్తి బోగస్" అని ప్రభుత్వ మాజీ విప్, జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట లో శుక్రవారం ఆయన నియోజకవర్గ వైసీపీ కార్యకర్తల సమావేశంలో ఉద్విగ్నంగా మాట్లాడారు. 'వైఎస్ రాజశేఖరరెడ్డిపై అభిమానంతో ఇప్పటి వరకు ఆ పార్టీలో కొనసాగా. ప్రజలు ఈ విధమైన తీర్పు ఇచ్చాక కూడా జగన్ వైఖరిలో మార్పు రాలేదు. ఇక ఆ పార్టీకి భవిష్యత్తు లేదు. నేను ఎమ్మెల్యేగా ఉన్న ఐదేళ్లలో సీఎం జగన్ అపాయింట్‌మెంట్ దొరకటం దుర్లభమైంది. సమస్యలపై విజ్ఞాపనలు ఇస్తే కనీసం సంబంధిత శాఖకు ఎండార్స్‌మెంట్ ఇచ్చే పరిస్థితి కూడా ఉండేది కాదు. సమస్యలపై వివరించినా పట్టించుకోలేదు. అతని వైఖరి వల్ల ఓటమి చెందాం. వైఎస్‌ను ఏ సమయంలోనైనా కలిసేవాళ్లం. అపాయింట్‌మెంట్ అవసరం ఉండేది కాదు. పార్టీ జెండా పట్టి జిల్లాలో బలోపేతం చేసిన నాకంటే వెనుక చేరిన వ్యక్తులే జగన్‌కు ముఖ్యమయ్యారు. ఆయన ముందు ప్రతిపక్ష నేతలను అసభ్యంగా మాట్లాడిన వారికే పదవులు వచ్చేవి. తనలాంటి నిబద్ధత కలిగిన వ్యక్తులు అంటే ఇష్టముండేది కాదు. పార్టీ నేతలు శుభలేఖలు ఇవ్వాలన్న జగన్ వద్ద కోటరీ అంగీకరించేది కాదు' అని పేర్కొన్నారు.

మరింత సమయం ఇవ్వండి

▸▸ కృష్ణా జలాలపై ట్రైబ్యునల్‌ను కోరిన ఏపీ, తెలంగాణ

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల పంపిణీపై తమ తమ వాదనలను వినిపించడానికి మరింత సమయం కావాలని రెండు తెలుగు రాష్ట్రాలు బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్‌ను అభ్యర్థించాయి. శుక్రవారం నాడు ట్రైబ్యునల్ ముందుకు రావాల్సిన ఆంధ్రప్రదేశ్... రిజాయిండరు, సాక్షుల వాదనలతో కూడిన పిటిషన్ వేసేందుకు తమకు కొంత గడువు కావాలని కోరింది. తెలంగాణ... తమ వాదనలతో కూడిన అఫిడవిట్‌ను వేసేందుకు రెండు వారాల గడువు కావాలని అభ్యర్థించింది. ఇద్దరి అభ్యర్థనలనూ ట్రైబ్యునల్ ఆమోదించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు అనుమతిని ఇచ్చింది.



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్న, వేదికపై కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం

▸▸ కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

▸▸ ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయం: మంత్రి అచ్చెన్న

▸▸ ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: మంత్రి సంధ్యారాణి

▸▸ శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో శుక్రవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం జరిగింది. శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం రాజపురంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రి అచ్చెన్న పాల్గొన్నారు. వైసీపీ పాలనలో అథోగతి పాలైన రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఉద్దానంలో కొబ్బరి పార్కు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. వంశధార, నాగావళి, బహుదా నదుల అనుసంధానానికి చర్యలు చేపడతామని చెప్పారు. ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసి, ఉపాధి కల్పిస్తామని అన్నారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ సమస్యల పరిష్కారంతోపాటు సంక్షేమ పథకాల అమలుతో ప్రజల మనసును కూటమి ప్రభుత్వం గెలుచుకుందన్నారు. కార్యక్రమంలో ఇచ్చాపురం, పలాస ఎమ్మెల్యేలు బెందాళం అశోక్, గౌతు శిరీష, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు నియోజకవర్గం మామిడిపల్లి గ్రామంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొన్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అన్నింటా వెనుకబడిపోయిందని రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నడిపించేందుకు సీఎం చంద్రబాబు శాయశక్తులా కృషి చేస్తున్నారని అన్నారు. పార్వతీపురం మండలం ములగ పంచాయతీలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, పాలకొండలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

ఏఎన్నార్ ప్రతి నటుడికీ స్ఫూర్తి: బాలకృష్ణ

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): తెలుగు సినిమా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిన అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకోవడం గర్వకారణమని సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. అక్కినేని ప్రతి నటుడికీ మార్గదర్శకమన్నారు. నాటక రంగం నుంచి చిత్ర రంగం వరకు ఏఎన్నార్ అందించిన సేవలు, ఆయన చేసిన సుదీర్ఘ ప్రయాణం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఇక ప్రక్షాళనే!

▸▸ కలకలం రేపిన 'ఆంధ్రజ్యోతి' కథనం

▸▸ పీఆర్ కమిషనరేట్‌లో సిబ్బంది చేతివాటంపై చర్చ

▸▸ సమగ్ర విచారణకు ఆదేశించిన డైరెక్టర్ కృష్ణతేజ

అమరావతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ కమిషనరేట్‌లో సిబ్బంది చేతివాటంపై శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం కలకలం రేపింది. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉద్యోగులు, అధికారులు ఈ కథనాన్ని వాట్సా‌ప్‌లలో సర్క్యులేట్ చేస్తూ హడావుడి చేశారు. గత నాలుగేళ్లుగా అవినీతి సిబ్బంది ఆగడాలను భరించలేక ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు.. ఈ వార్తతో ఏదైనా స్పందన వస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఈ వార్త చదివిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ కృష్ణతేజ వెంటనే స్పందించినట్లు సమాచారం. ఈ కథనంలోని ప్రతి అంశంపైనా సమగ్రమైన విచారణ చేసి సిబ్బందిపై సత్వరమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. బదిలీల కోసం వచ్చిన అధికారుల నుంచి కమిషనరేట్ సిబ్బంది భారీగా ముడుపులు స్వీకరించడం, దరఖాస్తు చేసుకున్న అధికారుల సమాచారం తెలుసుకుని వారికి ఫోన్లు చేసి రూ.లక్షలు గుంజుకోవడం తదితర విషయాలపై ఆరా తీసినట్లు తెలిసింది. దీంతో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలోని పలువురు అధికారులు.. రాష్ట్ర నలుమూలల నుంచి కమిషనరేట్‌కు వచ్చిన వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కొంత మంది మహిళా అధికారులు వారిని పురుగులు చూసినట్లు చూసి అసహనం ప్రదర్శిస్తున్నారని పలువురు డైరెక్టర్ దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిసింది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన తోటి ఉద్యోగుల పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తున్నారని, సమాధానం సరిగా చెప్పకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు వ్యాఖ్యానించినట్లు సమాచారం. అత్యంత సౌమ్యుడైన డైరెక్టర్ తన కార్యాలయ పరిధిలో ప్రతి ఉద్యోగి పట్ల ఎంతో ఆప్యాయంగా, గౌరవంగా ఉంటారు. ఇలాంటి కార్యాలయంలో మర్యాదలు తెలియని సిబ్బంది, అధికారులు పనిచేయడం ఇబ్బందిగా ఉందని పలువురు పేర్కొంటున్నారు. కమిషరేట్ సిబ్బంది ప్రవర్తనపై పూర్తిగా అధ్యయనం చేసి సంస్కరణలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది.

100 రోజుల పాలనపై బహిరంగ చర్చకు సిద్ధమా?

▸▸ జగన్‌కు వర్ల రామయ్య సవాల్

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): తన వంద రోజుల పాలన, చంద్రబాబు వంద రోజుల పాలనపై జగన్ బహిరంగ చర్చకు రాగలరా? అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య సవాల్ చేశారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాటాడారు. 'జగన్ పాలనలో వైసీపీ నేతలు తిరుమల తిరుపతి దేవస్థానంలో అనేక రకాలుగా అవినీతికి పాల్పడి, అందినంత దోచుకున్నారు. శ్రీవారి పట్ల జగన్ చేసిన నికృష్ట కార్యాలకు హైందవ భక్తులు భగ్గుమంటున్నారు. తిరుపతి లడ్డూల్లో కల్తీ నెయ్యి వాడిన వ్యవహారంలో అందరి వేళ్లూ జగన్ వైపు చూపిస్తున్నాయి. జగన్ కంగారులో ప్రెస్‌మీట్ పెట్టి, కల్తీ నెయ్యిపై సమాధానం చెప్పకుండా చంద్రబాబు పాలనపై విమర్శలు చేస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేయడం విడ్డూరం. టీటీడీ చైర్మన్‌గా కరుణాకరరెడ్డి అనే నాస్తికుడిని పెట్టారు. బాక్సైట్ మాఫియా నడిపిన వైవీ సుబ్బారెడ్డిని విశిష్ట భక్తుడని జగన్ చెప్పడం హాస్యాస్పదం' అని వర్ల మండిపడ్డారు.

విజయవాడ- బెంగళూరు మధ్య వందే భారత్ నడపాలి

▸▸ కేంద్రానికి టీటీడీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు వినతి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విజయవాడ- బెంగళూరు మధ్య కొత్తగా వందే భారత్ రైలును నడపాలని కేంద్ర రైల్వే, సమాచార, ప్రసార మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు టీటీడీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మంత్రితో భేటీ అయిన ఆయన, విజయవాడ- బెంగళూరు మధ్యరైలు సర్వీసులు పెంచాలని కోరారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రైలు సర్వీసులు పెంచేందుకు రైల్వే శాఖ చర్యలు తీసుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, ఎక్స్‌టెండెడ్ రియాలిటీ రంగాల అభివృద్ధికి నేషనల్ సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్‌ను స్థాపించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు.

నీతి ఆయోగ్ సీఈవోతో మంత్రి టీజీ భరత్ భేటీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యంతో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి మంత్రి టీజీ భరత్ శుక్రవారం భేటీ అయ్యారు. ఉత్పాదక రంగంలో ఏపీ పురోగతికి సంబంధించి విజన్ 2047, వచ్చే ఐదేళ్ల విజన్ గురించి ఇరువురూ చర్చించారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● శనివారం 21 సెప్టెంబరు 2024
diksuchi@andhrajyothy.com

పర్యావరణం - అధ్యయనం

పోటీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ జాగ్రఫీ

పర్యావరణాన్ని ఆంగ్లంలో ఎన్విరాన్‌మెంట్ అంటారు. ఈ పదాన్ని ఫ్రెంచ్ భాష నుంచి గ్రహించారు. ఫ్రెంచ్‌లో ఎన్విరానర్ అంటే చుట్టూ ఆవరించి ఉండటం లేదా చుట్టుకొని ఉండటం అని అర్థం.

నిర్వచనాలు: మనచుట్టూ ఆవరించి ఉన్న గాలి, నీరు, నేల, జంతువులు, వృక్షాలు అనగా జీవ, నిర్జీవ వ్యవస్థల సమ్మేళనాన్ని 'పర్యావరణం' అంటారు. (లేదా) మానవుని చుట్టూ పరిసరాలు ఏర్పడటానికి కారణమయ్యే సాంఘిక, ఆర్థిక, జీవ, భౌతిక రసాయనిక కారకాల సమ్మేళనాన్ని పర్యావరణం అంటారు.

డగ్లస్, హోలెండ్: జీవరాశుల జీవితాన్ని, స్వభావాన్ని, ప్రవర్తనను, అభివృద్ధిని, పరిపక్వతను ప్రభావితం చేసే అన్ని బాహ్యశక్తులు, ప్రభావాలు, పరిస్థితుల సమిష్టి స్వరూపాన్ని వర్ణించడానికి పర్యావరణం అనే పదాన్ని ఉపయోగిస్తారు.



● **ఎ.గౌడై:** తన గ్రంథం ద నేచర్ ఆఫ్ ద ఎన్విరాన్‌మెంట్‌లో భౌతిక పరిణామాలే పర్యావరణమని, దానిని ప్రభావితం చేసే వారిలో మానవుడు అతి ముఖ్యమైన వాడని చెప్పారు.

● **బోరింగ్:** ఈయన పిండోత్పత్తి నుంచి మృత్యువు వరకు వ్యక్తి పొందే భౌతిక స్పందనల సమ్మేళనమే పర్యావరణమని చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా పర్యావరణంపై అవగాహన కలిగించేందుకు 1974 నుంచి ఏటా జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించాలని ఐక్యరాజ్య సమితి నిర్ణయించింది.

పర్యావరణ అనుఘటకాలు

పర్యావరణం, జీవులు, నిర్జీవులు అనే రెండు ప్రాకృతికమైన అనుఘటకాలతో నిండి ఉంటుంది. పర్యావరణంలో రెండు అనుఘటకాలు ఉంటాయి. అవి-

ఎ) **జీవ అనుఘటకాలు:** వృక్షాలు, జంతువులు, సూక్ష్మజీవులు మొదలైనవి.

బి) **నిర్జీవ అనుఘటకాలు:** ఇవి మూడు రకాలు

1) శీతోష్ణస్థితిపరమైనవి: కాంతి, ఉష్ణం, వర్షపాతం మొదలైనవి.

2) భౌతికపరమైనవి: గాలి, నేల(మైదానాలు, పీఠభూములు, లోయలు మొదలైనవి), నీరు.

3) రసాయనికపరమైనవి: సేంద్రీయపరమైన కార్బొహైడ్రేట్స్, ప్రొటీన్స్, లిపిడ్స్, నిరేంద్రీయ పరమైన సోడియం, పొటాషియం, కాల్షియం, పాస్ఫరస్ మొదలైనవి.

పర్యావరణం - వర్గీకరణ

దీనిని మూడు రకాలుగా వర్గీకరించవచ్చు.

1) మానవ నిర్మిత పర్యావరణం/ కృత్రిమ పర్యావరణం

2) సహజసిద్ధ పర్యావరణం

1) మానవ నిర్మిత పర్యావరణం: మానవ నిర్మిత పర్యావరణాన్ని సామాజిక - సాంస్కృతిక పర్యావరణం అంటారు. సహజంగా ఏర్పడినవి కాకుండా మానవుడు తయారు చేసిన లేదా నిర్మించిన ఆవరణాన్ని మానవ నిర్మిత పర్యావరణంగా చెప్పుకోవచ్చు. ఉదాహరణకు పంట పొలాలు, అక్వేరియాలు, పూల తోటలు, చేపల చెరువులు, విద్యాసంస్థలు, పార్కులు, వాణిజ్య సంస్థలు మొదలైన వాటిని మానవ నిర్మిత పర్యావరణంగా పరిగణించవచ్చు.

2) సహజసిద్ధ పర్యావరణం: సౌర మండలంలో ఏ గ్రహానికి లేని విశిష్ట లక్షణం భూ మండలానికి ఉంది. జీవరాశికి అనువైన వాతావరణం ఒక్క భూ మండలానికే ఉంది. మన చుట్టూ ఉండే గాలి, నీరు, వివిధ జీవరాశులు అంటే మానవులు, జంతువులు, వృక్షాలు, పక్షులు, క్రిమికీటకాలు, సూక్ష్మజీవులు మొదలైన వాటిని కలిపి సహజసిద్ధ పర్యావరణం అంటారు. మానవుని ప్రమేయం లేకుండా భూమిపై గల అనుకూల శీతోష్ణస్థితి ప్రభావాల కారణంగా ఏర్పడినదే 'సహజసిద్ధ పర్యావరణం' అంటారు.

సహజసిద్ధ పర్యావరణాన్ని వాటి స్థితిని బట్టి నాలుగు రకాలుగా విభజించారు.

ఎ) వాతావరణం బి) జలావరణం
సి) శిలావరణం డి) జీవావరణం

ఎ) వాతావరణం: ఈ పదాన్ని గ్రీకు పదాలైన Atoms (vapour), Sphaira (Sphere) ఆవరణం నుంచి ఉద్భవించింది. గ్రీకుభాషలో ఆట్మాస్ అంటే గాలి/ఆవిరి అని అర్థం. ఈ ఆవరణాన్ని ఆంగ్లంలో అట్మాస్ఫియర్ అంటారు. భూమి పైభాగాన్ని కప్పి ఉన్న దుమ్ము, ధూళి, వాయువుల మిశ్రమాన్ని వాతావరణం అంటారు(లేదా) భూమిపై వ్యాపించి ఉన్న గాలిపొరను వాతావరణం అంటారు.

● భూమి చుట్టూ వాతావరణం లేకుంటే అంతరిక్షం నుంచి వెలువడే కాస్మిక్ కిరణాలు, సౌర కిరణాలు భూమిపై ప్రసరించి అన్ని గ్రహాల వలే ఒక ఉష్ణగోళంగా మారిపోయి, జీవరాశులకు ఆవాసం లేకుండా పోయేది. భూగోళం చుట్టూ వాతావరణం ఉండటం వల్ల జీవరాశి మనుగడకు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. కాబట్టి సహజంగా వాతావరణంలో ఉన్న ఆక్సిజన్, నైట్రోజన్, కార్బన్ డై ఆక్సైడ్, నీటి ఆవిరి మొదలైన వాటికి జీవ వైవిధ్యంలో కీలక పాత్ర ఉంది.

● వీటితోపాటు వాతావరణంలో దుమ్ము, ధూళి, లవణ కణాలు, సూక్ష్మ కణ రూపంలో ఉండి వాతావరణ ప్రక్రియల్లో ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయి.

● వాతావరణం గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని మెటరాలజీ అంటారు.

● వాతావరణం మనల్ని వెచ్చగా ఉంచుతుంది. ఇది భూ ఉపరితల ఉష్ణోగ్రతలను నియంత్రిస్తుంది. తీవ్రమైన పగలు - రాత్రి ఉష్ణోగ్రత వ్యత్యాసాలను తగ్గిస్తుంది.

● గాలి, వర్షం, మంచు మొదలైన అంశాలు, వాతావరణంపైనే ఆధారపడతాయి. వర్షం, గాలులు లేకుంటే జీవుల మనుగడ కష్టమవుతుంది. ఈ విధులే కాకుండా వాతావరణం సూర్యుని నుంచి విడుదలయ్యే హానికర అతి నీలలోహిత కిరణాల వల్ల కలిగే నష్టాన్ని నివారించడంలో సహాయపడుతుంది.

● ప్రపంచ వాతావరణ దినోత్సవం మార్చి 23(1950 నుంచి మొదలు)

● **ప్రపంచ వాతావరణ దినోత్సవం 2021 థీమ్:** పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ

● **ఉద్దేశం:** పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణకు చెట్లను చురుకుగా నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడం, పెరుగుతున్న కాలుష్య స్థాయిని తగ్గించడం.

వాతావరణం లక్షణాలు

● దీనికి రంగు, రుచి, వాసనలు ఉండవు. అయితే ఇది వాసనలను శబ్దాలను, ఒక చోట నుంచి మరో చోటకు మోసుకెళ్తుంది.

● ఇది పారదర్శకమైన లక్షణాన్ని కలిగి స్థితిస్థాపక శక్తిని కలిగి ఉంటుంది.

● భూమిని ఆవరించి ఉండటంతో సూర్యుని నుంచి వెలువడే హానికరమైన అతి నీలలోహిత కిరణాలను భూమిని చేరనీయకుండా జీవజాతిని రక్షిస్తుంది.

● వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులకు సంబంధించి వాతావరణంపై అధ్యయనం చేసేందుకు 1950 మార్చి 23న 180 దేశాల సభ్యత్వంతో ప్రపంచ వాతావరణ సంస్థను ప్రారంభించారు. ఈ సంస్థ ఏర్పడిన రోజును ప్రపంచ వాతావరణ దినోత్సవంగా నిర్ణయించారు. యూఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ దినోత్సవం జరుగుతుంది.

వాతావరణ సంఘటనం

వాతావరణం ఘన, ద్రవ, వాయు పదార్థాలతో ఏర్పడి ఉంటుంది. అవి-

1. ఘన పదార్థాలు: భూ ఉపరితలం నుంచి వాతావరణంలోకి చేరే దుమ్ము, ధూళి రేణువులు, కాలుష్య కణాలే వాతావరణంలోని ఘన పదార్థాలు. ఇవి పరిమితికి మించి చేరితే వాతావరణ పారదర్శకత దెబ్బతిని ఎదురుగా ఉన్న వస్తువులు మన కంటికి కనిపించకపోవడం, వాతావరణం కాలుష్యానికి లోనవుతుంది.

2. ద్రవ పదార్థాలు: వాతావరణంలోకి చేరి నీటి ఆవిరిని ద్రవ పదార్థంగా పేర్కొనవచ్చు.

3. వాయు పదార్థాలు: క్లోరిన్ తప్ప మిగిలిన అన్ని వాయు పదార్థాలు భూ వాతావరణంలో ఉన్నాయి.

వాతావరణంలోని వివిధ వాయువులు

(1) నైట్రోజన్- 78.09% (2) ఆక్సిజన్- 20.94%
(3) ఆర్గాన్- 0.93%
(4) కార్బన్ డై ఆక్సైడ్- 0.03%
(5) మీథేన్, ఇతర వాయువులు- 0.01%

నైట్రోజన్(78.09%): వాతావరణంలో అధిక శాతంలో ఉన్న వాయువు ఇది.

● ఇది వృక్ష ప్రపంచానికి ముఖ్యంగా లెగ్యుమినేసి మొక్కలకు వరప్రసాదం. దీని ద్వారానే వృక్షాలు నత్రజని తయారుచేసుకుని వాటి పెరుగుదలలో వినియోగించుకుంటాయి.

ఆక్సిజన్(20.94%): - ఆక్సిజన్‌ను ప్రాణ వాయువు అని అంటారు. కారణం జీవుల శ్వాసక్రియలో కీలకపాత్ర పోషిస్తుంది.

● వాతావరణంలోని ఆక్సిజన్ దహన ప్రక్రియను స్థిరీకరించే ముఖ్యమైన వాయువు.

● సూర్యుని నుంచి భూమి వైపు ప్రసరించే ప్రమాదకరమైన అతి నీలలోహిత కిరణాలను హరింపచేస్తుంది.

● ఓజోన్ వాయువు ఏర్పర్చడంలో కీలకపాత్ర పోషిస్తుంది.

ఆర్గాన్(0.93%): దీనిని ఎలక్ట్రిక్ బల్బుల్లో ఉపయోగిస్తారు.

● వాతావరణంలోని అధిక శాతంలో ఉన్న జడ వాయువు ఇది

కార్బన్ డై ఆక్సైడ్(0.03%): ఇది మొక్కల కిరణజన్య సంయోగక్రియలో ప్రధానపాత్ర వహిస్తూ ఆహారోత్పాదనను చేపట్టడంలో ముఖ్యపాత్ర వహించే వాయువు.

● గ్లోబల్ వార్మింగ్‌కు కారణమైన ప్రధాన వాయువు. దీనినే ప్రయోగశాలల్లో బొగ్గు పులుసు వాయువు అని కూడా పిలుస్తారు.

● వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ నీటి ఆవిరి 90 కి.మీ. ఎత్తు వరకు మాత్రమే ఉంటుంది. ఆక్సిజన్ 120 కి.మీ. ఎత్తు వరకు ఉంటుంది.



వి. వెంకట్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

అడ్మిషన్స్

ఎన్ఐఐలో పీహెచ్‌డీ

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యూనాలజీ(ఎన్ఐఐ)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆన్‌లైన్ ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా సీట్లు కేటాయిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.37,000ల జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్) ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు: ఇమ్యూనాలజీ, ఇన్ఫెక్షియస్ అండ్ క్రానిక్ డిసీజ్ బయాలజీ, మాలిక్యులర్ అండ్ సెల్యులర్ బయాలజీ, కెమికల్ బయాలజీ, స్ట్రక్చరల్ బయాలజీ, కంప్యూటేషనల్ బయాలజీ

అర్హతలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎమ్మెస్సీ(బయాలజీ/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/ఫిజిక్స్)/ఎంటెక్/ఎంబీబీఎస్/ఎంఫార్మసీ/ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులకు ఇంటర్, డిగ్రీ స్థాయుల్లో కనీసం 60 శాతం మార్కులు, పీజీ స్థాయిలో 55 శాతం మార్కులు ఉండాలి. సీఎస్ఐఆర్/యూజీసీ/ఐసీఎంఆర్/డీబీటీ/డీఎస్‌టీ ఫెలోషిప్‌లను అనుమతిస్తారు.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 23

అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్: అక్టోబరు 7

ఎన్ఐఐ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్: అక్టోబరు 27

ఎంట్రెన్స్ ఫలితాలు విడుదల: నవంబరు 10

ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు: నవంబరు 26 నుంచి డిసెంబరు 3 వరకు

ప్రోగ్రామ్ ప్రారంభం: 2025 జనవరి 1 నుంచి

వెబ్‌సైట్: www.nii.res.in



వోక్సెన్ యూనివర్సిటీకి మూడో స్థానం

ఎంబీఏ కోర్సుల నిర్వహణలో వోక్సెన్ యూనివర్సిటీకి ఇండియాలో మూడో ర్యాంకు లభించింది. ప్రముఖ బిజినెస్ స్కూళ్లు ఐఐఎం బెంగళూరు, ఇండియన్ బిజినెస్ స్కూల్(ఐబీఎస్) సరసన వోక్సెన్ వర్సిటీ నిలిచింది. అదేవిధంగా బ్లూంబర్గ్ బెస్ట్ స్కూల్ బి-స్కూల్ ర్యాంకింగ్స్-2024 జాబితాలో ఏసియా పసిఫిక్ రీజియన్‌లో ఆరో స్థానం దక్కించుకుంది. కాగా, 2025 విద్యా సంవత్సరానికి గాను వివిధ ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు వర్సిటీ తెలిపింది. ఎంబీఏలో జనరల్, బిజినెస్ అనలిటిక్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్ స్పెషలైజేషన్లు అందుబాటులో ఉన్నాయి. పూర్తి సమాచారం https://woxsen.edu.in/ వెబ్‌సైట్‌లో పొందవచ్చు.

జాబ్ కార్నర్

ఈఎస్ఐసీ హైదరాబాద్‌లో స్పెషలిస్ట్ ఖాళీలు

సనత్‌నగర్(హైదరాబాద్)లోని ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఈఎస్ఐసీ)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

1. సూపర్ స్పెషలిస్ట్(ఎంట్రీ లెవల్): **2 పోస్టులు**
2. స్పెషలిస్ట్(సీనియర్ స్కేల్): **2 పోస్టులు**

విభాగాలు: ఆఫ్తాల్మాలజీ, మెడికల్ ఆంకాలజీ, నెఫ్రాలజీ, నియోనాటాలజీ

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: స్పెషలిస్ట్ పోస్టులకు 69 ఏళ్లు, సూపర్ స్పెషలిస్ట్ పోస్టులకు 74 ఏళ్లు మించకూడదు.

జీతం: నెలకు స్పెషలిస్ట్ పోస్టులకు రూ.1,63,116; సూపర్ స్పెషలిస్ట్ పోస్టులకు రూ.2,00,000.

దరఖాస్తు ఫీజు: రూ.500; ఎస్సీ/ఎస్టీ/మహిళ/ఎక్స్ సర్వీస్‌మన్/పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఇంటర్వ్యూ తేదీ: సెప్టెంబరు 25

వేదిక: అకడమిక్ బ్లాక్, ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీ హాస్పిటల్, సనత్‌నగర్, హైదరాబాద్. **వెబ్‌సైట్:** https://www.esic.gov.in/

సెయిల్‌లో మెడికల్ ఆఫీసర్లు

రూర్కెలా(ఒడిశా)లోని ప్రభుత్వరంగ సంస్థ- స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సెయిల్)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. **ఖాళీలు: 11**

1. సూపర్ స్పెషలిస్ట్(బర్న్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ): **1 పోస్టు**
2. స్పెషలిస్ట్(డెర్మటాలజీ): **1 పోస్టు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, డీఎన్‌బీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.


వయోపరిమితి: 69 ఏళ్లు మించకూడదు

జీతం: నెలకు సూపర్ స్పెషలిస్ట్ పోస్టులకు రూ.2,50,000; స్పెషలిస్ట్ పోస్టులకు రూ.1,60,000; జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ పోస్టులకు రూ.90,000. **ఇంటర్వ్యూ తేదీ:** సెప్టెంబరు 24

వేదిక: కాన్ఫరెన్స్ హాల్, ఇస్పత్ జనరల్ హాస్పిటల్(ఐజీహెచ్), సెక్టార్-19, రూర్కెలా.

వెబ్‌సైట్: https://www.sail.co.in/

SCHOLARSHIP ALERT



Description: A CSR initiative by DXC Technology that aims to support the educational/sports expenses of students who belong to marginalized groups.

DXC Progressing Minds Scholarship

Eligibility: Women and transgender students pursuing graduation any year in STEM-related fields are eligible.

● Female athletes aged between 13 to 25 years and who have represented the state/country at the state/ national/ international level in the last 2/3 years can also apply.

● For students pursuing graduation, they must have obtained a minimum of 60% marks in their previous class/semester.

● Applicants annual family income must be less than or equal to 4,00,000 (5,00,000 for sportspersons).

Prizes & Rewards: For Graduation in STEM - 50,000

For Sportspersons: 1,25,000

Last Date to Apply: 06-10-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/DXCS4

Free Coaching for DNT Students under SEED Scheme

Description: An initiative by the Ministry of Social Justice and Empowerment, Government of India, to provide high-quality coaching to students belonging to De-notified Tribes (DNT), Nomadic Tribes (NT), and Semi-Nomadic Tribes (SNT).

Eligibility: Open for students belonging to De-notified, Nomadic, and Semi-Nomadic Tribes. Must be willing to pursue coaching for competitive examinations after Class 12th, such as JEE, NEET, CLAT, NDA, Non-Commissioned Military Ranks, CA-CPT, Banking, Insurance, PSU, SSC, RRB, State & Central Police, etc. Annual family income must be 2,50,000 or less. Must be either in Class 12th or have passed Class 12th. Class 12th passed students must have secured minimum qualifying marks required for competitive exams in Class 12 (depending on the competitive exam for which the candidate wishes to appear) whereas the current Class 12th students must have secured at least 50% in Class 10. Must not be availing of similar benefits (waiver for coaching classes) from any other Central Government or State Government Scheme.

Prizes & Rewards: Coaching fees of up to 1,20,000 and additional benefits

Last Date to Apply: 13-10-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/FCDNT1

buddy4study.com

లిటిల్స్

కప్ప-ముత్యం

అనగనగా ఒకఅడవిలో కొలనులో ఉండే కప్పకు అదే చోట ఉండే హంసతో మంచి స్నేహం కుదిరింది. కొన్ని రోజుల్లోనే అవి రెండూ ప్రాణ స్నేహితులయ్యాయి. ఒకసారి కప్ప కొలనులోని తామరాకు మీద తేలుతూ, హంస ఒడ్డున నిలబడికబుర్లు చెప్పుకుంటున్నాయి.

ఈలోగా ఎక్కడినుండి చూసాడో ఒక వేటగాడు చెట్టు చాటునుండి వచ్చి హంస మీదకు వల విసిరాడు. ఆ వలనుండి తప్పించుకోలేక పాపం హంస విలవిల్లాడింది, కప్ప ఆ వేటగాడిని చూసి, దయచేసి నా నేస్తాన్ని వదిలిపెట్టు అని ప్రాధేయపడింది. దానికి వేటగాడు


నేను పతలను దీన్ని సంతలో అమ్మితే చాలా డబ్బు వస్తుంది' అన్నాడు అది విన్న కప్ప నీకు డబ్బే కదా కావలసింది' అంటూ నీటిలో మునిగి ఒక ముత్యంతో తిరిగి వచ్చి వేటగాడితో ఇలా అన్నది. 'ఈ ముత్యం తీసుకో. దీన్ని అమ్ముకున్నానీకు చాలా సొమ్ము వస్తుందిఇది తీసుకుని నా స్నేహితురాలిని విడిచిపెట్టు' ఆ ముత్యం తీసుకుని, వేటగాడు హంసను వదిలేసి

వెళ్లిపోయాడు. అతను ఇంటికి వెళ్లి జరిగినదంతా తన భార్యతో చెప్పాడు ఆమె అంతా విని,

'ఆ కప్ప దగ్గర ఇంకా చాలాల ముత్యాలు ఉండి ఉంటాయి. ఇవాళే వెళ్లి, అవన్నీ తీసుకురా అన్నది. ఆ మర్నాడు వేటగాడు కొలను దగ్గరకు వెళ్లి, కప్పతో 'ఏయ్ నీ దగ్గర ఉన్న ముత్యాలన్నీ నాకు ఇచ్చెయ్ లేదంటే హంసను తీసుకెళ్లిపోతాను అని బెదిరించాడు. దానికి కప్ప

ఏదీ నీ దగ్గరున్న ముత్యం ఓసారిలా ఇవ్వు, దాన్ని చూసి, అచ్చం అలాంటి ముత్యాలే వెతికి తీసుకొస్తాను'అని ముత్యం తీసుకుని చటుక్కున నీళ్లలో దూకింది పోతూపోతూ, నా నేస్తం ఎపుడో దాక్కుంది. మేము నీకు దొరకము. అత్యాశతో నీ వద్ద ఉన్న ఒక్క ముత్యం కూడా పోగొట్టుకున్నావు' అన్నది. అనవసరంగా మంచి ముత్యాన్ని వదులుకున్నాను కదా అని వేటగాడు బాధ పడ్డాడు. అంత ఉపాయంతో తన ప్రాణాలు కాపాడిన కప్పకు కృతజ్ఞతలు చెప్పింది హంస. అప్పటినుండి ఆ రెంటి స్నేహం మరింత బలపడింది.

10 తేడాలను కనిపెట్టండి



సరైన నీడను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 415

						7		
6	9	3			7			4
	8		6		3			
		8		4		2	1	
			3		1			
	4	5		2		6		
			4		6		2	
4			1			3	7	5
		9						

సుడోకు - 414 సమాధానం

2	7	9	3	4	1	8	6	5
6	3	5	2	8	7	4	9	1
1	8	4	6	5	9	3	7	2
7	9	2	8	1	6	5	3	4
4	5	3	7	9	2	1	8	6
8	6	1	4	3	5	9	2	7
3	2	8	1	7	4	6	5	9
5	4	6	9	2	8	7	1	3
9	1	7	5	6	3	2	4	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.